THE LARGEST CIRCULATED TELUGU WEEKLY

స్వాతి

ESTABLISHED 1984

₹20

12.1.2018

సపరివార పత్రిక



గుండె మార్పిడికి 50 ఏళ్ళు



ఏకపీఠంపై శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి
ఘంటసాల 521 133 కృష్ణాజిల్లా A.P.

జలం జీవులకు ప్రాణాధారం. దేహాన్ని పరిశుద్ధం చేసేదీ, ఆరోగ్యాన్నిచ్చేదీ, ఆయుష్షును పెంచేదీ జలమే. జలంనుంచి జనించి జలధీశ్వరునిగా భక్తులచే పూజలందుకుంటున్న కృష్ణా జిల్లా ఘంటసాలలోని శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వర స్వామిని దర్శించండి. ఆరోగ్యవంతులుకండి.

జయ జయశ్రీ జలధీశ్వరస్వామివారికి జలమంటే ఇష్టం. కాసిన్ని నీళ్ళతో ఆయన్ని అభిషేకిస్తే చాలు, తృప్తిపడి కరుణతో మన శరీరంలో వున్న వ్యాధులన్నింటినీ ఆయన కడిగేస్తాడు. భక్తులు అభిషేకించిన నీరే తీర్థమై, ఆ తీర్థమే మహౌషధమై, సర్వరోగాలను హరించివేస్తుంది.ఆరోగ్యవంతుల్ని చేస్తుంది.

ఈ స్వామి ఆరోగ్యప్రదాత. శ్రీ జలధీశ్వరస్వామికి మూడు ప్రదక్షిణాలు చేసి అభిషేక తీర్థాన్ని సేవిస్తే, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. ఎందరో భక్తులకు అనుభవైకవేద్యమది. ఏక పీఠంపై వెలసిన శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వర స్వామి విశిష్టత ఇది.

సతీసమేతంగా కొలువైన నవగ్రహ మండపం ఇక్కడి ప్రత్యేకత. ఒకే ఆవరణలో తన కుమారులైన విఘ్నేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరులతో శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామి దర్శనభాగ్యం, భక్తుల పాలిటి మహద్భాగ్యం.

ఇక్కడి సుబ్రహ్మణ్యస్వామికి సుబ్రహ్మణ్యషష్ఠినాడు విశేషమైన పూజలు జరుగుతాయి. గ్రహానుగ్రహంకోసం, గ్రహదోషాలను పోగొట్టుకోదలచినవారు ఈ సతీసమేత నవగ్రహాలను వ్యక్తిగతంగా ఆరాధిస్తే, అత్యంత త్వరగా తమ సమస్యలన్నింటినుండి బయటపడతారు.

బస్సు మార్గం : విజయవాడ నుంచి ఘంటసాలకు (ఉయ్యూరు, కూచిపూడిల మీదుగా) దూరం 40 మైళ్ళు.
మోపిదేవి నుంచి ఘంటసాలకు - 8 మైళ్ళు, కూచిపూడి నుంచి ఘంటసాలకు - 8 మైళ్ళు.

సమగ్ర సమాచారంకోసం సెల్ : 99494 92410 E-mail : jaladheeswara@gmail.com

ఆరోగ్యప్రదాతా! జలధీశ్వరా! పాహిమాం రక్షమాం!



VKC pride
For the whole family
INDIA'S NO.1 PU FOOTWEAR
చాలా రోజులు నడుస్తాయి, అందుకే
జాగ్రత్తగా ఉంచుకోవాలి
Art No. 21116
MRP : ₹ 389.00*
Art No. 3325
MRP : ₹ 219.00*
Art No. 26112
MRP : ₹ 269.00*
Art No. 25109
MRP : ₹ 279.00*
* MRP mentioned is per 2N (1 pair) inclusive of all taxes.
*Disclaimer: Based on number of pairs produced
వికెసి ప్రైడ్
U4iC INTERNATIONAL PVT. LTD.,
Surampalli, Vijayawada, Krishna, Andhra Pradesh - 520015, Ph: 8499803629,
Ibrahimpatnam, Hyderabad, Telangana - 501506 Ph: 8498095426.
www.vkcgroup.com
Follow us on

THE LARGEST CIRCULATED TELUGU WEEKLY

స్వాతి

సపరివార పత్రిక

FOUNDER PROPRIETOR EDITOR : VEMURI BALARAM



ఆహార రహస్యం

విస్తరిలో వడ్డన ప్రారంభించిన తర్వాత చేతిలో తీర్థం వేసుకుని 'బ్రహ్మార్పణం బ్రహ్మాహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం బ్రహ్మైవతేన గన్తవ్యం బ్రహ్మ కర్మ సమాధినా' (4-24)అనే గీతాశ్లోకాన్ని పఠించి, తీర్థాన్ని సేవించి, తర్వాత బ్రహ్మభావనతో, దైవబుద్ధితో భుజిస్తే ఆ అన్నం అమృతరూపంగా పరిణమిస్తుంది.

భోజనం చేసేటప్పుడు మాట్లాడకూడదు. లోకాభిరామాయణాలు, కోర్టు వ్యవహారాలు ఆ సమయంలో చర్చించరాదు.

'స్నానే చ భోజనే హోమే జపే మౌనం సమాశ్రయేత్' స్నానంచేసేటప్పుడు, భోజనంచేసేటప్పుడు హోమమాచరించేటప్పుడు, అలాగే పూజా సమయంలో మౌనాన్ని తప్పనిసరిగా అవలంబించాలి అని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.

దైవభావనతో భుజించడం మొదటి పద్ధతి. ఇది ఉత్తమోత్తమం.

గోవింద (దైవ) నామసంకీర్తన బిగ్గరగా చేస్తూ భుజించడం రెండవ పద్ధతి. ఇది ఉత్తమం.

వ్యాపార కబుర్లు, ఎలక్షన్ కబుర్లు, మార్కెట్ కబుర్లు, కోర్టు సమాచారాలు చెప్పుకుంటూ భుజించడం మూడవ పద్ధతి. ఇది అధమం.

కాబట్టి దేహ మనస్సుల పోషణకాధారభూతమైన, అతిప్రధానమైన ఈ ఆహారాన్ని గ్రహించే పద్ధతిని శాస్త్రాలవల్ల, పెద్దలవల్ల తెలుసుకుని అంతా తమ ఆధ్యాత్మిక మార్గాన్ని సరిచేసుకోవాలి.

కనుక అప్పుడప్పుడు తీరిక చూసుకుని సుశిక్షణ కలిగిన మంచి ఆశ్రమాలకు వెళ్ళి, కొన్ని రోజులు అక్కడ వుండి, చక్కని పద్ధతులను అనుభవజ్ఞులైన పెద్దలనుండి గ్రహించి వాటిని శ్రద్ధగా ఆచరిస్తే జీవితం సార్థకమవుతుంది.

-గీతావాహిని



పాఠక దేవుళ్ళకు నమస్కారం

ఎడిటర్

వేమూరి బలరామ్

ESTABLISHED 1984 | సంపుటి 34 | 12.1.2018 | సంచిక 28

అనిల్ బిల్డింగ్స్ సూర్యారావుపేట పోస్ట్ బాక్స్ 339 విజయవాడ 520 002

He deserves not the sweet that will not taste the sour

సీరియల్స్

కథలు

స్పెషల్ ఫీచర్స్

శీర్షికలు



ముఖచిత్రం : మెహరీన్

చందాను www.swatipublications.com వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చు
E-mail: advtswati@gmail.com swativja@eth.net

విడిప్రతి ₹20 12 నెలలకు ₹1076
విదేశాలకు సంవత్సరచందా (ఎయిర్ మెయిల్) ₹6666 (100 డాలర్లు)

Editor : VEMURI BALARAM Swati Publications Anil Buildings Suryaraopet Vijayawada 520 002 Printed and Published by the owner VEMURI BALARAM
Printed at Anil Swati Press Autonagar Vijayawada Cover at Kala Jyothi Process Pvt.Ltd., Hyderabad
Tel.: (0866) 243 1862 243 4017 Advt. 243 1233 Mktg. 243 3938 Fax: 0866-243 0433



అత్యధిక సర్క్యులేషన్‌గల ఏకైక తెలుగు వారపత్రిక

వచ్చేవారం స్పెషల్

సంక్రాంతి సంచిక

సాక్షి

29.12.2017

'మధురజ్ఞాపకం' కథ అద్భుతంగా ఉంది. కథలన్నీ బాగున్నాయి.

'లాస్య మా పెళ్ళికి వచ్చిందోచ్' కథ బాగా నవ్వించింది.

సీరియల్స్ అన్నీ ఆసక్తికరంగా ఎదురుచూసేలా ఉంటున్నాయి.

జి.వి.మురళీమోహన్ ముచ్చుమిల్లి

భారతదేశంలాంటి పెద్ద దేశానికి ప్రతిపక్షం బలోపేతంగా ఉండటం ఎంతైనాఅవసరం.యువకుడు రాహుల్ గాంధీ కాంగ్రెస్ లాంటి చరిత్రగల పార్టీకి అధ్యక్షుడుగా ఎన్నిక అవటం ఆమోదించవలసిన విషయం.

'అనిల్' శీర్షికచైనా చిత్రాలతో చాలా ఆకర్షణీయంగా ఉంది.

'ఒక చిన్నమాట'లో భాగ్యలక్ష్మిగారి విశ్లేషణ ఆలోచింపదగినది.

లక్ష్మీ గిరిజాకుమార్ రాజమహేంద్రవరం

'జై భారత్' సీరియల్‌లోని పాత్రలు పాఠకులను బాగా పలకరిస్తున్నాయి.

బాపు బొమ్మలోని వేదన, ఆవేదన మనస్సును ఆకట్టుకున్నాయి.

'ఈ శీర్షిక మీదే' అందిస్తున్న హాస్య రసం ఉత్తమంగా ఉంటోంది.

'అఆఇఈ' సీరియల్ చదువుతుంటే ఉత్కంఠభరితంగా ఉంటోంది.

డా॥ శివభూషణం కర్నూలు

'నీవు నేను సమానం' వ్యాసంలో రచయిత చెప్పినట్లు భార్యాభర్తలు ఇరువురూసమానమేనన్న సత్యంసంసారానికి చాలా అవసరం.

'చిలిపి' చిలిపిచిలిపిగా సాగుతూ చక్కని ఆనందాన్నిస్తోంది.

'వసంతసేనా చారుదత్తం' సీరియల్ రసగంభీరంగా వుంది.

కె.ప్రభాకర్ ఖమ్మం

'సంకల్పసిద్ధి'లో దృఢసంకల్పం ఎంత ప్రధానమో, తీవ్ర వ్యాకులత లేకుండా మనిషి భగవత్సాక్షాత్కారం పొందలేడని అవగతమైంది.

'డయాబెటిస్' గురించి సంపూర్ణ సమాచారంతో డా॥ కె.వేణుగోపాల్‌రెడ్డి గారు చక్కగా వివరించారు.

'ఫర్ U' శీర్షికలో అన్నీ అంశాలు ఆరోగ్య ప్రియత్వంగా, ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి.

కె.సుధాకర్ హైదరాబాద్

'స్టార్‌టీమ్' వ్యాసం శీతాకాలంలో అందించతగ్గ వ్యాసరచన.

పిల్లలలో కృతజ్ఞతాపూరిత వైఖరిని వారికి అలవాటుచేసి ఇది నాది అన్న బాధ్యత తల్లిదండ్రులు వారికి నేర్పించాలని 'చేసినమేలు మరవద్దు' ఫీచర్‌లో చాలా చక్కగా తెలిపారు.

'చివరిరోజుల్లో...' రిచిబెనాడ్ తొలి పోటీ ఆడేవారికి సీనియర్ ఆటగాడిచేత దేశ క్యాప్ ఇప్పించడం ఆస్ట్రేలియా దేశ సాంప్రదాయం అని తెలిసింది.

'ఐ లవ్ మనీ' శీర్షిక బాగుంది.

ఎ.వి.సోమయాజులు కాకినాడ

ఇది మంచి సమయం



4.1.2018 నుండి 10.1.2018 వరకు శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, కృష్ణపక్షం, పుష్యమాసం.

4.1.2018 గురువారం
తిథి: తదియ రా. 9.32 వరకు
నక్షత్రం: ఆశ్లేష రా. 3.54 వరకు
వర్జ్యం:సా.5.44 నుండి 7.11 వరకు
దుర్ముహూర్తం : ప. 10.17-11.01 వరకు. మ. 2.43-3.27 వరకు
రాహుకాలం: మ.1.30-2.53 వరకు
మంచి సమయం: ప. 9.40 నుండి 10.10 వరకు
సూర్యోదయం: 6.35కి
సూర్యాస్తమయం: 5.40కి

5.1.2018 శుక్రవారం
తిథి: చవితి సా. 7.00 వరకు
నక్షత్రం:మఘ రా. 2.16 వరకు
వర్జ్యం: మ. 3.05-4.35 వరకు
దుర్ముహూర్తం:ప.8.48 నుండి 9.32 వరకు. మ. 12.30-1.14 వరకు
రాహుకాలం: ప.10.46-12.08 వరకు
మంచి సమయం: ప. 10.00 నుండి 10.40 వరకు
సూర్యోదయం: 6.35కి
సూర్యాస్తమయం: 5.41కి

6.1.2018 శనివారం
తిథి: పంచమి సా. 5.10 వరకు
నక్షత్రం: పూర్వఫల్గుని రా.1.20 వరకు
వర్జ్యం: ప.9.57 నుండి 11.29 వరకు
దుర్ముహూర్తం: ఉ.6.35-8.04 వరకు
రాహుకాలం: ప. 9.23-10.46వరకు
మంచి సమయం: మ. 2.30 నుండి 4.00 వరకు
సూర్యోదయం: 6.36కి
సూర్యాస్తమయం: 5.41కి

7.1.2018 ఆదివారం
తిథి: షష్ఠి సా. 4.04 వరకు
నక్షత్రం:ఉత్తరఫల్గుని రా.1.10 వరకు
వర్జ్యం: ఉ. 8.30-10.05 వరకు
దుర్ముహూర్తం : సా.4.14-4.58 వరకు
రాహుకాలం: సా. 4.19-5.42 వరకు
మంచి సమయం: ప. 10.10 నుండి 10.35 వరకు
సూర్యోదయం: 6.36కి
సూర్యాస్తమయం: 5.42కి

8.1.2018 సోమవారం
తిథి: సప్తమి మ. 3.47 వరకు
నక్షత్రం: హస్త రా. 1.46 వరకు
వర్జ్యం:ప. 9.47 నుండి 11.25 వరకు
దుర్ముహూర్తం : మ. 12.28 నుండి 1.12 వరకు.మ. 2.41-3.25 వరకు
రాహుకాలం: ఉ. 7.59-9.21 వరకు
మంచి సమయం: ప. 9.00 నుండి 9.30 వరకు
సూర్యోదయం: 6.36కి
సూర్యాస్తమయం: 5.43కి

9.1.2018 మంగళవారం
తిథి: అష్టమి సా. 4.15 వరకు
నక్షత్రం:చిత్త రా. 3.04 వరకు
వర్జ్యం : ప. 10.12-11.53 వరకు
దుర్ముహూర్తం:ప. 8.48 నుండి 9.32 వరకు. రా. 10.49-11.33 వరకు
రాహుకాలం: మ.2.52-4.15 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 6.36కి
సూర్యాస్తమయం: 5.43కి

10.1.2018 బుధవారం
తిథి : నవమి సా. 5.15 వరకు
నక్షత్రం: స్వాతి తె. 5.01 వరకు
వర్జ్యం : ప. 9.07-10.51 వరకు
దుర్ముహూర్తం: ప. 11.45 నుండి 12.29 వరకు
రాహుకాలం: మ.12.07-1.30 వరకు
మంచి సమయం: మ. 2.00 నుండి 3.30 వరకు
సూర్యోదయం: 6.36కి
సూర్యాస్తమయం: 5.43కి

*మీకు ఇది శుభారంభం.

ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగుతాయని చెప్పలేం. అయితే బడ్జెట్‌కి ఆమోదం తెలుపటం అత్యవసరం కాబట్టి ఆ మేరకు పార్లమెంట్ జరగవచ్చు. ప్రతి ఏటా జరిగే బడ్జెట్ సమావేశాలే అయినప్పటికీ 2018 బడ్జెట్ సమావేశాలకు ప్రత్యేకత వుంది.

2018-19 బడ్జెట్‌ని సమర్పించే సమయమిది.మరోమారు లోక్‌సభ ఎన్నికలు 2019లో జరగాలి. ఆ ఎన్నికలకు ముందు సమర్పించే చివరి బడ్జెట్ ఇదే.

స్వదేశీ నల్లడబ్బును అణిచివేసే యత్నం చేశారు. అందులో భాగంగానే పెద్దనోట్ల రద్దు ప్రకటనను చెయ్యటం జరిగింది. అయితే పెద్దనోట్ల రద్దు అనుకున్న ఫలితాలనిచ్చిందని ప్రభుత్వమే అనలేని పరిస్థితి. ప్రభుత్వం ఊహించినదానికన్నా భిన్నంగా ప్రజల దగ్గరున్న నల్లధనం మొత్తం బ్యాంకుల్లోకి చేరింది.

బ్యాంకుల్లోకి భారీగా నిధులు వేసినవారిని కనుక్కొని ప్రశ్నిస్తాం.వారిమీద నిఘాపెడ్తామని ప్రభుత్వం

కొత్త బడ్జెట్ ఎటువైపుకు

2019 మేలోగా ఎన్నికలు జరగాలి కాబట్టి మరో పూర్తిస్థాయి బడ్జెట్‌ని నరేంద్రమోడీ ప్రభుత్వం సమర్పించకపోవచ్చు.ఎలా చూసినా ఈ ప్రభుత్వానికి ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్. కీలక బడ్జెట్ కూడా.

అధికారంలో వున్నవారు ఎలాగయినా అధికారం నిలబెట్టుకోవాలనుకుంటారు. ప్రజలను రంజింపచేసే పథకాలు చేయగలిగినప్పుడే తిరిగి అధికారం దక్కుతుంది. ప్రజా ఉపయోగ పథకాలను ప్రకటించగలిగిన అవకాశం బడ్జెట్ ఇస్తుంది. కాబట్టి నాలుగేళ్ళ పాలన తర్వాత ఏ ప్రభుత్వం అయినా ప్రజలను ఆకట్టుకునే బడ్జెట్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది.

నరేంద్రమోడీ ప్రభుత్వంకూడా అంతకన్నా అతీతం కాదు. అయితే గత ప్రభుత్వాలకు, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికి కొంత తేడా వుంది.

ప్రజలకు రాయితీలు కల్పించటం, ఉపాధిచూపించటంద్వారా వారిని తమ గుప్పిట్లో పెట్టుకోగలమన్న ఆలోచన చేసింది యు.పి.ఎ. ప్రభుత్వం.

పనికి ఉపాధి పథకం, గ్రామీణ ప్రాంతంవారికి, పట్టణాలకు వర్తించే ఇతర పథకాల అమలుతో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తికరంగా వుంటారని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది.

కాంగ్రెస్ పార్టీ విధానాలనే కాదు, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ పాలనాపద్ధతిని తూర్పారబట్టిన పార్టీ బిజెపి. ప్రధాని నరేంద్రమోడీకి ఉచిత పథకాలమీదనమ్మకం లేదు. ప్రజలకు ఉచితంగా ప్రభుత్వం సౌకర్యాలు అందించటంవల్ల వారిని సోమరులను చేసినట్టు అవుతుందన్నది ఆయన నమ్మకం.

ప్రజలకు అవకాశాలు కల్పించి, అవి అందుకుని ఎదిగేలా ప్రోత్సహించాలి అన్నది నరేంద్రమోడీ ఆలోచన.

గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఆయన అమలుచేసిన నమూనా అది. అదేవిధంగా అవకాశాలు అనేవి ఏర్పరిచి, వాటిని అందిపుచ్చుకోగలిగినవారికి మరింత ప్రోత్సాహకాల్ని అందించారు.

వ్యాపార రంగాలను బాగా ప్రోత్సహించారు. ఆయన ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో గుజరాత్ మోడల్ మెరుగయినదని మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంగీకరించి, అనుసరించే యత్నం చేశారు. నరేంద్రమోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినతరువాత జాతీయస్థాయిలో అమలుచేసిన పథకాలు అన్నీ అటువంటివే.

సబ్సిడీలను తగ్గించే యత్నం చేశారు. అందులో నిర్బంధం లేకుండా సుతిమెత్తగా చెప్పి ప్రజలు స్వచ్ఛందంగా సబ్సిడీని వదులుకునేలా చేశారు.

జన్‌ధన్ యోజన ద్వారా అందరినీ బ్యాంక్ ఎకౌంట్స్ తెరవమని చెప్పి, బ్యాంకుల ద్వారా లబ్ధిపొందేలా ప్రోత్సహించారు.

మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ల ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి స్వయంఉపాధి పథకం వైపు మళ్ళేలా చేసే యత్నం జరిగింది.

మరోవైపు ఆర్థిక రంగానికి సంబంధించిన సంస్కరణలద్వారా స్వదేశంలోని నల్లడబ్బు వెలికితీత ఆలోచన చేశారు. విదేశాలలో వున్న నల్ల డబ్బును వెనక్కి తెప్పిస్తామన్నది నాడు నరేంద్రమోడీచేసిన వాగ్దానం కాని ఆ ప్రయత్నంలో నేటివరకు సఫలత లేదు.

ఎన్ని రకాలుగా చెపుతున్నా అది ఆచరణయోగ్యంగా, ఫలితాలు సాధించేదిగా కనిపించటంలేదు.

పెద్దనోట్ల రద్దు నిర్ణయంవలన అన్ని రంగాల ప్రజలూ పడిన ఇబ్బందులు మరచిపోకముందే 2017 జూలై నుండి జి.ఎస్.టి.ని అమలులోకి తెచ్చారు.

జి.ఎస్.టి. అమలుకు తగిన సన్నద్ధత లేకుండా అమలు తేదీని ప్రకటించారన్నది విమర్శ. జి.ఎస్.టి అమలు విషయంలో ఏకాభిప్రాయం వుంది.

అయితే జి.ఎస్.టి. స్లాబ్స్ విషయంలో రాజకీయ పార్టీలలో కొన్ని విభేదాలున్నాయి. జి.ఎస్.టి. అమలులోకి తెచ్చి ఆరునెలలు తిరగకుండానే వందవరకు సవరణలు తెచ్చారంటేనే అది ఎంత లోపభూయిష్టంగా రూపొందించారో అర్థమవుతుంది.

ఆ రెండు కీలక నిర్ణయాలవలన ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్న ప్రతిపక్షాల విమర్శకు, ఆ రెండు నిర్ణయాల అమలుతర్వాత వచ్చిన శాసనసభల ఎన్నికల్లో తమకు లభించిన విజయాలతో సమాధానం చెప్పాం అంటున్నది అధికారపక్షం.

పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి.లు అధికారపక్షానికి అంతగా నష్టం కలిగించని మాట వాస్తవం. అలాగని ఆ రెండు నిర్ణయాలు మహాద్భుతాలని అనలేం. ఆ రెండు నిర్ణయాల అమలుతర్వాత తొలిగా తెస్తున్న బడ్జెట్ ఇది. కాబట్టి ఆ రెండు నిర్ణయాల అమలు నేపథ్యంలో, రాబోయే సంవత్సరపు రాజకీయ అవసరాలకు అనుగుణంగా రూపొందించబోయే బడ్జెట్‌గానే దీన్ని భావించాల్సివుంటుంది.

సాంప్రదాయంగా రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి చేసే ప్రసంగం జనవరి 30న వుంటుంది. మరుసటి రోజున దేశ ఆర్థికస్థితికి సంబంధించిన నివేదికను ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌కి సమర్పిస్తారు.

వచ్చే రోజుల్లో రాజ్యాంగం మారనుంది... అది మార్చేందుకే మేము అధికారంలోకి వచ్చాం.

-అనంతకుమార్ హెగ్డే, కేంద్రమంత్రి



ఫిబ్రవరి 1న బడ్జెట్ సమర్పణ వుంటుంది. గత సంవత్సరం రైల్వేలకు ప్రత్యేకంగా బడ్జెట్ సమర్పించే విధానాన్ని రద్దుచేసిన ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ఈ సంవత్సరం మరో వలసపాలకుల పద్ధతికి మంగళం పాడనుంది.

ఫిబ్రవరి 28న బడ్జెట్ సమర్పించే గత విధానానికి భిన్నంగా ఫిబ్రవరి 1నే బడ్జెట్ వస్తోంది.

శీతాకాల పార్లమెంట్ సమావేశాలు జనవరి 5తో ముగుస్తున్నాయి. బడ్జెట్ సమావేశానికి నెలకన్నా తక్కువ వ్యవధి వుంటుంది.

ఇంత తక్కువవ్యవధిలో రెండోసారి పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటుచెయ్యటం అత్యవసర పరిస్థితి సమయంలో ఒక్కసారిమాత్రమే జరిగింది.

వరసగా అయిదవ బడ్జెట్ సమర్పించటానికి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సిద్ధమవుతున్న సమయంలో ఆ బడ్జెట్‌లో ఎటువంటి ప్రతిపాదనలుంటాయనేదానిమీద ఊహాగానాలు మొదలయ్యాయి.

గుజరాత్ గ్రామీణ ప్రాంతంలో బి.జె.పి.కి ఎదురైన వ్యతిరేకత ప్రభావం కేంద్ర బడ్జెట్ మీద పడుతుంది అనేది ఒక వర్గం అభిప్రాయం. గ్రామీణ ప్రాంతంలో ఆర్థిక వ్యవస్థ సక్రమంగా లేదు.

వ్యవసాయరంగం సంక్షోభంలో వుంది. ఫలితంగా గ్రామీణ ఓటర్లు గుజరాత్‌లో బి.జె.పి. ప్రభుత్వాన్ని తిరస్కరించారు.

కాబట్టి గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునే పథకాలకు పెద్దపీట వెయ్యాల్సిన రాజకీయ అవసరం వుందనేది వారి వాదన. అయితే కేవలం ఒక్క రాష్ట్రంలోని ఓటర్లనే బి.జె.పి. పరిగణనలోకి తీసుకోలేదు.

పెద్దనోట్ల రద్దు నిర్ణయంతర్వాత జరిగిన ఎన్నికల్లో బి.జె.పి. విజయం సాధించింది. గ్రామీణ ఓటర్లమీద జి.ఎస్.టి ప్రభావం కూడా అంతంతమాత్రమే.

కాబట్టి, వ్యవసాయరంగం విషయంలోనే కొద్దిమేర కేటాయింపులను పెంచే అవకాశం వుంటుందేమో. ఓటర్లను ఉచితాలతో ఆకట్టుకోవటాన్ని వ్యతిరేకిస్తూ, ఎన్నికలముందు అటువంటి ఉచితాలతో కూడిన ప్రజాకర్షక బడ్జెట్‌ని ఇవ్వటమంటే యు.పి.ఎ. విధానాలను అనుకరించటమేనన్న సందిగ్ధత కేంద్ర ప్రభుత్వంలో కూడా ఉంది.

"రాబోయే బడ్జెట్ ప్రజాకర్షక బడ్జెట్‌గా ఉండదు" అంటూ ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి బృందం సభ్యుడు రతిన్‌రాయ్ చేసిన ప్రకటనతో బడ్జెట్ మీద ఒక అవగాహనకు రాగలరు.

గత నాలుగు సంవత్సరాల బడ్జెట్‌లో లాగానే ఈసారి కూడా ప్రభుత్వ ఖర్చుల విషయం నాణ్యాతను పాటిస్తామని ఆయన అన్నారు. ఈ దశలో ప్రజాకర్షక పథకాలకు స్థానం లేదని పాలకులకు అర్థమైవుంటుందని రతిన్‌రాయ్ గట్టి పదమే ప్రయోగించాడు.

గడచిన మూడున్నర సంవత్సరాలలో చేపట్టిన ఆర్థిక సంస్కరణలను సంపూర్ణ అమలుస్థాయికి తీసుకువెళ్ళటమే ఈ బడ్జెట్ లక్ష్యంగా ఉంటుంది.

కొత్తగా సంస్కరణలు తెరమీదకు తెచ్చి, వాటి అమలుకు, అమలుచేసినా ఫలితం కనిపించని పరిస్థితిని ఎదుర్కోవటం నరేంద్రమోడీ ప్రభుత్వానికి ఇష్టంలేదు. ప్రస్తుతం అమలులో ఉన్న సంస్కరణలను అమలుచేసి, వాటివల్ల సాధించిన ఫలితాలతో ప్రజలలోకి వెళ్ళాలనుకుంటున్నది.

దేశం అనుకుంటున్న వృద్ధిరేటు సాధనలో వెనకబడున్నది. మరెన్నో ఇతర సంస్కరణలు తెస్తేగాని 8 శాతం వృద్ధిరేటు సాధ్యంకాదు.

ఆ దిశగా కొత్త బడ్జెట్ రూపకల్పన చేసే సాహసం అరుణ్‌జైట్లీ చెయ్యాల్సివుంటుంది. ఆర్థికపరమైన ఒడుదుడుకుల నుండి భారత్ బయటపడిందనేది సర్వత్రా వినిపిస్తున్న అంశం.

లండన్ కేంద్రంగా పనిచేసే సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్ (సి.ఇ.బి.ఆర్.) తాజా అంచనా ప్రకారం ప్రపంచ టాప్ ఆర్థికవ్యవస్థ ర్యాంకింగ్‌లు అతి త్వరలో మారనున్నాయి. బలీయ ఆర్థిక శక్తిగా భారతదేశం రూపుదిద్దుకోవటానికి ఆట్టే కాలం పట్టదన్నది వారి అంచనా.

- 2019 ఎన్నికల ముందు చివరి బడ్జెట్
- పెద్దనోట్ల రద్దు, జి.ఎస్.టి. నేపథ్యంలో బడ్జెట్
- అంతా బాగుందంటున్న అంతర్జాతీయ సంస్థలు
- ప్రజలలో కనబడని ఆర్థిక విశ్వాసం

2018-19 బడ్జెట్ కాలంలో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఐదవ స్థానంలో భారత్ నిలబడనున్నది. బ్రిటన్, ఫ్రాన్స్‌లను వెనక్కినెట్టి భారత్‌ముందుంటుందనేది ఆనందం నింపేవిషయం. 2032 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడవ స్థానంలో నిలబడుతుందన్నది అంచనా.

అప్పటికి చైనా మొదటిస్థానంలోకి వెళ్ళి అమెరికా రెండవ స్థానంలోకి నెట్టబడుతుంది. 21వ శతాబ్దం ఆసియా ఖండ దేశాలదేనన్న విషయం స్పష్టమవుతోంది. తాజాగా రూపొందించిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ర్యాంకింగుల్లో టాప్ 15లో పది ఆసియా దేశాలు ఉన్నాయి. ప్రపంచ ఇతర సంస్థల నివేదికలు భారత్ ప్రగతి తిరుగులేనిదని అంటున్నాయి.

అయితే అసలు సమస్య ప్రభుత్వ విధానాల నుండే. అంతర్జాతీయ మార్కెట్‌లకు అనుగుణంగా భారత్‌ని నడిపించగలిగిన నేర్పు నరేంద్రమోడీ ప్రభుత్వానికి వుందా అన్నది సందేహం.

ఎటునుండి మొదలుపెట్టి దేశ ఆర్థికవ్యవస్థను పైకి తీసుకువెళ్ళాలనేదానిమీద ప్రభుత్వంలో ఏకాభిప్రాయం లేదనిపిస్తోంది.

చట్టంలోని లొసుగులను చక్కదిద్దాలన్న యత్నం ఒక్కటి నరేంద్రమోడీ మనసులో స్పష్టం. ఆర్థికపరమైన లావాదేవీలన్నీ చట్టాలకు లోబడి నిర్వహించేలా చేస్తే ప్రభుత్వ ఆదాయం పెరిగితీరుతుంది. ఆధార్ కార్డ్ అనుసంధానం సత్ఫలితాలను ఇస్తోంది.

బినామీలను ఏరిపారేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నది. బినామీ ఆస్తులను దెబ్బతీసే చట్టం తీసుకురానున్నది. ప్రత్యక్ష పన్నుల విషయంలో సంస్కరణలకు నియమించిన బృందం నివేదికను ప్రభుత్వం అంగీకరిస్తున్నది.

పన్ను చెల్లింపుదారుల సంఖ్యను విస్తృతపరచగలిగితే పన్నులు తగ్గించగలమన్నది ప్రభుత్వం ఆలోచన. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పాటించేవిధంగా అన్ని వర్గాలకు ఆమోదమయ్యే కొత్త విధానాలను ప్రభుత్వం తీసుకురావాలి. డిజిటల్ లావాదేవీలు పెరిగాయి. పన్ను చెల్లింపులు మెరుగయ్యాయి.

అక్రమ సబ్సిడీదారులను గుర్తించి తొలగిస్తున్నారు. కింద స్థాయివారిని నియంత్రిస్తున్న తీరునే బడా వ్యాపారవేత్తలను నియంత్రించే విధానాలు బడ్జెట్‌లో ఆశిస్తున్నారు ప్రజలు. బ్యాంకింగ్‌రంగ సంస్కరణలు స్వాగతిస్తున్నప్పటికీ కొత్తగా తేవాలనుకుంటున్న బ్యాంకింగ్ బిల్లులో సాధారణ డిపాజిటర్స్‌కి భద్రతను తగ్గించే అంశాలు తొలగించక తప్పదు.

ప్రజల విశ్వాసం, సహకారం లేకుండా దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళలేరు. దేశ బడ్జెట్‌లోని అంకెలు, ఇతర సాంకేతిక పదాలు అందరికీ అర్థమయ్యేవి కావు. వాటిని అర్థంచేసుకోవాల్సిన అవసరం కూడా వారికి లేదు. వారు ఆలోచించేదంతా తమను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే అంశాలే.

కాబట్టి సామాన్య ఓటరుకి భద్రత కల్పించలేని బడ్జెట్ సాంకేతికంగా ఎంత గొప్పదయినా దానివలన ఏలినవారుమాత్రం ఓటర్ల మెప్పు పొందలేరు.


వాస్తవంలో ప్రజలు నేడు ఉచితాలు కోరుకోవటం లేదు. నాణ్యతను కోరుకుంటున్నారు. వస్తువులు, సేవలువంటివి ఏవైనా నాణ్యమైనవి, దీర్ఘకాలం మేలు చేసేవి కావాలి వారికి. వారి ఆశలకు తగినవిధంగా రూపొందించే బడ్జెట్ రావాలి అరుణ్‌జైట్లీ నుండి.

నాలుగేళ్ళ క్రితం అధికారంలోకి వచ్చినతరువాత చెప్పిన 'మేక్ ఇన్ ఇండియా' స్మార్ట్ సిటీలు, కొత్తగా కోటి ఉద్యోగాలు, స్వచ్ఛభారత్‌లు వంటివాటన్నిటికీ బడ్జెట్‌లో సమాధానాలు కావాలి. అవి సంతృప్తికర సమాధానాలు అయివుండాలి.

భారతదేశ ఆర్థికవ్యవస్థమీద విదేశాలన్నింటికీ సదభిప్రాయం ఉంది.అద్భుతంగా భారతదేశం ఎదగబోతున్నదని వారంటున్నారు. కాని స్వదేశంలో ఎందుకనో ఆ నమ్మకం కనిపించటంలేదు. ఆ విషయం ప్రభుత్వానికి తెలియదనుకోలేం. కాబట్టి ఎన్నికల ముందు సమర్పించే బడ్జెట్‌లో ప్రజలను మెప్పించకపోతే ఎన్నికల కష్టాలు మొదలవుతాయి.

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు

గుండె మార్పిడికి 50 ఏళ్ళు


Courtesy : SANANDA

వైద్యచికిత్సలో ఒక కొత్త అధ్యాయం మొదలై సరిగ్గా 50 ఏళ్ళు గడిచింది. మానవ శరీరంలోని కీలకమైన అంగం గుండె. ప్రతి క్షణం కొట్టుకుంటూ మనిషి బతికివుండటానికి కారణమైన ఆ గుండె మార్పిడి ఆపరేషన్‌కి ఇది స్వర్ణోత్సవ సంవత్సరం.

సరిగ్గా యాభైఏళ్ళక్రితం డిశంబర్ 3, 1967న దక్షిణాఫ్రికాకి చెందిన క్రిష్టియాన్ బెర్నార్డ్ అనేవైద్యుడు తొలిసారిగా ఒక గొప్ప సాహసం చేశాడు.


తనదగ్గరికి వచ్చిన ఒకరోగికి గుండెచెడిపోయింది. గుండెకొట్టుకోవటంలో కొంత తేడా వచ్చింది. అది క్రమంగా మరింత క్షీణించి ఏదో ఒకరోజున గుండె పనిచేయటం ఆగిపోతుంది. మనిషి ప్రాణం పోతుంది. ఆ పరిస్థితిలోవున్న రోగిపేరు లూయిస్ వాష్కన్స్కి.

అతడి వృత్తి చిరు వ్యాపారం. వయసు 53 ఏళ్ళు. అతడిని బతికించటం డా॥ బెర్నార్డ్‌కి ఓ సవాల్. ఆ సమయంలో ఆ ఆసుపత్రికి ఒక మహిళను తీసుకువచ్చారు. ప్రమాదంలో చిక్కుకున్న ఆమె మరణించలేదు. కాని మెదడు పనిచేయటంలేదు. వైద్య పరిభాషలో 'బ్రెయిన్‌డెడ్'పరిస్థితి.

ఆమె తిరిగి కోలుకుని సాధారణ పరిస్థితికి వచ్చే అవకాశం కన్పించలేదు. మిగిలిన అంగాలన్నీ సరిగ్గానే పనిచేస్తున్నాయి. ఆమెను వెంటిలేటర్‌మీద పెట్టి బతికిస్తున్నారు.

తొలి ప్రయోగం

ఆ సమయంలో డా॥ క్రిష్టియాన్ బెర్నార్డ్ చేసిన ఆలోచన గుండెమార్పిడి ఆపరేషన్. గుండె అవసరమైన పేషెంట్, గుండె పనిచేస్తున్న, తిరిగి కోలుకోలేని మరో పేషెంట్. ఇద్దరూ బెర్నార్డ్ ముందున్నారు.



డా॥ జి.సోమరాజు
ఛైర్మన్, మేనేజింగ్.డైరెక్టర్
కేర్ హాస్పిటల్స్, రోడ్ నెం.1
బంజారా హిల్స్, హైదరాబాద్
ఫోన్స్ : 040-39310208, 65518000
సెల్ : 98496 90345, 98493 88888

ఆమెగుండెతీసి అతనికి అమరిస్తే! ఇది ఆలోచనా పరంగా అద్భుతమేకాని సాధ్యమా! బతికివున్న మనిషి గుండెను బయటకు తీయటం సమంజసమా! అంటే బతికివున్న మనిషిని చంపటమే కదా! అని ఒకరకంగా హత్య చెయ్యటమేకదా.

అవన్నీ అప్పుడు డా॥ బెర్నార్డ్ మదిలో మెదిలిన సందేహాలు. అయినా తానొకవైద్య విప్లవానికి నాంది పలుకుతున్నాడు.

కాబట్టి మరోరకమైన ఆలోచన అనవసరం. ఒకవేళ తర్వాత ఎవరైనా ఫిర్యాదు చేస్తే 'హత్యానేరం' ఎదుర్కోవాల్సి వస్తుంది. దానికి సిద్ధమవ్వాలి.

తాను సృష్టిస్తున్న వైద్యచరిత్ర ముందు తాను అనుభవించబోయే శిక్ష చాలా చిన్నది అనుకున్నాడు బెర్నార్డ్. అప్పటికప్పుడు ఆపరేషన్‌కి సిద్ధం చేసుకున్నాడు.

నాటివరకు ప్రపంచంలో ఏ వైద్యుడూ చెయ్యని సాహసం. డా॥ బెర్నార్డ్ బృందం సిద్ధమైంది. ఆ ఆపరేషన్‌చేసే బృందానికి బెర్నార్డ్ నాయకుడు. ఆయనతో పాటుగా మరో 19 మంది నిపుణులు ఆ ఆపరేషన్‌లో పాలుపంచుకున్నారు.

ఎవరు ఏమి చెయ్యాలో వారందరికీ తెలుసు. అయితే తొలిసారి చేస్తున్నప్పుడు వుండే ఉద్వేగం వారందరిలోనూ వుంది.

ఆపరేషన్ విఫలమైతే అనే...భయాందోళన వుంది. అయినా ముందుకు కదిలారు. ఆపరేషన్ మొత్తం పూర్తవటానికి ఎనిమిది గంటలు పట్టింది. ఎనిమిది గంటల సమయంలో ఆ మహిళ గుండె తొలగించి ఈ లూయిస్ గుండెస్థానంలో అమర్చారు.

ఆ మార్పిడిగుండె తిరిగి కొట్టుకోవటం మొదలవగానే ఒక్కసారిగా డా॥ బెర్నార్డ్ బృందంలో అంతులేని ఉత్సాహం. ఆ వార్త బయటకు తెలియగానే ప్రపంచమంతటికీ హీరోగా నిలిచాడు డా॥ బెర్నార్డ్.

అన్ని పత్రికలలో పతాక శీర్షికలో డా॥ బెర్నార్డ్ ఫోటో, అతని పక్కనే మనిషి గుండె బొమ్మ. అసలు అది నిజమేనా!

క్రిష్టి యాన్‌బెర్నార్డ్‌చెపుతున్నది వాస్తవమేనా. ప్రపంచాన్ని మోసం చేస్తున్నాడేమో! అనే సందేహాలు తలెత్తకపోలేదు.

ఆ ఆపరేషన్ వివరాలు బయటకు

తెలియచెప్పి, మిగిలిన వైద్యులను ఒప్పించాల్సిన బాధ్యత డా॥ బెర్నార్డ్ మీద పడింది. అటువంటిప్రశ్నలు సాటి వైద్యులు వేస్తారని బెర్నార్డ్ ఊహించాడు.

అందుకే ఆపరేషన్ మొదటి నిమిషంనుండి చివరి క్షణంవరకు పూర్తి వివరాలను నమోదుచేసుకుని దానిని ఒక పుస్తకంగా తెచ్చేందుకు ఏర్పాటుచేశాడు. ఎక్వెరి సెకండ్ కౌంట్స్ (ప్రతిక్షణం విలువైనదే) పేరుతో డొనాల్డ్ మెక్‌రీ పుస్తకం రాశాడు.

మరెవరూ ప్రశ్నించటానికి వీలులేని విధంగా ఆ పుస్తకంలో వివరాలు పొందుపరిచారు.

రోగి బతికింది 18 రోజులే

అయితే గుండెమార్పిడి ఆనందం మూడు వారాలు కూడా మిగలలేదు. ఆపరేషన్ చేయించుకుని, కొత్తగుండెను కలిగివున్న రోగి ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది.

ఆ కొత్త గుండెను రోగి శరీరం స్వీకరించటం లేదని డా॥ బెర్నార్డ్ గ్రహించాడు.మానవ శరీరం చిత్రమైనది. తన శరీరంలోని ప్రతి కణం దానికి తెలుసు. తన శరీరాన్ని రక్షించుకునేందుకు ప్రత్యేకంగా రోగ నిరోధక వ్యవస్థ వుంటుంది.

మార్పిడి ఎలా...


గుండెమార్పిడి ఆపరేషన్‌కు ముందుగా-

- గుండెకువస్తున్న రక్తాన్ని ఒక యంత్రానికిమరలుస్తారు.ఆ యంత్రం గుండెచేసే పనిని చేస్తుంది. శరీరంలోని మిగిలిన భాగాలకు రక్తసరఫరా సమస్యరాకుండా చేస్తారు.
- ఆ తర్వాత పాడైపోయిన గుండెను రోగి శరీరంలో నుండి తొలగిస్తారు. గుండెతో సంబంధం కలిగివున్న రక్తనాళాలను ముందే తప్పిస్తారు. అలా తప్పించిన ఆ గుండె నాళాలను దాత గుండెకు కలుపుతారు. రక్తనాళాలను కలిపి కుట్లు వేస్తారు.
- ఆ సమయంవరకు గుండె బాధ్యతలను నిర్వహిస్తున్న యంత్రాన్ని క్రమంగా పక్కకుతప్పించి రక్తం కొత్తగా అమర్చిన గుండెకి వెళ్ళి, అక్కడి నుండి శరీర భాగాలకు పంపింగ్ అయ్యేలా చేస్తారు.
- దాతనుండితీసుకుని అమర్చిన కొత్తగుండెకు సందర్భాన్ని, అవసరాన్నిబట్టి షాక్ ఇచ్చి గుండె సక్రమంగా కొట్టుకునేలా చేస్తారు.
- దాతనుండి వచ్చిన గుండె తిరస్కరించబడకుండా రోగికి ఇమ్యూనో సప్రెసాంట్స్ ఇస్తారు. దాత గుండెను క్రమంగా శరీరం అర్థంచేసుకుని స్వీకరించేవరకు ఆ సప్రెసాంట్స్ అవసరమవుతాయి.

శరీరంలోని తన కణాలు కాక వెలుపలినుండి ఏ ఒక్క కొత్త కణం లోపలికి వచ్చినా దానిని వెంటాడి చంపివేస్తుంది రోగనిరోధకవ్యవస్థ.

సూక్ష్మజీవులు లోపలికి ప్రవేశిస్తేనే సహించని శరీరం పిడికిలి పరిమాణంలో వుండే గుండె కొత్తగా శరీరంలోకి వస్తే ఎందుకు సహిస్తుంది!

రోగకారక సూక్ష్మజీవులమీద దాడిచేసి సంహరించినట్టే కొత్తగా రోగి శరీరంలోకి ప్రవేశపెట్టిన గుండెమీద దాడిచేస్తున్నాయి అని డా॥ బెర్నార్డ్ భావించాడు.



రోగిలో కొత్తగా ప్రవేశపెట్టిన గుండె ఆరోగ్యంగా వుండాలంటే రోగి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ చురుకుగా వుండకూడదు అని అనుకున్నారు డా॥ బెర్నార్డ్ బృందంలోని సభ్యులు.

వెనువెంటనే రోగనిరోధకవ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు మందులు ఇచ్చారు.

ఆ మందులు పని చేస్తాయని, రోగి బతికి కొత్త గుండెతో ఆసుపత్రిలో నుండి బయటకువెళ్ళి గుండె మార్పిడి విజేతగా ప్రపంచం ముందు నిలుస్తాడని డా॥ బెర్నార్డ్ బృందం భావించింది.

కాని సరిగ్గా ఆ రోగి 18వ రోజున మరణించాడు. అది డా॥ బెర్నార్డ్‌కి పెద్ద షాక్. ఒక ప్రయోగం పేరుతో రెండు నిండు ప్రాణాలు బలితీసుకున్నాడన్న నింద పడింది బెర్నార్డ్ మీద. ఆ గుండె మార్పిడి సాహసం చెయ్యకుండా వుండాల్సిందా! అనే సందేహం బెర్నార్డ్‌కి కలిగింది. నిరుత్సాహపడక ఆ రోగి మరణానికి కారణం ఏమిటి అనే విషయం శోధించాడు.

గుండెను అందుకున్న 53ఏళ్ళరోగికి న్యుమోనియావుందిఅప్పటికే. ఆ న్యుమోనియాతో రోగనిరోధకవ్యవస్థ యుద్ధం చేస్తున్నది. కాని ఎప్పుడైతే రోగనిరోధకవ్యవస్థను నిర్వీర్యంచేసే మందులను ఇచ్చారో అప్పుడు ఆ వ్యవస్థ న్యూమోనియామీద పోరాటం చెయ్యలేని స్థితికి చేరింది.

ఫలితంగా న్యుమోనియా కారక జీవులు విజృంభించాయి. ఆ రోగి ప్రాణాన్ని బలిగొన్నాయి. దీనితో గుండెమార్పిడి ఆపరేషన్ విజయవంతమేనని, అందులో ఎటువంటి లోపం ఏర్పడలేదని, ఇతరకారణాలవల్ల రోగి మరణించాడని స్పష్టమైంది. దానితో డా॥ బెర్నార్డ్ ఆపరేషన్‌మీదున్న సందేహాలన్నీ తొలగిపోయాయి.

మానవ శరీరంలోని అంగాల మార్పిడికి అవసరమైన కొత్త ఆపరేషన్లు మొదలయ్యాయి.

అంగ మార్పిడి దిశగా

గుండె మార్పిడి ఆపరేషన్ ఒక్కరోజుతో వచ్చిన విప్లవంకాదు. అంగాల మార్పిడి ఆలోచన 18వ శతాబ్దంనుండి వుంది. అయితే దానికి తగిన అనుకూల వైద్య పరిస్థితులు తయారవటానికి దాదాపు నూటయాభై సంవత్సరాలు పట్టింది.

మానవశరీర నిర్మాణం, అందులోని విశేషాలు ఒకదాని తర్వాత ఒకటి కనుక్కోవటంవల్ల గుండె మార్పిడి సాహసం సాధ్యమైంది. శరీరంలో యాంటీబాడీస్, యాంటిజన్స్ వుంటాయని, అవి రోగనిరోధక వ్యవస్థలో కీలకమన్న హెర్లిష్ అనే శాస్త్రవేత్త కనుక్కుంటే, రక్తంలోని భిన్నగ్రూప్‌లను లాన్స్టీనెర్ అనే శాస్త్రవేత్త వెలికితీశాడు.

మరో పరాయి భాగాన్ని అందుకోవటంలో మానవ శరీరంలో పనిచేసే నిరోధికత మెకినిస్కోఫ్ వివరించాడు.రక్తనాళాలను తిరిగి కలిపే ప్రక్రియను ఎలెక్స్ కారెల్ అనే ఫ్రెంచ్ వైద్యుడు చూపించి 1912 నోబెల్ మెడిసిన్ అవార్డును గెలుచుకున్నాడు.

జీవులలోని కణజాలాలను, కీలక అంగాలను శరీరం ఆవల ఎక్కువ సమయం జీవించివుండేలా ప్రయోగాలను విజయవంతంచేసింది ఎలెక్స్ కారెల్.

ఒక సూక్ష్మనాళం శరీరం లోపలికి పంపి లోపలి ద్రవాన్ని బయటకు తేవటం లేదా ఇంజక్షన్ వేరుగా అంగానికివ్వటం అనే 'కాథెటరైజేషన్' ప్రక్రియను 1958లో డికెన్‌సన్ రిచర్డ్ విజయవంతం చేశాడు.

అదే సంవత్సరంలో రోగనిరోధక వ్యవస్థను జోకొట్టి నిద్రపుచ్చే మందులను కీత్ రీన్‌స్టైన్ కనుగొనటం వల్లే గుండె మార్పిడి ఆపరేషన్ చికిత్స చివరిగా విజయవంతమైంది.

1967లో తొలి గుండెమార్పిడి ఆపరేషన్ తర్వాత అంగ మార్పిడి ఆపరేషన్స్ పుంజుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది సంఖ్యలో పలురకాల అంగ

మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయి. అమెరికాలో జరిగే ప్రతి పది అంగమార్పిడి ఆపరేషన్లలో ఒకటి గుండెమార్పిడి ఆపరేషన్.

గుండె మార్పిడి ఆపరేషన్ తర్వాత జీవించే కాలం క్రమంగా పెరిగింది. కొత్త పద్ధతి వచ్చింది కదా అని గబగబా గుండె మార్పిడి ఆపరేషన్లు చేసి భంగపడ్డారు వైద్యులు. ఒక దశలో గుండె మార్పిడి తర్వాత రోగి బతకరేమోనన్న సందేహం ఏర్పడింది.

శరీరం కొత్తగుండెను తిరస్కరించటానికి గల కారణాలను అర్థం చేసుకునేందుకు దశాబ్దంపైగా పట్టింది. చివరికి కొత్త అంగాలను తిరస్కరించే శక్తిని అదిమిపెట్టే సైక్లోపోరిన్‌కి 1983లో అనుమతి లభించటంతో అంగమార్పిడి ఆపరేషన్లు పుంజుకున్నాయి.

అంగమార్పిడివిధానం విజయవంతమవటంతో అంగాలను అమ్ముకునే వ్యాపారం పెరిగింది.

వైద్యులు, దళారీలు ఒకగ్యాంగ్‌గా ఏర్పడి అక్రమంగా మూత్రపిండాలను తొలగించి, అమ్ముకున్న వైనం మనదేశంలో వెలుగుచూశాయి. అడ్డగోలుగా జరిగే అంగాల మార్పిడిని అరికట్టేందుకు చట్టాలు తీసుకురావాల్సివచ్చింది. అంగదాతలు ప్రభుత్వ విభాగాలలో రిజిష్టర్ చేసుకోవాలి.

రక్తసంబంధీకులు మాత్రమే అవయవదానం చెయ్యాలన్న నిబంధనలు వచ్చాయి. మిగిలినఅంగాల మార్పిడి ఆపరేషన్లు విజయవంతమయ్యాయి. కాని గుండెమార్పిడి ఆపరేషన్ తర్వాత గుండె పొందిన వారు గరిష్ఠంగా 13 ఏళ్ళు జీవించగల్గుతున్నారు.


ముఖ్యనగరాలలో

నేడు ప్రపంచవ్యాప్తంగా అన్నిరకాల అంగాల మార్పిడి ఆపరేషన్లు దాదాపు అన్ని ముఖ్య నగరాలలో జరుగుతున్నాయి. ప్రధానంగా మూత్రపిండాల దానం, అమరిక పెరిగింది. దానితర్వాతి స్థానంలో కాలేయ మార్పిడి ఆపరేషన్లు ఉన్నాయి.

గుండెమార్పిడి ఆపరేషన్లు మూడవస్థానంలో ఉన్నాయంటుంది అమెరికా. ఇంకా ఊపిరితిత్తులను మారుస్తున్నారు.పాంక్రియాటిక్ గ్రంథిమార్పిడి జరుగుతున్నది. అలాగే పేగుమార్పిడి ఆపరేషన్లు అమెరికాలో జరుగుతున్నాయి.

మనదేశంలో అధికంగా జరుగుతున్నవి మూత్రపిండ మార్పిడులు. అవయవదానం విషయంలో పెరిగిన అవగాహనవల్ల ఈ ఆపరేషన్లు చెయ్యగలుగుతున్నారు. అవయవాల మార్పిడి అవసరమైన రోగుల సంఖ్యకు తగినట్టుగా అవయవాలను దానం చేసేవారు లేరు. అవయవదానం అనేది పూర్తిగా అంగీకారం కాలేదు సమాజంలో.

మరణించిన వ్యక్తి బంధువుల అనుమతి లేకుండా అంగాలను వెలికితీయటం చట్టవిరుద్ధం. లిఖిత పూర్వక అనుమతి తప్పనిసరి.


Courtesy : THE WEEK

అవయవదానానికి సిద్ధమైనవారిలో కూడా అతి తక్కువ శాతంలోమాత్రమే అంగమార్పిడికి అవసరమైన స్థితిలో అంగాలుంటాయి. మార్పిడికి సేకరించే అంగం ఆరోగ్యంతో ఉండాలి. మరణించినతర్వాత స్వల్పకాలంలో అంగాల సేకరణ,రవాణా జరగాలి.

గాయాలవల్ల అంగాలు దెబ్బతిని ఉండకూడదు. వాటికి ఆక్సిజన్ సరఫరా ఆగి ఎక్కువ కాలం కాకూడదు. అవయవదానానికి సిద్ధపడినవారి వయసు పరిగణనలోకి తీసుకోవాల్సివుంటుంది. వయసుతో అంగాల పనితీరు మందగింపు సహజం.

మరణాలలో దాదాపు డెబ్బైశాతం మరణాలు అరవైఐదు సంవత్సరాల పైబడినవారు. వీరిలో అవయవదానానికి అంగీకారం ఇచ్చినవారు పది శాతానికి మించటం లేదు. అదికూడా వారి అవయవ ఆరోగ్యం అంతంతమాత్రమే. దానమిచ్చే అవయవం ఎటువంటి అనారోగ్యం లేనిదైవుండాలి.

గణాంకాల ప్రకారం

రవాణాలోఉండే చల్లదనపు వాతావరణం తట్టుకోగలిగిన శక్తి, బలం వాటికుండాలి. ఈ కారణాలవల్లనే అంగమార్పిడి ఆపరేషన్ ప్రక్రియ విజయవంతమైనప్పటికీ ఆ ఆపరేషన్లు చేసేందుకు తగిన అవయవ దాతలు దొరకటంలేదు.

గుండె ఆపరేషన్ చాలా క్లిష్టమయినది. ఎంతో జాగ్రత్తగా చెయ్యవలసినది. అమెరికా దేశపు గణాంకాల ప్రకారం ప్రతిఏటా ఇరవైఆరు లక్షలమంది మరణిస్తుంటే అందులో సగానికన్నా తక్కువమందే ఆసుపత్రుల్లో మరణిస్తున్నారు.

అయితే మరణించినవారందరి అవయవాలు తియ్యలేరు. వెంటిలేటర్‌మీదున్నవారి అవయవాలు తగినవి. అయితే వారి సంఖ్య పదకొండువేలలోపే. వారిలో అవయవదానానికి అంగీకరించేవారు ఎనిమిది వేలమంది. కాబట్టి 4వేలమంది గుండె పాడైపోయి ఎదురుచూస్తుంటే అందుబాటులో ఉంటున్నది 3వేల గుండెలే.

ఈ కారణంగా గుండె ఎవరికి అమర్చాలి అనే దానిని వేరువేరు అంశాలనుపరిగణనలోకి తీసుకుని నిర్ణయిస్తున్నారు.

బ్లడ్‌గ్రూప్ కలవాలి, శరీర తత్వం సరిపోవాలి. దాతకోసం ఎక్కువ కాలం వేచివుండినవారవ్వాలి.

దాతకు, ఆసుపత్రికి, వైద్యుడికి సమీపంలో ఉన్నవారికి ఈ అవకాశం దక్కుతున్నది. గుండె మార్పిడి అవసరం పెరిగి, తగినంతమంది అవయవ దాతలు దొరకని సమయంలో ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించాల్సివస్తున్నది.

అందులో ఒకటి ఇతర జంతువుల గుండెలను అమర్చటం. పందిగుండె మనిషి గుండెకు అతిదగ్గరగా ఉందన్నది పరిశోధకుల నమ్మకం. కృత్రిమ గుండెను అభివృద్ధిచెయ్యటం మరో ప్రత్యామ్నాయం. గుండెమార్పిడికి ఎదురుచూసే రోగులను కృత్రిమ గుండెమీద ఆధారపడేలా చేస్తున్నారు. ఇవి శరీరానికి ఆవలవుండే గుండెచేసే రక్త పంపిణీని చేస్తాయి.

దాతల గుండెలను రవాణాచెయ్యటంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించటం మరో ఆలోచన. ఇందుకోసం ఆగిపోయిన గుండెను తిరిగి కొట్టుకునేలాచేసేందుకు రూపొందించినపరికరం ప్రయోగ స్థాయిలో ఉంది. అన్నీ అనుకున్న రీతిలో ముందుకు వెళితే గుండె సమస్యతో మరణించేవారుండరేమో!

అయితే ఆ స్థాయికి చేరటానికి మరోఇరవైఏళ్ళు అయినా పడుతుందేమో! అవయవదానానికి అన్ని వయసులవారూ సిద్ధమైనప్పుడు, వారి రక్త సంబంధీకులు త్యాగానికి సిద్ధమైనప్పుడు మరో జీవికి ప్రాణంపోసినవారవుతారు. ఆ మేరకు ప్రపంచం మారేవరకు వేచివుండాల్సిందే.



ఆ ఇద్దరూ అపరిమితమైన
సౌందర్యాంగనలు
ఆ మిత్రరాళ్ళ మధ్యకు
ఓ అందచందాల వన్నెల రాచిలుక
ఇప్పుడా మహల్లోకి వచ్చింది
ఈర్ష్యపడ్డారా ఇద్దరూ
తాము వలచి వరించిన ఆ యువకుడు
ఆ వన్నెల విసనకర్ర వలలో పడినందుకు!!!
తమ సౌందర్యానికి సాఫల్యత లేదని
వాపోయారిద్దరూ!!!
అది చూసి మనసారా నవ్వుకుందా యువతి
ఎవరా అతివ?!
ఆ ఇద్దరు సౌందర్యాంగనలెవరు?!
ఆ ముగ్గురూ ప్రేమిస్తున్న యువకుడెవరు?!

గోల్డెన్ ఎరా సీరియల్

సి. శివరామమూర్తి

సామ్రాట్ సముద్రగుప్త

వచ్చేవారమే ప్రారంభం!

వేడి వేడి సమోసా



శనగపప్పు సమోసా

కావాల్సిన పదార్థాలు : ఒక కప్పు మైదా పిండి, అరకప్పు గోధుమపిండి, రెండు టేబుల్‌స్పూన్లనూనె, చాలినంతనీరు.

స్టఫింగ్ కోసం : అరకప్పు శనగపప్పు, పావుటీస్పూన్ వాము, రెండు టీస్పూన్లు నెయ్యి, అరటీస్పూన్ పసుపు, అరటీస్పూన్ కారం, అరటీస్పూన్ ఉప్పు, వేయించడానికి తగినంత నూనె, తాలింపు దినుసులు.

తయారుచేసేవిధానం : సమోసాకోసం పిండికలుపుకోవాలి. లేదంటే రెడీ మేడ్‌గా దొరికే సమోసా బేస్ అయినా కొనుక్కోవచ్చు. శనగపప్పు రాత్రంతా నానబెట్టాలి. పప్పు ఉడికించాలి.

ప్యాన్ వేడిచేసి నెయ్యి వేసి కాయాలి. ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక పసుపు, కారం, ధనియాల పొడి, పప్పు వేసి ఉడికించాలి. చల్లారనివ్వాలి.

సమోసా బేస్‌లో ఈ మిశ్రమంనింపి అంచులు మూసేసి నూనెలో వేయించి, వేడిగా పుదీనాచట్నీతో వడ్డించాలి.

దేశవ్యాప్తంగా పరికించి చూస్తే సాయంవేళ తినే పలహారాల్లో సమోసాలు ముందుంటాయి. నిజానికి సమోసాల మూలం మన దేశానిది కాదు. కాని, మనం మనదైన స్టయిల్‌లో వాటికి సరికొత్తరుచులు జత చేశాము. ఫిట్‌నెస్, డైట్ అంటూ ఎంత కఠినమైన ఆహారనిబంధనలు పాటిస్తున్నప్పటికీ, సమోసాల వాసనలు సోకితేమాత్రం ప్రతిఒక్కరినోట్లో నీరూరిపోతాయి.

అప్రయత్నంగానే చెయ్యి, మనస్సు అటువైపునకు మళ్ళుతాయి. సమోసాల లోపల నింపే పదార్థాల విషయంలో ఎవరి అభిప్రాయం వారిది.

రుచుల ప్రాధాన్యాన్ని అనుసరించి సదరు ఫిల్లింగ్ పదార్థాలు మారుతుంటాయి. సన్నగా తరిగిన కూరగాయ ముక్కలు, ఛీజ్, మాంసాహారపదార్థాలు వేటితోనైనా సమోసాలను నింపుకోవచ్చు.

మనదేశంలో శాకాహార సమోసాలకే అధిక ప్రాధాన్యం ఉంది. సమోసాల మూలం ఎక్కడా అనేది ఇప్పటికీ స్పష్టంగా తెలియని విషయంగానే ఉంది. ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మాల్దీవులు, శ్రీలంకవంటి దేశాల్లో వీటి ప్రాచుర్యం ఎక్కువ. మధ్యప్రాచ్య దేశాల్లో సైతం శతాబ్దాలుగా సమోసాలు ఆహారంలో భాగంగా వుంటున్నాయి.

కొన్ని సరికొత్త సమోసాల తయారీ విధానాలు ఆహారప్రియులకోసం.

ఛీజ్, పచ్చఉల్లి సమోసా

కావాల్సిన పదార్థాలు : రెండు కప్పులు మైదా, రుచికి ఉప్పు, రెండు లేదా మూడుటేబుల్‌స్పూన్లు నెయ్యి లేదా నూనె, తగినంత నీరు.

ఫిల్లింగ్ కోసం : అరకప్పు ఉల్లికాడ ముక్కలు, పావుకిలో ఛీజ్ తురుము, మూడుటీస్పూన్లు వెన్న, రెండు టీస్పూన్లు పచ్చిమిరపకాయ ముక్కలు, రుచికిఉప్పు, మిరియాల పొడి, వేయించడానికి నూనె.

తయారుచేసేవిధానం : మైదా, అవసరమైనంత ఉప్పు, నూనె లేదా నెయ్యి వేసి బాగా కలిపి, తగినంత నీరు పోసుకుంటూ చపాతీపిండిలా మృదువుగా కలుపుకోవాలి. పక్కన ఉంచుకోవాలి. ఛీజ్‌తురుము, వెన్న, ఉల్లి, ఉప్పు, పచ్చిమిరపకాయ ముక్కలు, మిరియాలపొడి వేసి బాగా కలుపుకోవాలి.

మైదాపిండిని రోల్ చేసుకుని రెండుగా సమంగా కట్ చేసుకోవాలి. రోల్ చేసి ఒకటి లేదా రెండు స్పూన్లు మిశ్రమాన్ని ఉంచి, సమోసా ఆకృతిలో మడవాలి.


మూకుడులో నూనెపోసి, మధ్యస్తంగా ఉండే సెగపై కాయాలి.

నూనె వేడెక్కిన తర్వాత తయారుచేసి ఉంచుకున్న సమోసాలను రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేదాకా వేయించాలి.

వీటిని వేడివేడిగా చట్నీ లేదా సాస్‌తోతింటే రుచిగావుంటాయి.







Courtesy : B+ve

మకరోని సమోసా

కావాల్సిన పదార్థాలు : అవసరమైనంత ఉడికించిన మకరోని.

టొమేటో పేస్ట్‌కోసం : రెండుమూడు టొమేటోలు, రెండు పచ్చిమిరపకాయలు, అరకప్పు తరిగిన ఉల్లిపాయముక్కలు.

సమోసా పిండికోసం : రెండు కప్పులు మైదాపిండి, అరకప్పు గోధుమపిండి, రెండు టేబుల్‌స్పూన్లు నూనె, తగినంత నీరు.

సాస్ తయారీకి : రెండు టీస్పూన్లు నూనె, టొమేటో పేస్ట్, రుచికి తగినంత ఉప్పు, మిరియాల పొడి, వేయించడానికి నూనె.

తయారుచేసేవిధానం : మకరోనితో తయారయ్యే సమోసాపిల్లలకు, పెద్దలకు సరికొత్త వెరైటీ.

టొమేటో, పచ్చిమిరపకాయలు, ఉల్లిపాయలు కలిపి పేస్ట్ తయారుచేసుకోవాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి పేస్ట్ వేసి వేయించాలి. ఉప్పు, మిరియాల పొడి కలుపుకోవాలి.

సాస్ ఉడికాక పక్కన ఉంచుకుని మకరోని పదినిమిషాలు ఉడికించి, సాస్‌లో కలపాలి. బాగా కలయబెట్టి చల్లారనివ్వాలి.

సమోసా ఆకృతి తయారుచేసుకుని మకరోని మిశ్రమం నింపి, నూనెలో వేయించుకోవాలి.



క్యాలీఫ్లవర్ సమోసా

కావాల్సిన పదార్థాలు : రెండు కప్పులు మైదాపిండి, అరకప్పు గోధుమపిండి, రెండు టేబుల్ స్పూన్లు నూనె, తగినంత నీరు.

స్టఫింగ్ కోసం: రెండు మూడు టేబుల్‌స్పూన్లు నూనె, అరటీస్పూన్ అల్లంపేస్ట్, అరటీస్పూన్ పచ్చిమిరపకాయ పేస్ట్, అరటీస్పూన్ కారం, ఒకటీస్పూన్ పసుపు, అరకప్పు క్యాలీఫ్లవర్ ముక్కలు, అరకప్పు బంగాళాదుంప ముక్కలు, అరకప్పు బఠాణీలు, వేయించడానికి నూనె.

తయారుచేసేవిధానం : దీన్ని కోల్‌కతాలో ఎక్కువగా తయారు చేస్తారు. దీనిని ఫూల్‌కోపిర్ సింఘరగా పిలుస్తారు.

సమోసాపిండి కలుపుకుని, రోల్ చేసి రెండుగా కట్ చేసుకోవాలి. ఫిల్లింగ్ తయారీకి ప్యాన్‌లో నూనె వేడి చేసి మధ్యస్తంగా ఉండే సెగస్టై ఉంచి జీలకర్ర, ఆవాలు, మెంతులు వేసి చిటపటలాడనివ్వాలి.

అల్లం, పచ్చిమిరపకాయ పేస్ట్, పసుపు, కారం వేసి ఓ నిమిషం వేగనివ్వాలి. తరిగిన క్యాలీ ఫ్లవర్, బంగాళాదుంపలు, బఠాణీలువేసి మసాలా బాగా పట్టేవిధంగా కలియబెట్టాలి. మూతపెట్టి పదినిమిషాలు సన్ననిసెగపై ఉడికించాలి.

చల్లారనివ్వాలి. సమోసా ఆకృతిలో ఒక్కోటీస్పూన్ మిశ్రమాన్ని నింపి అంచులు మూసేయాలి. మూకుడులో నూనె వేడిచేసి సమోసాలు వేసివేయించి, వేడిగాతినాలి.

కె.మధుయామిని

తొలిముద్దు తోరణం

తొలిరేయి... వెలుగుచలిత లోకానికి లలిత సాంత్వనకురుస్తూ... రేయి సాగుతోంది! నీలినింగి కాన్వాసుపై రమ్యమైన చిత్రంలా ఒదిగిన చందమామ- చుక్కలు గిల్లినట్లుగా... సిగ్గుతో ఎరుపెక్కిన కన్నెపిల్లచెక్కిలివర్ణంలో మెరిసిపోతున్నాడు!

వెన్నెల తరగలను చూస్తూ మరుమల్లెలు తెరలు తెరలుగా పొరలు విప్పుకుంటున్నాయ్.

సమాగమానికి సిద్ధమైన సుందరి మెలమెల్లగా బిడియపువలువలు తొలగిస్తున్నట్లు... ఏదో రసవత్తర ఘట్టానికి పూర్వరంగం సిద్ధంచేసి ఎదురుచూస్తున్నట్లుగా ఉంది.... ప్రకృతి!

యస్వీకృష్ణ

అతను తన రెండు అరచేతులనూ ఆమె వీపుపై ఆనించి ఆమెని తనవైపుకి ఆర్తిగా అదుముకుంటూ ఆమె చుబుకంనుంచి నెమ్మదిగా కిందికి దిగుతూ మెడమీదుగా పెదవులతో స్వరపేటికను స్పర్శిస్తూ, ఇంకొంచెం కిందకి సాగి ఠక్కున ఆగి బలంగా తన పెదవుల్ని అదిమాడు. ఆ సమయంలో...



గది మొత్తం విస్తరిస్తున్న అగరొత్తుల సువాసన మెత్తమెత్తగా మదిని మత్తెక్కిస్తూంటే...

"మా...న...సా!" అసంకల్పితంగానే వంశీ పెదవులు ఆమె పేరుని పలవరించాయి.

మానసతో అతడి పరిచయం మూడేళ్ళనాటిది. సోషల్ మీడియా 'ఫేస్‌బుక్'లో ఫ్రెండ్స్ అయిన వాళ్ళిద్దరూ ఛాటింగుల ద్వారా పరస్పర వివరాలూ, అభిప్రాయాలూ పంచుకుని, భావాలు కుదరడంవల్ల ఏడాది తర్వాత ఓ 'ఫైన్ ఈవెనింగ్' ప్రత్యక్షంగా కలుసుకున్నారు. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' కాదుగానీ... 'ఫస్ట్ సైట్ ఆఫ్టర్ ఫ్రెండ్షిప్ 'లవ్ టర్న్' తీసుకుంది.

మరో ఏడాదికల్లా ఇద్దరూ ఉద్యోగాల్లో సెటిలవడంతో పాటు తమ 'లైఫ్ పార్టనర్' విషయంలోకూడా పరస్పరంఓ 'నిశ్చితాభిప్రాయానికి' రావడంవల్ల పెద్దవాళ్ళకి తమ ప్రేమవిషయం తెలిపి ఒప్పించారు.

ఆర్నెల్ల క్రితమే శాస్త్రబద్ధంగా ఇద్దరికీ 'నిశ్చితార్థం' కూడా జరిగిపోయింది. అయితే అప్పటిదాకా అంతా సాఫీగానే సాగినా... అసలు 'అడ్డంకి' అక్కడే పడింది. ఇరువర్గాల పెద్దలు ముహూర్తాలూ, వెసులుబాట్లూ సరిచూసుకుని అందరికీ వీలైనరోజున పెళ్ళి ముహూర్తం నిర్ణయించేసరికి అదికాస్తా మరో ఆర్నెల్ల తర్వాత వచ్చే రోజయ్యింది!

దాంతో 'పెద్దలు కుదిర్చిన ఈ ప్రేమపెళ్ళి' కాస్తా సంతకాలుపూర్తయినా... మూడు సింహాల ముద్రపడని అధికారపత్రమయ్యింది!అలాగే వీరిద్దరి పరిస్థితి కూడా 'సీటు' రిజర్వ్ అయినా... 'బెర్త్' కన్‌ఫర్మ్ కాని సందిగ్ధమయ్యింది!!

'పట్టా' చేతికి రాకున్నా 'పాసయినట్టు' రిజల్టొచ్చిన స్టూడెంట్స్‌లా వీళ్ళు కూడా 'పెళ్ళి కాకపోయినా నిశ్చితార్థం జరిగిన ప్రేమజంట' కాబట్టి ఈ ఆర్నెల్లూ పెద్దవాళ్ళకు తెలీకుండా చెట్టాపట్టాలేసుకొని దొంగ చాటుగా ఎన్నో చోట్ల తిరిగారు.

సరదాగా సినిమాలకీ, షికార్లకీ వెళ్ళారు. అయితే ప్రేమపక్షుల్లా వాళ్ళెంతగా తిరిగినా ఏనాడూ హద్దులు దాటలేదు, ఎప్పుడూ అసభ్యంగా ప్రవర్తించలేదు.

ముఖ్యంగా ఈతరం యువత విషయంలో ఎంతగా చెప్పినా ఎవ్వరూ నమ్మని విచిత్రమైన విషయమేంటంటే.. మానసని వంశీ కనీసం చిరుముద్దయినా పెట్టుకోలేదు. కారణం... మానస ఒప్పుకోలేదు!

అతడెంతగానో బతిమాలేవాడు... "ముద్దుతోనైనా నా విరహాన్ని నిద్రపుచ్చరాదా?" అంటూ పరిపరివిధాల ప్రాధేయపడ్డాడు. ఉహుఁ ఆమె "ససేమిరా" అనేది.

"పెళ్ళికాకుండానే అలాంటి టీలూ, టిఫిన్లకీ నో ఛాన్స్ వంశీ!" అన్నదొకసారి.


"పెళ్ళవకుండానే స్వీట్ నథింగ్స్ కాస్తా రుచి చూసేస్తే... పెళ్ళయ్యాక 'సెకండ్ హ్యాండ్ అనుభూతి'లా అనిపించి, 'ఫ్రెష్ ఫీలింగ్' ఉండదోయ్ కృష్ణా... నా మాట విను!" అన్నది మరోసారి.

"మాటిమాటికీ నువ్విలాబతిమాలుతూబలవంతపెట్టావంటే అసలు పెళ్ళయ్యేదాకా నిన్ను కలవనే కలవను.. జాగ్రత్త!" అన్నది.

"ఒట్టు... పెళ్ళయ్యాక తొలిరాత్రి తొలిముద్దు నేనే నీకిస్తా... సరేనా?" అనేసింది ఆఖరిసారి.

అందరూ ఎదురుచూసిన ఆ రోజు రానేవచ్చింది... అనుకున్నట్లే వాళ్ళపెళ్ళయిపోయింది. ఆ రోజు వాళ్ళ మొదటి రాత్రి... తొలిరేయి వచ్చేసింది... తొలిముద్దే రావలసివుంది! తహతహలాడుతోంది మనసు... జివజివలాడుతోంది తనువు!

మనసిచ్చినమగువ మనసుపడ్డ వాడికిచ్చే మొదటి ముద్దు... 'పెళ్ళయిన కన్నెపిల్ల' పెనిమిటికిచ్చే ముచ్చటైన ముద్దు... కొత్తపెళ్ళికూతురు మురిపెంగా అందించే ముత్యాలముద్దు! చిరుచిరు సిగ్గుల చిన్నారి



ముద్దు.. చిరకాల నిరీక్షణ తదుపరి అందే ముద్దొచ్చే ముద్దు! ఎలా...ఎలా...ఎలా... ఉంటుందీ?

ఆర్తినిండిన ముద్దా? ఆర్ద్రతపండిన ముద్దా? ఆవేశం నింపిన ముద్దా? ఎలాగుంటుందీ... ఎలా ఉండబోతోందీ... ఏమవబోతోందీ? ఏదైతేనేం 'మొదటిరాత్రి మొదటి ముద్దు' హబ్బ... ఆ 'కిక్కే' వేరబ్బా!

"ఏమిటీ...? "కాకపోతే మరేంటీ? గదిలోకి వచ్చానో, లేదో... ముద్దిమ్మంటూ వెంటబడితే ఎలా? అంతకంటే ముందు చేయాల్సినవి చాలా ఉన్నాయ్?"

"చేయాల్సినవా? ఏమిటవీ?" ఆ మాటకి చిరుకోపంతో బుంగమూతి పెట్టింది మానస "అవికూడా నేనే చెప్పాలా? మీరే మొదలెట్టాలి?"

"ఔనా?" అంటూ ఆలోచిస్తున్నట్టు పోజు పెట్టి 'మెయిన్ పిక్చర్ కంటే ముందొచ్చే టీజర్ లాగా నేనుకూడా ముద్దుతోనే కదా మొదలెడదామంటున్నామా?" అన్నాడు వంశీ.

"ఛీ... అదికాదు, మీకెప్పుడూ అదే యావ!" ఈసారి నిజంగానే కోపం వచ్చింది మానసకి.

ఆ తర్వాత అతడికి దగ్గరగా జరిగి, పిడికిలితో అతడి గుండెలపై సున్నితంగా గుద్దుతూ-

"పెళ్ళికి ముందు ఎంత అల్లరి చేసేవారో అప్పుడే మర్చిపోయారా? కామెడీలు చేసి నవ్వించేవారు, నా అణువణువూ పొగిడేస్తూ కవ్వించేవారు, 'అడల్ట్ జోకులు' చెప్పి రెచ్చగొట్టేవారు, నేను వద్దన్న వాటి కోసం పదేపదే బలవంతపెడుతూ కోపం తెప్పించేవారు, నేనొప్పుకోనందుకు అలిగి ఏడ్పించేవారు.. ఉక్కిరిబిక్కిరైపోయేదాన్ని! అంత చేసిన మీకు ఇప్పుడేమైంది?" అంది కినుకుగా.

"అంటే..?" అర్థంకానట్లు చూశాడు వంశీ.

"ఏంలేదు మహానుభావా... ముందుగా కాసేపు కబుర్లు చెప్పుకుందామంటున్నాను!"

ఈసారి మాత్రం కోపం వంశీకి వచ్చింది... "అరిటాకులో అన్నీ వడ్డించి, నోటికి కుట్లేసినట్లుగా పెళ్ళికి ముందు నన్నో అంటరానివాడిలా ట్రీట్ చేసి నిన్ను ముట్టుకోనీయలేదు.

కబుర్లతోనే కాలం వెళ్ళబుచ్చావ్. ఇక పెళ్ళయిన తర్వాత కూడా కబుర్లేనా? ఊహు... ఇంక నేను ఓపిక పట్టలేను!" అంటూ ఆమె నడుంచుట్టూ చేతులు బిగించి దగ్గరికి లాక్కుని, ఆమె కళ్ళలోకి చూస్తూ... "మానసా! అప్పుడైతే మన పెళ్ళికాలేదని అన్నింటికీ అడ్డు చెప్పావ్. నేనూ సహనంగా ఉన్నాను.

ఇప్పుడైతే మన పెళ్ళయింది. ఆ స్వేచ్ఛతోనైనా నీ అంతట నీవే చొరవ తీసుకుంటావని ఎదురు చూశాను. నేనడిగితే తప్ప ఇవ్వవా? పైగా నాకు మాట కూడా ఇచ్చావ్... మర్చిపోయావా?" అన్నాడు వంశీ అనురాగంగా.

మానస నొచ్చుకున్నట్లుగా "నేనెందుకు మర్చిపోతాను కృష్ణా? ముద్దిమ్మని ఎంతగా నన్ను వేధించే వాడివో నాకు గుర్తులేదా?" అంటూ అరచేతుల్తో అతడి ముఖాన్ని అందుకుని అతడి కళ్ళలోకి చూస్తూ

"అయినా నేనేం ఇచ్చిన మాట తప్పేదాన్ని కాదు. అలాగని మొదటిరాత్రి గదిలోకి వచ్చీరాగానే గభాల్న మీదపడి గబగబా ముద్దుపెట్టేస్తే... ఎంత అబ్సర్డ్‌గా ఉంటుందో కదా!" అంది.

ఆ మెమాటల్లోని వాస్తవం గ్రహిస్తున్నట్లుగా యోచనలో పడ్డ వంశీకృష్ణ మెడచుట్టూ వరమాలలా చేతులు వేసి, అతడినుదురుకి తన నుదుర్ని మురిపెంగా తాటిస్తూ "కృష్ణా ఇన్నాళ్ళూ ఇద్దరమూ ఎంతో ఆత్రంగా ఎదురుచూసిన ఈరాత్రి ప్రతీక్షణాన్ని మన తీయని అనుభూతులతో నింపుకోవాలి.

జీవితమంతా గుర్తుండాల్సిన రాత్రి కదా ఇది! ఎంత సున్నితంగా, ఇంకెంత నిమ్మళంగా మొదలెట్టాలి? మీ మగాళ్ళంతా ఇంతేనేమో...

అదో గొప్ప

మంచి అవకాశాలు అందుకుంటూ కెరీర్‌రేస్‌లో స్పీడ్ పెంచేసిన అనుఇమ్మాన్యుయేల్‌కు స్టార్‌హీరోల సరసన నటించడం అంటే అమిత ఇష్టం అట.

అలాగే ఓసారి పనిచేసిన దర్శకుడు మరోసారి ఆఫర్ ఇస్తే ఓ గౌరవంగా భావిస్తానంటున్నది.

"కలిసి పనిచేసిన దర్శకుడు రెండోసారి పిలవడం అనేది గొప్ప గౌరవం. అటువంటి అవకాశం నాకు తెలుగులో ఇంకారాలేదు. భవిష్యత్‌లో తప్పకుండా రాగలదని ఆశిస్తున్నాను.కెరీర్ ఆరంభంలో మలయాళంలో అటువంటి అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారిపోయింది" అని చెప్పింది.

మొదటి రాత్రి అంటే కేవలం అందుకోసమేనన్నట్లు గుడ్డెద్దు చేన్లోకి దూకినట్లుగా ఎలాంటి నాందీ ప్రస్తావనలు లేకుండా అసలు పని మొదలుపెట్టేస్తారు!" అంది కినుకగా, ఒకింత చిలిపిగా.

"ఇంతకాలం ఉగ్గబట్టుకొని ఉన్నానుగా... ఇప్పుడు కూడా నిగ్రహంగా ఉండాలా?" అంటూ విసురుగా అనబోయి, అంతలో ఏదో గుర్తొచ్చి ఆగిపోయాడువంశీ. ఎంతో మధురంగా,సరసంగా సాగాల్సిన శోభనంరాత్రి వాదనలకి చోటివ్వడం సరికాదనిపించిందతడికి.

"సారీ మానసా... మన తొలిరేయిని రసభంగం చేయడం నాకు మాత్రం ఇష్టమా? అన్నీ సరదాగా తీసుకోవాలి!" అన్నాడు. ఆ మాటలకి కరిగిపోయింది మానస. అతడి చెంపల్ని రెండు అరచేతుల్తో అపురూపంగా అందుకొని, ఏదో వెతుకుతున్నట్లుగా అతడి ముఖంలోకి పరిశీలనగా చూసింది. ఎందుకో... ఆమె చూపులకి సిగ్గేసింది వంశీకి. "ఏంటలా చూస్తున్నావ్?" అన్నాడు.

ఆమె చూపులు తిప్పుకోకుండా అతడి కళ్ళలోకి మార్చిమార్చి చూస్తూ చెప్పింది "ఏం లేదు కృష్ణా... మీకు ముందే పెదవుల మీద ముద్దిస్తే ఎలా ఉంటుందీ... అని!"

"ఎలాగుంటుందని అడుగుతావేంటీ... అద్దిరిపోతుంది!" అన్నాడు.

"ఊహూ... నాకైతే అలాగనిపించదు. ముందు నుదురు, ఆ తర్వాత బుగ్గలు, ఆపై చుబుకంపై పెదవులతో సున్నితంగా స్పృశిస్తూ... రసఘట్టానికి చేరబోయేముందు పెదవులపై పెట్టే ముద్దు రమ్యంగా, రసవత్తరంగా ఉంటుంది... కదా!" అంది సిగ్గుల మొగ్గయిపోతూ. తన మాటలకి బదులివ్వకుండా తనవంకే మురిపెంగా చూస్తూండిపోయిన వంశీకృష్ణని చూస్తూ "కాదా...?" అనడిగింది.

ఏమనుకున్నాడో...ఏమో...బదులివ్వకుండా మానసని ప్రేమగా దగ్గరికి తీసుకుని ఆమె మెడ మీదుగా చేతులు వెనక్కి పోనిచ్చి దోసిలితో చంద్రబింబాన్ని అందుకున్నట్లుగా అందమైన ఆమె ముఖాన్ని అపురూపంగా తనముఖానికి దగ్గరగా చేర్చుకున్నాడు.

ముందుగా... పాలసంద్రంలా తళుకులీనుతున్న ఆమె నుదుటిపై తన పెదవుల్ని మృదువుగా అద్దాడు. తరువాత నల్లకలువల్లాంటి ఆమె నీలికనులను సుతారంగా స్పృశించాడు.

ఆ తర్వాత వెన్నెల్లో బోర్లించిన వెండిగిన్నెల్లా మెరిసిపోతున్ననిండైన ఆమె బుగ్గల్ని మునిపంట సున్నితంగా కొరికాడు. ఆపైమధువుల భాండానికి మార్గం చూపెడుతూ వేసినట్లున్న ఆమె నాసికాగ్రాన్ని నాలుకతో స్పర్శించాడు. అతడి చర్యలకి మానసలో నెమ్మదిగా 'కదలిక' మొదలైంది. అది క్రమక్రమంగా 'గిలిగింత'గా మారుతూంటే.... పరవశంతో వివశురాలైపోతూ మైమరపుగా కనులు మూసుకుంది.

వంశీ తన రెండుఅరచేతులనూ ఆమె వీపుపై ఆనించి ఆమెని తనవైపుకి ఆర్తిగా అదుముకుంటూ ఆమె చుబుకం నుంచి నెమ్మదిగా కిందికి దిగుతూ మెడమీదుగా పెదవులతో స్వరపేటి కను స్పర్శిస్తూ, ఇంకొంచెం కిందకి సాగి ఠక్కున ఆగి బలంగా తన పెదవుల్ని అదిమాడు.

అంతే... ఆ చర్యకి అధాటుగా ఝల్లుమందామె తనువంతా. అతడి తలను అలాగే తనవైపుకి అదిమిపట్టుకుంది. ఆ తర్వాత వంశీ ఆరోహణక్రమంలో నెమ్మదిగా పెదవులతో ఆమె మెడ క్రిందుగా స్పృశిస్తూ... చుబుకం మీదుగా పైకి మీదుగా పైకి చేరి ఆమె పెదవుల దగ్గర ఆగాడు.

ఓసారి ఆమె ముఖంలోకి తనివితీరా చూసి, పెదవులతో ఆమె అధరాలను అందుకోబోతూండగా... అంతవరకూ కళ్ళుమూసుకుని ఆ అనుభూతిని ఆస్వాదిస్తున్న మానస ఠక్కునకళ్ళుతెరిచి అతడిని ఆపింది. "అది... నావంతు!"అంది గుసగుసగా. ఆమె కళ్ళలోకి చూసి నవ్వాడు వంశీ మురిపెంగా.

"చెప్పండి...ఏ ముద్దుకావాలి? ఎలాంటిముద్దు కావాలి? తెలుగుముద్దా? ఇంగ్లీషు కిస్సా? ఫ్రెంచ్ మంఛూరియానా? ఇటాలియన్ కస్సాటానా? లేక ఆస్ట్రేలియన్ సాండ్‌విచ్చా? అరేబియన్ స్నాషా? ఆఫ్రికన్ ట్రీటా? నైజీరియన్ బ్రీజా?... చెప్పండీ, ఏది కావాలి?" అడిగింది మానస.

అది విని "హేయ్... ఇవన్నీ నీకెలా తెలుసు?" అంటూ నివ్వెరబోయాడు వంశీ.

"ఏముందీ... పెళ్ళికి ముందే 'ముద్దుల మర్మం', 'చుంబన రహస్యం' లాంటి పుస్తకాలు కొనుక్కుని మరీ చదివి తెలుసుకున్నాను!"

వంశీ నవ్వేస్తూ "హయ్యో పిచ్చి మానసా... నీకెందుకన్ని తిప్పలూ? నన్నడిగుంటే అవన్నీ నేర్పించేవాడిని కదా?" అన్నాడు.

"ఔనౌను...నేర్పిస్తారు, నేర్పిస్తారు!ఎందుకునేర్పించరూ... ఆ ట్రైనింగ్ సాకుతోనైనా నన్ను ముద్దు పెట్టుకోవచ్చని మహబాగా నేర్పించేవార్లెండి!" అంది అతడికళ్ళలోకిచూసి చిలిపినిష్ఠూరంప్రదర్శిస్తూ.

వంశీ కొంటెగా నవ్వేస్తూ... ఆమె నడుంమీది తన చేతుల్ని మరింత బిగిస్తూ దగ్గరికి లాక్కున్నాడు.

మానస సిగ్గు పడుతూ అతడికౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది. తలొంచి ఆమె కళ్ళలోకి కొంటెగా గుచ్చిగుచ్చి చూస్తూ హస్కీవాయిస్‌తో అన్నాడు వంశీ "ఏయ్... నాకు ఇస్తానన్న ముద్దు ఇచ్చెయ్!"

తడబడుతున్న తనువునీ, కంపిస్తున్న మనసునీ అదుపులో పెట్టుకుంటూ "ఓ.కే... కళ్ళు మూసుకోండి!"





రాజకీయాలలోని కష్టనష్టాలు, ఎత్తుపల్లాలు గురించి తెలుసుకున్నాను కాబట్టే వెనకంజ వేస్తున్నాను. -రజనీకాంత్, నటుడు

అంది మానస. వెంటనే కళ్ళుమూసుకుని తనముఖాన్ని ముందుకు చాచి ఆమె ముఖానికి దగ్గరగా చేర్చాడు. అదిరే అధరాలతో అతడిపెదవులవైపే చూసింది.

ముద్దుగా... ముచ్చటగా, ప్రేమగా... కాంక్షగా! మెలిమెల్లిగా అతడి పెదవులకి దగ్గరగా వచ్చింది ఆమె ముఖం... ఇరువురి ఉచ్ఛ్వాసనిశ్వాసాలు వెచ్చగా తగిలాయి పరస్పరం!

ఆ వెచ్చదనానికి మనసులో బెరుకు.... ఆ 'వెచ్చదనానికి' ఒంట్లో వణుకు! "ఇంకా ఏమిటాలస్యం?" ఆగలేనట్లుగా,ఒకింతఅసహనంగా అన్నాడు వంశీ.

"మరేం...ఎంతపాతబడినా ఎప్పటికీ కొత్తగా అన్పించాల్సిన ముద్దు కూడా... ఎలా ప్రారంభించాలా... అని చూస్తున్నాను!" అన్నది మానస.

"కదా మరీ! గుర్తుపెట్టుకో... ఇది నీ తొలిముద్దు! ఎలా ఇస్తావో నీ ఇష్టం... తీయగా, హాయిగా ఉండాలి. నేనెక్కడున్నా గుర్తొచ్చేట్లుగా ఉండాలి, మన మునిమనవలు పుట్టుకొచ్చేదాకా గుర్తుండాలి సుమా!" అన్నాడు వంశీ. ఆ మాటలకి సిగ్గుతో ఎఱ్ఱబడ్డాయామె బుగ్గలు... బెరుకుతో పాడిబారాయామె పెదవులు!

"కమాన్...ప్రోసీడ్!" అన్నాడతను ఆత్రంగా, ఆగలేనట్లుగా. అతడికి మరికొంచెం దగ్గరికొచ్చింది మానస. అతడిభుజాలపై చేతులేసి, మడమలు పైకెత్తి మునివేళ్ళపై బరువంతా మోపి, తలపైకి లేపి తన పెదవుల్తో అతడి పెదవుల్ని సుతిమెత్తగాతాకింది,

అతడి నాసిక అడ్డొచ్చేసరికి కొద్దిగా తల ప్రక్కకి వంచింది. తేనెలోని తీపిదనం నిండిన పనసతొనల పెదవులూ, పచ్చిపాల వగరు కలసిన దొండపండు పెదవులూ పరస్పరం గాఢంగా హత్తుకున్నాయి.

హిమజ్వాలలతో కూడిన ఇరువురి ఊపిరి జంట తనువులలో తపనని రాజేస్తుంటే... ఇద్దరిలోనూ మెలిమెల్లిగా ఏరువాక సాగింది.

ఎంతైనా తొలిముద్దు... నిజంగా తొలకరి ముద్దే! హబ్బ.. మొదటిముద్దులో ఉండే ఆ 'కిక్కే' వేరబ్బా!!

పది నిమిషాల పరవశం తరువాత మానస తన పట్టుసడలిస్తూ... అలసిపోయినట్లు అతడి ఎద మీదకి వాలిపోయింది.

తన చేతుల్ని ఆమె వీపుచుట్టూ పెనవేసి మరింత దగ్గరగాహత్తుకుంటూ"ఇప్పటికైనా చెప్తావామానసా?" అనడిగాడు ఆమె మెడమీద చుంబిస్తూ.

"ఏమిటి కృష్ణా?" అనడిగింది మానస అతడిలోకి మరింత ఒదిగిపోతూ.

"పెళ్ళికిముందు నాతో కలిసి సరదాగా తిరిగినదానివి. మనం కాబోయే ఆలూమగలమని తెలిసికూడా ఎన్నిసార్లడిగినా చిరుముద్దయినా ఇవ్వలేదెందుకని? ఏ ప్రమాదమూలేనిది ముద్దేకదా... ఇస్తే నీ సొమ్మేం పోయేదమ్మా?"

"ప్రమాదంలేదా? ఎందుకులేదూ... అసలు ప్రమాదమంతా అందులోనే ఉంది. ఆడవాళ్ళందరి గురించీ నాకంతగా తెలీదుకానీ... నా గురించి అడిగారు కాబట్టి చెప్తున్నాను కృష్ణా!

నేను అమ్మచాటు బిడ్డని... ఆచారాలమాటున కొమ్మని! సిగ్గూ- బిడియం, ముద్దూ-మురిపెంలాంటివి నాలోకాస్త ఎక్కువ పాళ్ళలోనే ఉన్నాయి.

'ముద్దు' అనేది చాలా తుంటరిది.

మొదలు కాకూడదు గానీ... మొదలైందంటే అక్కడితో ఆగి పోనీయకుండా ఆరడిపెట్టే గారడీ చర్య. మనోనిగ్రహాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ నిలువునా కూల్చేస్తుంది. మనిషిని కుదురుగా ఉండనీయదు. ఒక్కదానితో సరిపెట్టుకోనీదు, ఒక్కసారితో దాహం తీరదు. 'ముద్దు'కి చిత్రమైన లక్షణముంది ఎంతగా ఇస్తున్నా... 'ఇంతై... ఇంతింతై' అన్నట్లుగా అనంతంగా కొనసాగుతుంది.

సహజంగానే ఆడపిల్లగా నా తొలిప్రాయాన్నీ - పరువాన్నీ, అందాన్నీ - అనురాగాన్నీ, ముద్దుల్నీ - మురిపాల్నీ... అన్నీ పూజాకుసుమాల్లా పవిత్రంగా నా భర్తకే అర్పించుకోవాలనుకున్నాను.

మనసైనవాడికి మనసైన ముద్దు మనస్ఫూర్తిగా ఇవ్వడంలో ఎంతో సంతృప్తి ఉంది. అయితే అది అనువైన సమయంలో, ముచ్చట కుదిరినవేళలోనే, నిశ్చింతగా ఇవ్వాలి.

పెళ్ళికిముందు మీరెంత బలవంతపెట్టినా, ప్రాధేయపడినా నేను ముద్దివ్వకపోవడానికి ప్రధాన కారణం... నాలోని అభద్రతాభావమే!

ఆ భావంతో తనువూ, మనసూ సంపూర్ణంగా ఆయత్తమవవు. అంతాకంగారుగా, భయంగా, అయోమయంగా ఉండి అలజడిగా, అనిశ్చితంగా అనిపిస్తుంది.

మొదటిముద్దులోని మాధుర్యాన్ని పరిపూర్ణంగా ఆస్వాదించలేకపోతాను. అసలు ఇంత బాధెందుకు. హాయిగా పెళ్ళయ్యాకే ముద్దూ ముచ్చట్లన్నీ ఇచ్చిపుచ్చుకుంటే... వాటిలోని తృప్తీ, పరవశం తనువునీ, మనసునీ మురిపిస్తాయి.

అందుకే ఇది అమూల్యమైన ముద్దు, అమృతోపేతమైన ముద్దు... ముచ్చటైన ముద్దు, మురిపాల ముద్దు!"అని ఓ క్షణమాగి, "చాలా? ఇంకాచెప్పాలా?" అంటూ ఆపింది మానస.

వంశీకి నోటమాట రాలేదు అది విని!

పెళ్ళికిముందు ఆమెవద్ద అతడి 'ముద్దురిక్వెస్టు' ప్రతిసారీ ఎందుకు రిజెక్ట్ అయ్యేదో ఇప్పుడు ఇంత వివరంగా అర్థమవుతూంటే... విస్తుబోయి మానస వంకే చూస్తూండిపోయాడు... ఆమె తనని పట్టుకుని కుదుపుతూ పిలిచేదాకా.

"ఏమిటీ... ఉన్నట్టుండి అలా అయిపోయారు?" అనడిగింది అర్థంకాక.

"ఆ.... ఏంలేదు, ఏంలేదు... ఇందాక నువ్విచ్చిన ముద్దులోని మత్తు జరజరా పాకుతూ నషాళాని కెక్కుతుంటేనూ!" అన్నాడు తేరుకుంటూ.

"సరే... నావంతు అయిపోయింది. ఇక మీదే ఆలస్యం!" అంది మానస ఓరగా అతడి కళ్ళలోకి చూస్తూ..పరోక్షంగా అతడికర్తవ్యాన్ని గుర్తు చేస్తూ. వంశీ మరింక ఆలస్యంచేయలేదు.

అప్పటిదాకా నీలినింగిలో వెలుగులు చిమ్ముతూ ఆసక్తిగా గమనిస్తోన్న జాబిలి కూడా ఏదో గుర్తొచ్చినట్లుగా ఓ తుంటరి మేఘంచాటుకు గబగబాపరిగెత్తాడు! S

ఇంకో పదేళ్ళు

ఓ పదేళ్ళుగా కెరీర్ బండిని ఈడ్చుకువస్తున్న అంజలి ఇంకో పదేళ్ళపాటు కెరీర్‌కు ఢోకా లేదన్న ధీమా వ్యక్తం చేస్తున్నది. అటు సీనియర్లతో, ఇటు జూనియర్లతో కలిసి నటిస్తూ తమిళంలోనూ అలరించింది ఈ తెలుగమ్మాయి.

ప్రస్తుతం హారర్ సినిమా 'బెలూన్'లో నటిస్తున్నది. ఇంతకుముందూ ఓ రెండు హారర్ సినిమాలు చేసివున్న అనుభవంతో హుషారుగా కనపడుతున్నది. "ఇప్పటికి హీరోయిన్‌గా ఓ పదేళ్ళు గడిచిపోయాయి. ఇంకో పదేళ్ళు కొనసాగుతా" అని చెప్పింది. మంచిదేగా!





రామ్‌దేవ్ బాబాకి ధైర్యముంటే పతంజలి బ్రాండ్ కండోమ్ తయారుచేసి మార్కెట్‌లోకి వదలాలి. -రాఖీసావంత్, నటి

ఒక చిన్నమాట

Happy New Year 2018



డాక్టర్ జె.భాగ్యలక్ష్మి
E-mail: jbhagyalakshmi43@yahoo.in

కొత్త సంవత్సరం వచ్చేసింది. ఎన్నో సంబరాలు, కానుకలు, విందులు, శుభాకాంక్షలు. క్రిస్మస్‌తోనే పండుగ ఆరంభమైనట్లనిపిస్తుంది.ఇది ఈనాటి మాట కాదు. ఎన్నో ఏళ్ళుగా, కొన్ని తరాలుగా వస్తున్న పండుగ ఉత్సాహమే.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పండుగ. ఒక మతానికి, ఒక ప్రాంతానికి, ఒక భాషకు ముడిపెట్టే విషయం కాదు. ఒకప్పుడు విద్యావంతులు, నాగరికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు మాత్రమే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటారనే భావముండేది.

కాని మన దేశం అద్భుతమైన దేశం. మన దేశ ప్రజలు ఊహాతీతులు. నిర్దిష్టంగా వీరిని ఎవరూ అంచనా వెయ్యలేరు. మూఢనమ్మకాలవారు, నిరక్షరాస్యులు, నిరుపేదలు అని దశాబ్దాలుగా వారిని వర్ణిస్తూ వచ్చినా ఈ అల్లకల్లోల ప్రపంచంలో ఈ మాత్రం శాంతి సామరస్యాలతో సురక్షితంగా భారత దేశం నిలిచిందంటే దానికి కారణం ప్రజలే.

అలౌకికమైన ఆధ్యాత్మికత అంతర్వాహినిగా ప్రచ్ఛన్నమైన సరస్వతీ నదిలా ఈ దేశంలో ప్రవహిస్తూ ప్రజల మతంతో, విశ్వాసంతో నిమిత్తంలేకుండా సర్వం జగన్నాథమ్, సర్వస్వం ఈశ్వరీయమ్,సర్వత్రా దైవ స్వరూపం అనే దృక్పథంతో ఉంటారు. అందుకే కొత్త సంవత్సరాన్ని పండుగగా జరుపుకుంటారు. దేవాలయాలకు, ప్రార్థనా స్థలాలకు వెళతారు.

భిన్నత్వంలో ఏకత్వమని,అన్నిటినీ తనలో కలుపుకుని ప్రహించే మహాప్రవాహం ఈ దేశతత్త్వమని జవహర్‌లాల్ నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో చెప్పినటువంటి మాటలు ఎంతో నిశిత దృష్టితో చేసిన వ్యాఖ్యలు అక్షరసత్యాలు.

కల్లోలాలు లేవా, కలహాలు లేవా, విభేదాలు లేవా అంటే అవి ఉన్నాయి. చాలావరకు అవి కృతకం. అప్పుడప్పుడూ వచ్చే తుఫాను గాలులు.

కాని మూల నైజం ఆధ్యాత్మికత, అవగాహన, పరస్పర గౌరవం, అన్నిటినీ స్వీకరించి తనలో కలుపుకోగలిగిన విశాలత్వం.

ముక్కోటి దేవతలను స్వీకరించేవారికి మరో శక్తిని, మరో దేవతా స్వరూపాన్ని, మరో విశ్వాసాన్ని మనసులో స్వీకరించటం పెద్ద కష్టం కాదు.

ఒక వివరణ ప్రకారం ముక్కోటి దేవతలంటే ఆనాడున్న ముక్కోటి ప్రజలేనని, ప్రతి వ్యక్తీ దైవాంశం ఉన్నవాడేనని, పూజనీయుడని భావించటమన్నమాట.

ఈ విధంగా సామరస్యంతో జీవిస్తున్న ప్రజలను విడదీస్తూ బోధలు చేయటం, రెచ్చగొట్టటం ఈ దేవుణ్ణే ఆరాధించాలి, ఈ పండుగే చెయ్యాలి, మరో ఆరాధన పనికిరాదు, ఈ పండుగ మనది కాదు అని చెప్పటం ఎంత గొప్పవారు (ఎంత ఉన్నత పదవిలో, ఉన్నత స్థాయిలో, గురుస్థానంలో ఉన్నవారు) చెప్పినా అది అసమంజసమే.

ఆనందం ఆనందమే. పండుగ పండుగే.సుహృద్భావంతో ఒకరినొకరు కలుసుకోవటం,శుభాకాంక్షలు చెప్పుకోటం సందర్భం ఏదైనా సముచితమే.

మనసులో భేదాభిప్రాయాలున్నా, వివాదాలున్నా మనం కలిసి జీవించటానికి ఈ సందర్భాలు మరో అవకాశాన్నిస్తాయి. వాటిని హ్రస్వదృష్టితో, స్వార్థంతో మలినపరచకూడదు.

సకారాత్మకమైన (సానుకూలభావన) ఆలోచనలు, చర్యలు నకారాత్మక (వ్యతిరేక) భావనలు, మాటలు, చర్యలకంటే ఎక్కువ ఆనందాన్ని మనకు ఇస్తాయి. కొత్త సంవత్సరంలో కొత్తకు స్వాగతం. పాతకు వీడ్కోలు చెప్పటం పరిపాటి.

కాలప్రవాహం ఒక్కటే. కాని మన పరిమిత అవగాహనలో దానికి అవధులు సృష్టించుకుంటూ, మైలురాళ్ళుగా భావిస్తూ ముందుకు సాగుతుంటాం.

గడచిన సంవత్సరంలో ఏమి పొందాం, ఏమి నష్టపోయాం, ఏమి సాధించాం, ఎందులో వైఫల్యం పొందాం అని సమీక్ష చేసుకోవలసి ఉంటుంది.విజయాలకు పొంగిపోకుండా, వైఫల్యాలకు క్రుంగిపోకుండా, ఆశాదృక్పథం విడనాడకుండా ఆత్మవిశ్వాసంతో జీవించినప్పుడే మన జీవితం సార్థకమవుతుంది.

యువతకు తొందరపాటు ఎక్కువ. అన్నీ క్షణాల్లో జరిగిపోవాలనుకుంటారు. త్వరగా నిరాశకు గురవుతారు. క్రుంగిపోయి ఒక్కొక్కసారి అమూల్యమైన జీవితాన్నే అంతంచేసుకుంటారు.

ప్రకృతి నియమానుసారమే పని చేస్తుంది. మొక్క నాటగానే చెట్టు కాదు. పూలు పూయవు. కాయలు కాయవు.

మనకు మాత్రం తొందరపాటు ఎందుకు? సాధారణంగా కొత్త సంవత్సరంలో కార్యోన్ముఖులు, విజయపథంలో నడిచేవారు కొన్ని తీర్మానాలు చేసుకుంటారు.వాటినిఅమలుపరచే ముందు కొన్నిటికి వీడ్కోలు చెప్పక తప్పదు.

మనకు తగిన సామర్థ్యంలేదని, అనుకున్నది సాధించలేమని, ఎవరో ఒకరు మనల్ని గుర్తిస్తేగాని విలువలేదనే ఆలోచనలు మానాలి.

మనం నిలుపుకోలేని హామీలు, చెయ్యలేకపోయిన పనులగురించి దుఃఖించకూడదు. మనల్ని నిర్లక్ష్యం చేసి కించపరచినవారిని మరచిపోవాలి.

మనల్ని నిరంతరం పీడించే దుఃఖాలను, జ్ఞాపకాలను వదులుకోవాలి. అలాగే జీవితంలో ముఖ్యమైన విషయాలను దూరంచేస్తూ మనల్ని బానిసలుగా చేసుకున్న అలవాట్లకు గుడ్‌బై చెప్పాలి.

మిమ్మల్ని మీరు కించపరచుకునే విధంగా ఎవరైనా మాట్లాడి ఉంటే ఆ మాటలు గుర్తుకుతెచ్చుకోనవసరంలేదు.వారెవరైనా సరే మరచిపోవాలి.మీరెంతగానో ప్రేమించిన వ్యక్తి మిమ్మల్ని నిర్లక్ష్యంచేసి ఉంటే, టిట్ ఫర్ టాట్, మీరూ ఆ మనిషిని మరచిపోండి.

అమాయకంగా, తెలియనితనంతో చేసిన తప్పుల గురించి ఆలోచించకండి, బాధపడకండి.

దేవుడు మనల్ని సమయానికి ఆదుకోడని ఫిర్యాదు తగదు. దేవుడు సమయానికే వస్తాడట. మనమే చాలా తొందరలో ఉంటామట.

కొత్త సంవత్సరంలో ఏడుపేమిటో తెలియనంతగా నవ్వాలి. ఏదీ పోగొట్టుకోనంతగా ఆటలో మునగాలి. ఎవరినీ బాధించనట్లు ప్రేమించాలి. రేపన్నది లేనంతగా ఈరోజు జీవించాలి. కోకొల్లలుగా మీకు అందుతున్న శుభాకాంక్షలు స్వీకరించాలి.

హ్యాపీ న్యూ ఇయర్.

Cell : 81860 00039 www.themoneyworkshop.com



సురేష్ పద్మనాభన్

ఐ లవ్ మనీ



కుటుంబసభ్యులంతా కలిసి రాత్రిపూట భోజనం చేస్తున్నదృశ్యంఊహించుకోండి. అది ఎంత ఆనందకర సమయం.తల్లి, తండ్రి, కొడుకులు, కూతుళ్ళు ఇంకా ఎవరైనా వుంటే వారు... అందరూ ఒకేసారి భోజనానికి కూర్చున్నారు. భోజనం మధ్యలోకబుర్లు తప్పవుకదా. ఆ కబుర్లు డబ్బు మీదికి మళ్ళాయనుకోండి.

ఆ రోజు ఒక్కొక్కరికి కలిగిన పలు రకాల అనుభవాలను చెపుతుంటారు. అందులో ఆ రోజు డబ్బుకు సంబంధించిన అనుభవాలు వుంటే, ఆ డబ్బును ఎలా సంపాదించిందీ, ఎలా ఖర్చు చేసిందీ తెలియజేస్తారు. డబ్బుకు సంబంధించి తీసుకున్న ముఖ్యమైన అనుభవాలను పంచుకుంటారు.

ఇవేకాకుండా డబ్బు, డబ్బు సంపాదన, ఖర్చుల మీద వారివారికున్న ఆలోచనలు, వ్యూహాలు, ఊహాలు కూడా పంచుకోవచ్చు. ఇంటిదగ్గరే వుండి కాని లేదా షాపింగ్‌కి వెళ్ళి కాని మీ భార్య ఒకలాభసాటి బేరం చేసి మంచి వస్తువు కొనితెచ్చిందనుకోండి. ఆ విషయం ఆమె చెపుతుంటే వినటానికి ఎంత ఆసక్తికరంగా వుంటుంది.

వారికిచ్చిన పాకెట్‌మనీలో కొంత ఆదాచేసి కిడ్డీ బ్యాంక్‌లో దాచిన వివరం పిల్లలు చెపుతుంటే అమ్మా నాన్నలు పొంగిపోకుండా వుంటారా!

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మీ ఎరియర్స్, బోనస్‌లో అందాయన్న విషయం చెపితే కుటుంబసభ్యులంతా ఆనందంపొందకుండావుండగలరా! ఇలా అందరి జీవితాలలోని డబ్బుకు సంబంధించిన అంశాలను హాయిగా అరమరికలు లేకుండా పంచుకోగలగటం ఒక చక్కటి అనుభవం.

అయితే కుటుంబసభ్యుల కబుర్లలో పారదర్శకత వుండాలి. ఒకరి ఆలోచనలను మరొకరు అప్పటికప్పుడే తప్పుపట్టటం లేదా ఖండించటం చేయకూడదు. ఆ విధంగా చేస్తే మరుసటిరోజు వారు మాట్లాడేందుకు సంశయిస్తారు.

ఫలితంగా ఆలోచనల పంపకాలు ఆగిపోతాయి. అందువల్ల కబుర్లు ఎవరినో ఒకరిని దృష్టిలో పెట్టుకుని చేయకూడదు. ఇలా భోజనందగ్గర చెప్పుకునే కబుర్లు కుటుంబసభ్యుల మధ్య బంధాన్ని మరింత బలపరుస్తాయి. డబ్బు సంపాదనలో తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను పిల్లలు అర్థంచేసుకుంటారు. అదేవిధంగా డబ్బుపట్ల పిల్లల దృక్పథం కూడా మారిపోతుంది.

ఇక అక్కడినుండి మీ జీవితంలో డబ్బుకున్న విలువ పెరుగుతుంది. ఒకరి నిర్ణయాలను మరొకరు మనస్ఫూర్తిగా అభినందించగలుగుతారు.

పిల్లలు డబ్బు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించినా, ఖర్చు తగ్గించి ఆదాపెంచినా ఆ ఆనందాన్ని అందరూ పంచుకోగలుగుతారు. కుటుంబంలోని వారంతా డబ్బు విషయంలో ఆచితూచి వ్యవహరించటం అలవాటు చేసుకుంటారు.

ఇక్కడినుండే అసలైన మార్పు అందరిలో కనిపిస్తుంది. సాయంత్రం భోజనంవేళ ఎప్పుడుఅవుతుందా, ఎప్పుడు నా అనుభవాలు నలుగురికి చెపుదామా అని కుటుంబసభ్యులందరూ ఆశగా ఎదురుచూస్తారు.



ప్రతిరోజూ ఇలా కలిసి భోజనంచేస్తూ డబ్బుకి సంబంధించిన కబుర్లు చెప్పుకుంటే సంపద పెంచుకునే ఆలోచనలు కోకొల్లలుగా వస్తాయి.

మీ సంపద మూడుపువ్వులు ఆరు కాయలుగా వెల్లివిరుస్తుంది. మీకు తెలియకుండానే ఒకదాని తర్వాత మరొకటి కలిసివస్తాయి. సంపద పెరుగుతుంది. సామాజిక హోదా మెరుగవుతుంది.

అందుకే ఏ కుటుంబమైతే కలిసి భోజనంచేస్తుందో ఆ కుటుంబం వృద్ధిలోకొచ్చి తీరుతుంది. వారిలోని ఐక్యత వారిని ఎదిగేలా చేస్తుంది.

(వచ్చేవారం వస్తా)



ఇది చదివినవారికి డబ్బు వశమవుతుంది

True are two sider of a coin

ప్రతిరోజూ కలిసి భోజనంచేస్తూ డబ్బుకి సంబంధించిన కబుర్లు చెప్పుకుంటే సంపద పెంచుకునే ఆలోచనలు కోకొల్లలుగా వస్తాయి. కొత్త కొత్త సంగతులు తెలుస్తాయి. మీ సంపద మూడు పువ్వులు ఆరు కాయలుగా వెల్లివిరుస్తుంది.



Courtesy : SANANDA

లాంగ్ లివ్

మనం రోజువారీ తీసుకునే పౌష్టిక ఆహారంవల్ల మన ఆయుష్షు మరింత పెరుగుతుంది. మనం ఆనందంగా చిరకాలం జీవించేందుకు అవసరమయిన ఆహార పదార్థాలను గురించి తెలుసుకోవటం ఎంతయినా అవసరం. అలాంటి ఆహారపదార్థాలు నిత్యం మనకి అందుబాటులోనే ఉంటాయి. ఖర్చుకూడా తక్కువే. మరి అలాంటి ఆహార పదార్థాలని భుజించి మనం చిరకాలం జీవించటానికి ప్రయత్నిద్దాం.

పసుపు : పసుపులో 'కర్క్యుమిన్' అనే పదార్థం హెచ్చు స్థాయిలో ఉంటుంది. ఈ పదార్థం ఇన్‌ఫ్లమేషన్స్‌ను దూరంచేస్తుంది. గుండెజబ్బులనుండి క్యాన్సర్‌వరకు ఏ రోగాలు రాకుండా నిలువరిస్తుంది. పసుపులో యాంటీ ఆక్సిడెంట్‌లు పుష్కలంగా ఉన్నాయి. ఇది పదార్థాలను నిల్వచేయటానికి ఉపయోగిస్తుంది.

మొలకెత్తిన విత్తనాలు : వీటిలో విటమిన్లు, ఎంజైమ్‌లు పుష్కలంగా లభిస్తాయి. ఎంజైములు మాంసకృత్తులను, కొవ్వును, కార్బోహైడ్రేట్‌లను సూక్ష్మంగా విభజించేస్తాయి. ఒక కప్పు మొలకెత్తిన విత్తనాలు తింటే ఒక మామూలు మనిషికి రోజుకు అవసరమైన 40 మిల్లీగ్రాముల 'సి' విటమిన్ లభిస్తుంది.

అంతేకాక, వీటిలో మనకు 'బి' విటమిన్, ఫోలిక్ ఆమ్లం మరియు బయోటిన్ లభిస్తుంది. దానివలన శరీరంలో విటమిన్ బి ఇరవైశాతం నుంచి ముప్ఫయ్ శాతంవరకు పెరుగుతుంది.

చేపలు : వారంలో ఒక్కరోజైనా చేపలకూర తింటే, అల్జీమర్స్ వ్యాధి వచ్చే అవకాశం అరవైశాతం తగ్గుతుంది. అలాగే, తరచుగా చేపలు తినేవాళ్ళల్లో గుండె జబ్బులు వచ్చే అవకాశం మూడవ వంతు తగ్గుతుంది అని తాజా పరిశోధనలు చెపుతున్నాయి.

డార్క్ చాక్లెట్ : (85 శాతం కోకో) చాక్లెట్‌లో నైట్రిక్ ఆక్సైడ్ పుష్కలంగా లభిస్తుంది. దానివలన రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. రెడ్‌వైన్, గ్రీన్ టీలో వున్న ఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్‌కంటే ఎక్కువ మేలుచేస్తుంది. ఎండార్ఫిన్‌ల విడుదలకు సహకరిస్తుంది.

మన మనస్సు ఆశావహదృక్పథంతో ఉండేట్టు చూస్తుంది. దీనిలో వున్న సెరటోనిన్ ఆనందాన్ని పెంచుతుంది. మంచి మూడ్‌లో మనల్ని ఉంచుతుంది.

పెరుగు : సహజంగా తోడుబెట్టి, చల్లబరిచిన పెరుగు, పులియబెట్టిన క్యాబేజి కిమ్చిల్లో సహజసిద్ధమైన ప్రోబయోటిక్స్ ఉంటాయి. వాటివల్ల మన జీర్ణాశయంలో అరుగుదలకు సహకరించే మంచి బ్యాక్టీరియా పెరుగుతాయి. జలుబు, ఫ్లూజ్వరం రాకుండా రక్షిస్తుంది.

ఆకుపచ్చని ఆకుకూరలు : వృద్ధులు ప్రతి రోజూ కప్పు ఆకుకూరలతో చేసిన సలాడ్లు, కూరలు గానీ తింటూంటే, వారికంటే 11 సంవత్సరాల చిన్న వారిలో ఎంత శక్తి వుంటుందో అంత వారిలో కూడా ఉంటుంది. వాటితోపాటు గుండె కండరాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. క్యాన్సర్ రాకుండా ఆపవచ్చు.

బీన్స్ : నిదానంగా అరిగే బీన్స్ తినటంవలన రక్తంలోకి గ్లూకోజు చేరటం నిదానిస్తుంది. దానివలన ఆకలి తొందరగా వేయదు. బీన్స్‌లో పీచు, ఫైటో ఈస్ట్రోజన్లు మాంసకృత్తులు, క్యాల్షియమ్, ఫోలిక్ ఆమ్లం మరియు విటమిన్ బి6 బాగా లభిస్తాయి. అంతేకాక కొవ్వు శాతం చాలా తక్కువ.

బెర్రీలు : బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల గుండెజబ్బులు, కొన్నిరకాలైన క్యాన్సర్, మధుమేహం మరియు జ్ఞాపకశక్తిలో తరుగుదలలాంటివి రాకుండా నిరోధించవచ్చు. బ్లూబెర్రీలు, క్రాన్ బెర్రీలు, బ్లాక్ కరెంట్స్‌లో ఇవి ఎక్కువ. అలాగే 'సి' విటమినుండే కేప్ గూస్‌బెర్రీ మరియు ఇండియన్ గూస్‌బెర్రీ అనే పిలువబడే ఉసిరికాయలద్వారా కూడా పైన చెప్పిన ఫలితాన్ని పొందవచ్చు.

పర్పుల్ క్యాబేజీ : దీనిలో బెర్రీలలో ఉన్నట్టుగానే కంటి చూపును, మెదడును రక్షించే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. వంటకాలపై అలంకరణకు వాడటంద్వారా ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు.

నట్స్ : వారం అంతటలోనూ 140 గ్రాముల నట్స్. రోజుకు 5 లేదా అంతకంటే ఎక్కువ తింటూవుంటే గుండెజబ్బులు వచ్చే అవకాశం సగానికి సగం తగ్గిపోతుంది. అవి వాల్‌నట్స్ కావచ్చు, వేరు శనగగుళ్ళు కావచ్చు, బాదంపప్పు కావచ్చు. తినే ఆహారంమీద వాటిని జల్లుకొని తింటే ఎంతో మంచిది.

టొమేటోలు : టొమేటోలు, యాపిల్స్, పీర్స్, బీట్ రూట్‌లు, బొండామిర్చి మొదలైనవాటిలో బోరాన్, ఫైటో ఈస్ట్రోజన్‌లు లభిస్తాయి. స్త్రీలలో వచ్చే మెనోపాజ్ లక్షణాలను ఇవి కొంతవరకు తగ్గిస్తాయి. బోరాన్ శరీరంలో ఈస్ట్రోజన్ నిలిచివుండేట్టు చూస్తుంది.

అవిసెగింజలు : అవిసెగింజల్లో పీచు, ఒమెగా-3S, కొవ్వు ఆమ్లాలు బాగా లభిస్తాయి. అవి గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం, గ్రహణశక్తి తగ్గుదలలాంటివి రాకుండా రక్షిస్తాయి. కీళ్ళనొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. అవిసెగింజలను పొడిచేసి, పెరుగు, ఓట్సు, పాన్‌కేక్‌లు, సలాడ్‌లు, సూప్‌లు, సాండ్‌విచ్‌లపై చల్లుకుతింటే మంచిది.

వైన్ : వారానికి ఒకటి లేదా రెండుసార్లు వైన్ లేదా ఇతర ఆల్కాహాల్‌తో కూడిన పానీయాలు మితంగా తీసుకుంటే దానివల్ల కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

గుండె మరియు మెదడు ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజూ తాగటం మంచిదికాదు.

ఈ ఆహారాలతో జాగ్రత్త

చల్లని ముక్కలు : ప్రాసెస్‌చేసిన మాంసాహారం, సాస్‌లు క్యాన్సర్‌ను కలిగిస్తాయని 2015లో ఆరోగ్య సంస్థవారు ప్రకటించారు. దాదాపు పొగతాగటంతో సమానంగా హానికారకమని గుర్తించాలి.

గ్రిల్ మాంసం : అధిక ఉష్ణోగ్రతమీద వండిన మాంసం, అలాగే నెగడుమీద మూతలేకుండా కాల్చటంవలన క్యాన్సరొచ్చే అవకాశాలు పెరుగుతున్నాయని తెల్సింది. మాంసం వండేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

సుగంధ పెరుగు : మామూలు పెరుగుమీద

పండ్లముక్కలు వేసుకునితింటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలా కాకుండా స్ట్రాబెర్రీ పెరుగు మీరు కొంటే స్ట్రాబెర్రీ రుచికోసం దాంట్లో సుమారు 23 గ్రాములవరకు పంచదార కలుస్తుంది.

ప్యాక్‌చేసిన ఆహారం : ఏ పదార్థాలకైతే ఎక్కువ ప్యాకింగ్ చేయవలసిన అవసరం ఉంటుందో ఆ పదార్థాలు మనకంత ఎక్కువ హాని చేస్తాయి.

పంచదార, దాంతో చేసిన పదార్థాలు : పంచదార మన హార్మోన్‌ల్లో మార్పుచేస్తుంది. అందువలన మనలో అసలు ఆకలికంటే అధికంగా ఆహారం తీసుకోవాలనిపిస్తుంది. మనలో ఆనందాన్ని కలిగించే డోపమైన్ హార్మోన్‌ని మాయంచేసి పంచదార తినేట్టు చేస్తుంది. దానివల్ల కాలేయం దెబ్బతింటుంది.

కృత్రిమ తీపి పదార్థాలు : ఇటీవల పరిశోధనలలో మామూలు పంచదార తినేవారికంటే కృత్రిమ తీపిపదార్థాల్ని తినేవారు అవసరమైనదానికంటే 30% ఎక్కువ క్యాలరీలున్న ఆహారాన్ని తింటున్నట్టుతేలింది. 'సుక్రలోజ్'లాంటి కృత్రిమ తీపిపదార్థాల్లో వున్న తీపి క్యాలరీలందించదు కాబట్టి దానికి ప్రత్యామ్నాయంగా మానవ మెదడు అతి ఆకలిరూపంలో, ఎక్కువ క్యాలరీలు వున్న ఆహారాన్ని తినాలని చూస్తుంది.

బ్రెడ్: అన్ని బ్రెడ్‌ల్లోను ఉప్పు అధికంగా ఉంటుంది. తింటే తెలియదు. అందుచేత అధిక రక్తపోటు వున్నవారు బ్రెడ్స్‌కు దూరంగా వుంటే మంచిది.

మార్పు మంచిదే

కొబ్బరినూనె : రిఫైండ్ నూనెకు బదులు కొబ్బరి నూనెను వాడితే దానిలో మధ్యరకం కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. అవి ఆహారం అరుగుదలకు, శరీరంలో శోషణ చెందటానికి ఉపయోగిస్తాయి. ఇలా సహజసిద్ధమైన సంతృప్తి ఆమ్లాలు వాడటంవల్ల శరీరంలో మంచి కొవ్వు పెరిగి, చెడ్డ కొవ్వు కరిగిపోతుంది. దానివల్ల హృదయం ఆరోగ్యంగా ఉంటుంది.

పాప్‌కార్న్ : ఎండిన మొక్కజొన్న విత్తులను తీసుకుని ఒక పేపర్ సంచిలో వుంచి, మూతి బిగించి, మైక్రోవేవ్ ఓవెన్‌లో 2 నుంచి 3 నిమిషాలు ఉంచండి. సహజసిద్ధంగా వచ్చిన పేలాలను తినటం మంచిది. శుద్ధిచేసిన కొవ్వులు, ఇతర రసాయనాలుకలిపిన పాప్‌కార్న్‌ను తినకపోవటం ఆరోగ్యానికి ఎంతో మేలు.

బ్రౌన్ రైస్ : (ఒంటిపట్టు లేదా దంపుడు బియ్యం) బాగా తెల్లగా వున్న బియ్యాన్ని వండుకుని తినడం కంటే ప్రాథమికంగా శుద్ధిచేసిన ఒంటిపట్టుబియ్యాన్నో లేదా దంపుడు బియ్యాన్నో తినటం మంచిది.

బ్రౌన్‌రైస్ తింటే శరీరంలో నెమ్మదిగా చక్కెరవిడుదలవుతుంది.దీనిలో అన్నిరకాల బి విటమిన్లు, జింక్, మెగ్నీషియం, క్రోమియం, క్యాల్షియం లభిస్తాయి.

ఉల్లిపాయ వేపుడు : నాన్‌స్టిక్ పెనంపై ఉల్లిపాయముక్కల్ని వేసి గరిటెతో అటూ ఇటూ కలుపుతూండాలి. ఉల్లిముక్కల్లో నుంచి బైటకు వచ్చిన నీరు వేగటానికి పనికివస్తుంది.

నూనె ఒక చుక్క కూడా వేయకూడదు. ఒకవేళ మాడుతున్నట్టు అనిపిస్తే నీళ్ళు చిలకరించండి లేదా నాలుగు కూరముక్కలేసి బాగా కలపండి, వేయించండి. బంగారురంగులోకి వచ్చేదాకా వేయించండి.

బంగాళాదుంపల వేపుడు : బంగాళాదుంపలలో ఉన్న అమినో ఆమ్లం బాగా ఎక్కువ వేడిమీద వేయిస్తే ఆక్రీలమైడ్ అనే విధంగా మారుతుంది.

ఈ ఆక్రీలమయిడ్‌వల్ల మెదడులోని కణాల మధ్య విషయ ప్రసారం కష్టం అవుతుంది. అందుచేత సాధ్యమయినంతవరకు బంగాళాదుంపలను ఆవిరితో గాని, లేదా మైక్రో ఓవెన్‌లో గానీ ఉడికించాలి. వేపుడు తప్పకపోయినట్లయితే బంగాళాదుంపల ముక్కల్ని పదిహేనునిమిషాలనుంచి ముప్పై నిమిషాలసేపు నీటిలో నానబెట్టి వుంచాలి.


Courtesy : BETTER HOMES & GARDENS

పిండిపదార్థాలు-పీచు : మనం తినే ప్రతి పది గ్రాముల పిండిపదార్థాలకి కనీసం ఒక గ్రాము పీచు వుండేలా చూసుకోవాలి.

హిల్సా లేదా పామ్‌ఫ్రెట్ చేపలు : ఈరెండు భారతీయ చేపలలో సాల్మన్ చేపలతో సరిసమానంగా మాంసకృత్తులు లభిస్తాయి. అంతేకాక వీటిల్లో విటమిన్ డి, విటమిన్ బి12, మెగ్నీషియమ్, క్యాల్షియమ్ పుష్కలంగా లభిస్తాయి.

పండ్లు : పండ్ల ప్రత్యేకించి తీయగా వుండేమామిడి మరియు అరటిపండ్లల్లో 'ఫ్రక్టోజ్' అనే చక్కెర లభిస్తుంది. మన కాలేయం, దీనిని ప్రాసెస్‌చేసి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు, జాగ్రత్తగా శరీరంలో నిలిపి వుంచుతుంది. శరీరంలో అధికంగా ఫ్రక్టోజ్ నిల్వ వుంటే అది యూరిక్ యాసిడ్‌గా మారుతుంది.

దానివల్ల గౌట్ వ్యాధి, శరీరంలో ట్రైగ్లిజరైడ్స్ పెరుగుతాయి. అందువలన గుండెజబ్బు, ఊబకాయం వచ్చే అవకాశాలు పెరుగుతాయి. పండ్లను రోజా తినే మొదటి ఆహారంలో భాగంగానో, కుదరకపోతే రెండవసారి తినే ఆహారం ముందో తినాలి.

పాలల్లో ఓట్స్ : ఓట్స్‌ను పాలల్లో కలిపి రాత్రంతా ఫ్రిజ్‌లో వుంచాలి. మరుసటిరోజు ఉదయాన పండ్ల ముక్కలు, నట్స్, తేనె లేదా వేరుశనగ, వెన్నకలుపుకుని తినాలి. ప్రతి కప్పులో నలభై గ్రాముల ధాన్యపు

పదార్థాలు, నాలుగు గ్రాముల పీచు మరియు పాల ద్వారా మాంసకృత్తులు లభిస్తాయి.

ఇంటిదగ్గరే తినండి : మనం బైట తినే ప్రతిసారీ సుమారుగా మూడువందల క్యాలరీల ఆహారాన్ని ఇంట్లోకంటే ఎక్కువ తింటాం. హోటల్లో లభించే ఆహారంలో సోడియం (ఉప్పు), చక్కెర మరియు సంతృప్తి కొవ్వు అధికంగా వుంటుంది.

మయోనైజ్‌ను వాడవద్దు : మయోనైజ్ బదులుగా శాండ్‌విచ్‌లు, సలాడ్‌లో శనగలు, నువ్వుపప్పు, నిమ్మరసం, వెల్లుల్లితో చేసిన పేస్ట్ లేదా నువ్వుల పేస్ట్ లేదా ఆలివ్ మిశ్రమాన్ని వాడండి.

క్యాలరీలను కరిగించండి

కొవ్వంటే భయం వద్దు: కొందరు సైంటిస్ట్‌లు, ఎక్కువ బరువు ఉన్న యువకులతో ఒక ప్రయోగం చేశారు. ముందుగా యువకులకు తక్కువ క్యాలరీలు ఉన్న ఆహారాన్ని అందించారు. 10 నుంచి 15 శాతం బరువు తగ్గగానే వారిలో కొందరికి తక్కువ కొవ్వున్న ఆహారాన్ని పెట్టారు. మిగిలినవారికి పిండిపదార్థాలు తక్కువ, ఆలీవ్‌నూనె, నట్స్,అవకాడో,విత్తులులాంటి ఆరోగ్యకర కొవ్వు ఉన్న ఆహారాన్ని అందించారు.

తక్కువ కొవ్వున్న ఆహారం తింటున్నవారిలో జీవన క్రియల వేగం బాగా పడిపోయింది. తక్కువ పిండి పదార్థాలు,ఎక్కువ మంచి కొవ్వు ఆహారం తిన్నవారిలో జీవనక్రియల వేగం మందగించలేదు.

నీరు ఎక్కువ తాగండి : నీరు తాగటంవలన జీవన క్రియల వేగం పెరుగుతుందని కొన్ని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. మంచినీళ్ళు తాగితే వాటిని శరీరం గ్రహించటానికి క్యాలరీలను ఖర్చుపెట్టాల్సి వస్తుంది. అందుచేత సాధ్యమైనంత ఎక్కువ నీరు తాగుతూండాలి. ప్రాంతాన్ని, శరీరతత్వాన్నిబట్టి నీరు ఎంత తాగాలన్నది వైద్యుల సలహా తీసుకోవాలి.

ఒక కప్పు కాఫీ లేదా గ్రీన్ టీ : కెఫిన్ వున్న పానీయాలు తాగటంవల్ల శరీరంలో శక్తి వినియోగం 13 శాతంవరకు పెరుగుతోంది.ఇంకా దానికంటే మరిగిన టీవల్ల జీవనక్రియలవేగం పెరుగుతుంది. అందుచేత టీ, కాఫీలు గానీ అసలు మానకండి. ఒకవేళ వాటిలో చక్కెర వేసుకునే అలవాటుంటే చెంచా లేదా అంతకంటే తక్కువ వాడటానికి పరిమితం కండి.

తగినంత మాంసకృత్తులు : చాలామంది మనుషులు, ఆహారం తీసుకున్న ప్రతిసారీ ఎక్కువలో ఎక్కువ 25 నుంచి 30 గ్రాముల మాంసకృత్తులను మాత్రమే కండరాల నిర్మాణానికి, మరమ్మతులకు వాడుకోగలుగుతారు. మిగిలిన మాంసకృత్తులు అన్నీ కొవ్వుగా మారిపోతాయి. 30 గ్రాముల మాంసకృత్తులు సుమారుగా ఐదు గుడ్లకు, సుమారు 570 గ్రాముల తక్కువ కొవ్వు వున్న పెరుగుకు సమానం.

మాటలు నమ్మి కొనకండి

ప్రాసెస్ చేసిన పదార్థాలు : వీటిలో ఎక్కువ ట్రాన్స్‌ఫాట్ వుంటుంది.

హోల్‌గ్రెయిన్ లేబుల్స్ : ఏదయినా వస్తువు పైన వున్న లేబుల్‌పై అది (పప్పుధాన్యాలతో) హోల్ గ్రెయిన్ తయారయింది.

కోడిగుడ్లలో కొలెస్ట్రాల్ ఎక్కువా? : మనిషి తినే రకరకాల కొవ్వులు అన్నీ కలిసి శరీరంలో కొలెస్ట్రాల్‌గా మారతాయని మనకు తెలుసు. అందువల్ల కోడిగుడ్లు తింటే వచ్చే భయమేమీ లేదు.



తక్కువ తక్కువ ఎక్కువసార్లు తినండి: రోజులో ఐదునుంచి ఆరుసార్లు తిన్న మనుషులు జంక్‌ఫుడ్ ఎక్కువ తింటున్నట్లు గమనించారు.

పాస్తా తినటం మంచిదేనా : పాస్తా అరగటానికి ఎక్కువ సమయం పడ్తుంది. అందుచేత శరీరంలోని చక్కెరస్థాయిల్లో ఒకేసారి పెరుగుదల ఉండదు.

ఆర్గానిక్ ఆహారం మంచిదా : ఆర్గానిక్ఆహారం తినటంవల్ల పురుగుమందులు వాటిలో కలవకపోవటంవల్ల కొంత మేలు జరగటమన్నమాట నిజమే.

నెయ్యి వాడకం అసలే వద్దు : ఈ రోజు మనకు లభిస్తున్న రిఫైండ్ వంటనూనెలతో పోలిస్తే సహజసిద్ధంగా నెయ్యిలో ఆరోగ్యకరమైన సంతృప్తి కొవ్వులు మరియు ఏకరీతి అసంతృప్తి కొవ్వులు ఉన్నాయి. ఇవి ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి.

ఉప్పు తగ్గించండి : ఒక్క అధిక రక్తపోటుతో బాధపడే వ్యక్తులు తప్ప మిగిలిన వ్యక్తులు ఉప్పును సాధారణ స్థాయిలో తినవచ్చు.

పిండిపదార్థాలు తినకండి: ఇదీ తప్పే. చక్కని ఆయుర్దాయంకోసం పప్పుధాన్యాలు, బ్రౌన్ రైస్,చిలగడదుంపలు, బీన్స్‌ల నుండి వచ్చే మిశ్రమ పిండి పదార్థాలు ఎంతో దోహదం చేస్తాయి.

మిల్క్ షేక్‌లు, పండ్లరసాలు మంచివేనా: చాలా వాటిల్లో పంచదార, వాటితోపాటు ఇతరాలు కలుపుతారు. చాలా వాటిల్లో ఎసెన్సు వాడతారు. కానీ నిజమైన పండ్లను వాడరు. అందుచేత వాటిని తాగేముందే నిజంగా పండ్లతో చేస్తున్నారా? లేదా ఎసెన్స్‌తోనా అనేది తెలుసుకోండి.

బంగారు నియమాలు

రాత్రి భోజనం తక్కువ తినండి : ఉదయం మొదటిసారి తినేటప్పుడు ఎక్కువ తినాలి. దానివల్ల కండరాలు, మెదడు ఉత్తేజితమవుతాయి. మధ్యాహ్నం మధ్యస్తంగా తినాలి. రాత్రి తక్కువగా తినాలి.

వారంలో రెండు రోజులు, ఉపవాసం ఉండండి : మీరు బ్రేక్‌ఫాస్ట్‌ను ఉదయం 7 గంటలకు తినే అలవాటు వుంటే రాత్రిపూట భోజనాన్ని కూడా 7 గంటలలోపు ముగించండి. అలా చేస్తే శరీరం ఉపవాసస్థితిలో 12 గంటలు ఉంటుంది.

మార్పుకు సమయం మించిపోలేదు : పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయం పెన్సిల్వేనియావాళ్ళు చేసినపరిశోధన ఇలా ఉంది.వారు ఇరవైమంది ఆఫ్రికన్ అమెరికన్స్‌కు ఎక్కువ పీచున్న ఆఫ్రికా ఆహారం పెట్టారు. మరో ఇరవయిమంది గ్రామీణ ఆఫ్రికన్స్‌కు తక్కువ పీచున్న పడమటి దేశాల ఆహారాన్ని ఇచ్చారు.

రెండు వారాల తర్వాత క్యాన్సర్ వచ్చే అవకాశాన్ని సూచించే జీవసూచికలు అమెరికన్స్‌లో తగ్గాయి. ఆఫ్రికన్స్‌లో బాగా పెరిగాయి.అందుచేత సరైన ఆహారాన్ని తినటం ఈ రోజే మొదలుపెట్టండి.

పాలపర్తి శ్రీకాంత్

సంగీతం మోక్ష సాధకం
(త్యాగరాజ ఆరాధన : 6.1.2018)

సాక్షాత్తు పరమేశ్వరుని నుండి లభించిన వేదాలని గానంచేస్తేనే మోక్షం సిద్ధిస్తుందనేది మన భావన.

అయితే త్యాగరాజస్వామి తన సంగీతాలాపనద్వారా ఆ రామపర బ్రహ్మాన్ని కనులారా భౌతిక శరీరంతో దర్శించగలగడమే కాక, తన భార్యకి కూడా చూపగలిగిన ధన్యజీవి.

రాజాశ్రయాన్ని పొంది ధనధాన్యాలని పొందలేదనే భావంతో తనవాళ్ళే త్యాగరాజు ఆరాధించే రామపంచాయతనాన్ని కావేరీనదిలో పడేస్తే-

ఆ విగ్రహాలు దొరికేంతవరకూ ప్రాయోపవేశాన్ని (తిండీ, నీరూ ముట్టకుండా ఉండడం) చేస్తూ రామకీర్తనలనే పాడుతూ ఒడ్డుకి కొట్టుకొచ్చిన రామపంచాయతనాన్ని పొందిన సంగీత భక్తి సమ్రాట్టు ఆయన.

'సీతమ్మ మా యమ్మ, శ్రీరాముడు మాకు తండ్రి' అని కీర్తించాడంటే ఆ కీర్తనలోని ప్రతి అక్షరం శరీరంనిండుగా అనుభవించి ఇవతలికి వచ్చినవే.

అందుకే ఈ రోజుకీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాన్ని వేలకొలదీ సంగీత పండితులు ఏకకాలంలో గానమయంచేస్తూ నిర్వహిస్తారు.

ఆ గానాలు విన్పించే ఆ ప్రదేశం ఒక అయోధ్య. ఆ పాడేవారంతా త్యాగరాజు అంశకలవాళ్ళూ- అక్కడ కన్పించని రూపంతో ఉంటూ ఏ కొందరికో కన్పించే దైవం రాముడు. ❐

కర్మ క్షయం

'ఎన్నో పూజలు చేశాను. ఎన్నో ఆలయాలకి విరాళాలిచ్చాను.

ఎందరికో దానాలు చేశాను... అయితే ఏం లాభం? నాకేం ఒరగబెట్టాడు దేవుడు?' అని దైవాన్ని తగ్గిస్తూ మాట్లాడకూడదు.

భద్రాచలంలో ఆలయాన్ని కట్టించిన రామదాసుకి ఉద్యోగం పోయింది. కన్నకొడుకు గంజిగుంటలో పడి అపమృత్యువుపాలయ్యాడు. తాను కారాగారంలో పడ్డాడు. దెబ్బలు తిన్నాడు.

అలాగే సక్కుబాబు ఇంటినిండు చాకిరీనీ చేసింది.

అత్తపెట్టిన బాధల్ని భరించింది.

మీరాబాయి జీవితమూ అంతే కదా! ఇలా ఆలోచిస్తూ వెళ్తే-దైవాన్ని అంత గొప్పగా ఆరాధించిన ఎవరూ సుఖకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడప(నే)లేదని అర్థమవుతుంది- ఇదేమిటి అనిపిస్తుంది మనకి.

పూర్వజన్మ పాపకర్మ మొత్తము ఇక్కడ క్షయమయితే తప్ప ఆ లోకానికి వెళ్ళటానికి వీలులేదు కాబట్టి ఆ పాపకర్మ ఫలితాలే ఈ దుఃఖాలు అని గమనించుకోగలగాలి. ❐



అయ్యప్ప స్తుతి

లోకవీరం మహాపూజ్యం, సర్వరక్షాకరం విభుం।
పార్వతీ హృదయానందం, శాస్తారం ప్రణమామ్యహమ్॥

లోకైకవీరుడు, మహాత్ములచే పూజలందుకునేవాడు, సకల లోకాలను సర్వవేళలా రక్షించేవాడు, కోరినవారికి కోరినన్ని వరాలను ప్రసాదించే ప్రభువు, పార్వతీదేవి ప్రేమకు పరిపూర్ణపాత్రుడు, ధర్మాన్ని శాసించి నేర్పించేవాడు అయిన శ్రీ అయ్యప్పస్వామికి నమస్కారము. ❐

తామరాకుపై నీటిబొట్టు

తామరాకులో నీటిబొట్టున్నా ఎలా నీటికీ, ఆకుకీ సంబంధం ఉండీకూడా లేనట్లుందో, ఒంటికి నూనె రాసుకున్న వ్యక్తిని పట్టుకున్నా దొరికినట్లుండి కూడా చేతికి చిక్కడో, కొంగ నీటి ఒడ్డున నిలబడ్డప్పటికీ నీటిలోనుండి బయటికొచ్చే చేపమీదే తన దృష్టి ఉంటుందో, తల్లి ఏ పనిచేస్తున్నా తన మనసూ, బుద్ధీ ఉయ్యాలలో ఉన్న శిశువుమీదే ఉంటుందో అలా మనమంతా సంసారబంధాల్లో ఉన్నా దృష్టి మాత్రం భగవంతునిపైనే ఉంచాలి.

భగవంతుడు ఈ యుగంలో ఎవరికీ కన్పించడు. అయితే తన చేష్టలతో, లీలలతో మహత్యాలతో ఎవరికీ కనిపించకుండానూ ఉండడు. ❐

ఆరాధన

ఉదయనాచార్యులవారు శ్రీ వేంకటేశ్వర భక్తులు. ప్రతినిత్యం ఆరాధించి ఆయన్ని దర్శిస్తూనే ఉండేవారు.

ఓమారు ఆయన కొండని ఎక్కుతుంటే శ్రీ వేంకటేశుడు ఈయన్ని చూడనట్లుగా కొండ దిగిపోతూంటే ఆయనకి ఎదురుగా వెళ్ళి- ఐశ్వర్య మదంతో మత్తెక్కిన వేంకటేశుడా! నన్ను గమనించకుండా నీ అనుగ్రహ దృష్టిని ప్రసరింపజేయకుండా వెళ్ళిపోతావా?

రేపటిరోజున దైవమే లేడంటూ నిన్ను అవమానించబోయే వాళ్ళకి గట్టి సమాధానం చెప్పి నిన్ను నిలబెట్టవలసిన వాణ్ణి నేనే అని గమనించు!

నా అధీనంలో ఉన్న నీకు నాతో పనుంది జాగ్రత్త! అని హెచ్చరించాడు, ఉదయాచార్యులవారు. (ఐశ్వర్య మద మత్తో ౖసి ...మదధీనా తవ స్థితిః।) ❐

{పరమాత్మపై విశ్వాసమే మనిషికి లోలోపలి కవచం.}

శుభకార్యాలలో

మనింట్లో ఏదైనా ఓ శుభకార్యమో, ఉత్సవమో జరుగుతుంటే,దానికి ఏవో కారణాలవల్ల రాలేనివారు శుభాకాంక్షలని పంపడంలో కొంత అర్థముంది.

అయితే ఆ జరుగుతున్న పండుగని గూర్చిగాని, జరుగుతున్న ఉపనయనం వివాహంవంటి శుభకార్యాల గురించి గాని, ఏమాత్రపు విషయమూ అవగాహనాకూడా లేకుండా 'శుభాకాంక్ష'లని పంపడం కేవలంచేతులుదులుపుకోడానికి చేసే పని తప్ప హృదయపూర్వకంగా కాదన్న మాటే.

ఈ శుభాకాంక్షలనేవి కొన్నిచోట్ల మరింత అర్థంలేనివిగా కనిపిస్తాయి. 'దసరా శుభాకాంక్షలు'వంటివి దీనికి ఉదాహరణ.

దసరాకి త్రిశక్తిస్వరూపిణి అయిన ఆమె అనుగ్రహం మనకి లభించాలి కాబట్టి, నిజంగా మనకి ఆ అనుగ్రహాన్ని ప్రార్థించేవాడైతే విజయదశమీ అంబా అనుగ్రహాకాంక్షలు అనో లేదా ఆ అర్థం వచ్చేలానో పంపాలి తప్ప,అన్నిటికీ ఒకే తీరులో పండుగ పేరుని జతచేస్తూ శుభాకాంక్షలనే మాటని జతచేసి పంపడమంటే 'చేతులుదులుపుకోవడమే'. ❐


అభూతకల్పన

శివునికి ఓ కూతురున్నట్లు ఆమెకి పార్వతీపరమేశ్వరులు పెళ్ళిచేసినట్లూ, ఆ అల్లుడు ఆమెని సరిగా చూసుకోకపోతూంటే శంకరుడు దుఃఖిస్తూ పార్వతితో బాధని వ్యక్తీకరించుకుంటున్నట్లూ... ఈ తీరులో కన్పించే విన్పించే అభూతకల్పనలని వెంటనే ఖండించని పక్షంలో కాలక్రమంలో నిజాలుగా మారిపోతాయి.

శంకరునికి సంతానమే లేదు. పార్వతి గర్భాన్ని ధరించనే లేదు కదా! మరి ఈ కూతురెలా వచ్చిందిట? అన్నీ నిజం అనుకోకూడదు.

సీరియల్

మనిషిలో మనిషి



"ఏమిటిలా వచ్చావ్...? నిద్రపట్టడం లేదా...?"అనడిగాడు కార్తికేయ.

"ఎలాపడుతుంది? అందరికీ అన్ని జాగ్రత్తలూచెప్పావ్.నాకేమీ చెప్పావా?"అని అక్కడున్న ఛైర్ లాక్కుని దగ్గరగా కూర్చుంటూ గారాబంగా అడిగింది సంజనా.

"నీకు జాగ్రత్తలు చెప్పాలా? ఏంచెప్పాలి? నీకు తెలీదా? కాదంటే నీతో ఒక విషయం మాట్లాడాలనుకున్నాను రేపుఉదయం..."

"ఉదయం సాయంత్రాలు లేవు. ఇప్పుడే అదేదో మాట్లాడు" అంది సంజనా.

"కర్మాగార నిర్మాణం ఆరంభించడానికి తక్కువలో తక్కువ మూడు మాసాల వ్యవధి పడుతుంది. కనీసం ఆరుమాసాల తర్వాతగాని ఉత్పత్తి ఆరంభం కాదు. అంతవరకు నువ్వు ఇక్కడుండి ఏం చేస్తావు... యు.కె. వెళ్ళిపోతావా?" అన్నాడు కార్తికేయ.

"వెళ్ళి ఏంచేయాలి?"

"నువ్విక్కడికొచ్చి రెండేళ్ళు కావస్తోంది. మీ పేరెంట్స్‌ని, బంధువుల్ని చూడాలనిలేదా. కొంతకాలం హ్యాపీగా వాళ్ళతో ఉండిరావచ్చుగా"

"వెళ్ళనుగాక వెళ్ళను. ఎందుకంటే అక్కడ కార్తికేయ వుండడుగదా. నువ్వూ వస్తానంటే చెప్పు వెళ్దాం" అంది సంజనా.

"అదెలా... నాకిక్కడ ఎన్ని పనులున్నాయి? అన్నీ తెలిసికూడా నువ్విలా మాట్లాడ్డం న్యాయం కాదు"

"నన్ను యు.కె. పంపించేయాలని చూడ్డం నీకు న్యాయంగా ఉందా? నిన్నొదిలి ఎక్కడికెళ్తానను కున్నావ్. నీతోనేనేను. అంతే" అంటూలేచి కార్తికేయ ఒడిలో కూర్చుంది. గోముగా చూస్తూ మెడచుట్టూ చేతులేసి వంగి అధరాలు ముద్దాడింది.

"నీతో ఉండటమే హ్యాపీ



E-mail: Suryadevaranovelist@gmail.com

సూర్యదేవర రామ్‌మోహనరావు



కార్తీ, ప్లీజ్. నన్ను నీనుంచి దూరంచేసే ఆలోచనచేయకు. ఎడబాటు భరించ లేను" అంటూ గాఢంగా కౌగిలించుకుంది.

అంతఆర్తిగా తనను ఆరాధిస్తున్నఅందాల రాశికి ఇంకేం చెప్పగలడు. మృదువుగా ఆమె వీపు నిమిరి శంఖంలాంటి మెడమీద ప్రేమగా ముద్దుపెట్టడం తప్ప.

అనుకున్నట్టే నాలుగోరోజున ల్యాబ్‌కి మూతపెట్టే పనులు మొదలయ్యాయి. ఆ రోజు ఉదయం నుంచే ఆ పనుల్లో బిజీఅయిపోయారంతా. ఆ రాతిదుర్గానికి విద్యుత్ సప్లైకోసం ఇంతకాలం సోలార్ పవర్‌ని ఉపయోగిస్తూ వస్తున్నారు. ముందుగా దుర్గంపైన బిగించిన సోలార్‌పానల్స్‌ని రిమూవ్‌చేసి భద్రపరిచారు.

ప్రయోగాలకు సంబంధించిన రికార్డులనుమొత్తం సీక్రెట్ లాకర్స్‌లో దాచేశారు. కంప్యూటర్స్ కనెక్షన్స్ రిమూవ్ చేసి భద్రపర్చారు. అలాగే కరెంట్‌ని స్టోర్ చేసే బ్యాటరీలనూ కనబడకుండా దాచారు.

ఇలా ఏ ఒక్క సెక్షనూ వదలకుండా భద్రపర్చి బిగించారు. పొరబాటున శత్రువు ఎవడైనా దుర్గంలో ప్రవేశించినా వాడికి ఎలాంటి ఆధారాలు లభ్యం గాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు.

ఈ పనులన్నీ ముగించి స్నానాదికాలు చేసేసరికి భోజనంవేళయింది. అంతా భోజనాలు చేయగానే ఇక ప్రయాణం హడావుడి మొదలయింది.

కార్తికేయ సంజనాలు తమ బట్టల సూట్‌కేస్‌లు ఇతర వస్తువుల్ని తమ జీప్‌లోకి చేర్చారు. సైంటిస్ట్‌లు నలుగురూ వాళ్ళ అసిస్టెంట్లు నలుగురికీ ఒక వ్యాన్, వంటవాళ్ళు పనివాళ్ళకోసం మరో వ్యాన్ సిద్ధంగా వున్నాయి. అంతా ప్రయాణానికి సిద్ధం కాగానే ల్యాబ్ తలుపులు, దుర్గం తలుపులు మొత్తం బిగించి తాళాలు వేశారు. కార్తికేయ ఎవరికి ఎంత ఇవ్వాలో అంతా డబ్బు ముట్టచెప్పాడు.

ముందుగా కార్తికేయ సంజనాల జీప్ సొరంగ మార్గంలో ప్రవేశించింది. మిగతా వ్యాన్‌లుకూడా రాగానే ఆ మార్గాన్ని కూడా మూసేశాడు కార్తికేయ. నలభై నిమిషాలు హెడ్‌లైట్ల కాంతిలో సొరంగమార్గాన ప్రయాణించి అడవిలోకి వచ్చేసరికి సాయంకాలం మూడుగంటలయింది సమయం.

అహింస, సత్యభాషణము, సమస్త ప్రాణికోటి పట్ల సరళ ప్రవర్తన, క్షమ, అప్రమత్తత అనే ఈ సద్గుణాలు ఎవరిలో వుంటాయో వారు సుఖంగా వుంటారు.

కొండపాదంలోని సొరంగమార్గం ప్రవేశద్వారాన్ని కూడా మూసేసి లాక్ చేశాడు కార్తికేయ. రాళ్ళలో రాళ్ళలా కలిసిపోయిన డోర్‌ని గాని, మార్గాన్ని గాని ఇంకెవ్వరూ గుర్తించలేరు. ఇక నిశ్చింతగా పర్లాకిమిడి దిశగా పరుగు ఆరంభించాయి వ్యాన్లు.

పర్లాకిమిడి వచ్చిన మరునాడు ఉదయమే ప్యాలెస్‌కువెళ్ళాడు కార్తికేయ. రాజా విష్ణుచంద్ర గజపతి మహాదేవ్‌ను కలిశాడు. తన ప్రయోగ విజయాలతో బాటు ప్రోగ్రెస్ మొత్తం రిపోర్ట్ చేశాడు. అంతా విని మనసారా అభినందించారు రాజావారు.

"చూడు కార్తీ! ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి రెండో దశ నిమిత్తం సాయం కోరడానికి మనం ఢిల్లీ వెళ్ళాల్సి వుంది. కాని ఇంకో పదిరోజుల వరకు ఇక్కడ మాకు పనులు పూర్తికావు. అంతవరకు ఆగాలి. ముఖ్యంగా మా కుమార్తె యువరాణి సహానాదేవి తొలిసారిగా లండన్ నుంచి ఇక్కడికి రాబోతోంది" అంటూ విషయమంతా వివరించారు రాజావారు.

ఆ మాటలు విని నిర్ఘాంతపోయాడు కార్తికేయ. కారణం యువరాణి రాక గురించి కాదు. ఆమెకు ప్రాణగండం ఉందనీ, వైధవ్యయోగం వుందనీ రాజావారు నమ్మటం. దీన్ని నమ్మకం అనుకోవాలో మూఢ నమ్మకం అనుకోవాలో అర్థంకాలేదు.

"సార్! ఈ రోజుల్లో కూడా ఇలాంటివాటిని మనం నమ్మొచ్చా? జోతిష్యులేమన్నా దేవుళ్ళా ఖచ్చితంగా ఇలా జరుగుతుందని చెప్పటానికి?" అనడిగాడు.

గాఢంగా ఒక్క నిట్టూర్పు విడిచి -

చిన్నగా నవ్వారు రాజావారు.

"ఇది నమ్మకమో.... మూఢనమ్మకమో కాదు. జ్యోతిష్యంకూడా ఒకశాస్త్రమే. శాస్త్రం ఎప్పుడూఅబద్ధం చెప్పదు కార్తికేయా. ఆపైన తరతరాలుగా కవి

జరిగిన కథ 8

సహానాదేవికి రానున్న గండం గురించి, ఆ గండం నుండి బయటపడేందుకు జరగాల్సిన వివాహం గురించి సత్యానందస్వామి, రాజగురువు మున్నలూరి కృష్ణశాస్త్రి, రాజావారి మధ్య చర్చ జరుగుతుంది. కార్తికేయ జోరున వర్షంలో పర్లా కిమిడి చేరుకుంటాడు.

ఇంటికి సమీపంగా వచ్చాక అతని వ్యాన్‌లోకి ఐదుగురు ఆగంతులు చొరబడి అతన్ని రివాల్వర్‌తో బెదిరించి ఓ చోట వ్యాన్‌ని ఆపిస్తారు. ఇంతలో సంజనానుండి ఫోన్ వస్తుంది. ఆమెతో మాట్లాడి తను సైంటిస్ట్‌ని కాదని మీరనుకుంటున్న సైంటిస్ట్ అసిస్టెంట్‌ననీ బుకాయించి వారెందుకు కార్తికేయను చంపాలనుకుంటున్నారో తెలివిగా సమాధానం చెప్పిస్తాడు.

ఆ తరువాత తన దగ్గరున్న పిస్టల్‌తో అందర్నీ షూట్‌చేసేస్తాడు. ఒక్క సురేష్ భండారీ అనే అతన్ని తప్పించి తనే కార్తికేయనని చెప్పి అతడ్నీ షూట్ చేసేస్తాడు.

సురేష్ భండారీ అతని అనుచరులు జలసమాధి అయిన విషయం తెలీక కిట్టప్పనాయుడు గందరగోళపడుతుంటాడు.

కార్తికేయ నిర్వహించిన చివరిప్రయోగం కూడా సక్సెస్ అవుతుంది. ఇక చదవండి.



అవినీతికి పాల్పడిన నేతలను ఏదో ఒక సమయంలో చట్టం దోషులుగా శిక్షించక మానదు.

-రవిశంకర్‌ప్రసాద్, కేంద్రమంత్రి

పండితుల్తో పాటు జ్యోతిష పండితులనూ సమానంగా ఆదరించి పోషించిన గజపతి వంశం మాది. నమ్మకంతోపాటు మా ఆచార వ్యవహారాలూ అలాగే ఉంటాయి. నమ్మటం నమ్మకపోవటం వారివారి అనుభవాల్నిబట్టి ఉంటుంది.సరి...నువ్వు నమ్మకపోయినాఫరవాలేదు. ఆ రోజు మా తనయ యువరాణి సహనాదేవి దర్శించడానికయినా వస్తావుగా?" అన్నారు.

"ఎంతమాట. తప్పకుండా వస్తాను సార్. నాకు తెలుసు ఇక్కడంతా యువరాణివారు ఎలా ఉంటారో చూడాలని చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు"

"నీ సెక్రటరీ పేరేమిటన్నావ్... సంజనా కదూ. ఆ అమ్మాయిని కూడా తీసుకురా.

కాని ఆమెముక్కోపిలాఉంది. ఒకవేళరానంటే బలవంతంగా తీసుకురానక్కర్లేదు. నువ్వొస్తే చాలు"

"అలాగే సర్. వస్తాను"అంటూ సెలవు తీసుకుని వచ్చేశాడు కార్తికేయ.

నిశ్చయించిన ముహూర్తం రోజు నాలుగు రోజులకు దగ్గరపడింది. పళని నుంచి మరునాడు తన శిష్యులు ఆరుగురితో పర్లాకిమిడి బయలుదేరుతున్నాడు స్వామి సత్యానంద.

కాని ఇంతవరకు లండన్ నుంచి రావలసిన యువరాణి మేఘనా సౌందర్యానంద సహనాదేవి ప్యాలెస్‌కు చేరుకోలేదు. ఆ రోజు ఇదే విషయాన్ని రాజావారి ముందు ప్రస్తావించాడు రాజగురువు మున్నలూరు కృష్ణశాస్త్రి.

"యువరాణి వచ్చేస్తుంది గురువర్యా. టెన్షన్ పడాల్సిన పనిలేదు. రోజూ ఫోన్ చేసి మాట్లాడుతూనే ఉన్నాను. తనకక్కడ ఫైనల్‌ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. ఇవాళరేపటితో అవీ అయిపోతాయి. వెంటనే బైలుదేరుతుంది.

ముహూర్తానికి ఒకరోజు ముందుగాని ఆ రోజు ఉదయంగాని ఇక్కడుంటుంది.నో ప్రాబ్లమ్. మీఏర్పాట్లలో మీరుండండి" అంటూ భరోసా ఇచ్చారాయన.

ఆ రోజు కూడా రానేవచ్చింది. ఉదయమే ప్యాలెస్‌కు రెడీ అవుతున్నాడు కార్తికేయ. ఇంతలో అక్కడికి సంజనా వచ్చింది. ఆమెను చూసి విస్తుపోయాడు కార్తికేయ "సంజూ ఏమిటిది?" అడిగాడు.

"ఏమిటి?" ఎదురు ప్రశ్నించింది సంజనా.

"నువ్వింకా నైటీలోనే ఉన్నావేమిటంటున్నాను. రాత్రి చెప్పానుగదా. కాసేపట్లో మనం ప్యాలెస్‌కి బయలుదేరాలి. తొలిసారిగా యువరాణి సహనాదేవి ప్యాలెస్‌కువస్తోంది. మనంవెళ్ళాలి. త్వరగా రెడీ అవు" అంటూ గుర్తుచేశాడు కార్తికేయ.

"అవసరం లేదు. నేను రాను" అంది సంజనా.

"రావా!" ఒకింత అసహనంగా అడిగాడు.

"అవును. రాను" స్పష్టంగా చెప్పింది.



"ఇద్దరం కలిసొస్తామని రాజావారితో చెప్పాను. నువ్వు కాదంటే ఎలా?"

"ఎలా ఏంటి కార్తీ. అసలు నాకో డౌటు తెలుసా? ఇప్పుడు మనం ప్యాలెస్‌కు వెళ్ళకపోయినా మనం రాలేదని అక్కడ బాధపడేవారు ఎవరూ లేరు.

అయినా కూడా నువ్వింత హైరానాపడుతున్నావంటే... ఆమె అందం ఏపాటిదో చూడాలనేగా.

నా కన్నా అందగత్తె అవునో కాదో తెలుసుకోవాలనేగా... రాజావారేమన్నా తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తానంటూ మాటిచ్చారా ఏమిటి?"

సంజనా మాటలకు విస్తుపోయి -

తలపట్టుకుని కూర్చుండిపోయాడు కార్తికేయ.

"'ఓర్నాయనో... అసూయ ముందుపుట్టి ఆడది తర్వాత పుట్టిందంటారు. సంజూ! నీ నిందలు వింటుంటే అది నిజమేనన్పిస్తోంది. యువరాణి అందగత్తె అయితే మనకెందుకు కురూపి అయితే మనకెందుకు. ఆమె సంస్థానవారసురాలు.

ఆమెతో ముందు ముందు మనకి చాలా అవసరాలుంటాయి. పరిచయం చేసుకోవాలిగాబట్టి వెళ్ళాలి. తప్పదు. దీనికింత రాద్ధాంతం చేసి పెడర్థాలుతీసి నా ప్రేమను శంకించటం న్యాయంగా ఉందా?" అంటూ లేచి దగ్గరకొచ్చి కౌగిట బంధించాడు.

"సంజూ! నాకు లభించిన పారిజాతపుష్పానివి నువ్వు. ఈ జన్మకే కాదు జన్మజన్మలకీ మనం విడిపోని జంటగానే ఉండాలి. నిన్ను మించిన సౌందర్యం లోకంలో ఉంటుందా? నువ్వే నా ప్రాణమని తెలీదా?" అంటూ ముద్దులిచ్చి లాలించి బుజ్జగిస్తేగాని సంజనా అలక తీరలేదు.

అప్పుడు కూడా -

"ఓకే కార్తీ! అయినా నువ్వెళ్ళొస్తే చాలుగదా నేనెందుకు? హ్యాపీగా తినికూర్చుని టి.వి. చూస్తుంటాను. నువ్వెళ్ళొచ్చెయ్" అంది సంజనా.

"అంతేగాని నువ్వు రానంటావ్?" కౌగిలి వదిలేస్తూ అడిగాడు కార్తికేయ.

"రానని చెప్పాగదా" ఆమె అంత మొండికేసేసరికి - రాజావారి మాటలు గుర్తొచ్చి చిన్నగా నవ్వాడు. సంజనా ఉడుక్కుంది. "ఎందుకా దొంగనవ్వు?" అంటూ నిలదీసింది.

"ఏంలేదు. రాజావారు మనుషుల్ని భలే అంచనా వేస్తారు. నీ గురించి ఆయన చెప్పింది కరెక్టే" అన్నాడు కార్తికేయ.

"ఆహా... ఏం చెప్పారేమిటి?"

"సంజనా ముక్కోపిలా ఉంది. రానంటే బలవంతంగా తీసుకురానక్కరలేదు. నువ్వొస్తేచాలన్నారు"

"అంటారు ఎందుకనరు? ఆయన యక్షప్రశ్నలంటేనే నాకు పరమ చిరాకు. అందుకే ప్యాలెస్‌కు రానంటాను. నువ్వెళ్ళొచ్చెయ్" అంది.

మరికొద్దిసేపట్లోనే కార్తికేయ తన బైక్‌మీద బైలుదేరి ప్యాలెస్‌కు వెళ్ళిపోయాడు. అతడ్ని సాగనంపాక

వెరీ క్రేజీ

నవ్వులతోనే సమ్మోహన అస్త్రాలు విరజిమ్మే కాజల్ అగర్వాల్ సైలెంట్‌గా బోల్డెంత క్రేజీ ఫాలోయింగ్‌ను సంపాదించేసింది.

ఫేస్‌బుక్‌లో ఈ అమ్మడి ఫాలోయర్ల సంఖ్య అక్షరాలా రెండుకోట్ల నలభై లక్షలమంది అట.

ఈ విషయాన్ని తనే స్వయంగా పేర్కొన్నది. ఈ పిల్ల ఎక్కువగా లైవ్‌చాట్స్ చేస్తుండడమే బహుశా ఇందుకు కారణం ఏమో. కాగా, తన తల్లిగురించి కాజల్ ఎంతో మురిసెంగా చెప్పుకున్నది.

"నాకు తెలిసిన అందమైన మహిళ మా అమ్మ. తనే నా రోల్‌మోడల్. గైడ్,స్ట్రెంగ్త్"అని చెప్పింది.

సంజనా స్నానానికి బాత్‌రూమ్‌కి దారితీసింది.

చాలాసంవత్సరాల తర్వాత - ఆ రోజు ఉదయం పర్లాకిమిడిలో నగారా శబ్దం వినవచ్చింది. కోట బురుజులపైన ఇద్దరు బలిష్ఠులైన మనుషులు అదేపనిగా భేరీని మ్రోగిస్తున్నారు. భేరీ నాదం దిక్కులవెంట ప్రతిధ్వనిస్తోంది.

నగారా శబ్దం కోటలో జరిగే విశేషానికి సంకేతం. అయితే సుమారు మూడువందల సంవత్సరాల క్రితం నిర్మించిన కోట గావటంతో కొంత బలహీన పడింది. ఎన్నో యుద్ధాల్ని మరెన్నో విజయాల్ని చూసి గజపతుల కోట. దాన్ని పాడుబెట్టడం రాజా విష్ణు చంద్ర గజపతి మహదేవ్‌కిష్టంలేదు. కోటకు మరమ్మతులు జరిపిస్తున్నారు. అందులో ఎవరూ లేరు. ప్రస్తుతం ప్యాలెస్‌లోనే రాజావారి నివాసం.

కోటకు దిగువన ఒకింత దూరంగా నిర్మించబడిందిప్యాలెస్. ఈ అద్భుతమైన ప్యాలస్‌కు, కోటకు మధ్యన సుమారు రెండు ఫర్లాంగుల దూరంలో నిర్మాణాలేమీ జరగలేదు. ఆ ప్రాంతమంతా అక్కడక్కడా పూలమొక్కలతో అందమైన లాన్ ఏర్పరచబడి చూడ్డానికి పచ్చిక తివాసీలా ఉంటుంది.

అటు కోటకి ఇటు ప్యాలెస్‌కి మధ్య ప్రాంతంలోని లాన్ మీద యువరాణివారికి తాంత్రికక్రతువు జరిపించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.పలని నుంచి వచ్చిన స్వామి సత్యానంద ఆయన శిష్యులు ఆరుగురు ఆ పనుల్లో అక్కడ బిజీగా ఉన్నారు.

ఆ చోటుకి ఇవతలగా నీడకోసం అనేక షామియానాలు లేపబడి వీక్షించడానికిఅనువుగా అనేక కుర్చీలు వేయబడున్నాయి. అయితే ఈరోజు ఆకాశం మబ్బులతో ఉన్నందున ఎండ తెలీటంలేదు.

వాస్తవానికి రాజగురువు కృష్ణశాస్త్రి గారు కూడా అక్కడ ఉండాలి. కాని వేకువజామునే ఆయన స్నానాదికాలు ముగించి శివాలయానికి బయలుదేరి వెళ్ళారు. అక్కడ మహామృత్యుంజయ యాగం నిర్వహించే పనుల్లో మునిగి ఉన్నారాయన.

నూట ఎనిమిదిమంది ఋత్విక్కులతో యువరాణీ వారి క్షేమం కోసం భారీయాగం ఆరంభం కానుందక్కడ. యాగ ఆరంభ ముహూర్తం, ఇక్కడ తాంత్రిక క్రతువు ముహూర్తం రెండూ ఏకసమయం గావటం విశేషం. ఆ విధంగా కృష్ణశాస్త్రిగారు శివాలయంలో ఉండిపోవటంచేత యువరాణీవారు ప్యాలెస్‌కు చేరుకున్నారా లేదా నే విషయం కృష్ణశాస్త్రిగారికి తెలీదు.

యువరాణికి వైధవ్యయోగం తప్పించేందుకు జరుపుతున్న తాంత్రిక క్రతువును రాజావారు రహస్యంగా జరిపించాలనుకోవటంలేదు. ఇది పూర్తిగా తమ కుటుంబానికి సంబంధించిందే అయినా యువరాణీని చూడాలని అంతా ఎదురుచూస్తున్నారు.

ఇవాళగాకుంటే రేపయినా ఈ క్రతువు గురించి నలుగురికీ తెలుస్తుంది. దాచి ప్రయోజనంలేదు కాబట్టి పబ్లిక్‌గానే నిర్వహించ తలపెట్టారాయన.

అయితే మీడియావాళ్ళని మాత్రం ఆ దరిదాపులకు రాకుండా ఆంక్ష విధించారు. పత్రికల్లోగాని టి.విల్లోగాని వస్తే శిక్షార్హులని ప్రకటించారు. ఆ విధంగా మీడియాను దూరంగా ఉంచారు.

ఇంతకీ లండన్నుంచి బయలుదేరిన యువరాణీ ఇండియా వచ్చి ప్యాలెస్‌కు చేరుకుందా లేదా అంటే ఎవరివద్దా ఖచ్చితమైన సమాధానం లేదు. కాని తెల్లవారుజామునే ఆమె ప్యాలెస్‌కు చేరుకున్నట్టు గాలి వార్తలు మాత్రం షికారు చేస్తున్నాయి.

ఈ పరిస్థితిలో - కార్తికేయ కోటగుమ్మం వద్దకు చేరుకునేసరికి ఉదయం ఎనిమిది గంటలయింది సమయం. అప్పటికే కోలాహలంగా ఉందక్కడ.

ఇక్కడ కోటగుమ్మం అంటే కోట యొక్క ప్రధాన ద్వారమని అర్థం కాదు. కోటకువెళ్ళేమార్గానికి ప్రథమ ద్వారమని అర్థం. కోటను చుట్టి ఉండే దృఢంగా ఎత్తయిన గోడ వద్ద నిర్మించబడుతుంది.

కోటను చుట్టి నాలుగు దిక్కులా నాలుగు గుమ్మాలున్నాయి. మూడు రథాలు ఒకేసారి ప్రవేశించగలిగేంత వెడల్పు ఉండి పైన పెద్ద ఆర్చ్ వుంటుంది. ఏనుగులు తలతో కుమ్మినా పగలనంత దృఢమైన ఇనుము, చెక్కలతో నిర్మించిన ఎత్తయిన తలుపులు కలిగి ఉంటాయి. రాచరికపు రోజుల్లో ఈ కోట గుమ్మాల్ని రాత్రుళ్ళు మూసేసి ఉదయం తెరిచేవారు. నిరంతరం సైనిక కాపలా ఉండేది.

ప్రస్తుతం ప్యాలెస్ వైపున్నతూర్పు గుమ్మాన్ని తప్ప మిగిలిన మూడు దిక్కులా గుమ్మాల్ని మూసే ఉంచుతున్నారు. ఈరోజు ఉత్తర దిక్కు కోటగుమ్మాన్ని కూడా పబ్లిక్ కోసం తెరిచారు. రెండు గుమ్మాలవద్దా సెక్యూరిటీ టైట్ చేశారు. ప్రతి ఒక్కరినీ చెక్ చేసిగాని లోపలికి వదలటంలేదు.

పురప్రముఖులు, వి.ఐ.పి.ల ప్రవేశంకోసం తూర్పు గుమ్మాన్ని కేటాయించారు. వారినే లోనకు వదులుతున్నారు.సాధారణ పౌరుల్ని ఉత్తర ద్వారంవైపు వెళ్ళమని అటు పంపించేస్తున్నారు. ఆ గుమ్మం అక్కడికి అరకిలోమీటరు దూరంలో ఉంది.

సెక్యూరిటీగార్డ్స్‌కి కార్తికేయ పరిచయస్థుడుగాబట్టి అతన్ని ఎవరూ ఆపే ప్రయత్నంచేయలేదు. లోనకు వదిలేశారు. ముందుగా ప్యాలెస్‌లోకెళ్ళి రాజావారికి కనబడి రావాలనుకున్నాడు కార్తికేయ.

కాని ఈ హడావుడిలో ప్యాలెస్‌లో ఆయన ఎక్కడున్నారో ఏమిటో తెలీదు. మనసుమార్చుకుని బైక్‌ని కుడిపక్కకు తిప్పి పార్కింగ్ ప్లేస్‌వైపు పోనిచ్చాడు.

విశాలమైన పార్కింగ్ ప్రాంతం అప్పటికే సగం వెహికిల్స్‌తో నిండిపోయింది. తన బైక్‌ని విడిగా ఒక సైడ్‌లో ఉంచి లాక్ చేసుకుని ప్యాలెస్ పక్కనుంచి పశ్చిమంగా ముందుకెళ్ళాడు.

వెహికిల్స్‌మీద వస్తున్నవాళ్ళు అటే వెళ్తున్నారు. కాస్త ముందుకెళ్ళి మలుపు తిరగ్గానే కన్పించాయి షామియానాలు.

అక్కడికి చేరుకుని ముందు వరుసలో ఒక చైర్ లాక్కుని కూచున్నాడు. ఓసారి చుట్టూ గమనించాడు. వంద గజాల దూరంలోనే తాంత్రికక్రతువుకి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బుల్లితెరకూ రెడీ

ఉన్నదాన్ని వదిలేసి బాలీవుడ్ వెళ్ళి బోల్తాపడ్డ ఇలియానా, తిరిగొచ్చి మళ్ళీ దక్షిణాదిలో 'కోటి'కి పడగలెత్తాలని చేసిన యత్నాలన్నీ వృథా అయిపోయాయి.హాటెస్ట్‌పోజులు ఎన్నిపెట్టినా నోయూజ్.

కొన్నాళ్ళు ప్రేమాయణంతో బిజీ. కాని, ఎన్నాళ్ళిలా? అనుకుందేమో-సీరియస్‌గా సినీ యత్నాలు ఆరంభించింది. ఇంకో ఓపెన్ ఆఫర్‌కూడా ఇచ్చేసింది. మంచి అవకాశాలు, పాత్రలు లభిస్తే వెండితెరపైనేకాదు, బుల్లితెరపైనా నటిస్తానంటున్నది.

బుల్లితెరపై గుర్తుండిపోయే అవకాశం వస్తే చేస్తానంటున్నది. ప్రస్తుతం అజయ్‌దేవగణ్‌తో ఓ సినిమా చేస్తోంది.తెలుగులో తొలి 'కోటి' తారకు ఎన్నికష్టాలు వచ్చాయో కదా!





ఓటువేసే హక్కు 18 ఏళ్ళకు ఇచ్చినప్పుడు ఎన్నికల్లో పోటీచేసేందుకు వయసు 18 ఏళ్ళకు తగ్గించాలి.

-ఆదిత్య ఠాక్రే, శివసేన నేత

అక్కడికి ఎదురుగా అయిదువందల గజాల దూరంలో బారికేడ్ల వెనక సాధారణ పౌరులు చేరి యువరాణి రాకకోసం ఎదురుచూస్తున్నారు.

వాళ్ళంతా ఉత్తర గుమ్మం మార్గంగా లోనకొచ్చిన వాళ్ళు. గుంపులు గుంపులుగా ఇంకా వస్తూనేవున్నారు. వాళ్ళకి వెనక ఎత్తయిన కోట కనబడుతోంది.

సుమారు వందమంది పోలీసులు ఆ ప్రాంతాన్ని కంట్రోల్‌చేస్తున్నారు. ఒకపక్క ప్యాలెస్‌కి చెందిన సెక్యూరిటీ సిబ్బంది మరోపక్క పోలీసులు ఈ కార్యక్రమం సక్రమంగా జరిగేందుకు చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు.

కోట బురుజులపైనుంచి భేరీనాదం నిర్విరామంగా విన్పిస్తూనే ఉంది. ఇక లాన్‌మీద ఓ పక్క తప్పెట్లు,కొమ్ముబూరలు, బాకాలు, భాజాలు మ్రోగుతున్నాయి. మరోప్రక్క మోకాళ్ళవరకు తోడాలు, పొడవాటి చేతికర్రల చివర మువ్వలు విచిత్ర వేషధారణతో తప్పెట గుళ్ళ బృందం రిథమిక్‌గా కదులుతూ చిందేసి ఉత్సాహపరుస్తోంది.

మరోపక్క అడవినుంచి వచ్చిన గిరిజన స్త్రీల బృందం ఒకటి సీతాకోక చిలుకల్లా అలంకరించుకుని తమ నృత్యగానాలతో అలరిస్తోంది. మరో చోట కొందరు నపుంసకస్త్రీల బృందం తప్పట్లు తాళాలతో వలయాకారంగా నర్తిస్తూ అలరిస్తున్నారు.

ఇలా అక్కడేదో గొప్ప ఉత్సవవేడుకలు జరుగుతున్నంత సందడిగాను కలర్‌ఫుల్‌గాను ఉంది.

తన దృష్టిని స్వామి సత్యానంద, ఆయన శిష్యులవైపు మళ్ళించాడు కార్తికేయ. నిజానికి ఇంతకుముందు సత్యానందస్వామితో పరిచయం లేదు. చూసిందికూడా లేదు. ఇప్పుడే చూస్తున్నాడు.

వాళ్ళంతా చాలా బిజీగా ఉన్నారక్కడ. అసలీ తాంత్రికక్రతువు తతంగం ఏమిటో అర్థంగావటం లేదు. యువరాణికి వైధవ్యయోగం ఎలా తప్పిస్తారనీ తెలీదు. అందుకే ఆసక్తిగా పరిశీలిస్తున్నాడు. స్వామీజీ శిష్యులు పనివాళ్ళు కలిసి అక్కడ మూడు చితులు పేరుస్తున్నారు. మధ్యలో ఉంచుతున్నది ఖరీదైన చందనపు కట్టెలు.

అదీ మధ్యలో స్థలం ఉంచి చుట్టూ కట్టెలు ఎత్తుగా పేర్చుతున్నారు. దానికి అటు పదడుగుల దూరంలో ఒకటీ, ఇటు పదడుగుల దూరంలో ఒకటీ ఇటు పదడుగుల దూరంలో మరొకటిగా రెండుచితులు పేరుస్తున్నారు. అవిమాత్రం సాధారణ కట్టెలు.

చందనపు చితికి ఎదురుగా ఒక పురోహితుడు కూర్చుని పెండ్లి జరిపించడానికి సామాగ్రి సిద్ధం చేస్తున్నాడు. స్వామి సత్యానంద దగ్గరుండి పురోహితుడికి సూచనలు సలహాలు చెప్తున్నాడు. ఒక పక్కగా కంబళిమీద డోలుసన్నాయి భజంత్రీమేళం కూచుని సిద్ధంగా ఉన్నారు.

ఈ తతంగం ఏమిటో అర్థంగాక ఓవంక, యువరాణివారిని దర్శించాలనే ఆత్రుత మరోవంక తొందరపెడుతూండగా ఆశ్చర్యసంభ్రమాలతో అంతా వీక్షిస్తున్నారు. అక్కడ ఏ కొద్దిమందికో తప్ప అసలు విషయం అందరికీ తెలీదాయె.

జరుగుతున్న ఏర్పాట్లన్నీ ఉదయం తొమ్మిది గంటలకు పూర్తయ్యాయి.

స్వామి సత్యానంద సైగతో ఆటపాటలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. కోటపైనుంచి భేరీనాదం తప్ప ఇంకేం శబ్దం విన్పించటంలేదు. అప్పుడు పురోహితుడు పెళ్ళితంతు ఆరంభించాడు.

స్వామి సత్యానంద ఒకచైర్‌లో అక్కడే కూచున్నాడు. ఆయన వెనకే చేతులు కట్టుకు నిలబడ్డారు శిష్యులు. డోలు సన్నాయితోకూడినభజంత్రీమేళం వాయించటం ఆరంభించారు.

కుతూహలంగావీక్షిస్తున్నారు అంతా. అక్కడవివాహం జరుగుతున్నట్టు అర్థమవుతోంది. కాని పెళ్ళికొడుకు ఎవరు పెళ్ళికుమార్తె ఎవరు ఎవరికీ అర్థంగావటంలేదు. ఇంతవరకు రాజావిష్ణుచంద్ర గజపతి మహదేవ్‌గాని, వారి తనయ యువరాణి మేఘనా సౌందర్యానంద సహనాదేవిగాని ప్యాలెస్‌వదిలి బయటికొచ్చినజాడలేదు. అంతలో-

"పెండ్లి కుమారుడ్ని తీసుకురండి" అంటూ అరిచాడు పురోహితుడు.

అప్పుడు... సరిగ్గా అప్పుడు... అందర్నీ ఆశ్చర్యచకితుల్నిచేస్తూ ఇద్దరు నౌకర్లు బలిసిన నల్లమేకపోతు ఒకదాన్ని అక్కడికి లాక్కొస్తూ కన్పించారు.

దాన్ని చక్కగా స్నానం చేయించి నుదుట పసుపు కుంకుమలు పూశారు. నాలుగు కాళ్ళకూ పసుపు పూశారు. నుదుట బాసికంకట్టారు. దాని కొమ్ములకు పట్టువస్త్రం చుట్టబడి పెండ్లి కుమారునిలాగే దాన్ని ముస్తాబుచేసి తీసుకొస్తున్నారు.

ఇదేం విడ్డూరం. లోకంలో ఎక్కడన్నా మేకలకు పెళ్ళిళ్ళు జరిపిస్తారా. ఆడమేకను పెళ్ళికూతురిగా అలంకరించి తెస్తారు కాబోలు. ఇది చూడ్డానికా తామంతా పనులు మాని ఇక్కడికి వచ్చింది.

రాజావారికి మతిపోయిందా.

ఇంతకూ యువరాణీ వారు ఇంతవరకు ప్యాలెస్ వదిలి రాకపోవడానికి కారణం ఏమిటి? పురజనులేకాదు ప్రముఖులుకూడా నివ్వెరపోయి వింత చూస్తున్నారు.

ఇంకా ఉంది



మనిషి లాగే రిక్షా ఎక్కటమంటే శ్రమ దోపిడని రామమనోహర్ లోహియా ఎన్నడూ రిక్షా ఎక్కలేదు.
-నితిన్ గడ్కరీ, కేంద్రమంత్రి

ప్రియా బెనర్జీ

పర్సనల్ ఎజెండా



కెనడియన్ సినీ నటి ప్రియాబెనర్జీ. బాలీవుడ్‌లోకి ప్రవేశించి తన సత్తా చాటుతున్నది. 'జబ్బా' వంటిసినిమాలో ఐశ్వర్యారాయ్ బచ్చన్,ఇర్ఫాన్‌ఖాన్‌ల సరసన నటించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నది.ఆమె ఇష్టాయిష్టాలు:

- **నేను ఇష్టపడేవి:** చాలా ఉన్నాయి.అయితే ఆహారం అన్నా, నా కుక్క, అబ్బి అన్నా మరీ ఇష్టం
- **నేను అసహ్యించుకునేవి:** అసహ్యం అనేది పెద్ద పదం.అయితే నాకు బద్ధకం అంటే ఇష్టంవుండదు
- **మూఢనమ్మకాలంటూ :** ఏవీ లేవు. నేను చాలా ప్రాక్టికల్‌గా వుండే వ్యక్తిని
- **నాకు బాగా నచ్చే విషయం :** ప్రతిరోజూ ఉదయాన్నే నా కుక్క నన్ను లేపడం
- **నాకున్న అతిపెద్ద భయం:** ఇష్టపడేవారిని కోల్పోతానేమోనని
- **నా బలం :** నా కుటుంబం
- **నా బలహీనత :** నా కుటుంబం, నా కుక్క
- **నాలోని సెక్స్ అప్పీల్:** నా కళ్ళు, నా పెదవులు, నా పర్సనాలిటీ
- **నా ఫాంటసీ :** వండర్ ఉమెన్ కావడం
- **నా హీరో :** మా నాన్న
- **నా స్పైస్ :** ప్రతి స్పైస్‌ను ఇష్టపడతా
- **నా ఫేవరెట్ బెడ్‌రూమ్ లైన్ :** నిద్రపోదామా
- **నాకున్న పెద్ద ఎసెట్ :** నా రిలేషన్‌షిప్
- **నా పాషన్ :** నా పని
- **నాకున్న గొప్ప అవసరం:** నా కుటుంబాన్ని సంతోషంగా ఆనందంగా ఉంచగలగడం
- **నా ఫేవరెట్ ఆస్తి:** నాలోని సెన్సాఫ్ హ్యూమర్
- **బాగా అలసట కలిగించేవి:** వాస్తవానికి ఏవీ లేవు. నేనెప్పుడూ ఎనర్జిటిక్‌గా వుంటుంటా
- **నన్ను ఎక్కువగా కదిలించేది:** ఏ కొంచెం ప్రేమ చూపినా ఆనందపడతాను
- **నా జన్మదినం :** ఏప్రిల్ 16.

ఎవడి పిచ్చి...

కామెడీ కథ



"ఈ రోజు గుమ్మడికాయ ముక్కలు తేలేదేం?" భర్తను అడిగింది వరలక్ష్మి సంచిలో నుంచి కూరల్ని తీస్తూ.

"ఈ నెలంతా గుమ్మడికాయ కూర తినకూడదట" చెప్పాడు వామనరావు.

"ఎవరు చెప్పారు" అడిగింది మళ్ళీ.

"నిన్న ఉదయం టీవీలో గ్రహబలాలు చెపుతున్నప్పుడు సిద్ధాంతి గారు చెప్పారు.. వినలేదా?"

తల కొట్టుకుంది వరలక్ష్మి. పిచ్చి బాగా ముదిరిందనుకుంది. వామనరావు వంటింట్లో నుంచి హాల్లోకొచ్చాడు. టీవీ పెట్టి అన్ని ఛానల్స్‌లో వచ్చే దినఫలాలు వినసాగాడు.

తన రాశివాళ్ళు ఆ రోజు వేసుకోవలసిన డ్రస్ రంగు, ఎవరితో ఎలా వుండాలో, ఏ దిక్కున ప్రయాణించాలో అన్నీ విన్నాడు. సాధ్యమైనంతవరకు ఆరోజు అలాగే ఉండాలని నిర్ణయించుకుని ఆఫీసుకెళ్ళడానికి తయారవ్వసాగాడు.

ఇక్కడ వామనరావు గురించి కొంత చెప్పాలి. అతను ఓ పెద్ద ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆఫీసులో అన్ని పనులు సక్రమంగా చేస్తాడు. ఎవరితోనూ మాటపడకుండా పనిచేస్తాడు. అతనికున్న పిచ్చివల్ల అప్పుడప్పుడు ఇబ్బందులు పడుతుంటాడు పాపం.

అతనికున్న పిచ్చల్లా టీవీలో రోజూ వచ్చే గ్రహబలాలను విని ఆ విధంగా ఉండటానికి ప్రయత్నించడం. దానివల్ల వరలక్ష్మికి ఇంట్లోనూ, బయటకూడా చాలా ఇబ్బందిగా ఉంటుంది.

అతని డ్రస్సింగ్ విషయంలో ఆమెకు మరింతగా అన్పిస్తుంది. గ్రహబలంలో చెప్పినట్లుగా బట్టలు వేసుకోవడం ఆమెకు నచ్చదు.

వాళ్ళు ఎరుపు రంగు మంచిదంటే, ఎర్ర ఫ్యాంటు, ఎర్ర షర్టు, పచ్చా- నీలం అంటే పచ్చఫ్యాంటు, నీలం రంగు షర్టు వేసుకుంటాడు. చూడ్డానికి ఎంత ఆడ్‌గా ఉంటాయో ఎంత చెప్పినా వినడు.

వాళ్ళు చెప్పే అన్ని రంగులకు తగ్గట్టు బట్టలు కొనుక్కుంటాడు. అతను వేసుకునే బట్టల్ని చూసి ఎంతమంది నవ్వుకున్నా అతను పట్టించుకోడు. ఆఫీసులో కూడా అందరికీ అలవాటైపోయింది. పెళ్ళయిన కొత్తలో బాగానే ఉండేవాడు కానీ తర్వాత్తర్వాత ఈ పిచ్చి పట్టుకుంది. అతనితో ఎక్కడికి వెళ్ళాలన్నా వరలక్ష్మికి చాలా ఇబ్బందిగా ఉంటుంది.అందుకే సినిమాలకు, బంధువుల ఇళ్ళలో జరిగే పెళ్ళిళ్ళు, పేరంటాలకు మానుకుంది.

ఎక్కడికి వెళ్ళినా ఆ రంగురంగుల డ్రస్‌లతో తయారవుతాడేమో సరస్వతికి తల కొట్టేసినట్లుగా ఉంటుంది. అందుకే అన్నింటికీ ఫుల్‌స్టాఫ్ పెట్టేసింది.

ఆఫీసుకు వెళ్ళడానికి వామనరావు త్వరత్వరగా తయారవుతున్నాడు. ఆ రోజు ఉదయం దినఫలాల్లో ఎరుపురంగు మంచిదని రెండు ఛానళ్ళు, నలుపు, నీలం మంచిదని ఒక ఛానల్, పచ్చరంగు మంచిదని మరో ఛానల్ చెప్పడంతో కాసేపు బుర్రగోక్కుని ఎలా అబ్బా అని కాసేపు ఆలోచించి అన్నిరంగులుండేట్లు డ్రస్ సెలెక్ట్ చేసుకున్నాడు.

ఎర్ర రంగు ఫ్యాంటు, అదే రంగు షర్టు (రెండు ఛానళ్ళు చెప్పాయి కదా) నల్లరంగు డ్రాయరు, నీలం రంగు బనియను, పచ్చరంగు కర్చీఫు తీసి వేసుకున్నాడు. పడమరవైపు ప్రయాణం మంచిదని చెప్పడంతో ఇంటి వెనుక నుంచి వర్జ్యం లేకుండా సుముహూర్తంలో ఆఫీసుకు బయలుదేరాడు.

సీట్లో కూర్చుని సీరియస్‌గా పని చేసుకుంటున్న సమయంలో ప్యూనొచ్చి ఆఫీసరుగారు పిలుస్తున్నారని చెప్పాడు.సీట్లోనుంచి ఆయన రూమ్‌లోకి అడుగుపెట్టాడు. వామనరావు వెళ్ళేసరికి ఆయన ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. మాట్లాడుతున్నంతసేపు ఆయన ముఖంలో రంగులు మారుతున్నాయి. మాట్లాడటం

కట్టా రాంబాబు

అయ్యాక వామనరావురావుని పైకి కిందకి చూశాడు. అలా చూస్తుంటే వామనరావుకి భయమేసింది.

"మీరు చేసే పనులవలన నేను మాట పడవలసి వస్తుందయ్యా" అన్నాడాయన కోపంగా.

"నేనేం చేశాను సార్" అన్నాడు బిత్తరపోతూ.

"నువ్వంటే నువ్వనే కాదు వామనరావ్, ఆఫీసు స్టాఫ్ అంతా. ఏ పనులు సక్రమంగా జరగడంలేదని పై నుంచి నాకు చివాట్లు.

మనం సబ్మిట్ చెయ్యాల్సిన ప్రాజెక్టు రిపోర్టు సమయానికి పంపలేదని నాకు అక్షింతలు పడ్డాయి. అయినా నువ్వుమాత్రం తక్కువ తిన్నావా ఏమిటి? నువ్వో రాజకీయ శక్తిగా తయారవ్వాలనుకుంటున్నావు, ఇంక పనులేం చేస్తావు చెప్పు"

గతుక్కుమన్నాడు వామనరావు "నేను రాజకీయ శక్తిగా తయారవ్వడమేమిటి సార్"

"నిన్ను చూస్తుంటే తెలియడంలేదా ఏమిటి... నెలలో పదిసార్లన్నా ఆ ఎర్రడ్రస్ వేసుకొస్తావు. ఎరుపు రంగు ఏ పార్టీవాళ్ళు వేసుకుంటారో అందరికీ తెల్సు. నీలో ఆ భావాలు మొదలైతే ఆఫీసులో రివల్యూషన్నొస్తుంది. అలాంటి వేషాలు వేస్తే నా దగ్గర కుదరదు తెలిసిందా" అంటూ చివాట్లేశాడు.

వామనరావుకి మతిపోయింది. తను వేసుకున్న డ్రస్‌కి రాజకీయ పార్టీకి లింకుపెట్టడమే అర్థంకాలేదు. వర్జ్యం లేకుండా మంచి ముహూర్తంలో బయలుదేరినా తనకీ చివాట్లేమిటో అర్థం కాలేదు.

మరోసారి కూడా అలాగే జరిగింది. ఆ రోజు ఆఫీసుకి పదినిముషాలు ఆలస్యంగానే బయలుదేరాడు వర్జ్యం వుందని. గ్రహబలం ప్రకారం నల్లరంగు డ్రస్ వేసుకున్నాడు. ముందురోజు శకునం బాలేదని సెలవు పెట్టేశాడు.

ఆఫీసుకి చేరుకునేసరికి ఆఫీసుముందు ఉద్యోగులంతా లోపలికి పోకుండా బయటే నిలబడి స్లోగన్స్ ఇస్తున్నారు. 'ఏం జరిగిందబ్బా' అనుకుంటూ వాళ్ళందరి దగ్గరకు నడిచాడు. అంతా నల్లరంగు బ్యాడ్జెస్‌ని షర్టులకు పెట్టుకుని 'ఆఫీసర్ డౌన్ డౌన్' అంటున్నారు. ఏం జరిగిందని ముందుకు వెళ్ళి యూనియన్ ప్రెసిడెంట్‌ని అడిగాడు.

"నిన్న మన ఆఫీసరు జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావుని సస్పెండ్‌చేశాడని దాన్ని ఉపసంహరించుకోవాలని నిరసన తెలియచేస్తున్నా"మని చెప్పాడు.

సరిగ్గా వామనరావు యూనియన్ ప్రెసిడెంటుతో మాట్లాడుతున్న సమయంలోనే ఆఫీసరుగారు తన రూములో నుంచి బయటికి వచ్చి వామనరావుని చూశాడు. వెంటనే లోపలికి వెళ్ళి వామనరావుని తన చాంబరుకు పిలిపించాడు. ఇంతమంది ఉండగా తననే ఎందుకు పిలిచాడబ్బా అనుకుంటూ భయం భయంగా లోపలికి అడుగుపెట్టాడు.

"నేనప్పుడే చెప్పాను కదా వామనరావ్ నీలో నాయకత్వ లక్షణాలొచ్చాయని. ఫర్వాలేదు నామీదే నువ్వు వ్యతిరేకంగా స్ట్రయిక్ చేయిస్తున్నావుగా"

'ఇదేంటి ఈయన ఇలా అంటున్నాడు. అసలేం జరిగిందో తనకు తెలియకే ప్రెసిడెంటును అడిగాడు. సుబ్బారావు ఏం చేశాడో, ఈయన ఎందుకు సస్పెండ్ చేశాడో తెలీదాయె! దాన్ని తనతో ముడిపెడుతున్నాడేమిటి?', "నాకేం తెలీదు సార్. ఇందులో నా ప్రమేయం ఏమీలేదు సార్" అన్నాడు.

"నా చెవిలో పూలుపెట్టకు వామనరావ్! నామీద నీకు ఎంత కోపంగా ఉందో ప్రత్యక్షంగా చూస్తూ వుంటే తెలియడం లేదా. అంతా నిరసన తెలియచేస్తూ నల్ల బ్యాడ్జెస్ పెట్టుకుంటే నువ్వు ఏకంగా నల్ల డ్రస్సే వేసుకువచ్చావు మరి.

నాయకుడు అన్నవాడు అలా ఉండాలిలే, లేకపోతే నీమాట వాళ్ళంతా వినరుకదా. సరే ఏం చేసుకుంటారో చేసుకోండి. నేను ఏం చేయాలో ఎవరికి చేయాలో అదే చేస్తాను. ఇంక నువ్వు వెళ్ళు..." అని తలవాచేలా చివాట్లు పెట్టాడు.

వామనరావు నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది. తను వేసుకున్న బట్టల వల్ల ఇంత అనర్థం జరుగుతుందని అతను కల్లోకూడా ఊహించలేదు. ఇప్పుడేం చేయాలబ్బా అనుకుంటూ ఆ రోజంతా మధనపడుతూనే ఆఫీసు జనంతోపాటు సమ్మెలో పాల్గొన్నాడు. ఇంటికొచ్చి జరిగిందంతా భార్యకు చెప్పాడు.

"నేను చెపితే విన్నారా ఆ పనికిమాలిన టీవీల్లో వచ్చే చెత్తంతా మీరు విని ఇలా తయారవ్వబట్టే కదా మీకీ తిప్పలు. నాకు తెలీకడుగుతాను.

మీ రాశివాళ్ళు కొన్ని లక్షలమంది ఉంటారు. అంతా మీలాగే తయారవుతున్నారా? టీవీలో చూసే అన్ని ప్రోగ్రాముల్లాగే వీటిని చూసి ఊరుకోవాలిగానీ వాళ్ళు చెప్పినట్లు తు.చ తప్పకుండా పాటిద్దామనుకుంటే ఇలాగే జరుగుతుంది. ఇప్పటికయినా బుద్ధి తెచ్చుకుని అందరిలాగే ఉండండి..." అని ఛడామడా తిట్టిందిగానీ వామనరావు ఆమె మాటలను పట్టించుకోలేదు.

ఆ మరునాడు ఆఫీసుకు వెళ్ళాడు. ఆ రోజు ఎర్రరంగు డ్రస్ వేసుకోవలసివచ్చింది. సమ్మె కొనసాగుతూంది.

కొంతమంది నిరాహారదీక్షలో కూర్చున్నారు. బలవంతం చేసి వామనరావుని కూడా కూర్చోపెట్టారు. ఎంత తప్పించుకుందామన్నా కుదరలేదు.

అప్పుడే ఆఫీసులో అడుగుపెడుతున్న ఆఫీసరు మెడలో దండ, నుదిటిమీద సిందూరం బొట్టుతో నిరాహారదీక్షలో కూర్చునివున్న వామనరావుని చూసి పళ్ళు నూరుకుంటూ లోపలికెళ్ళిపోయాడు.

వామనరావుకి భయం పట్టుకుంది ఆఫీసరు తనని పిలుస్తాడేమోనని. కానీ పిలవలేదు. హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నాడేగాని లోపల్లోపల భయంగానే ఉంది. ఆ తర్వాత రోజు కూడా సమ్మె కొనసాగింది. ఇద్దరూ దిగిరాలేదు.


ఆ రోజు మిగతావాళ్ళతోపాటు వామనరావునిరాహారదీక్షలో కూర్చోక తప్పలేదు. ఐతే ఆ రోజు జాతకరీత్యా నల్లడ్రస్ వేసుకోవలసివచ్చింది. అప్పుడు కూడా ఆఫీసరు కంట్లో పడ్డాడు. మొత్తంమీద మూడో రోజు పైవాళ్లు కల్గజేసుకోవడంతో సమ్మె విరమించారు.

ఒకటా, రెండా...?

ఉత్తరాది, దక్షిణాది చిత్రాలతో అలరించే అదితీ రావ్ హైదరీ చుట్టూ రూమర్ల అల్లిక చిక్కగా సాగుతున్నది. వీటిగురించి అడిగితే, 'విని నవ్వుకుంటూ వదిలేస్తా' అంటూ మరోమారు నవ్వేస్తుంది.

"ఒకటీ, రెండూ కాదు, అనేక రూమర్లు వచ్చాయి. నా ప్రేమ వ్యవహారం గురించి ఎన్నో కబుర్లు వినపడ్డాయి.ఒకరి పెళ్ళి చెడగొట్టానని, వేరొకరితో కలిసి తిరిగానని, ఇంకొకరితో కలిసివుండేందుకు ఇల్లు వెతికానని, మళ్ళీ మాజీ ప్రియుడిదగ్గరకు వెళ్ళానని ఒకే నెలలో ఇన్నిరకాల పుకార్లు చుట్టుముట్టాయి.

అన్నీ విని నవ్వుకున్నాను మినహా ఏదీ చెయ్యలేదు. ఇంకా చెప్పాలంటే సదరు రూమర్ల నెలలో అసలు నేను ముంబయిలోనే లేను" అంటూ తేల్చేసింది.





పెట్టుబడులపై ప్రజల నమ్మకం సడలకూడదంటే సంస్థలోని ఉద్యోగులు తమ జీతాలు తగ్గించుకోవాలి.

-నారాయణమూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండర్

హమ్మయ్య అనుకుంటూ వామనరావు ఆఫీసుకు బయలుదేరాడు. ఆ రోజు గ్రహరీత్యా పసుపురంగు షర్టు, అదే రంగు ప్యాంటుతో రాహుకాలం, యమ గండం లేకుండా ఆఫీసులోకి అడుగుపెట్టాడు.

సమ్మె ముగిసింది కాబట్టి ఇంక ఆఫీసరుతో ఏమీ గొడవుండదు తన పనేదో తను చేసుకోవచ్చని వామనరావు అనుకున్నాడు. కానీ సరిగ్గా పన్నెండు గంటల సమయంలో ఆఫీసరు నుంచి పిలుపొచ్చింది. 'ఏం జరుగుతుందో భగవంతుడా' అనుకుంటూ ఆఫీసరు రూములోకి అడుగుపెట్టాడు.

"ఏమోయ్ వామనరావ్ బాగున్నావా? మొత్తం మీద సమ్మెను విజయవంతం చేయించావు కదా, అనుకున్నది సాధించావు"

"నేనేం సాధించాను సార్. నాకీ విషయంతో ఎటువంటి సంబంధంలేదు సార్. నలుగురితోపాటు నేను పాల్గొన్నానేకానీ నాకే పాపం తెలీదు సార్"

"చూడు వామనరావ్! సమ్మె వెనకాల ఎవరి హస్తం వుందో నేను వూహించలేనంటావా అంత వెధవలా కన్పిస్తున్నానా నీకు.

నేను అన్నీ గమనిస్తూనే వచ్చాను. సమ్మెకు నాయకత్వం వహిస్తూ ఎర్ర డ్రస్‌లు, నిరసనలు తెలియజేస్తూ నల్లడ్రస్‌లు వేసుకువచ్చి సమ్మెను బాగానే ఆర్గనైజ్ చేశావు కదా... వీడు ఏం చేస్తాడులే అనుకుంటున్నావు కదూ నా గురించి.

నేను ఏం చేయగలనో నీకు త్వరలోనే తెలుస్తుందిలే... అన్నట్టు పార్టీ మారినట్లున్నావు కదూ"

"నేను పార్టీ మారటమేమిటి సార్. నాకు ఏ పార్టీతోనూ సంబంధం లేదు" బిత్తరపోతూ అన్నాడు.

"నేనేం అమాయకుణ్ణి కాదు వామనరావ్ నువ్వు చెబితే నమ్మడానికి. నువ్వు వేసుకునే డ్రస్‌ను చూస్తే తెలీడంలేదూ నువ్వు అధికార పార్టీలోకి మారావని. అలా మారితే నేనేం చేయలేననేకదా నీ నమ్మకం.

నువ్వు అందరితో చెబుతున్నావట... లోకల్ ఎమ్మెల్యే నీకు ఫ్రెండ్ అని, హోమ్‌మినిస్టర్ తెల్సని. అంటే వాళ్ళు నీకు తెలిస్తే నేను భయపడిపోవాలా? ఆ పప్పులేం ఉడకవు నాదగ్గర. ఛీఫ్ మినిష్టరు చెప్పినా నేను వినను తెల్సిందా" అంటూ ఛీంకరించాడాయన.

అప్పుడు తను వేసుకున్న పసుపురంగు డ్రస్‌ని చూసుకున్నాడు. ఒక్కసారిగా దిమ్మతిరిగింది.



ఈ డ్రస్‌లన్నీ తనకొంప ముంచాయికదా అనుకున్నాడు. ఆఫీసరు కాళ్ళమీద పడినంత పనిచేశాడు. "సార్ నేను వేసుకున్న డ్రస్‌లకు, సమ్మెకు ఎటువంటి సంబంధం లేదు సార్.

నాకు గ్రహబలాల పిచ్చి ఉంది సార్. అందులో ఏ రోజు ఏ రంగు మంచిదో చెపితే ఆ రంగు డ్రస్ వేసుకుంటానంతే. నాకే ఎమ్మెల్యే, హోమ్ మినిష్టరు తెలియదు సార్. కనీసం వాళ్ళను ఎప్పుడూ కూడా చూడలేదు. నన్ను క్షమించి ఈసారికి వదిలెయ్యండి సార్" అంటూ వేడుకున్నాడు వామనరావ్.

వామనరావు చెప్పిందేమీ ఆయన నమ్మలేదు. ఆయన చెప్పినట్లుగానే మరో మూడురోజుల తర్వాత వామనరావుకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది.

సిటీలో వున్న ఈ ఆఫీస్‌కి బ్రాంచి ఓ పల్లెటూరులో ఉంటే దానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. వరలక్ష్మి వామనరావుని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. మరోగత్యంతరం లేక ఇక్కడ రిలీవయ్యి అక్కడ జాయినయ్యాడు. అయినా వామనరావులో మార్పు రాలేదు.

అదే గ్రహబలాలు, వర్జ్యాలు, రాహుకాలాలు, యమగండాలను ఫాలో అవుతూ ఉద్యోగం చేసుకుంటూ అప్పుడప్పుడు ఇబ్బందులు పడుతుంటాడు. పల్లెటూళ్ళో అతని వేషధారణ చూసి సర్కస్‌లో బఫూన్ అని, దసరా వేషగాడు అని పేరుపెట్టినా అతను ఏం పట్టించుకోడు.

ఎవడి పిచ్చి వాడికానందం అన్నట్టు వామన్రావు అలా అలా బతికేస్తున్నాడు. వామనరావులాంటివాళ్ళలో మార్పు ఎప్పుడు వస్తుందో, అసలు వస్తుందో రాదో కాలమే చెప్పాలి మరి.

దర్శకత్వానికి 'నో'

'చాలామంది బాలీవుడ్ తారలమాదిరి చిత్ర నిర్మాణం చేస్తారా?' అని సోకులాడి సోనాక్షిసిన్హాను అడిగితే, స్క్రిప్టు నచ్చాలి కదా అంటూ సూటిగా, స్పష్టంగా సమాధానం ఇచ్చింది.

"స్క్రిప్టు బావుంటే సినిమా నిర్మించడం ఇష్టమే కాని, అదెప్పుడు జరుగుతుందో చెప్పడం కష్టం. ఇక, దర్శకత్వం విషయానికి వస్తే అది చాలా కష్టమైన పని. అన్ని విభాగాలపైనా పట్టు సాధించగల నైపుణ్యాలు నాలో లేవు. కాబట్టి దర్శకత్వం ఆలోచనే లేదు. వెబ్ సిరీస్‌లో నటించాలన్న ఆసక్తి వుంది. ఎగ్జయిటింగ్ ఆఫర్ వస్తే నటిస్తా" అని చెప్పింది.

చిలిపి



కాదు అని తెలిసినా జనం కాసేపు నమ్మేది?
సినీనటులు తామే పాడుతున్నట్లు నోరు ఆడించటం.

అక్బరు కాలంలో తాజ్‌మహల్‌పై వర్షం కురిసేది కాదుట. ఎందుచేత?
అప్పటికింకా తాజ్‌మహల్ కట్టబడలేదుకాబట్టి.

మగవారు మందుకి బానిసలైతే మరి ఆడవాళ్ళు?
స్టీలుసామాన్లకు.

మహిళలకు మరో ప్రాణం.
నవల.

'భార్య' అంటే ఎవరు?
లైసెన్స్ గల జేబుదొంగ.

'మా తాతలు నేతులు తాగారు. మా మూతులు వాసన చూడండి' ఈ సామెత విన్నారా?
ఆ! మా ఊరి బోరింగ్ పైపులు చూస్తే ఈ సామెత గుర్తుకొస్తుంది.

'తాడూర సందులేదు మెడకో డోలు' అని ఎవరిని అనొచ్చు?
పెళ్ళి చేసుకున్న నిరుద్యోగిని.





ఇచ్చేశా నా హృదయం తీసుకో

ఈతరం మనిషి

ప. అ. ఇచ్చేశా నా హృదయం తీసుకో
ఎదలోపల పదిలంగా దాచుకో
అద్దంలా చూసుకో
ముద్దల్లే వాడుకో ఆ. ॥ఇచ్చేశా॥

చ.అ. చిగురువంటి చినదానికి చెంపలే సొంపులు
ఆ. చిలిపి కళ్ళ చినవాడితో చెలిమిలోనే ఇంపులు
అ. చేసుకొనే బాసలు చెరిగిపోని రాతలు
ఆ. చేసుకొనే బాసలు చెరిగిపోని రాతలు
ఆ. చెప్పలేని ఊహలు
చేయబోవు చేతలు ॥ఇచ్చేశా॥

చ.అ. మన మధ్యన గాలికూడ వుండనే వుండదు
ఆ. మనమంటే కాలమైన పరుగిడనే పరుగిడదు
అ. నువ్వు నా ఊపిరి
ఆ. నేను నీ లాహిరి ॥2॥

అ. ఇద్దరమూ చూద్దాము ఆనంద హిమగిరి
ప.అ. ఇచ్చేశా నా హృదయం తీసుకో
ఎదలోపల పదిలంగా దాచుకో
అద్దంలా చూసుకో
ముద్దల్లే వాడుకో

సంగీతం చక్రవర్తి గానం బాలు, సుశీల



నువ్వు నేను ఏకమైనాము

కొడుకు కోడలు

ప. అ. నువ్వు నేను ఏకమైనాము-నువ్వు నేను ఏకమైనాము
ఇద్దరమూ, మనమిద్దరము ఒక లోకమైనాము
ఇ. లోకమంతా ఏకమైనా వేరుకాలేము
వేరుకాబోము-వేరు కాబోము వేరు కాబోము
ఆ. వేరు కాలేరా...? నా పేరు విన్నారా?

చ. ఎవరు నువ్వు?-ఎవరు నువ్వు?
మనుషులు చేసిన సంఘం నేను
మతాన్ని నేను... కులాన్ని నేను ధనాన్ని నేను
అనార్కలిని అహుతిగొన్నాము
మజ్నూ ప్రేమను మసిచేశాము-అ. ప్రియా-ప్రియా
ఈ నీడలను, పీడలను జయించి వస్తాను
నీకోసం మరలివస్తాను-నీకోసం బ్రతికివుంటాను
ప్రాణం నిలుపుకుంటాను

చ. వెడలిపోయే వసంతమా-వెదకి ప్రియునికి చెప్పుమా
ఎండకాలం ముందు వున్నది-మండిపోతూ మనసున్నది ॥2॥
నల్లని నల్లని మబ్బులారా-నా కళ్ళకు తోబుట్టువులారా
గుండె పగిలి కురిసినారా-గొల్లునా కన్నీటిధారా
ఆకులు రాలినవి-ఆశలు కూలినవి
అలసిపోనీ కన్నులుమాత్రం-అగని రాకకై వేచినవి
మనసిచ్చిన నేనే నిన్ను-మరచి విడిచిపోతున్నాను
ప్రేమకన్న త్యాగం మిన్న-అది మిగిలిపోనీ-నా జీవితాన
నన్నూ రగిలిపోనీ-నీ ప్రేమలోన

సంగీతం కె.వి.మహదేవన్ గానం సుశీల, ఎల్.ఆర్.ఈశ్వరి

వారఫలం

జనవరి 4 నుండి 10, 2018 వరకు

పిడపర్తి వీరేశ్వరశాస్త్రి, పిడపర్తి భాస్కర సుబ్రహ్మణ్యశాస్త్రి
సెల్ : 9492156064



మేషం: అశ్విని, భరణి, కృత్తిక 1వ పా. మీ ఊహలను నెరవేర్చుకొనేందుకు ప్రయత్నాలు అవసరం. ఆరోగ్యం, ఆర్థికం అనుకూలం. చేతిదాకా వచ్చినట్లుంటాయి కాని కొన్ని అవకాశాలు దోబూచులాడగలవు. వ్యక్తిగతమైన విమర్శలకు దూరంగా ఉంటూ ప్రయత్నాలు లౌక్యంతో సాగించాలి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు పరవాలేని విధంగా సాగుతాయి. అదనపు లోన్స్‌కు దూరంగా ఉండుట ఉపకరించగలదు. విద్యార్థులకు వ్యాసంగాలలో సంతృప్తి ఉండగలదు. ఆది, సోమ, బుధవారాలు అనువైనవి.



వృషభం: కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.మానసిక,ఆర్థికపరమైన ఒత్తిడులకు గురైనా ఆత్మీయులతో ఉత్సాహపూరితంగా వ్యవహరించుకోగలరు. శుభసంకల్పములతో వ్యవహరించుకుంటారు.ఇతరులనుండి మెప్పుదలలకై యత్నాలుంటాయి.శ్రమలకు తగిన ప్రయోజనాలు పొందలేకపోతారు. గొప్ప కార్యాలకు ప్రయత్నాలు సాగుతాయి. ఊహలతో ప్రయాణాలు సాగుతాయి. విద్యార్థులు ఏకాగ్రతలతో సాగాలి. ప్రైవేట్‌రంగాలలో పనిచేసేవారు ఓర్పుతో వ్యవహరించుకోవాలి. ఈ రాశివారు గురు, బుధ వారాలందు ముఖ్యమైన పనులను చేపట్టుకోవాలి.



మిథునం: మృగశిర 3, 4పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా. మీదైన తరహాలో వ్యవహరించుకుంటారు. కొన్ని అనుకూలతలు దైవికంగా ఏర్పడతాయి. ఆనందమును, హుషారును పొందగలరు. వృత్తి, ఉద్యోగాలందు ఆశించిన ప్రయోజనాలు పొందుతారు. గతంలో వాయిదా పడినవాటిని పూర్తిచేసుకోగలరు. పలుకుబడిగల వ్యక్తుల పరిచయాలు సిద్ధిస్తాయి. ఆర్థిక అవసరాలకు ముందుచూపు అవసరం. పనులను సకాలంలో పూర్తిచేసుకోగలరు. విజయాలు వరిస్తాయి. శుక్ర, శని, ఆదివారాలు అనువైనవి.



కర్కాటకం: పునర్వసు 4వ పా, పుష్యమి, ఆశ్లేష. ఈ వారంలో అస్థిరమైన నిర్ణయాలు, అనవసర ప్రసంగాలు కొన్ని ఇబ్బందులను ఏర్పరచగలవు. మీ అంతట మీరుగా అపవాదాలను ఏర్పరచుకుంటారు.కుటుంబవ్యక్తుల సహాయాలను,సూచనలను అర్థంచేసుకోలేక ఇబ్బందులను ఏర్పరచుకొనే సూచనలున్నాయి. ఆర్థికంగా సంతృప్తికరమైన స్థితులు ఉంటాయి. మీ పనులపట్ల ఏకాగ్రతలు చూపాలి. ఇతరులను వ్యంగ్య వ్యాఖ్యానం చేయక లౌక్యములతో సాగాలి.విద్యార్థులు టార్గెట్ విధానాలు చూపాలి. ఈ రాశివారికి గురు, ఆది, సోమవారాలు అనువైనవి.



సింహం: మఘ, పూర్వఫల్గుని,ఉత్తరఫల్గుని 1వ పా. పట్టుదలలతో పనిచేయాలి. మానసికంగా ఒత్తిడులకు గురి అవుతారు.ఖర్చులున్నా ఆదాయాలలో సంతృప్తికరమైన స్థితులుంటాయి. కొత్త బాధ్యతలను స్వీకరించుట-కొత్త పనులను చేపట్టుట వంటివి ఉంటాయి. స్పష్టమైన నిర్ణయాలచే మీకున్న గుర్తింపును పెంచుకోగలరు. అధికారులు వంటివారితో తెలివిగా వ్యవహరించుకోవాలి. సంతానపు వ్యక్తిగత విషయాలచే సంతృప్తిని పొందుతారు. ఆధ్యాత్మికత కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యతనీయగలరు. మిత్రులచే మేలు పొందగలరు. శుక్ర, శని, బుధ వారాలు అనువైనవి.



కన్య: ఉత్తరఫల్గుని 2, 3, 4పా, హస్త, చిత్త 1, 2పా.మీ నిత్యకృత్యములను సకాలంలో నిర్వహించుకోగలరు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలందు మిశ్రమ ఫలితాలుంటాయి. మీ ఊహలు నిజం చేసుకొనేందుకు పట్టుదలలతో సాగవలసి ఉంటుంది. ఆదాయం, ఖర్చు రెండూ సమపాళ్ళలో ఉండగలవు. ఆరోగ్యమునకై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవలసి రావచ్చును. పూర్వార్జితాలనుండి ఆదాయాలు, ఇన్స్యూరెన్స్‌లచే ప్రయోజనాలు వంటివి చేతి కందగలవు. విద్యార్థులు, నిరుద్యోగులు పట్టుదలలతో సాగాలి. ఈ రాశివారు ముఖ్యమైన పనులను చేపట్టుటకు గురు, ఆది, సోమవారాలు అనువైనవి.



తుల: చిత్త 3, 4పా, స్వాతి, విశాఖ 1, 2, 3పా.ముఖ్యం అనుకున్న పనులను చేపట్టి పూర్తిచేసుకొనేందుకు అనువైన సమయం. మంచి చేసినా చెడే అన్నట్లు కొన్ని పరిస్థితులు వికటించగలవు-మెలకువలు అవసరం. మిత్రుల ప్రభావాలుంటాయి. కొన్ని సంఘటనలు ఆత్మవిశ్వాసమును పెంచుతాయి. ఆరోగ్యమనుకూలం. భవిష్య నిర్ణయాలు కొన్ని తీసుకోగలరు. బంధువుల ప్రేమాభిమానాలు పెరుగుతాయి. కొందరిచే ప్రశంసలు పొందగల్గుతారు. గురు, శుక్ర, శని, బుధ వారాలు అనువైనవి.



వృశ్చికం: విశాఖ 4వ పా, అనూరాధ, జ్యేష్ఠ. ఒత్తిడులు, ఆటంకాలు ఎదురైనా కార్యసాఫల్యములు ఏర్పరచుకోగలరు. కొన్ని అంశాలలో పరిష్కారాలు పొందగలరు. కొన్నిట మిశ్రమఫలితాలు పొందగలరు. ఆర్థికంగా ఎదురయ్యే ఒడిదుడుకులకు ముందు జాగ్రత్తలు అవసరం. కాలానుగుణంగా వ్యవహరించుకొనేందుకు ప్రయత్నాలు అవసరం. స్థిరాస్తుల వ్యవహారాలకు, దీర్ఘకాలిక పెట్టుబడులకు దూరంగా ఉండాలి. కుటుంబవ్యక్తులచే ఆహ్లాదకర వాతావరణాలుంటాయి. శుక్ర, శని, ఆది, సోమవారాలు అనువైనవి.



ధనుస్సు: మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పా. కోరుకున్నవి ఊరించగలవు. సహాయ, సహకారాలు కొన్ని తగ్గే సూచనలున్నాయి.ఏకాగ్రతలతో వ్యవహరించుకునేవారికి అనుకూలతలుంటాయి. వ్యయాలకు-తగిన ప్రయోజనాలు పొందలేకపోతారు. బంధుమిత్రుల సలహాలకు, మౌనంగా సాగుటకు ప్రాధాన్యతనీయండి. న్యాయపరంగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను పొందగలరు. వాహనప్రాప్తి ఉండగలదు. నవగ్రహ శ్లోకాలను పఠించాలి. వీరు ఆది, సోమ, బుధవారాలు అనువైనవి.



మకరం: ఉత్తరాషాఢ 2, 3, 4పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.ఏకాగ్రతతో వ్యవహరించుకోవాలి. అకారణ కలహ సూచితములున్నాయి. అతిగా ఊహించుకొనుటచే కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి రావచ్చును. కుటుంబసభ్యుల పాత్రచే అపవాదాలను ఎదుర్కొంటారు. ఆవేశకావేశాలకు దూరంగా ఉంటూ ఆలోచనలకు ప్రాధాన్యతనీయాలి. ప్రశాంతతలకు ఆధ్యాత్మికంగా వ్యవహరించుకుంటారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలకు అంతగా ప్రాధాన్యతనీయలేకపోతారు. విద్యార్థులు మరింత పట్టుదలలు చూపుకోవాలి. శుక్ర, శని వారాలలో అన్నిటా జాగ్రత్తలు పాటించుకోవాలి.



కుంభం: ధనిష్ఠ 3, 4పా, శతతార, పూర్వాభాద్ర 1, 2, 3పా. శుభఫలితాలు ఏర్పడతాయి. మనోధైర్యాలు చూపి యత్నించుకోగల్గుతారు. అవసరాలకు కావలసిన సదుపాయాలు, ధనం అందగలవు. లక్ష్యసాధనలో కుటుంబవ్యక్తుల సహకారాలు పొందగలరు. ఆప్తుల సంఖ్యను పెంచుకోగలరు. భవిష్యత్ అవసరాలకు తగిన బాట వేయగల్గుతారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో ఇతోధిక అనుకూలతలు, కలిసివచ్చుట వంటివి ఉంటాయి. ఈ రాశివారు ముఖ్యమైన పనులు చేపట్టుటకు ఆది, సోమ, మంగళవారాలు అనువైనవి. అన్నిటా మెలకువలు పాటించుకోవాలి.



మీనం: పూర్వాభాద్ర 4వ పా, ఉత్తరాభాద్ర, రేవతి. గతంకంటే మంచిని పొందగలరు. సమయానుకూలంగా మీ పనులలో మార్పుచేర్పులు చేయగల్గుతారు. మంచి సంకల్పం విజయబాట అవ్వగలదు. ఇతరులనుండి రావలసినవి పొందుటయే కాక చెల్లింపులనుపూర్తిచేసుకోగల్గుతారు. కొన్నిటిని వాయిదా వేసుకొనుట, కొన్నిటిని పూర్తిచేసుకొనుట వంటివి ఉంటాయి. ఆలోచనలను- ముఖ్యులతో సంప్రదించి అమలులో పెట్టుకోవాలి. కార్యాచరణలలో తడబాటు రానీయక పట్టుదలలతో సాగాలి. ఈ రాశివారికి శుక్ర, శని, ఆది, సోమవారాలు అనువైనవి.



Courtesy : STAYFIT

క్వీన్ ఫ్రూట్

చాలా రకాల పండ్లగురించి, వాటి లాభనష్టాల గురించి తరచూ మాట్లాడుకుంటుంటారుకాని, ద్రాక్షపండ్లలోని అనుకూల, ప్రతికూల విషయాల గురించిన చర్చ తక్కువ. నిజానికి వీటిని 'క్వీన్ ఆఫ్ ఫ్రూట్స్'గా పేర్కొనాలి.

అందుబాటులో వుంచుకోవడానికి, సులువుగా తినడానికి అనువుగావుంటాయి. తీపి,పులుపు కలగలిపిన ద్రాక్షపండ్లు భోజనాల నడుమ తినడానికి సరైనవి. పండ్లు, కూరగాయల సలాడ్లు రెండింటిలో కలుపుకోవచ్చు. గుండె జబ్బులనుంచి క్యాన్సర్‌దాకా పరిరక్షించగల గుణాలు వీటిలో వుంటాయి.

చిన్నగా, మృదువుగావుండే ద్రాక్షలో చాలా రకాలుంటాయి. గింజలున్నవి, లేనివి కూడా ఉంటాయి. తినేవాటిని టేబుల్ గ్రేప్స్ అని, వైన్ తయారీకి ఉపయోగించేవాటిని వైన్ గ్రేప్స్ అని పేర్కొంటారు.

ఎండబెట్టేవాటికి వాడేవాటిని 'రైజన్ గ్రేప్స్' అంటారు. విభిన్నరకాల ద్రాక్షల్లో రంగు, సైజు, రుచి మారుతుంటాయి.

ఆకుపచ్చ, నలుపురంగులతోపాటు ఎరుపు, బ్లూ-బ్లాక్, పర్పుల్ రంగుల్లోనూ వుంటాయి. ద్రాక్షలో 65 నుంచి 85 శాతం నీరు, 10 నుంచి 33 శాతం గ్లూకోజ్,ఫ్రక్టోస్ (చక్కెర) ఉంటాయి.

ఎ, సి, బి6 ఫోలేట్‌లకు మంచి ఆధారం. పొటాషియం, క్యాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, మెగ్నీషియం, సెలీనియం వంటి అత్యవసర ఖనిజాలుంటాయి. ద్రాక్షను ఏ రూపంలో తీసుకున్నా ఆరోగ్యపరమైన ప్రయోజనాలు దక్కుతాయి.

- ద్రాక్షపండ్లు ఆస్తమా నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఊపిరితిత్తుల్లో ఉండే తేమను పెంచుతాయి.శారీరకవ్యవస్థకు డిటాక్సిఫైచేసి, క్లెన్స్ చేయడంద్వారా బరువు తగ్గడానికి ఉపకరిస్తాయి.
- ద్రాక్షపండ్లు ప్లేట్‌లెట్స్ తగ్గకుండా పరిరక్షిస్తాయి. హానికర బ్లడ్‌క్లాట్స్‌ను అడ్డుకుంటాయి.
- కొన్ని రకాల వైరస్‌లపై దృఢమైన యాంటీవైరల్ గుణాలు కలిగి పోరాడడంలో ద్రాక్ష ఎంతగానో సాయపడుతుంది.
- ద్రాక్షగింజల్లో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్స్ లభిస్తాయి. ఫ్రీర్యాడికల్స్‌ను నియంత్రించడం ద్వారా ముందస్తు వార్ధక్యాన్ని, ఇతర రుగ్మతలను అడ్డుకుంటాయి.
- మలబద్ధకాన్ని అధిగమించడంలో తిరుగులేనివి. పేగులు,ఉదరాన్ని టోన్‌చేయడంద్వారా దీర్ఘకాలిక మలబద్ధకంనుంచి రక్షిస్తాయి.
- వయస్సురీత్యా వచ్చే దృష్టిసమస్యలు, కండరాల డీజనరేషన్‌నుంచి కాపాడే గుణాలు ద్రాక్షలో ఎక్కువగా లభిస్తాయి.
- వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్‌వల్ల రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన శక్తిని ఇస్తాయి.
- కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. అజీర్ణం నుంచి, ఉదరంలోని ఇరిటేషన్‌నుంచి కాపాడతాయి.
- ద్రాక్షతో తయారయ్యే వైన్ హైపర్‌టెన్షన్‌తో ఇబ్బందిపడేవారికి ఉపశమనం ఇస్తుంది.
- ద్రాక్షరసాన్ని 'దేవతల అమృతం'గా పేర్కొంటారు. గౌట్, రుమటాయిజం, చర్మ, లివర్ ఇబ్బందులుగలవారికి మేలుచేస్తుంది.
- ద్రాక్ష, ద్రాక్షరసం రెండూ కూడా క్యాన్సర్ కణాల ఎదుగుదలను నెమ్మదింపజేసి లింఫ్, లివర్, ఉదరం, బ్రెస్ట్ సెల్స్‌లో ట్యూమర్లు ఏర్పడడాన్ని అడ్డుకుంటాయి.
- మైగ్రేషన్‌ను నివారించడంలో బాగా పండిన ద్రాక్షతో తయారుచేసిన రసం మంచి గృహచికిత్స. ఉదయాన్నే, అదనంగా నీరు కలపకుండా ద్రాక్షరసాన్ని తీసుకోవడం మంచిది.





డా॥జి. సమరం

Feel confident and give you a better time in bed

ex సైకాలజీ

ఎ.కె. రాజమండ్రి

మాకు పెళ్ళిఅయ్యి 5 సంవత్సరాలైంది. పెళ్ళి అయిన మొదట్లో నాకు సెక్స్ ఎడల చాలా ఇంట్రెస్టు ఉండేది. మా ఆయన ఇంట్రెస్టు చూపించకపోయినప్పటికీ ఆయన్ని ఫోర్స్‌చేసి సెక్స్‌లో పాల్గొనేటట్లు చేసేదాన్ని. మా ఆయన ఒక విధమైన శాడిస్టు.

ఆ విషయం పెళ్ళిఅయినకొద్ది నెలలకే తెలిసిపోయింది. అయినదానికీ, కానిదానికీ ఊరికే కించపరుస్తూ మాట్లాడటం, తిట్టడం, పశువుకంటే హీనంగా చూడటం చేస్తారు. కాని నాకు ఆరోగ్యం బాగుండకపోయినా తన ఇష్టం తీర్చుకుంటాడు. మొదట్లో నాకు సెక్స్ ఎంత ఇంట్రెస్టు ఉండేదో ఇప్పుడు అంతలేకుండాపోయింది. ఎందువల్ల?

శృంగారం విషయంలో భర్త ప్రవర్తన పరిగణనలోకి వస్తుంది. భర్త మాటిమాటికీ తిడుతున్నా, కించపరుస్తున్నా, హీనంగా చూస్తున్నా, మనస్సు విరిగిపోతుంది.

అటువంటి మనిషితో శృంగారంలో పాల్గొనాలనిపించదు. మీ విషయంలో అదే జరిగింది. అందువల్లే మొదట్లో మీకు సెక్స్‌ఎడల ఎంత ఇంట్రెస్టు ఉన్నప్పటికీ ఆయన ప్రవర్తన వల్ల సెక్స్ అంటేనే అసహ్యం ఏర్పడింది. దంపతులిద్దరూ ప్రేమగా ఉంటే శృంగారం వాళ్ళిద్దరిమధ్య చక్కగా పరిమళిస్తుంది.

బి.ఎమ్. భీమవరం

నా వయస్సు 22 సంవత్సరాలు. పెళ్ళిసంబంధాలు చూస్తున్నారు. నాకు సెక్స్ మీద అవగాహన లేదు. ఫ్రెండ్స్‌ని అడిగితే బ్లూ ఫిల్మ్

చూడమన్నారు. బ్లూ ఫిల్మ్ చూడటం వలన ప్రయోజనం ఉంటుందా? సలహా ఇవ్వండి.

బ్లూఫిల్మ్ చూడటం వలన ప్రయోజనం ఉండదు సరికదా లేనిపోని అపోహలు కలుగుతాయి. ఎటువంటి భయంలేకుండా పెళ్ళి చేసుకోండి. ఏమైనా సమస్యలు వస్తే పెద్దవాళ్ళని సంప్రదించండి. వాళ్ళు మీకు తగిన సలహా ఇస్తారు.

సి.ఎస్. కరీంనగర్

నాకు పెళ్ళిఅయింది. భార్యతో బాగానేఉంటాను గాని మరదలు అంటే మోజు ఉంది. మరదలికి కూడా నేనంటే ఇష్టమే. మరదలికి ఇంకా పెళ్ళికాలేదు. అయినా ఇద్దరం సెక్స్‌లో పాల్గొంటున్నాము. సెక్స్‌లో పాల్గొన్నప్పుడు మరదలు నొప్పిగా ఉందని అరుస్తుంది. నొప్పిగా ఉందికదా, సెక్స్ వద్దంటే ఒప్పుకోదు. పైగా యోనిలో బాధకి నేనే కారణం అంటుంది. అయినా సెక్స్ కావాలంటుంది. మరి మా ఆవిడకి ఏ బాధా లేదు. నా మరదలికే ఎందుకీ బాధ?

మీ మరదలికి మీ మీద మనస్సు ఉంది. సెక్స్ కావాలనే కోరికా ఉంది. కాని తనకి ఇంకా పెళ్ళి కాలేదు కనుక కడుపు వస్తుందేమోనన్న భయం అంతర్లీనంగా ఉంది. దానివల్ల తనకి తెలియకుండానే యోని దగ్గర బిగపట్టేస్తోంది.

సెక్స్ కోరిక, కడుపు వస్తుందనే భయం రెండూ ఉండటంతో ఈ రకంగా జరుగుతోంది. సెక్స్‌లో పాల్గొన్నప్పుడు యోనిదగ్గర కండరాలని తెలియకుండానే బిగపట్టేస్తుంది. అందువల్లే నొప్పి అంటోంది. అమ్మాయిలు ఇటువంటి డైలమాలో ఉన్నప్పుడు ఈ పరిస్థితిఉంటుంది. అయినా పెళ్ళికాని మీ మరదలితో సెక్స్‌లో పాల్గొనడం ఎంతమాత్రం మంచిది కాదు. అనుకోకుండా కడుపువస్తే చాలా సమస్యలు వస్తాయి. మీరు ఆమెతో సెక్స్‌కి దూరంగా ఉండండి.

జె.ఆర్. ఆదిలాబాద్

మొన్ననే నాకు పెళ్ళిచూపులు అయ్యాయి. పెళ్ళి కూడా నిశ్చయం చేశారు. ఆ అమ్మాయి నాకంటే 9 సంవత్సరాలు చిన్నది. అంత చిన్న అమ్మాయిని నేను వద్దన్నా పేరెంట్స్ ఊరుకోవడంలేదు. నేను విపరీతంగా హస్తప్రయోగం చేస్తాను.

విపరీతంగా హస్తప్రయోగం ఉండటంవల్ల ఇంత చిన్న అమ్మాయితో నేను సక్సెస్‌ఫుల్‌గా సెక్స్‌లో పాల్గొనగలనా? ఆ అమ్మాయిని మెప్పించగలనా? నన్ను ఏం చేయమంటారు?

సాధారణంగా భార్యాభర్తల వయస్సు తేడా 2-5 సంవత్సరాలే ఉండటం మంచిది. పురుషునికంటే అమ్మాయి వయస్సు చాలా తక్కువగా ఉంటే వాళ్ళిద్దరి మధ్య మనస్సుల కలయిక అంతగా ఉండదు.

భర్తకి ఆ అమ్మాయి చిన్నపిల్లలాగా అనిపిస్తుంది. ఆ అమ్మాయికి అతను అంకుల్‌అనిపిస్తాడు.మనస్సు పంచుకుని, చెట్టపట్టాలేసుకుని తిరగలేకపోతారు. అందుకని మీ పేరెంట్స్‌కి స్పష్టంగా చెప్పండి. ఇంత వయస్సు తేడా ఉండటం మంచిది కాదు.

ఎ.ఎస్. సికింద్రాబాద్

ఇటీవల నాకు యాక్సిడెంట్ అయింది. దాదాపు మూడు నెలలు బెడ్‌రెస్ట్ తీసుకున్నాక కోలుకున్నాను. కొంచెం ఒళ్ళుకూడా చేశాను.ప్రస్తుతం నా వయస్సు యాభై సంవత్సరాలు. యాక్సిడెంట్‌కి ముందు రెగ్యులర్‌గా సెక్స్‌లో పాల్గొనేవాడిని.

ఇప్పుడు సెక్స్‌లో పాల్గొంటే అంగం చిట్లి నొప్పి చేస్తోంది. దీనివల్ల సెక్స్‌లో పాల్గొనలేకపోతున్నాను. ఎందువల్ల ఇలా జరుగుతోంది?

సాధారణంగా షుగరు ఉన్నవాళ్ళల్లో అంగం చిట్లి నొప్పి అనిపించడం ఉంటుంది.మీరు ఒకసారిషుగరు పరీక్ష చేయించుకోండి. షుగరుని కంట్రోల్‌లో పెట్టుకుంటే చర్మం చిట్లడం ఉండదు. అయినా ఒకసారి మీ డాక్టరు దృష్టికి తీసుకువెళ్ళండి.

ఎస్.ఎమ్. తెనాలి

నేనొక అబ్బాయి మీద మోజుపడ్డాను. అతను చాలా చలాకీగా ఉంటాడు. కాని అతనికి ఎందరో అమ్మాయిలతో సెక్స్ సంబంధాలు ఉన్నాయని మొన్ననే తెలిసింది.అయినా అతనితో సెక్స్‌లో పాల్గొనాలని మనస్సు ఎంతో కోరుకుంటోంది.

అతనికి ఎటువంటి వ్యాధులూ లేకపోతే నేను సెక్స్‌కి ఓకే. మరి అతనికి వ్యాధులు ఉన్నవీ, లేనివీ నేను తెలుసుకోవడం ఎలా?

చలాకీగా ఉన్న ఒక అబ్బాయి మీద మీరు మనస్సు పడటం బాగానే ఉందిగాని అతనికి ఇంకా ఎందరో అమ్మాయిలతో సంబంధాలు ఉన్నాయని తెలిసి కూడా అతనితో సెక్స్‌లో పాల్గొనాలని ఆరాటం చెందడం అంత మంచిది కాదు.

మనిషిని పైకిచూసి జబ్బులు ఉన్నవీ, లేనివిచెప్పడం కుదరదు. వ్యక్తిని పరీక్ష చేయడం, టెస్టులు చేయడం ద్వారానే వ్యాధులు ఉన్నవీ, లేనివీ తెలుస్తుంది.

ఈ దశల క్లైమాక్స్ అది

సంగీతంలో స్థాయిలు వున్నట్టే సెక్స్‌లోకూడా పలుస్థాయిలు వుంటాయి. సెక్స్‌కోరిక కలగటానికి కారణాలు అనేకం.వాటి గురించిన వివరణ అనవసరం. ఒకసారి మనసు లైంగిక అనుభవం మీదికి పోగానే మహిళల శరీరంలో స్పందనలు మొదలవుతాయి. జీవనక్రియ స్పందనలు శరీరభాగాలలో స్పష్టమవుతాయి.

యోనిభాగంలో ద్రవాలు స్రవించి, తేమగా తయారవటం తొలి లక్షణం. అది రక్తనాళాలను ప్రభావితం చేసే ద్రవాన్ని విడుదలచేయిస్తుంది. ఈ రసాయన ప్రభావాన యోనికి అటూ ఇటూ వున్న పెదవుల వంటివి కోర్కెను పెంచుతాయి.

కోరికమీద మనసు పెరుగుతుండగానే శరీరం లోపల మార్పులు వస్తాయి. గర్భాశయం లోపలికి లాక్కొని యోనిభాగం పొడవుగా మారి పురుషాంగాన్ని లోపలికి ఆహ్వానించేందుకు సిద్ధమవుతుంది. క్లైటోరిస్, మూత్రనాళ పరిసర భాగాలు ఉబ్బినట్టవుతాయి. అలా కోరిక పెరిగినపుడు మూత్రవిసర్జన చేయాలని అనిపించవచ్చు.క్లైటోరిస్‌రాపిడిని కోరుకుంటుంది.

కోరిక స్పందనగా గుండెవేగం పెరుగుతుంది. రక్తం వేగంగా సరఫరా అవుతుంది. క్లైటోరిస్‌కి రక్త సరఫరా మెరుగై మరింత ఉబ్బుతుంది.

ఈ దశలో పూర్తిస్థాయి రాపిడిని పురుషాంగం నుండి క్లైటోరిస్ కోరుకుంటుంది. అలా రాపిడి క్రమంగా, ఒక పద్ధతి ప్రకారంఅందించబడుతుంటే ఆనందం పెరుగుతుంది. ఆ రాపిడి ఎంతకాలం స్వీకరిస్తుందనేది స్త్రీలందరిలో ఒకేలా వుండదు. కొందరికి పరిమిత రాపిడి సరిపోతుంది.

మరికొందరు తమ చేతిలోకి పురుషాంగం తీసుకుని దానితో తమకు ఇష్టమైనంతసేపు రుద్దుకుంటూనే వుంటారు. మరికొందరు తాము పురుషుడిపైన వుంటే క్లైటోరిస్‌కి మెరుగైన రాపిడి తగులుతుందంటారు.

ఎలాఎంతసేపు ఆ రాపిడిఅనే అంశంలో భిన్నత్వం వున్నా క్లైటోరిస్ రాపిడి తప్పనిసరి. ఆ రాపిడి కలిగిస్తూనే పురుషాంగం యోనిలోకి, వెలుపలికి కదులుతుంది. పురుషాంగం అందించే రాపిడి ఆమెను అలా గాలిలో తేలుస్తుంది. ఎక్కడెక్కడో విహరిస్తున్నట్లుగా వుంటుంది. శరీరం కదిలిపోతుంది.

పురుషాంగాన్ని వీలైనంత లోతుకు తీసుకునేందుకు యోనిని ముందుకునెట్టిపెడ్తుంది స్త్రీ. రెండు అంగాల మధ్య గాలిదూరటానికి వీలులేనంతగా బిగుసుకుంటాయి. యోని పెదవులు గట్టిగా పట్టివుంచగా, పురుషాంగం పైకి లోనికి కదలటాన్ని స్ట్రోక్స్ అంటారు.

అలా స్ట్రోక్స్ స్త్రీని భావప్రాప్తికి తీసుకువెళతాయి. భావప్రాప్తికి చేరేముందు యోనికి మెదడు నుండి సంకేతం వెళుతుంది. పురుషాంగాన్ని గట్టిగా పట్టుకోమన్నది యోనిపెదవులకు అందే సందేశం.

గర్భాశయం, యోని, పాయుకండరాలు ఒక క్రమపద్ధతిలో తరంగంలా కదులుతాయి. ఇది సాధారణంగా ఒక నిమిషంసేపు వరకు వుంటుంది.

అతనికి బాగా దగ్గరగా చేరి, అతని ఛాతిమీద తలపెట్టి వేళ్ళను కదిలిస్తూ ఒకరకమైన ఆనందాన్ని ప్రదర్శిస్తారు. అతగాడిని అలా అంటిపెట్టుకుని వుంటారు. ఈలోగా మరోమారు కావాలన్న కోరిక మొదలవవచ్చు. అప్పుడు తిరిగి ఈ దశలన్నీ గతంలోకన్నా కొంచెం వేగంగా దాటుకుంటూ ఇద్దరూ భావప్రాప్తికి చేరతారు. ◆


డా॥ జి.సమరం వాసవ్య నర్సింగ్‌హోమ్ బెంజిసర్కిల్ విజయవాడ 520 010 ఫోన్ 0866-2472370 E-mail drsamaram@hotmail.com www.gsamaram.com

జై భారత్

ఆ అవకాశాన్ని సుకా చక్కగా ఉపయోగించుకున్నాడు. ఇంజినీర్ ఛాంబర్స్‌లోకి వెళ్ళి డిపార్ట్‌మెంట్ ఇంటర్నల్ ఫైల్‌కోసం చూశాడు. అతనెంతో కష్టపడవలసిన అవసరం లేకుండానే ఆ ఫైల్ దొరికింది. అందులో గౌతమ్ చెప్పిన కాగితం ఉంది. దాన్ని జాగ్రత్తగా తన సెల్‌ఫోన్‌తో ఫోటో తీశాడు.

తరువాత లంచ్ అవర్‌లో బయటకు వెళ్ళి ప్రింట్ అవుట్ జిరాక్స్ కాపీ తీశాడు. అది గతం. ప్రస్తుతానికి వస్తే గౌతమ్ చెప్పినట్టు సుకా డ్రాగన్ రెస్టారెంట్‌కు చేరుకున్నాడు. తొమ్మిదవ నెంబర్ టేబుల్‌ముందు కూర్చున్నాడు.

చిత్ర వెంకటేష్



అయిదునిమిషాల తరువాత గౌతమ్ వచ్చాడు. సుకా వెంటనే ఆ కాగితాన్ని తీసి అతనికి ఇచ్చాడు. గౌతమ్ దాన్ని చూసి తృప్తిగా తలపంకించాడు. తరువాత తన జేబులోంచి లక్షరూపాయలు తీసి ఇచ్చాడు. వణుకుతున్న చేతులతో ఆ డబ్బును తీసుకున్నాడు సుకా.

"అగ్రిమెంట్ ప్రకారం మీరు కోరినంత డబ్బు ఇచ్చాను. నా సంతోషంకొద్దీ ఇంకో పదివేలు ఇస్తున్నాను తీసుకోండి. ఈ డబ్బుతో మీ భార్యను కాపాడుకోండి. మీరిద్దరూ సుఖంగా, సంతోషంగా ఉండాలని మనసారా కోరుకుంటున్నాను. నాతో అవసరం ఉంటే నేను ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు కాల్ చెయ్యండి.

అంతవరకు సెలవు. ఈ క్షణంనుంచి మీరెవరో నేనెవరో. మనిద్దరికీ ఇంతకుముందు కొంచెం కూడా పరిచయం లేదు. గుడ్‌బై" అని ఇంకో మాటకు అవకాశం ఇవ్వకుండా గౌతమ్ వెళ్ళిపోయాడు.

గౌతమ్ వెళ్ళిపోయిన వెంటనే అక్కడనుంచి కదలలేదు సుకా. ఇంకో అయిదునిమిషాలు కూర్చుని తర్వాత నింపాదిగా బయల్దేరాడు. ఆటోలో తిన్నగా హాస్పిటల్ చేరుకున్నాడు. డాక్టర్‌ను కలుసుకుని తను తెచ్చిన లక్షరూపాయలు ఇచ్చాడు.

"వెల్ మిస్టర్ సుకా సమయానికి డబ్బుతెచ్చారు.

జరిగిన కథ (7)


సూర్జిత్‌సింగ్ ఇంట్లో జరిగే ఫంక్షన్‌కి వెళ్ళేందుకు పై అధికారులను అనుమతి అడుగుతాడు ప్రద్యుమన్. ఫంక్షన్స్‌కి వెళ్ళటానికి అనుమతి లేదని రాతపూర్వకంగా సమాధానమిస్తారు చైనా అధికారులు. ఈ సంగతిని సూర్జిత్‌సింగ్‌కి ఫోన్ చేసి చెబుతాడు ప్రద్యుమన్.

తన ఇంటి తలుపులు ఓరగా తెరచివుండటం చూసిన పింగ్‌పాంగ్‌కి ఎవరో ఇంట్లోకి ప్రవేశించారని అర్థమవుతుంది. దీంతో అటెన్షన్‌గా ఇంట్లోకి వెళతాడు. తలుపు పక్కనే దాక్కున్న గౌతమ్ పింగ్‌పాంగ్‌ని అదుపులోనికి తీసుకుని రివాల్వర్‌తో బెదిరించి 'బ్లాక్‌కోబ్రా' ప్రాజెక్ట్‌కి సంబంధించిన వివరాలు అడుగుతాడు.

మొదట సమాచారం ఇవ్వటానికి నిరాకరిస్తాడు పింగ్‌పాంగ్. దీంతో కోపంతో కాలిపై కాల్చేసరికి దానికి సంబంధించిన అనేక వివరాలు గౌతమ్‌కి చెప్పేస్తాడు పింగ్‌పాంగ్.

చైనా మిలట్రీ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే సుకాకి ఒక అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ వస్తుంది. ఆసక్తిగా ఆ వివరాలు వింటాడు.

ఇక జరగబోయేది చదవండి.



రేపే మీ ఆవిడకు ట్రీట్‌మెంట్ మొదలుపెడతాను. ఆవిడ తప్పకుండా కోలుకుంటుంది. నాది గ్యారంటీ" అన్నాడు డాక్టర్. సుకా బలహీనంగా నవ్వాడు.

తలుపుమీద చప్పుడు వినిపించింది. చదువుతున్న పుస్తకం పక్కనపెట్టి టైమ్ చూశాడు ప్రద్యుమన్. టైమ్ నాలుగు గంటలు కావస్తోంది. ఈ టైమ్‌లో ఎవరు వచ్చారా అనుకుంటూ వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా నవ్వుతూ లీ కనిపించాడు.

అనుకోకుండా అతన్ని చూసేసరికి కొంచెం అదిరిపాటుకు గురయ్యాడు ప్రద్యుమన్. నిజానికి లీ టైమ్ సాయంత్రం అయిదుగంటలు.

ప్రతిరోజూ అతను అదే టైమ్‌కు వచ్చేవాడు. కాని ఈ రోజు ఒక గంటముందు వచ్చాడు. అదే ఆశ్చర్యంగా ఉంది ప్రద్యుమన్‌కు. 'మీరా' అన్నాడు ప్రద్యుమన్ మెల్లగా తేరుకుంటూ.

"సారీ ప్రద్యుమన్ ఈ రోజు సాయంత్రం ఐదు గంటలకు నాకు ఒక ముఖ్యమైన అఫీషియల్ మీటింగ్ ఉంది. అలాగని క్లాస్ మిస్ కావటం నాకు ఇష్టంలేదు. అందుకే ఒక గంటముందు వచ్చాను. మీకు అభ్యంతరం లేదనుకుంటాను" అన్నాడు లీ.

"నో టెటాల్ రండి లోపలికి" అన్నాడు ప్రద్యుమన్ మర్యాదపూర్వకంగా.

"మీరు కూర్చుని నిన్న నేను చెప్పిన పాఠాన్ని ఒకసారి రివైజ్ చేసుకోండి. ఈలోగా నేను రిఫ్రెష్ అయి వస్తాను" అనిచెప్పి లోపలికి వెళ్ళాడు ప్రద్యుమన్.

అయిదునిమిషాలలో రిఫ్రెష్ అయివచ్చి లీకి ఎదురుగా కూర్చున్నాడు ప్రద్యుమన్. వెంటనే పాఠం చెప్పటం మొదలుపెట్టాడు. పాఠమైపోయేసరికి లీ బుద్ధిమంతుడైన విద్యార్థిలా దీక్షగా వింటున్నాడు.

గంటసేపు అనర్గళంగా పాఠం చెప్పాడు ప్రద్యుమన్. మధ్యమధ్యలో ఆపి సందేహాలుంటే అడగమని చెప్పాడు. తనకు ఏ డౌట్స్ లేవని చెప్పాడు లీ.

సరిగ్గా అయిదుగంటలకు పాఠం చెప్పటం ఆపేశాడు ప్రద్యుమన్. లీ కూడా లేచి బయలుదేరటానికి సిద్ధం అయ్యాడు.

"మీరు చాలా చక్కగా అర్థమయ్యేలా పాఠంచెబుతున్నారు. అందుకే మీకు ఏదైనా మంచి గిఫ్ట్ ఇవ్వాలని ఎన్నో రోజులనుంచి అనుకుంటున్నాను. కాని ఏం ఇవ్వాలో తెలియలేదు. కొన్ని వస్తువులు ముఖ్యంగా మాలాంటి మిలిట్రీ అధికారులు వేరేవాళ్ళకు ఇవ్వటానికి వీలులేదు. అందుకే బాగా ఆలోచించి ఈ సంవత్సరం డైరీ తీసుకువచ్చాను. ఇదిగో దీన్ని నా గిఫ్ట్‌గా తీసుకోండి" అని డైరీ ఇచ్చాడు.

"థ్యాంక్యూ కామ్రేడ్ లీ" అంటూ నవ్వుతూ డైరీ అందుకున్నాడు ప్రద్యుమన్.

"వస్తాను, మళ్ళీ రేపు కలుసుకుందాం. రేపు ఖచ్చితంగా అయిదుగంటలకు వస్తాను" అని చెప్పి తన జీపులో కూర్చున్నాడు లీ. క్షణంతర్వాత జీపు వేగంగా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ప్రద్యుమన్ తలుపులు మూశాడు. డైరీ తీసుకుని తన బెడ్రూమ్‌లోకి వెళ్ళాడు. మంచంమీద కూర్చుని

డైరీ తెరిచాడు. రెండు పేజీలు తిప్పినతరువాత నిర్ఘాంతపోయాడు ప్రద్యుమన్.

ఆ పేజీమీద మార్కర్ పెన్నుతో లీ పేరు రాసుంది. బహుశా ఇలాంటి డైరీ లీకి కూడా ఉండాలి. రెండు డైరీలు ఒకేలా ఉండటంతో లీ పొరపాటుపడ్డాడు. కొత్త డైరీ అనుకుని తన డైరీ తీసుకువచ్చి ఇచ్చాడు. మామూలుగా వేరేవాళ్ళ పర్సనల్ డైరీ చదవటం మంచి లక్షణం కాదు. సంస్కారం అనిపించుకోదు. ఈ విషయం ప్రద్యుమన్‌కు తెలుసు.

అయినా ఏదో తెలియని ఆసక్తి అతన్ని కబళించింది. సంస్కారాన్ని డామినేట్ చేసింది. తరువాత పేజీలో ఏదో విమానం బొమ్మ ఉంది. దానికిందచైనీస్ భాషలో ఏదో రాసుంది. బహుశా అది విమానానికి సంబంధించిన స్పెసిఫికేషన్స్ కావచ్చు.

అది ఒక యుద్ధ విమానం. కింద 'ఫిఫ్త్ జనరేషన్ వార్ ప్లేన్' అని రాసుంది. దానికింద ఎర్రపెన్నుతో 'ప్రాజెక్ట్ బ్లాక్ కోబ్రా' అని కూడా రాసుంది. కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టుగా అయింది.

ప్రద్యుమన్ దేనికోసమైతే ఇంత దూరం వచ్చాడో ఆ సమాచారం కష్టపడకుండానే దక్కింది. ఆసక్తితో రెండో పేజీ చదవబోయాడు. అప్పుడే బయట వాహనం ఆగిన చప్పుడు వినిపించింది.

ప్రద్యుమన్ ఒక్కసారిగా అలర్ట్ అయ్యాడు. గబగబా డైరీని హాలులో టీపాయ్‌మీద పెట్టి ఏం తెలియనట్టు వెళ్ళి తలుపు తీశాడు. అతని ఊహ నిజమైంది. గుమ్మందగ్గర లీ కనిపించాడు. అతని మొహం రక్తం ఇంకిపోయినట్టు తెల్లగా అయిపోయింది. మనిషి ఆపాదమస్తకం ఉద్వేగంతో కంపించిపోతున్నాడు.

"మిస్టర్ ప్రద్యుమన్ మీ డైరీ అనుకుని నా పర్సనల్ డైరీ ఇచ్చాను. దయచేసి అది నాకు ఇచ్చి మీ డైరీ తీసుకోండి" అంటూ కొత్త డైరీని ప్రద్యుమన్ చేతిలో పెట్టాడు. టీపాయ్‌మీద ఉన్న లీ డైరీని తీసుకువెళ్ళి అతనికి ఇచ్చాడు.

ప్రద్యుమన్‌కు థ్యాంక్స్‌చెప్పి లీ డైరీ తీసుకుని వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయినతరువాత ప్రద్యుమన్ మళ్ళీ తలుపులు మూసి బెడ్రూమ్‌లో కూర్చున్నాడు. ఇప్పుడు అతనికి అంతా అర్థమైంది.

బ్లాక్ కోబ్రా ప్రాజెక్ట్‌లో లీ ఒక ముఖ్యమైన అధికారి అయివుండాలి. ప్రతిరోజూ ఆ ప్రాజెక్ట్ గురించి ఇతర అధికారులతో చర్చించాలి అతను. ప్రతిసారీ డిపార్ట్‌మెంట్ ఫైల్స్ చూడటం సాధ్యంకాదు. అందుకే లీ ప్రాజెక్ట్ వివరాలు అన్నీ తన పర్సనల్ డైరీలో రాసుకున్నాడు. అంటే సిన్హాకు వచ్చిన సమాచారం నిజమే అని తేలింది. ఈ విషయం సిన్హాకు ఎలా చెప్పాలి.

సింగ్ తనకు ఒక ట్రాన్స్‌మీటర్ ఇస్తాడని సిన్హాగారు చెప్పారు. కాని ఇంతవరకు ఇవ్వలేదు. ఈ రోజు ఆ విషయం అడిగి తెలుసుకోవాలి.

కొంచెంసేపు విశ్రాంతి తీసుకున్నతరువాత మెల్లగా పింగ్ రెస్టారెంట్‌వైపు బయలుదేరాడు ప్రద్యుమన్.

బీజింగ్‌లో ఇండియన్ ఎంబసీ ఎదురుగా ఒక చిన్న రెస్టారెంట్ ఉంది. ఆ రెస్టారెంట్‌లో ఒక టేబుల్ ముందు కూర్చునివున్నాడు గౌతమ్. ఆ రెస్టారెంట్‌కు ఏదో తినటానికి రాలేదు గౌతమ్.

సుకా ఇచ్చిన కాగితం ఇవ్వటానికొచ్చాడు. సుకా వెళ్ళిపోయిన తరువాత గౌతమ్ తన బాస్ ప్రకాశ్‌తో మాట్లాడాడు. తన మామూలు సెల్ కాకుండా ఇంకో సెల్ వాడాడు. ఆ సెల్‌నెంబర్ అతని బాస్‌కుమాత్రమే తెలుసు. చివరకు అతని గర్ల్‌ఫ్రెండ్ సుజికి కూడా ఆ సెల్ నెంబర్ తెలియదు. మామూలుగా కోడ్‌వర్డ్ చెప్పినతర్వాత అసలు విషయం చెప్పాడు గౌతమ్.

"గుడ్. అనుకున్నది సాధించినందుకు నాకుచాలా ఆనందముగా ఉంది. ఈ రోజు నిన్ను కలుసుకోవటం వీలుకాదు... ముఖ్యమయిన ఇద్దరు చైనీస్ అధికారులు ఎంబసీకి వచ్చారు. మన అంబాసిడర్‌తో ఏదో మాట్లాడుతున్నారు. ఈ పరిస్థితిలో నేను ఆఫీసు దాటి బయటకు రాలేను. అందుకే ఒక పనిచెయ్యి. రేపు ఇదే సమయానికి మన రెస్టారెంట్‌కు రా. అక్కడ తీరికగా మాట్లాడుకుందాం" అన్నాడు ప్రకాశ్.

అలాగే అనిచెప్పి లైన్ కట్ చేశాడు గౌతమ్. ఆ కాగితాన్ని జాగ్రత్తగా బీరువాలో పెట్టి తాళం వేశాడు. ఇంత బిజీగా ఉన్నా అతను పింగ్‌పాంగ్ గురించి మరచిపోలేదు.తనగురించి అన్ని వివరాలు సేకరించాడంటే ఇది తప్పకుండా ఎంబసీలో పనిచేస్తున్నవాళ్ళ పని అయివుంటుంది వాళ్ళలో ఎవరో తనగురించిన పూర్తి వివరాలు అతనికి అందించారు.

అతను ఎవరో ఏ ర్యాంకులో ఉన్నాడో గౌతమ్‌కి అర్థంకాలేదు. ఎంబసీలో దాదాపు యాభైమంది పని చేస్తున్నారు. వాళ్ళందరూ నమ్మకమైనవాళ్ళు. దేశ భక్తులు. దేశంమీద ఎంతో ప్రేమ ఉన్నవాళ్ళు. వాళ్ళ బ్యాక్ గ్రౌండ్ పూర్తిగా చెక్‌చేసినతర్వాత ప్రభుత్వం వాళ్ళను ఎంబసీలో నియమించింది.

ఇప్పుడు వాళ్ళలో ఒకడు డబ్బుకోసం ఆశపడి చైనీస్ అధికారులకు లొంగిపోయాడు. వాళ్ళ తరపున పనిచేస్తూ భారత్‌కు సంబంధించిన రహస్యాలను చేరవేస్తున్నాడు. అలాంటివాడిని పట్టుకోవడం అంత తేలికకాదు. చాలా జాగ్రత్తగా వలవిసిరి పట్టుకోవాలి. సమయంచూసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ప్రభుత్వానికి అప్పగించాలి.

అలా జరగాలంటే అది గౌతమ్ ఒక్కడివల్లమాత్రం కాదు. ఎంబసీ అధికారుల సహకారం, సహాయం కావాలి. ప్రకాశ్ వచ్చినప్పుడు ఈ విషయం అతనికి



యోగిని!

తమలోని అందాల యాంగిల్స్‌ను ప్రదర్శించడానికి ఎన్ని కళలైనా పోవచ్చు.

శ్రీలంక బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ అదే పనిలో పడినట్లుంది. సినిమాల్లో ఎంచక్కా తెలివిగా అవకాశాలు పట్టేస్తూనే, సోషల్ మీడియాలోనూ తనదైన పోకడలు వెదజల్లుతున్నది జాక్వెలిన్.

యోగా పోజులు ఇస్తూ, శరీరాన్ని వీలయినంత ఫ్లెక్సిబుల్‌గా చేసి జాక్వెలిన్ పోస్ట్ చేసిన ఫోటోలు చూసినవారు కళ్ళార్పడాన్ని మర్చిపోతున్నారు.

పైగా ఈ పోజుకు తనకుతానే 'యోగిని'అంటూ ఓ టైటిల్ కూడా ఇచ్చేసుకున్నది!



మధ్యప్రదేశ్‌లో బి.జె.పి. ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పూలమాల వేసుకోను.

-జ్యోతిరాదిత్య సింధియా, కాంగ్రెస్ నేత

చెప్పాలి. జాగ్రత్తగా ఉండమని హెచ్చరించాలి.

మరునాడు ప్రకాశ్ చెప్పిన టైమ్‌కు రెస్టారెంట్ చేరుకున్నాడు. టైమ్‌పాస్ కావటానికి లైట్‌గా కాఫీ మాత్రం తీసుకున్నాడు గౌతమ్. అతను ఎంతోసేపు ఎదురుచూడవలసిన అవసరం లేకుండాపోయింది. అయిదునిమిషాలలో ప్రకాశ్ వచ్చాడు.

సీరియస్‌గా వచ్చి గౌతమ్ ఎదురుగా కూర్చున్నాడు. సర్వర్‌కు కాఫీ ఆర్డర్ ఇచ్చాడు. తరువాత సుకా ఇచ్చిన కాగితాన్ని ప్రకాశ్‌కు ఇచ్చాడు గౌతమ్. ఆ కాగితంలో ఏముందో చూడకుండానే తన జేబులో పెట్టుకున్నాడు ప్రకాశ్. ఇంతలో సర్వర్ కాఫీ తెచ్చి అతనిముందు పెట్టి వెళ్ళిపోయాడు.

ఇద్దరిలో ఎవరూ మాట్లాడలేదు. అపరిచితుడిలా ఒకరికి ఒకరు తెలియనట్టు ప్రవర్తించారు.కాఫీ తాగిన తరువాత ప్రకాశ్ వెళ్ళిపోయాడు.

గౌతమ్ మాత్రం అక్కడనుంచి కదలలేదు. వెంటనే బయల్దేరితే ఎవరికైనా అనుమానం వస్తుంది. అందుకే సిగరెట్ తాగుతూ కొంచెంసేపు గడిపాడు. తరువాత బిల్ పే చేసి బయటకు నడిచాడు.

గౌతమ్ ఇచ్చిన కాగితం తీసుకుని ప్రకాశ్ లోపలికి వెళ్ళాడు. చుట్టూవున్న సెక్యూరిటీ గార్డ్స్ అతనికి మర్యాదగా సెల్యూట్ చేసి పక్కకు తప్పుకున్నారు. ప్రకాశ్ తిన్నగా అంబాసిడర్ ఛాంబర్స్‌లోకి వెళ్ళాడు. విశాలమైన మహాఘని టేబుల్ వెనుక గంభీరంగా కూర్చునివున్నాడు ఇండియన్ అంబాసిడర్.

ఆయనకు దాదాపు ముప్పై అయిదు సంవత్సరాలు ఉంటాయి. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. సాఫీగా వెనక్కిదువ్విన జుట్టు.తెలివిని సూచించే కళ్ళు. నిజంగానే అతను తెలివయినవాడు. అందుకే చాలా చిన్న వయసులో అంత పెద్ద పదవికి రాగలిగాడు.

లోపలకు వచ్చిన ప్రకాశ్ అంబాసిడర్‌కు వినయంగా నమస్కారం చేసి గౌతమ్ ఇచ్చిన కాగితాన్ని ఇచ్చాడు. "ఏమిటిది" అడిగాడు అంబాసిడర్.

"మన ఏజెంట్ గౌతమ్ ఇచ్చిన కాగితం. నేను చదివాను. మీరుకూడా చదవండి"అన్నాడు ప్రకాశ్.

అంబాసిడర్ క్యాజువల్‌గా ఆ కాగితం తెరిచి చూశాడు. అది కమ్యూనిస్ట్‌పార్టీ పొలిట్‌బ్యూరో ఛైర్మన్ తన దేశరక్షణ సంస్థలకు పంపించిన సీక్రెట్ నిర్ణయం. అందులో ఐదు వాక్యాలుమాత్రం ఉన్నాయి.

టాప్ సీక్రెట్. "బ్లాక్ కోబ్రా ప్రాజెక్ట్‌ను నేను పూర్తిగా ఆమోదిస్తున్నాను"

"మన పథకంప్రకారం ఆ ప్రాజెక్ట్‌ను అనుకున్న సమయానికి పూర్తిచెయ్యండి. ఫండ్స్ గురించి ఆలోచించకండి. ఎంత ఖర్చు అయినా ఫర్వాలేదు, ప్రభుత్వం భరించటానికి సిద్ధంగానే ఉంది. కాని ప్రాజెక్ట్ మాత్రం విజయవంతం కావాలి" అని వుంది. కింద ఛైర్మన్ సంతకం, ఆయన అఫీషియల్ సీల్ ఉంది.

"ఏమిటి ఈ బ్లాక్ కోబ్రా" ఆశ్చర్యంగా అడిగాడు అంబాసిడర్. నిజంగానే అతనికి బ్లాక్ కోబ్రా ప్రాజెక్ట్ గురించి తెలియదు. సిన్హా కూడా అతనికి చెప్పలేదు. కాని ప్రకాశ్‌కుమాత్రం తెలుసు. అతను నియమించిన గౌతమ్ ఈ బ్లాక్ కోబ్రాగురించి తెలుసుకుని ప్రకాశ్‌కు రిపోర్ట్ ఇచ్చాడు. తరువాత ప్రకాశ్ ఆ విషయం సిన్హాకు చెప్పాడు.

ఇది మొత్తం ఫీల్డ్ వర్క్‌కనుక అంబాసిడర్‌కు చెప్పవలసిన అవసరం లేదని ప్రకాశ్ అనుకున్నాడు. కాని ఇప్పుడు అంబాసిడర్ ఆ బ్లాక్ కోబ్రా గురించి అడగటంతో ప్రకాశ్‌కు చెప్పక తప్పలేదు... అంతా విన్న అంబాసిడర్ మొహం గంభీరంగా అయింది.

"డబ్బుగురించి భయపడవద్దని చెప్పినప్పుడే నాకు అనుమానం కలిగింది. ఇది ఏదో దేశరక్షణకు సంబంధించిన విషయమని. కాని ఫిఫ్త్ జనరేషన్ వార్ ప్లేన్ అనిమాత్రం అనుకోలేదు.

ఇప్పుడు అసలు విషయం తెలిసింది కనుక మన ఏజెంట్లను చాలా జాగ్రత్తగా ఉండమని చెప్పండి. వీలైతే ఆ విమానం తాలూకు బ్లూ ప్రింట్స్ సంపాదించమని చెప్పండి. మన ఇంజినీర్లకు అవెంతో ఉపయోగపడతాయి" అన్నాడు అంబాసిడర్.

'తప్పకుండా' అన్నాడు ప్రకాశ్. వెంటనే తన ఏజంట్లను అలర్ట్ చేస్తానని చెప్పి ప్రకాశ్ వెళ్ళిపోయాడు. అంబాసిడర్ వెంటనే ఆ కాగితాన్ని అదే రోజు డిప్లమెటిక్ పౌచ్‌లో పి.ఎమ్.ఓ. ఆఫీస్‌కు పంపించాడు.

బయటకు వచ్చిన ప్రకాశ్ వెంటనే గౌతమ్‌కు కాల్ చేసి విమానం తాలూకు బ్లూ ప్రింట్స్ ఎలాగయినా సంపాదించమని అడిగాడు.

"అదెలా సాధ్యం సార్. ఆ బ్లూ ప్రింట్స్ చీఫ్ ఇంజినీర్ సేఫ్‌లో భద్రంగా ఉంటాయి. వాటిచుట్టూ చాలా పెద్ద సెక్యూరిటీ ఉంటుంది. ఆ సెక్యూరిటీ తప్పుకుని లోపలికి వెళ్ళి బ్లూ ప్రింట్స్ తీసుకురావాలి. ఇది చెప్పినంత తేలిక కాదు సార్. చాలా కష్టంతో కూడుకున్నది. అయినా ప్రయత్నిస్తాను" అన్నాడు గౌతమ్.

"నువ్వు పెద్దగా కష్టపడవలసిన అవసరం లేదు. సుజి నీ గరల్ ఫ్రెండ్ కదా. ఆమె సహాయం తీసుకో. నీ మాట కాదనదు. కావాలంటే ఎంత డబ్బు అయినా ఇస్తానని చెప్పు" అన్నాడు ప్రకాశ్.

"సుజి ఈ పని చెయ్యదు సార్. మీకు ఈ విషయం తెలిసో తెలియదో నాకు తెలియదు. సుజికి నేను ఇండియన్ ఏజెంట్ అని తెలియదు. ఒక మామూలు కంపెనీ ఎంప్లాయ్ అని అనుకుంటుంది.

ఇప్పుడు నేను ఈ విషయం ప్రస్తావించితే- తప్పకుండా ఆమెకు అనుమానం వస్తుంది. నేను ఒక ఇండియన్ ఏజెంట్ అని తెలిసిపోతుంది. ఆమె మావ్ సబార్డినేట్ అని మీరు మరచిపోతున్నారు"

"నువ్వు చెప్పింది నిజమే. నేనే తొందరపడ్డాను. బ్లూప్రింట్ విషయం నీకే విడిచిపెడ్తున్నాను. నువ్వు ఏం చేస్తావో నాకు తెలియదు. బ్లూ ప్రింట్స్ మాత్రం మనకు కావాలి. అవి ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా" అన్నాడు ప్రకాశ్.

ప్రకాశ్‌తో మాట్లాడినతరువాత గౌతమ్ ఆలోచనలో పడ్డాడు. బ్లూ ప్రింట్స్ ఎలా సంపాదించాలో అతనికి తోచటంలేదు. ఇంతలో అతని బుర్రలో ఫ్లాష్ వెలిగింది. ఆ ఫ్లాష్ సుకా. ఇప్పుడు సుకా అతని చేతిలో ఉన్నాడు. తను ఏం చెప్పినా వింటాడు. అతని సహాయం తీసుకుని ఈ పని పూర్తిచెయ్యాలి.

ఈ ఆలోచన వచ్చీరాగానే గౌతమ్

ఇంకెప్పుడంట!

ఇటు బాలీవుడ్‌లో, అటు హాలీవుడ్‌లో పరుగులు పెట్టేస్తున్న ప్రియాంకచోప్రా వయస్సు ముప్ఫైఐదుకు చేరేసి ఆల్రెడీ పెళ్ళివయస్సు దాటిపోయింది.

ప్రేమ, పెళ్ళి ధ్యాసే లేనట్లు కెరీరే ధ్యేయంగా సాగిపోతోంది. ఇదే సంగతిని కదిలిస్తే "నా మనస్సుకు నచ్చినవాడు ఇంకా తారసపడలేదు. పెళ్ళి ప్లాన్ చేసుకున్నప్పుడు అవ్వదుకదా.

అయినా నాకు సినిమాలు చేయడానికే టైమ్ సరిపోతున్నది. ఇక నాకు పెళ్ళిగురించి ఆలోచించే తీరిక ఎక్కడిది" అని అంటోంది.

ఎప్పటికైనా తప్పదు కదా- మరి ముదిరిపోతే కష్టం అని తెలియదా? ఏంటి?





చరిత్రలో మొట్టమొదటి స్త్రీవాది ద్రౌపది. -రామ్ మాధవ్, బి.జె.పి. నేత

సీరియల్

ఉత్సాహంగా సుకాకు కాల్ చేశాడు.

పాఠం విన్నతరువాత రిలాక్స్‌గా సిగరెట్ వెలిగించాడు లీ. ఆ రోజు అతను చాలా మంచి మూడ్‌లో ఉన్నాడు. ప్రద్యుమన్‌తో మనస్సువిప్పి మాట్లాడాడు. ఒక చైనీస్ అధికారిలాగా కాకుండా మామూలు పౌరుడిలాగా కబుర్లు చెప్పాడు.

ఈ పరిణామాన్ని ప్రద్యుమన్ ఎంతమాత్రం ఊహించలేదు. కాని ఒక రకంగా అతనికి చాలా సంతోషం కలిగింది. ఇప్పుడు లీ అతన్ని పూర్తిగా నమ్ముతున్నాడు. అందుకే తనతో అన్ని విషయాలు మాట్లాడుతున్నాడు. ముఖ్యంగా తన కుటుంబం గురించి కూడా చెప్పటం జరిగింది.

"రేపు మా ఇంట్లో ఒక ముఖ్యమైన ఫంక్షన్ ఉంది. నాకు బాగా కావల్సినవాళ్ళను, ముఖ్యమైనవాళ్ళను మాత్రం పిలిచాను. మీరుకూడా తప్పకుండా రావాలి" అన్నాడు లీ ఉన్నట్టుండి. "నాకు రావాలనే ఉంది. కాని అధికారులు పర్మిషన్ ఇస్తారా అని అనుమానంగా ఉంది" అన్నాడు ప్రద్యుమన్.

"ఆ విషయం నాకు విడిచిపెట్టండి. పర్మిషన్ విషయం నేను చూసుకుంటాను. మీరు మాత్రం ఆరుగంటలకు సిద్ధంగా ఉండండి. మా మనిషి వచ్చి మిమ్మల్ని పికప్ చేసుకుంటాడు. నిజానికి మిమ్మల్ని ఒంటరిగా పంపించరు. నేను పక్కన ఉంటాకనుక తప్పక పంపిస్తారు" అన్నాడు లీ.

ప్రద్యుమన్ ఉత్సాహంగా చూశాడు. సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది. ఆ రోజు ఎందుకో వాతావరణంలో విచిత్రమైన మార్పువచ్చింది. బాగా చల్లబడింది. గాలికూడా చల్లగా వీస్తూ సేద తీరుస్తున్నట్టుగా ఉంది.



కపిల్‌సిబాల్, మణిశంకర్ అయ్యర్‌లు మా పార్టీ ప్రచారాన్ని గుజరాత్‌లో దెబ్బతీశారు.

-వీరప్ప మొయిలీ, కాంగ్రెస్ నేత

ప్రద్యుమన్ తన క్లాస్‌లు పూర్తిచేసుకుని క్వార్టర్స్ చేరుకున్నాడు. పుస్తకాలను టేబుల్‌మీద పెట్టి రిఫ్రెష్ అయ్యాడు. కాఫీతాగుతూ టీవీ ఆన్ చేశాడు. ప్రభుత్వ ఛానల్‌లో శంకుస్థాపన ప్రోగ్రామ్ వస్తోంది.

బీజింగ్‌లో ఒక ప్రాంతంలో ఒక బిల్డింగ్‌కు శంకుస్థాపన జరుగుతోంది. ఆ శుభకార్యానికి లోకల్ నాయకులతోపాటు అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రి కూడా వచ్చాడు. మామూలుగా రిబ్బన్ కటింగ్‌తర్వాత మంత్రి మాట్లాడాడు. "ఇప్పటికే మనమెంతో అభివృద్ధిచెందాం. కాని సాధించవలసింది ఇంకా ఉంది. ముఖ్యంగా మనం ఆసియాలో బలమైన శక్తిగా ఎదిగాం.

మనప్రక్క దేశాలు మనని చూసి అసూయపడుతున్నాయి. ముఖ్యంగా భారత్ మనని చూసి కళ్ళలో నిప్పులు పోసుకుంటుంది. చుట్టుపక్కల దేశాలన్నీ మనని ఎంతో గౌరవంగా చూస్తుంటే భారత్‌మాత్రం మనని పట్టించుకోవటంలేదు.

మన అభివృద్ధిని మెచ్చుకోవటంలేదు. పైగా ద్వేషిస్తోంది. ఇది ఒక రకంగా మన గొప్పతనమైనా మనం ఇంతటితో ఊరుకోకూడదు. చుట్టుపక్కల దేశాలు మనని చూసి భయపడేలా చెయ్యాలి. ముఖ్యంగా భారత్ మనని చూసి బెదిరిపోవాలి.

మన సైనికబలం ఆయుధాల శక్తి చూసి సిగ్గుతో తలవంచుకోవాలి. అది జరగాలంటే ప్రపంచాన్ని జయించే శక్తిని మనం సమకూర్చుకోవాలి. అప్పుడే మన నాయకుల లక్ష్యం నెరవేరుతుంది. అందుకేబాగా ఆలోచించి ప్రాజెక్ట్ బ్లాక్‌కోబ్రా చేపట్టాం.

ఆ ప్రాజెక్ట్ దాదాపు పూర్తి అయ్యే స్టేజికి వచ్చింది. ట్రయల్ రన్‌మాత్రం మిగిలివుంది. అదికూడా విజయవంతమయితే ఈ ప్రపంచంలో ఏ దేశం మనముందు నిలబడలేదు. మనకు లొంగిపోవలసిందే.

ఆ రోజు తొందరగా రావాలని మనమందరం మనసారా కోరుకుందాం..." అని తన ఉపన్యాసం పూర్తిచేశాడు మంత్రి.

అందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు. మినిస్టర్ ప్రసంగమైనతరువాత లోకల్ నాయకులు మాట్లాడారు. ఆ తరువాత ఏదో సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభమైంది. ఆ తర్వాత ప్రోగ్రాం చూడలేదు ప్రద్యుమన్. టీవీ ఆన్‌చేసివచ్చి సోఫాలో కూర్చున్నాడు.

చైనీస్ మినిస్టర్ చెప్పిన మాటలు అతని చెవులలో ఇంకా మార్మోగిపోతున్నాయి. బ్లాక్ కోబ్రా గురించి ప్రస్తావిస్తూ దాని సహాయంతో భారత్‌మీద దాడి చెయ్యాలని చెప్పాడు మంత్రి.

అదే నిజమయితే దారుణమైన మారణహోమం జరుగుతుంది. భారత సరిహద్దులో ఉన్న కొన్ని లక్షలమంది అమాయక ప్రజలు నల్లుల్లా మాడిపోతారు. రక్తం ఏరులయి ప్రవహిస్తుంది. అలా జరగటానికి ఎంతమాత్రం వీలులేదు.

సిన్హా చెప్పినట్టు ఏదోక విధంగా బ్లాక్ కోబ్రాను హైజాక్ చెయ్యాలి. చైనీస్ అధికారులకు కనిపించకుండా ఎక్కడైనా దాచెయ్యాలి. విమానం లేదు కనుక చైనా ప్రభుత్వం తాత్కాలికంగా తన నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటుంది.

ఆ విమానం దొరికేవరకు భారతదేశం జోలికి రాదు. అదిమాత్రం నిజం. సాధ్యమైనంత తొందరగా ఆ విమానాన్ని హైజాక్ చెయ్యాలి.

ప్రద్యుమన్ ఈ రకంగా ఆలోచిస్తుంటే అప్పుడే గేటుదగ్గర వాహనం ఆగిన చప్పుడు వినిపించింది. క్షణం తరువాత లీ ఆర్డర్లీ లోపలికి వచ్చి ప్రద్యుమన్‌కు నమస్కారం చేశాడు. ప్రద్యుమన్ వెళ్ళి మౌనంగా జీపులో కూర్చున్నాడు. మరుక్షణం జీపు చాలా వేగంగా గమ్యస్థానంవైపు సాగిపోయింది.

ఒక గంటసేపు బీజింగ్ రోడ్డుమీద ప్రయాణం చేసినతరువాత జీపు రెండు అంతస్థుల భవనం ముందు ఆగింది. ప్రద్యుమన్‌ను తీసుకువచ్చిన మనిషి, ప్రద్యుమన్ ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

విశాలమైన హాలు లైట్లతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. హాలుకు కొంచెం దూరంలో చిన్న డయాస్ ఉంది. అప్పటికే చాలామంది ఆహూతులు వచ్చేశారు. వాళ్ళలో చాలామంది తాగుతూ ఎంజాయ్‌చేస్తున్నారు. కొంతమంది గుంపులుగా నిలబడి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళలో సివిలియన్స్ ఎవరు, మిలిట్రీ అధికారులు ఎవరు అని చెప్పటం కష్టం.

ఇంకా ఉంది




కథే ముఖ్యం

ప్రతి ఒక్కరికీ చేసేపాత్రల విషయంలో లెక్కలుంటాయికాని, వాటిని తు.చ. తప్పక పాటించడం కుదరనేది శృతీహాసన్ అభిప్రాయం.

"ఫలానా కథల్లోనే నటిస్తాను. ఫలానా పాత్రలే చేస్తా అంటూ లెక్కలు కట్టుకున్నా అవి అలాగే కొనసాగవు. పాత్రల లెక్కల్ని మార్చగలా కథలు నా అభిప్రాయాన్ని మార్చవచ్చు.

అలా కాకుంటే నేను ఇంతే అనుకుంటే మంచి పాత్రను, కథను కోల్పోవచ్చు. కాబట్టే, కథకంటే ఏదీ ఎక్కువ కాదు. కథ విన్నాకే నా అభిప్రాయాన్ని చెప్పడం నాకు అలవాటు" అని వివరించింది.



మీ ఉత్సాహం కోసం

శరీరం సక్రమంగా పనిచేస్తుంటే ఎటువంటి సమస్యలు బయటకు కనిపించవు. శరీరం లోపలి గ్రంథులు గతి తప్పితే అలసట, నిస్సత్తువ, ఇతర అనారోగ్య లక్షణాలు వస్తాయి.

అటువంటి నిరంతర అలసటలోనుండి బయట పడటం అవసరం. దానిని అలాగే వదిలేస్తే ఎందుకు పనికి రాకుండాపోయే ప్రమాదముంది.

అందుకోసం ఏవేవో మందులు మింగేకన్నా యోగాద్వారా లాభం పొందటం మంచిది.

ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని సాధనం యోగా. ఒక్కొక్క సమస్యకు ఒక్కో ప్రత్యేక ఆసనాన్ని యోగా శాస్త్రం నిర్దేశించింది. అటువంటివాటిని గుర్తించి సాధన చేసి వేయగలిగితే మేలు చేకూరుతుంది.

తీరిక లేని దైనందిన పని షెడ్యూల్‌తో యోగా క్లాసులు మిస్సవుతున్నామనో, జిమ్‌కు వెళ్ళలేకపోతున్నామనో ఫీలయ్యేవాళ్ళు ఎక్కువమంది ఉంటారు. వీటికోసం ఎటువంటి ఆందోళనపడకుండా ఏవైనా కొత్త వాటిని ప్రయత్నించాలి.

జిమ్‌కు వెళ్ళలేదన్న చింత వదిలేసి, ఇంట్లోనో ఆఫీసులోనో చిన్నపాటి ఆసనాలు వేయాలి.

ఎక్కువగంటలు కదలకుండా కుర్చీలో కూర్చుని ఉద్యోగం చేసేవారు ఏదో ఒక ఆసనం వేయకపోవడం అంటే పొగతాగడంతో సమానం లాంటిదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆఫీసులో ఏడెనిమిది గంటలు కదలకుండా కూర్చుని పనిచేసి, తిరిగి ఇంట్లో మూడు నాలుగు గంటలు టీవీ ముందు కూర్చుంటే ఆరోగ్యానికి చాలా హాని జరుగుతుంది.

ముఖ్యగా నలభై అయిదు సంవత్సరాలు పైబడిన ఉద్యోగులకు ఇటువంటి జీవనశైలివల్ల అనారోగ్యాల ముప్పు ఎక్కువగా ఉంటుంది. కదలకుండా ఎక్కువ గంటలు కూర్చుని ఉండడంవల్ల శరీరంలో ఇన్సులిన్ స్థాయిలు పెరుగుతాయి.

ఫలితంగా శారీరక క్రియల్లో తేడాలు వస్తాయి. ఆఫీసుకు నడుస్తూనో లేదా సైకిల్‌పై వెళ్తేనో అనారోగ్య ఇబ్బందులు ఉండవు. లేనిపక్షంలో ఇన్ని గంటల పాటు కూర్చుని పనిచేసేవారు ప్రతిరోజూ తప్పనిసరిగా కొన్ని ఆసనాలు వేస్తుండాలి.

రోజంతా ఎనర్జిటిక్‌గా ఉండాలంటే కనీసం పది నిమిషాలు అత్యధిక ఇంటెన్సిటీ ఎక్సర్‌సైజులు చేసినా చాలనేది నిపుణుల సూచన.

ఏదోక సమయంలో...

ఇంట్లో వెయిట్స్ చేసినా, సైక్లింగ్ చేసినా చక్కని ప్రసరణ జరుగుతుంది. శరీరానికంతటికీ వ్యాయామం లభిస్తుంది. అసలు ఏదీ చేయకపోవడం కంటే ఎంతో కొంత చేయడం ఉత్తమం.

ఆసనాలు వేయడానికి ఉదయం, సాయంత్రం వేళలు మాత్రమే అనుకూలమైనవన్నది సాధారణ అభిప్రాయం. ఆ సమయాల్లోనే చేయాలనుకుంటూ చాలామంది కుదరకమానేస్తుంటారు కూడా.

కాని, అస్సలు ఆసనాలు వెయ్యనిదానికంటే ఏదో ఒక కుదిరిన సమయంలో చెయ్యగలగడం మంచిది. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే సమయంలో ఆసనాలు వేయడం వల్ల స్వేదం ఎక్కువగా పడుతుంది. మధ్యాహ్నం మూడు, నాలుగు గంటల నడుమ, ఉదయం పది, పదకొండు గంటల మధ్య తేలికపాటి ఆసనాలు వేయటం మంచిది.

ఇలా చేయడం వల్ల శరీరం చురుగ్గా అవడమే కాకుండా, జీర్ణక్రియ రేటు బావుంటుంది. ఋతుక్రమ సమయంలోనూ సౌకర్యాన్ని అనుసరించి ఆసనం అంటే వాకింగ్ వంటివి కూడా చెయ్యవచ్చు. ఆహారం తిన్నవెంటనే మాత్రం చెయ్యకూడదు.

లోపలి అంగాలు, గ్రంథుల పనితీరును మెరుగుపరిచి, అలసటను దూరంచేసే యోగాసనం 'బంధకోనాసనం'. ఇది వేయటం అలవాటుచేసుకుంటే మరి కొంచెం ముందుకు వెళ్ళి మరిన్ని సంక్లిష్ట ఆసనాలను వేసి ఆరోగ్య లబ్ది పొందుతారు.

అలసట పారద్రోలే ఆసనం వేసేందుకు ముందుగా నిటారుగా కూర్చోవాలి. తర్వాత కాళ్ళను ముందుకు చాపాలి. రెండు చేతులు పక్కన వదులుగా నేలను తాకుతూ వుండాలి. ఆ తర్వాత కాళ్ళను మోకాలు దగ్గర వంచుతూ పాదాలను తుంటివైపుకు తీసుకోవాలి. రెండు పాదాలను ఒకదానికి ఒకటి తాకనిచ్చి, మోకాళ్ళ భాగాన్ని వదులుగా వదిలేయాలి.

పాదాలమీద మరీ అతిగా ఒత్తిడి పెంచివేయవద్దు. ఎంతమేర కాళ్ళను లోపలికి తీసుకోగలిగితే అంతవరకే తీసుకోండి. రెండు చేతుల వేళ్ళతో రెండుపాదాల వేళ్ళను పట్టుకోవాలి. పిడికిట్లో కాలివేళ్ళు ఇమిడినట్లవ్వాలి. కింద నేలను తాకుతున్న పాదభాగాన్ని అదిమి వుంచుతూ నడుము, వీపును మరింత నిటారుగా నిలబెట్టండి. దీనివలన వెన్ను భాగం వెళ్ళి తల చివర తగులుతున్నట్టనిపించాలి.

అలసట పోతుంది

ఇలా కూర్చుని దృష్టిని ముక్కు చివర భాగంమీద పెట్టాలి. ఇలా ఐదునిమిషాలుపాటు భంగిమలో కూర్చున్న తర్వాత క్రమంగా చేతులను వదులుచేసి పాదాలనుండి వేరు చేయాలి. కాళ్ళను నెమ్మదిగా ముందుకు చాపండి.

ఈ ఆసనం ప్రారంభించేటప్పుడు ఎలా కూర్చున్నారో అలాంటి స్థితికి తిరిగి రావాలి. ఈ భంగిమతో తొడల లోపలి భాగం, గజ్జలు, మోకాలు భాగాలు బాగా సాగుతాయి. ఆడవారిలో బహిష్టు సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. అండాశయ ఆరోగ్యం బాగుంటుంది.

పురుషులలో ప్రోస్టేట్ గ్రంథి మీద మంచిప్రభావం వుంటుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి.

మూత్రాశయం, మూత్రపిండాలు మెరుగ్గా పనిచేస్తాయి. ఈ భంగిమ నీరసాన్ని పోగొడుతుందని యోగా పుస్తకాలు చెపుతున్నాయి.

గజ్జల మధ్య భాగంమీద ప్రభావం చూపి లైంగిక ఆనందం పొందటం మెరుగయ్యేలా చేస్తుంది. ఐతే మోకాలుచిప్ప సమస్యలు లేదా ఇటీవలకాలంలో మోకాలికి గెబ్బ తగిలి వున్నా, ఆ ప్రాంతంలో వాపు వున్నా, తుంటి భాగం సమస్యలు వున్నా ఈ ఆసనం వెయ్యకుండా వుండటం మంచిది.

గెలుపు

సి. యమున

"సత్యమూర్తిగారు, ప్రయాణానికి సిద్ధంచేసుకుంటున్నారు కదా..." ఉరుముతున్నట్లే అడిగారు ఎదురుగా ఉన్న ప్రిన్సిపాల్ నరసింహం గారు. నరసింహం అవతారం ఏమోకాని ఈ మనిషి మటుకు మనిషి రూపంలో ఉన్న సింహమే!

"సార్, మరీ నేను..." గొంతు పెగుల్చుకుని నేను చెప్పే ప్రయత్నంలో ఉండగానే... "టైమ్‌కు బయలు దేరండీ. మీరు దగ్గరుండి మరీ కప్పు పట్టుకురావాలి మన స్కూల్‌కు" నేను చెపుతున్న మాటను గుంతలో తొక్కుతూ ఆయన డిక్లేర్ చేశారు.

చిత్తూరు జిల్లా కుప్పంలో కాలిక్యులేషన్స్, ఈక్వేషన్స్ అవసరంలేని, క్రియేషన్స్‌కు అవకాశంలేనిహిస్టరీ క్లాస్‌లు చెప్పుకుంటూ గడిపేసే టీచర్ ఉద్యోగం నాది. మా స్కూల్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ ఖోఖో పోటీల్లో ఆడటానికి క్వాలిఫై అయ్యారు.

చిత్తూర్ టౌన్‌లో మూడురోజులు పోటీలు, పిల్లలని వెంటపెట్టుకుని వెళ్ళవలసిన పి.టి. టీచర్, నా స్నేహితుడూ అయిన చలపతి జ్వరం వచ్చి వెళ్ళలేని స్థితిలో ఉన్నాడు. వాడు నాకు ఒక ముక్క కూడాచెప్పకుండా డైరెక్ట్‌గా ప్రిన్సిపాల్‌తో నేను పిల్లలతో వెళతానని చెప్పేశాడు. అలా నన్ను బుక్ చేశాడు.

'ఇదేమిటీ' అని వాడిని నిలదీశాను.

"నువ్వే ఏదో స్వయంగా ఆడేసి కప్పుతీసుకురావాలి అన్నట్లు అంత కంగారెందుకురా! ఏదో టీమ్ మేనేజర్‌లాగా వెళుతున్నావు, అంతేగా! కోచ్ కూడా వస్తున్నాడు. ఇంకేంటి ప్రాబ్లమ్" అంటూ దబాయించిపారేశాడు. అప్పటినుండీ నాకు టెన్షన్ మొదలైంది.

అది వాళ్ళు ఓడతారా, గెలుస్తారా అనికాదు. అంతమంది చిన్నపిల్లల బాధ్యతలో ఏదన్నా జరగరానిది చోటుచేసుకుంటే ఎలా అనే భయం.

ఈ రోజుల్లో లేచినదగ్గరనుండి కిడ్నాప్‌లు, యాక్సిడెంట్స్, ఉన్మాదుల దాడులు... ఎన్నిరకాల ప్రమాదాలు పొంచివున్నాయో!

తొమ్మిదిమంది ప్లేయర్స్, ముగ్గురు ఎక్స్‌ట్రా ప్లేయర్స్, మొత్తం పన్నెండుమంది పిల్లలను వెంటవేసుకుని చిత్తూరు బయల్దేరాను.అందరూ పదమూడు ఏళ్ళలోపు పిల్లలే. ఒకటికి పదిసార్లు ఆ పంద్రెండు తలకాయలు లెక్కపెడుతూనే ఉన్నాను.

మాతోపాటు బయలుదేరిన కోచ్ ప్రకాష్ ఏమీ పట్టనట్లు పేపర్ చదువుకుంటూ తనవరకు తను గిరిగీసుకుని కూర్చున్నాడు. బహుశా గ్రౌండ్‌లో మాత్రమే తన కోచింగ్ బాధ్యత, అది దాటితే తనకు సంబంధం లేదనుకుంటున్నాడా!

చిన్నపిల్లల పూర్తి బాధ్యత నాదవ్వటంవలనో లేదా నా పిరికి స్వభావంవల్లో నాకు మహా కంగారుగా ఉంది. చిత్తూరు చేరేసరికి సాయంత్రం అయ్యింది. పోటీలు కండక్ట్ చేస్తున్న స్కూల్‌కి వెళ్ళి అడ్మినిస్ట్రేటర్‌కి రిపోర్ట్ చేసి మా బస మేం ఏర్పాటు చేసుకున్నట్లు కూడా తెలియచేశాను.

వివిధ ప్రాంతాలనుండి వచ్చిన పిల్లలతో అక్కడంతా కోలాహలంగా ఉంది. దాదాపు ముప్పైస్కూల్స్ నుండి వచ్చిన పిల్లలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. పోటీలు నిర్వర్తిస్తున్నవాళ్ళే (బస ఏర్పాట్లు) స్టే కూడా ఎరేంజ్ చేస్తారు. అవి సాధారణంగా క్లాస్ రూమ్స్‌లోనో, లేదా హాస్టల్ రూమ్స్‌లోనో ఏర్పాట్లుచేస్తారు.

అవి అంత సౌకర్యంగా ఉండవేమో అన్న ఆలోచనతో చలపతి తన మేనల్లుడి ఇంట్లో ప్లాన్ చేశాడు. పిల్లలేవిధంగానూ డిస్టర్బవ్వకుండా ఆ కప్ కొట్టాలని వాడి ధ్యేయం. చలపతి చెప్పినట్లు కొంగారెడ్డి పల్లెలో ఊరికి కొస్త దూరంగా ఉన్న 'ఈశ్వర' అపార్ట్‌మెంట్స్ చేరుకున్నాము. ఆ రోజు తన మేనల్లుడు భాస్కర్ వారంరోజులు క్యాంప్‌కి వెళుతున్నాడని, వాచ్‌మెన్ దగ్గర 'కీ' తీసుకోమనీ చలపతి ముందుగానే చెప్పటంతో బిల్డింగ్ ఎంట్రన్స్ ప్రక్కగా ఉన్న గది దగ్గరికి వెళ్ళి వాచ్‌మెన్‌ని కీ అడిగాం.

"ఇంకా లిఫ్ట్ కనెక్ట్ చెయ్యలేదు బాబు. మెట్ల మీదుగా వెళదాం" అంటూ దారితీశాడు.

కొత్తగా కట్టిన బిల్డింగ్. పెయింట్ వాసన గమ్మత్తుగా ఉంది. మెట్లు ఎక్కుతుంటే మెట్ల క్రింద చిన్న రూమ్‌లాగా ఏర్పడ్డ జాగాలో పడేసిన ఖాళీ పెయింట్ డబ్బాలు కనపడ్డాయి.

"ఫ్లోర్‌కి మూడుచొప్పున నాలుగు ఫ్లోర్స్‌లో మొత్తం పంద్రెండు ఫ్లాట్స్ బాబూ. గృహప్రవేశాలయ్యాయి కాని ఇంకా అందరూ రాలేదు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మూడు కుటుంబాలు, రెండో ఫ్లోర్‌లో ఈ బాబు, మూడో ఫ్లోర్‌లో ఒక కుటుంబం వచ్చారు. మూడో ఫ్లోర్‌వాళ్ళు ఊరు వెళ్ళారు" ఫ్లాట్ చేరేలోపు అడక్కపోయినా సమాచారం అందించాడు వాచ్‌మాన్.



అప్పట్లో 80 కిలోలు

ఇప్పుడింత సన్నగా, నాజూగ్గా ఉన్న 'హలో' తార కల్యాణి ప్రియదర్శన్ స్కూల్లో చదువుకున్న రోజుల్లో ఎనభైకిలోల బరువు ఉండేదట. "మామూలుగా నేను తిండిపోతును.ఇంత స్లిమ్‌గా తయారవడానికి చాలా కష్టపడ్డాను. అయితే బరువు తగ్గడానికి షార్ట్ కట్స్ అయితే అనుసరించలేదు.

డైట్, బ్యాడ్మింటన్, సైక్లింగ్‌వంటి అనేక వ్యాయామాలతో సన్నబడ్డాను. నాకు చిన్నప్పటినుంచీ కూడా హీరోయిన్ కావాలన్న ఆలోచన వుందికాబట్టి సినిమాలు లేకుండా నా జీవితాన్ని మరోమాదిరి ఊహించుకోలేదు" అని చెప్పింది.



చిన్న సిట్ అవుట్, దానినుండి హాల్లోకి ఎంట్రన్స్. హాల్‌కి కనెక్ట్ అవుతూ రెండు బెడ్‌రూములు, కిచెన్. మాతోపాటు లోపలికి వచ్చిన వాచ్‌మెన్ డైనింగ్ టేబుల్‌మీద ఏర్పాటుచేసిన భోజనాలు, బెడ్ రూమ్‌లో ఓ ప్రక్కగా ఉంచిన చాపలు, దిళ్ళు, దుప్పట్లు చూపించాడు.

చలపతి ఇచ్చిన గైడెన్స్ ఎఫెక్టో ఏమో తెలీదుకాని బ్యాచిలర్ అయిన భాస్కర్ చేసిన ఆ ఏర్పాట్లు ముచ్చటగా అనిపించింది. "భాస్కర్ బాబు మీకు ఏమి అవసరమైనా చూసుకోమని నాకు చెప్పివెళ్ళాడు. మీకు ఏమి కావాలన్నా అడగండి బాబు" అంటూ నాలుగుసార్లు చెప్పివెళ్ళాడు వాచ్‌మెన్.

అతన్ని పంపించి ఫ్లాట్ తలుపేస్తూ చూశాను, ఎదురుగా ఆక్యుపై చెయ్యని రెండు ఫ్లాట్స్ తాళాలు వేసివున్నాయి.

రెండు రోజులు ఎంత వేగంగా గడిచిపోయాయో తెలీదు. ఈ రెండు రోజుల్లోనూ మా స్కూల్ పిల్లలు అద్భుతంగా ఆడి అవతల టీములను అవలీలగా ఓడించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. కోచ్ ప్రకాష్, ఊరిలోని చలపతి ఆనందం పట్టనలవి కావట్లేదు. పిల్లలు కూడా అమితోత్సాహంతో ఉన్నారు.

పిల్లలకి అతి ఉత్సాహంతో నిద్ర వస్తున్నట్లులేదు. హాల్లోనే అందరూ పక్కలు పర్చుకుని తమలోతాము మాట్లాడుకుంటూ స్పోర్ట్స్ ఛానెల్ చూస్తున్నారు. నిద్ర లేకుండా గడిపితే రేపు ప్రొద్దున వాళ్ళు ఫ్రెష్‌గా ఉండటం కష్టమనిపించింది నాకు.

"పద్దైంది. తొందరగా నిద్రపోండి. రేపు మీరందరూ ఫుల్ ఎనర్జీతో ఉండాలిగా" అన్నాను.

నా మాట విని టీవీ ఆపేసి బుద్ధిమంతులైన ఆ పిల్లలు వెంటనే పడుకోవటానికి సిద్ధమయ్యారు.

ఎవరో గొంతునులుముతున్నట్లుగా ఊపిరాడటంలేదు. గుక్కతిప్పుకోని దగ్గు. మెలకువవచ్చేసింది. ఒక క్షణం ఎక్కడ ఉన్నానో అర్థంకాలేదు.

కళ్ళు కనపడకుండా, ఊపిరాడకుండా ఫ్లాట్‌అంతా పొగ చుట్టేసింది. కరెంట్ లేదు, చీకటి. ఉలిక్కిపడి మంచం దిగి మొబైల్ లైట్‌లో తడుముకుంటూ హాల్లోకి నడిచాను. ఇద్దరు ముగ్గురు పిల్లలు ప్రక్కల మీద కూర్చుని తీవ్రంగా దగ్గుతున్నారు.

మిగతావాళ్ళు అలసటవల్ల అనుకుంటా మేల్కోలేక అలాగే నిద్రల్లో దొర్లుతున్నారు.వెంటనే సిట్ ఔట్‌లోని మెయిన్‌రోడ్డుదగ్గరకు వెళ్ళబోయా.అక్కడ నుండి తీవ్రమైన పొగ, వేడిసెగలు వస్తున్నాయి. ఆ సమీపంలోకి కూడా వెళ్ళే పరిస్థితి లేదు.

ఏదో పేలుతున్న శబ్దం. బాంబులా? ఒక్కక్షణం గుండె తీవ్రంగా కొట్టుకుంది.ఊహు, బాంబులు కాదు. బాంబులైతే ఈపాటికి నష్టం తీవ్రంగా ఉండేది. మరేమయ్యుంటాయి. 'ఇప్పుడు చెయ్యాల్సింది కారణాలు వెతకటంకాదు. పరిస్థితినుండి బయటపడటం' మనసు హెచ్చరించింది.


"అవును, దీనినుండి ఎలా బయటపడాలి? బయటకు వెళ్ళటానికి ఉన్న ఒక్కగానొక్క డోర్ ముందు దాకా మంటలు చుట్టుముట్టినట్లున్నాయి. క్రింది అంతస్తుదాకా మంటలు వచ్చేసి ఉంటాయి.

అందుకే ఆ సెగ, పొగ. వాటిని దాటుకుని కిందకు దిగలేము. ఏ క్షణంలోనయినా ఆ మంటలు ఈ ఫ్లోర్‌లోకి వ్యాప్తిచెంది తలుపుకు అంటుకోవచ్చును" ఆలోచనలతో తల తిరిగిపోతోంది.

ప్రకాష్ కూడా లేచివచ్చాడు. 'సార్, ఏమయింది' కంగారుగా అడిగాడు. పరిస్థితి పూర్తిగా నాకూ తెలియకపోయినా అర్థమైందేదో చెప్పాను.

పిల్లలందరూ లేచారు. వాళ్ళ మొహాలనిండాకంగారు. వాళ్ళల్లో వాళ్ళు టెన్షన్‌గా డిస్కషన్స్... కొందరు ఊపిరందక దగ్గుతున్నారు. వాళ్ళ దగ్గులు భరించలేనట్లు ఉంది. "ఇప్పుడెట్లా..." వణుకుతూ అడుగుతున్నాడు ప్రకాష్. నాకన్నా భయస్తుడిలా ఉన్నాడు.

"ప్లీజ్, కంట్రోల్ యువర్ సెల్ఫ్. మన భయం



పెద్ద లక్ష్యాల్లేవు

తనో తెల్లకాగితం లాంటిదాన్ని అంటూ వెన్న ముద్ద అందాల రాశీఖన్నా చెప్తోంది. తాను చేయ గలిగినదే చేస్తా అంటూ గిరిగీసుకుని కూర్చునే తత్వం తనకు అస్సలు లేనేలేదట.

"అన్నీ చేసేయగలనని చెప్పడంకాదు.కాని నేను పలానాదిమాత్రమే చేయగలనని హద్దులు పెట్టు కోలేను. దర్శకులు నాపై నమ్మకం ఉంచి పలానా పాత్ర చెయ్యి అంటే అది చేయగల ధైర్యం నాలో ఉంది. పెద్దపెద్ద లక్ష్యాలు, అర్థతకుమించిన కలలు కనడం మొదటినుంచి అలవాటు లేదు" అంటూ తన సిద్ధాంతాల జాబితా విప్పిచెప్పింది.



అతిగా బయటపెడితే పిల్లలు అసలు తట్టుకోలేరు. దగ్గుతో ఊపిరాడక వాళ్ళు ఏమైపోతారో అని కంగారుగా ఉంది. ఏం చెయ్యాలో ఆలోచించండి" అతనికి మాత్రమే వినపడేటట్లు మెల్లగా,స్థిరంగా చెప్పాను.

"సర్, మాకు ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ క్లాసులో చెప్పింది గుర్తుకువస్తోంది" నీళ్ళు నములుతూ చెపుతున్నాడు కోచ్ ప్రకాష్.

"క మాన్, అదేదో తొందరగా చెప్పండి" అని కమాండ్‌గా అడిగాను. నా గొంతులోని కమాండ్‌కు నేనే ఆశ్చర్యపోయాను.

"తడిబట్ట అడ్డం పెట్టుకుని పీలిస్తే పొగ..." అతని జవాబు పూర్తికాకముందే వేగంగా బాత్‌రూమ్‌లోకి వెళ్ళి బక్కెట్ నిండా నీళ్ళు తీసుకువచ్చాను.

బాల్కనీలో తాడుమీద, హాల్‌లో కిటికీలమీద, కుర్చీలమీద ఆరేసిన బట్టలు చేతికి వచ్చినవి గుంజి బకెట్‌నీళ్ళల్లోముంచి, పిండి ఇచ్చి 'ముక్కుకు అడ్డం పెట్టుకుని గాలి పీల్చండి' అని హెచ్చరిక చేశాను.

అందరూ వాటిని గబాగబా అందుకుని ముక్కులకు అడ్డంపెట్టుకున్నారు. కాస్త దగ్గులు తగ్గాయి.

నేనూ ముక్కుకు ఓ తడి బట్ట అడ్డంపెట్టుకుని, ప్రకాష్‌కి ఇంకో టవల్ అందించాను. కాస్త భయంగా ఉంది. మెయిన్‌డోర్‌దగ్గర ఆరెంజ్ రంగునీడలు కనపడ్తున్నాయి.అంటే ఇంకొంచెంసేపట్లో అగ్నికి ఆహుతి కాబోతున్నామన్నమాట. గుండె దడదడలాడింది.

ఫోన్ చేతిలోకి తీసుకున్నాను "ఎవరికి చెయ్యాలి? ఇరుగూ పొరుగూ ఎవరూ తెలియదు. ఫీడ్ చేసిపెట్టుకున్న పోటీలు నిర్వహించే స్కూల్ ల్యాండ్ లైన్ నంబర్ తప్పితే ఏ నెంబర్లు లేవు. ఆఫీస్‌లో ఉండే ఆ నెంబర్ ఈ టైమ్‌లో ఎవరు తీస్తారు?ఐనా ఆశతో నాలుగు సార్లు డయల్ చేశాను. ఎవ్వరూ తియ్యలేదు. కొంతమంది పిల్లలు సన్నగా ఏడుపు మొదలెట్టారు.

నా భయాన్ని ప్రక్కకునెట్టి "ఊరుకోండి, ఏమీ కాదు... ఫైర్ ఇంజన్స్ వస్తాయి" నాకు తోచిన మాటలతో వాళ్ళకు ధైర్యంచెప్పే ప్రయత్నం చేశా.

బయట మంటలకు హాల్ వేడెక్కిపోతోంది. క్షణ క్షణానికీ పెరిగిపోతూ చుట్టేస్తున్నపొగతో గాలిపీల్చుకోవటం కష్టమైపోతోంది. ఆ పరిస్థితినుండి దూరంగా పిల్లలందరినీ హాల్‌కి ఆనుకున్న బాల్కనీలోకి తీసుకెళ్ళాను. కాస్త ఓపెన్ ఎయిర్ ఉన్నది అక్కడే!

తడిబట్ట అడ్డు తీసి గుండెలనిండా గాలి పీల్చుకున్నాను. పొగ బాల్కనీలోకి కూడా దూసుకొస్తోంది. ఇంతుమించు పిల్లలందరూ ఏడుపు మొదలెట్టేశారు. వాళ్ళ అందరి మొహాల్లో నాకు నా ఐదేళ్ళకొడుకే కనపడ్తున్నాడు. "పిల్లని తీసుకొచ్చింది నేను. క్షేమంగా తిరిగి వాళ్ళ తల్లితండ్రులకు అప్పగించాల్సిన బాధ్యత కూడా నాదే! ఏదోకటి చెయ్యాలి" నాలో ఆవేశం.

బాల్కనీలోనుండి కిందకు తొంగిచూశాను. ఎత్తు నుండిచూస్తే కళ్ళు తిరిగినట్లయింది. నా దృష్టి బాల్కనీని ఆనుకుని కిందకి వెళ్తున్న పైప్‌లైన్ మీదపడింది. ఇంకా ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యదల్చుకోలేదు. నేను చేయబోయే పని ప్రకాష్‌కి చెప్పాను.

"సార్, మమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతారా?" అని బేలగా అడిగాడు ప్రకాష్.

"మీరో, నేనో ఈ పనిచెయ్యాలి ప్రకాష్. పసివాళ్ళు ఆ పని చెయ్యలేరు. వాళ్ళు చేస్తామన్నా మనం ఒప్పుకోలేంకనుక మీరు డిసైడ్‌చేయండి. మీరా, నేనా" అని చెప్పి క్షణాలు లెక్కపెట్టటం మొదలుపెట్టాను.

ప్రకాష్ నుండి జవాబు లేదు. "క్విక్" తొందర పెట్టాను. "సారీ సర్, మీకు ఉన్నంత ధైర్యం నాకు లేదు" అన్నాడు. ఆ మాటకు అంత టెన్షన్‌లోనూ నా ధైర్యం గురించి నాకు నవ్వు వచ్చింది.

పిల్లలకి 'తడిబట్ట ముక్కుకు అడ్డంగా పెట్టుకునే గాలి పీల్చమని, భయపడద్దని' గట్టిగా చెప్పాను. వాళ్ళు ఏడుపు గొంతులతోనే 'ఎస్, సార్' అనిజవాబు చెప్పారు.నేను మెల్లగా బాల్కనీ పిట్టగోడ ఎక్కి వంగి జాగ్రత్తగా పైపును ఓ చేత్తో పట్టుకున్నాను. ఆ తరువాత ఒక కాలు పైపుకేసి నొక్కిపట్టి రెండో చేయి కూడా కలిపి పైపును గట్టిగా పట్టుకున్నాను.

తరువాత రెండో కాలుకూడా తీసి పైపుకు పట్టు బిగించి నెమ్మదిగా కిందకు జారటం మొదలెట్టాను. "ఒక్కో ఇంచ్ జారుతున్నానే కాని మనసులో భయం గుప్పుమంటున్న పొగకన్నా ఘోరంగా చుట్టేసింది. ఇంతలో చేతిమీద ఏదో పాకుతున్న భావన. బహుశా బొద్దింక. ఒంటిమీద వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. రెండో చేత్తో దాన్ని తోసేశాను.

ఆ ప్రయాసలో స్లిప్ అయ్యాననే అనిపించింది. గబుక్కున తిరిగి పైపు పట్టుకున్నాను. సగం పైనే జారాను. పైన పిల్లల ఏడుపులు, మాటలు కలగాపులగంగా వినపడుతున్నాయి.

ఇంకో నాలుగు అడుగులు జారాను. అక్కడ పైప్ లీక్ ఉన్నట్లుంది. దుర్గంధం. కడుపులో తిప్పేసింది. కళ్ళు తిరిగినంత పనైంది. పళ్ళ బిగువున ఉగ్గపట్టుకుని వేగంగా కిందకి జారాను. ఆ వేగానికి పైపు కాస్త ఊగింది. గుండెజారి గొంతులోకి వచ్చినట్లయింది. ఒక్క క్షణం నా భార్య, కొడుకు గుర్తుకొచ్చారు.

ఆచితూచి జారుతూ నేలకు చేరాను. ఒకక్షణం ఊపిరి పీల్చుకుని పట్టేసిన చేతులు, కాళ్ళు సాగదీసుకున్నాను. వెంటనే బిల్డింగ్‌ముందుకు పరుగెత్తాను. అగ్నికీలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

నిప్పుల్లో రంగు డబ్బాలు పేలి పడుతున్నాయి. వాచ్‌మెన్, ఇరుగుపొరుగువారు, గ్రౌండ్‌ఫ్లోర్ ఫ్లాట్స్‌లో వాళ్ళు బక్కెట్లతో నీళ్ళుపోస్తూ ఆర్పటానికి ఎంతగానో ప్రయాసపడుతున్నారు.

"ఖాళీ అయిన టర్పెంటైన్ డబ్బాలు, పెయింట్ డబ్బాలు అమ్ముకుందామని మెట్లకింద ఉన్నకరెంటు మీటర్‌కింద పెట్టావు. మీటర్ షార్ట్ సర్క్యూట్ అయ్యి స్పార్క్ వచ్చి అవి అంటుకుని ఇలా పీకలమీదకు తీసుకొచ్చాయి"వాచ్‌మెన్‌ని తిడ్తున్నాడు ఒకాయన.

వెంటనే వారిమధ్యకు దూసుకువెళ్ళి నేను చేసిన పని, అక్కడ వున్న క్లిష్ట పరిస్థితి క్షణాల్లో వివరించాను. వెంటనే అందరూ బిల్డింగ్ వెనక్కి చేరి చేతిలో ఉన్న మొబైల్స్ ఆన్‌చేసి పైకి ఫోకస్ చేశారు. లీలగా పిల్లలు కనపడుతున్నారు. గట్టిగా అరిచి పిల్లలకు ధైర్య వచనాలు చెప్పటం మొదలెట్టారు.

"నావలనే ఇదంతా! పాపం పిల్లలు ఏమైపోతారో ఏమో" బాధగా అన్నాడు వాచ్‌మెన్.



> భారతదేశంలో శాంటాక్లాజ్‌కి భిన్నంగా తెల్లగడ్డపు ముసలాయన ప్రజల డబ్బు దోచి సాక్స్ మాత్రం మిగులుస్తాడు.
>
> -మనీష్ తివారీ, కాంగ్రెస్ నేత

"ఫైర్ ఇంజన్స్ నెంబర్ కలిసింది. బయలుదేరా రుట. పావుగంటలో వచ్చేస్తారుట" సమాచారం అందించాడు ఓ యువకుడు.

"అంతసేపు ఆగే పరిస్థితిలేదు అక్కడ. ఏ క్షణంలో అయినా మంటలు ఫ్లాట్‌లోకి ప్రవేశించవచ్చు. పొగతో పిల్లలు ఊపిరి ఆడక స్పృహ తప్పేటట్లు ఉన్నారు" ఆందోళనగా చెప్పాను.

అందరిలో కంగారు, బాధ. గాభరాగా ఏవేవో మాట్లాడుతున్నారు. అగ్నిమాపక దళం వాళ్ళు వచ్చే దాకా ఆగే పరిస్థితి లేదు. వాళ్ళని కిందకు వెంటనే దింపాలి.కాని ఎలాగో ఏం తట్టటంలేదు. "ఫైర్‌ఇంజన్ వాళ్ళు వస్తే ఈ పరిస్థితిలో ఏం చేస్తారు?" అన్న పంథాలో వేగంగా ఆలోచించటం మొదలెట్టాను.

"నిచ్చెన వేసి దింపటం లేదా ఏదన్నా తాడు ఆ బాల్కనీ రాడ్‌కు కట్టి జారమనటం. మూడోది నెట్ పట్టుకుని వాళ్ళని పైనుండి జంప్ చెయ్యమని పట్టు కోవటం" నా మనసులో తట్టిన మూడు ఆలోచన లను వెంటనే అక్కడ వాళ్ళకు చెప్పాను. అంత పొడుగు తాడు, నిచ్చెన లేదని తేల్చేశారు.


ఇహ నెట్ ఉండే అవకాశమే లేదు కనుక "మీరు వెంటనే మీ ఇళ్ళల్లో గట్టి దుప్పట్లు పట్టుకురండి. ఒకదానితో ఒకటి జమిలి చేసి పట్టుకుని వాళ్ళను దూకమని చెపుదాము" అభ్యర్థనగా అన్నాను.

"సార్, బిల్డర్ బిల్డింగ్ డక్ట్‌లో రక్షణకోసం బిగించ టానికి 'డక్ట్ ఏరియా సేఫ్టీ నెట్' కొన్ని స్టోర్ రూమ్‌లో పెట్టాడు" ఉద్వేగంగా చెప్పాడు ఆ యువకుడు.

అంతటితో ఆగకుండా వాచ్‌మెన్ తీసుకుని బిల్డింగ్‌కి ఓ మూలగా ఉన్న స్టోర్ రూమ్‌కేసి వేగంగా అడుగులు వేశాడు. రెండునిమిషాల్లో ఇద్దరూ నెట్‌ని మోసుకుంటూవచ్చారు. ఈలోపు నేను ప్రకాష్‌కి ఫోన్ చేసి చెయ్యవలసినది చెప్పాను.

అతను వణికిపోతున్నాడు. ఆమాత్రం రిస్క్ తీసుకోబోతే ప్రాణానికే ముప్పవ్వచ్చు అని గట్టిగా చెప్పాను. అంతకుమించి గత్యంతరం కూడా లేకపోవటంతో తను నేను చెప్పింది చెయ్యటానికి సిద్ధపడ్డాడు. అందరం ఊపిరి బిగపట్టుకుని నెట్‌ను వెడల్పుగా చేసి గట్టిగా పట్టుకున్నాము.

మొట్టమొదట ప్రకాష్ సహాయంతో ఓ పిల్లవాడు పైనుండి కిందకు దూకాడు. వెంటనే అతన్ని నేల మీదకు దింపాము. అలా దింపినవారిని ఓ ప్రక్కగా కూర్చోపెట్టి, నీళ్ళు ఇచ్చి, సేద తీర్చి, కలిగిన భయాన్ని పోగొట్టే బాధ్యత ఆడవారికి అప్పగించాము.



మన దేశంలో సామాన్యులపై చట్టం వేగంగా పనిచేస్తుంది. అర్థబలం, అంగబలం వున్నవారి విషయంలో ఆ వేగం కనిపించదు.

-పవన్‌కళ్యాణ్, జనసేన అధినేత

మరల నెట్‌ను గట్టిగా పట్టుకున్నాము. 'సెండ్' అని గట్టిగా అరిచాను. ఇంకో పిల్లవాడు దూకాడు. మొదట ఇద్దరూ క్షేమంగా కిందకు దూకటంతో పిల్ల ల్లోను, ప్రకాష్‌లోను కాన్ఫిడెన్స్ వచ్చిందనుకుంటా ఏడుపులు ఆగిపోయాయి. పదినిమిషాలలో ఒకరి తరువాత ఒకరూ అందరూ కిందకు దూకేశారు.

అందరికీ దగ్గరుండి సహాయం చేసిన ప్రకాష్ చివరిగా దూకాడు. సక్సెస్‌ఫుల్‌గా అందరూ క్షేమంగా కిందకు చేరటంతో అక్కడున్నవారందరిలో ఆనందం. "మీరు సమయస్ఫూర్తితో ధైర్యంగా అడుగు వేయ బట్టి ఇంతమంది ప్రాణాలు దక్కాయి..." అంటూ అందరూ నన్ను అభినందించారు.

ప్రకాష్ నన్ను గట్టిగా కౌగిలించుకున్నాడు. పిల్లలు కూడా చుట్టుముట్టారు. నాలో ఏదో సంతృప్తి. ఫైర్ ఇంజన్స్ బిల్డింగ్‌లో ప్రవేశించాయి. ఇంకా ప్రజ్వ రిల్లుతున్న మంటల్ని పైపులతో నీళ్ళుకొట్టి ఆర్పారు. తూర్పున వెలుగురేకలు పరచుకున్నాయి.

పొగ చూరిపోయిన మెట్లమీదుగా ఫ్లాట్‌లోకి వెళ్ళాము. ఫ్రెంట్ డోర్ కాలి బూడిదయ్యింది. వేడికి గోడమీద కాలెండర్స్ మసిబారిపోయాయి. కిటికీ అద్దాలు బ్రేక్స్ ఇచ్చాయి. ఒకరితరువాత ఒకరు జాగ్ర త్తగా ఆచితూచి అడుగులు వేసుకుంటూ లోపలికి వెళ్ళాము.

అవన్నీ చూసి మేం ఎటువంటి ప్రమాదం నుండి బైటపడ్డామో అర్థమయ్యి ఒక్కక్షణం మనసు వణికింది. ఆ సంఘటన వలన పిల్లల్లో మొదట ఏర్పడ్డ భయం తొలగిపోయి ఓ సాహసకృత్యమే మనసంతా నిండి పోయిందనుకుంటా కొత్త ఉత్సాహంతో ఉన్నారు.

కాలకృత్యాలుతీర్చుకునిరెడీఅయిపోయి స్కూల్‌కి ఉరుకులు పరుగుల మీద చేరుకున్నారు. ఆట పోటా పోటీగా జరిగింది. మా స్కూల్ పిల్లలు ప్రత్యర్థి రేడి యంట్ స్కూల్‌మీద ఫైనల్స్ గెలిచారు.

సంబరం అంబరాన్ని అంటింది. నాకూ చెప్పలేని ఆత్మతృప్తి. అప్పుడు చలపతికి ఫోన్‌చేసి రాత్రినుండి ఇప్పటి గెలుపుదాకా జరిగిన విషయం చెప్పాను.

పిల్లలు కూడా వారి వారి ఇళ్ళకు ఫోన్స్‌చేసి యాక్సి డెంట్‌నుండి బయటపడిన విధానం,ఆటలో గెలుపు గురించి ఎంతో ఉత్సాహంగా చెప్పారు.

తిరిగి కుప్పం చేరుకున్నాము. సరాసరి స్కూల్‌కే వెళ్ళాము. స్కూల్‌లో మాకు ఘన స్వాగతం పలికారు. చలపతి నన్ను ఆలింగనమే చేసుకున్నాడు. వాడి కళ్ళల్లో చెమ్మ. అక్కడకు చేరుకున్న తల్లిదం డ్రుల కళ్ళల్లోనూ ఇంచుమించు అదే భావన.

వారి వారి పిల్లలను ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నారు. వారి పిల్లలను వారికి క్షేమంగా అప్ప గించినందుకు నాలో ఓ రిలీఫ్. గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఉపన్యాసంలో మాట్లాడుతూ 'అంత టెన్షన్‌కు గురైకూడా, వెంటనే తేరుకుని బాగా ఆడి గెలుపు సాధించినందుకు మన హీరోలకు నా అభినంద నలు' అంటూ పిల్లలకు విషెస్ తెలియచేశాను.

"మీరుగనుక ఆ సాహసం చెయ్యకపోతే ఈనాడు ఏ పరిస్థితిలో ఉండేవారేమో...! ప్రాణాలు ఉంటేనే కదా ఆపై గెలుపులన్నీ! మీరూ రియల్ హీరో" అని అంటూ మా ప్రిన్సిపాల్ నరసింహంగారు సాధువు లాగా చిరునవ్వుతో పలికారు.

అది విని పిల్లలు అందరూ 'రియల్ హీరో' అని అరవటం మొదలుపెట్టారు. "నెక్స్ట్ జరగబోయే ఇంటర్ స్టేట్ పోటీలకు కూడా మన రియల్ హీరో గారే టీమ్‌తో వెళ్ళాలని నా రిక్వెస్ట్" అంటూ చలపతి వినయం ఒలకబోస్తూ టీజింగ్‌గా అరిచాడు.

"చంపుతాను" అని వేలుతో సైగచేసి చూపించాను. గ్రౌండ్ అంతా నవ్వులతో నిండిపోయింది.



ఆ రెండూ లేవు

పదమూడేళ్ళ వయస్సునుంచి బిజీబిజీగా గడి పేస్తున్న తమన్నాకు మూడుపదులు వచ్చేసినా అస్సలు డేటింగ్‌కు తీరిక లేనేలేదంటున్నది.

"కొన్నిసార్లు నాకు తిండి తినడానికి సమయం చిక్కదు. ఇక అటువంటప్పుడు ప్రేమకు తీరిక ఎక్కడ దొరుకుతుంది. పైగా డేటింగ్‌లాంటివాటికి మనస్సు ప్రశాంతంగా ఉండాలి. కావాల్సినంత తీరిక ఉండాలి. నాకేమో ఈ రెండూ లేవు.

అయినా జరగబోయేవాటిగురించి పగటికలలు కనకూడదన్నది నా అభిప్రాయం. వృథా ఆలోచన లతో సమయాన్ని గడపక, నేను వాస్తవంలో జీవి స్తుంటా" అని చెప్పిందీ మిల్కీ బ్యూటీ.

Japan



Japanese call their country the "Land of the Rising Sun". People once thought that their emperor was the son of the Sun goddess.



An ikebana flower arrangement is like a poem, except that it uses flowers instead of words to say something!

ikebana



Torii gate


If you see a Torii gate, it means that there is a Shinto shrine inside. Shinto ia an old Japanese religion.



origami

Look at all the things you can make by folding paper! The Japanese are very good at this art, called origami.





Come, join the hanami picnic! In spring, people come to the park to enjoy the beautiful sakura flowers. Can you see Mount Fuji in the background?


Mount Fuji

sakura

When you meet someone, don't forget to bow to show respect!

bow

hanami



bullet train

If you miss the last bullet train, you can stay in a capsule hotel for the night. The hotel rooms are so tiny that you cannot even stand up in them!



capsule hotel



Girl's Day

On Girl's Day, girls put up dolls of the Emperor and Empress. Sometimes they put up dolls of the whole royal court!



samurai



Boy's Day

Long ago, samurai warriors fought bravely for their warlord masters. On Boy's Day, families put up samurai dolls so that boys will grow up strong and brave, like the samurai!



sushi

Have you ever eaten sushi? Sushi has rice, raw fish and seaweed in it. Don't take too much wasabi with your sushi- it is very, very hot!



wasabi




samurai doll

Drinking tea in Japan can take up to four hours! The tea ceremony is simple and relaxing. This tradition began 500 years ago.



tea ceremony

Sumo wrestlers are huge! I wonder how much sushi they can eat? They need to be heavy so that they can wrestle well.



Sumo wrestlers

వసంతసేనా చారుదత్తం

సీరియల్



"మీ ఇంటికి కన్నంవేసి, దాపరికపు నగను అపహరించిన దొంగను. మీ విషయంలో తప్పుచేసినవాణ్ణి. నన్ను క్షమించాలి! మీ శరుణు వేడ్తున్నాను"అన్నాడతను.

"మిత్రామా! నువ్వు ఉపకారమే చేశావు నాకు" అన్నాడు చారుదత్తుడు గౌరవంగా.

"కుల గౌరవాలను, అభిమానాలను సంరక్షించదలచిన సజ్జనుడు ఆర్యకుడు యజ్ఞవాటికలో దుష్టపాలకరాజును యజ్ఞపశువుగా వధించాడు" అన్నాడు శర్విలకుడు.

"శర్విలకా! పాలకరాజు గొలపల్లె నుంచి తెప్పించి, నిష్కారణంగాబంధించిన ఆర్యకుడ్ని నువ్వు విడిపించావా?" ఆశ్చర్యపోయాడు చారుదత్తుడు.

"అవును"

"ఓహో! చాలా మంచే జరిగింది. ఈ నీ చోరకళ ఈ విధంగా ఉపయోగపడిందన్నమాట!" అని అతడ్ని అభినందించాడు చారుదత్తుడు.

"మీ ప్రియమిత్రుడు ఆర్యకుడు ఉజ్జయినీ రాజ్యం స్వీకరించగానే, వేణా నది ఒడ్డున వున్న కుశాపతి రాజ్యం మీకు ఇచ్చాడు. ఆయన మొదటి మైత్రీ బహుమానాన్ని మీరుమన్నించాలి..." అని అన్నాడు శర్విలకుడు ఎంతో వినయంగా.

వసంతసేన ఆ మాటలు విని ఎంతో సంబరపడిపోయింది. "ఒరే, ఆ పాపి, పాతరాజుగారి బామ్మర్దిని ఇట్లా తీసుకొని రండి" అని సైనికులని ఆజ్ఞాపించాడు శర్విలకుడు. వెంటనే వాళ్ళు బయలుదేరి వెళ్ళారు.

"అయ్యా! ఆర్యకరాజు విన్నవిస్తున్నాడు- ఈ రాజ్యం మీ గుణసంపత్తివల్ల సంపాదించింది గనుక, మీరు స్వేచ్ఛగా ఏ అధికారాన్నయినా వినియోగించుకోవచ్చు" అన్నాడు శర్విలకుడు.

"ఏమది! మా గుణసంపత్తివలనా?" ఆశ్చర్యపోయాడు చారుదత్తుడు.

"ఓరీ శకారకు! రా!రా! నీ పొగరు బోతుతనమునకి ఫలం అనుభవించు" అని భటులు అతడిని విరిచికట్టి, చారుదత్తుడి పాదాలముందు పడేశారు. శకారుడు ఆశ్చర్యపోతూ, "కట్టు తెంచుకున్న గాడిద లాగు ఎంత దూరం పారిపోయినా, లొంగని కుక్కను పట్టుకున్నట్టు, నన్ను పట్టుకొనివచ్చారు.

చుట్టూ రాజపురుషులుండీ నన్ను బంధించారు. దిక్కులేని నేను ఎవరి దిక్కు చేరను? సరే, దీనులని కరుణించే అతడ్నే వేడుకుందాం"అని అనుకొని, "ఆర్య చారుదత్తా...! రక్షించు, రక్షించు" అని కాళ్ళు పట్టుకున్నాడు.

చారుదత్తుడు ముఖం తిప్పుకున్నాడు. "చారుదత్తా వీడ్ని విడిచిపెట్టు మేము చంపెయ్యాలి" చుట్టూవున్న జనాలరుస్తున్నారు.

"నీవు దిక్కులేని వారికి దిక్కు, నన్ను రక్షించు..." వేడుకుంటూనే వున్నాడు శకారుడు.


"ఓరీ, వీణ్ణి ఈయననుండీ పక్కకు లాక్కు వెళ్ళండి..." అని సైనికులను ఆజ్ఞాపించి, "ఆర్యా! చెప్పండి, ఈ పాపిని ఏం చెయ్యమన్నారు?

గట్టిగా కట్టి కుక్కలచేత కరిపించమన్నారా? కొరత వేయించమన్నారా? రంపాలతో కోయించమన్నారా?" అని అడిగాడు శర్విలకుడు. చారుదత్తుడు వసంతసేనవైపు చూశాడు.

"ఏం శిక్ష వేయాలో మీరు చెప్పండమ్మా?" అడిగాడు శర్విలకుడు.

"ప్రజాద్రోహి పాతరాజుకు విధించిన శిక్షలాంటిదే వీడికీ విధించండి" అంది వసంతసేన.

ఏడుస్తున్న శకారుడిని సైనికులు అక్కడ్నించీ ఈడ్చుకువెళ్ళారు. అంతలో అక్కడికి చందనకుడు పరుగుపరుగునొచ్చాడు. "మీరు చూడలేదా? మహారాజుగారి మేడకు దక్షిణంగా గుంపులు గుంపులుగా జనం మూగుతున్నారు. మీరు చనిపోయా



ఖిలందర్

జరిగిన కథ (16)

చారుదత్తుడిని శ్మశానానికి తీసుకువెళుతుంటే జనం అంతా కన్నీరుపెట్టుకుంటారు.


తన కొడుకును ఓమారు చూడాలని ఉందని చెప్పేసరికి తలారులు చారుదత్తుడి కొడుకైన రోహసేనుడిని శ్మశానందగ్గరికి పిలిపిస్తారు.

రోహసేనుడిని కౌగిలించుకుని కన్నీరుపెట్టుకుంటాడు చారుదత్తుడు. శకారుడు బంధించిన బండివాడు మేడమీది నుండి కిందకు దూకి తప్పించుకునొచ్చి తలారులతోచెపుతాడు, చారుదత్తుడు నిరపరాధని, అసలు నేరస్థుడు శకారుడు అని.

బండివాడు తప్పించుకున్నాడని తెలిసి ముచ్చెమటలు పోస్తాయి శకారుడికి. చారుదత్తుడు తలారులున్నచోటుకొచ్చి చారుదత్తుడ్ని త్వరగా చంపమని తొందరచేస్తాడు శకారుడు. నాల్గవసారి చాటింపు వేస్తారు చారుదత్తుడి తల నరికేందుకు.

ఇంతలో అక్కడికి బౌద్ధభిక్షువు, ఉపాసిని తోడురాగా వసంతసేన పరుగు పెట్టుకుంటూ వస్తుంది.చారుదత్తుడు రక్షించబడతాడు.

ఇక జరగబోయేది చదవండి.



రనుకొని, ధూతాంబ అగ్నిప్రవేశంచేస్తున్నారు. నేను నా శాయశక్తులా చెప్పాను 'అమ్మా! సాహసించకండి' అని. ఆర్య చారుదత్తులవారు జీవించేవున్నారని చెప్పినా కానీ దుఃఖంలో మునిగిన ఎవ్వరూ నా మాట వినలేదు" అన్నాడు.

"అయ్యో! నెచ్చెలీ! నేను జీవించివుండగానే ఈ పనికి ఉద్యమిస్తున్నావా? చారుశీలా! నీ చరిత్ర ఈ భూమికి అతీతమయింది. కానీ నన్ను విడిచి నీవొక్కతెవూ పరలోకం కోరుకోవడం తగదు" అని పైకి చూస్తూ, క్రిందపడి సొమ్మసిల్లిపోయాడు చారుదత్తుడు.

"అయ్యో! ప్రమాదం...! అక్కడికి త్వరగా వెళ్ళాలి. ఆర్యుడిక్కడ మూర్ఛపడ్డాడు. అయ్యో, మా ప్రయత్నమంతా విఫలమయ్యేటట్లు కనబడుతోంది" అని శర్విలకుడు ఆవేదన చెందాడు.

వసంతసేన నీళ్ళు తెచ్చి చారుదత్తుడి ముఖంమీద చల్లింది. అతడు లేచి, "అయ్యో, ప్రియా! ఎక్కడున్నావు? నాకు సమాధానం చెప్పు"అంటుంటే, చందనకుడు, "లేవండి, ఇలా రండి! ఇలా రండి!" అంటూ చారుదత్తుడి చేతిని తన భుజంమీద వేసుకొని ముందుకు కదిలితే, అందరూ అనుసరించారు.

ధూతాంబ అగ్నిగుండంవైపుకు వెళుతూ, కన్నీళ్ళతో తన కొడుకుతో, "నాయనా! నన్ను విడిచిపెట్టు, ఈ పనికి అడ్డుపడకు. ఆయన గురించి ఏమి అమంగళం వింటానో అనీ భయపడుతున్నాను" అంది.

"అమ్మా! నన్ను చూడవా? నువ్వు లేకుండా నేను బతకలేను..." అని ఆమెను ముందుకు కదలనివ్వకుండా చెంగు పట్టుకున్నాడు రోహసేనుడు.

"అమ్మా! తండ్రి లేని బిడ్డకు, తల్లికూడా లేకుండా చేస్తావా? న్యాయమా?"అన్నాడు మైత్రేయుడు.

"నాయనా! ఆయన మరణదండన వార్త విన్నప్పుడే నేను మరణించివుండాల్సింది. నిజంగా నాది గట్టి పిండమే. నన్ను ఆపవద్దు నాయనా, నేను ఈ దుఃఖాగ్నిలో ఇప్పటికే దహించకుపోతున్నాను" అని ఆమె కన్నీరు కార్చింది.

"అమ్మా! బ్రహ్మణ స్త్రీ ఒంటరిగా చితి ఎక్కడం పాపమనీ పెద్దలంటారు" అన్నాడు మైత్రేయుడు.

"ఆయన గురించిన అమంగళ

వార్తని వినేకంటే, ఈ పాపమే మంచిది" అంది ఆమె స్థిరంగా.

శర్విలకుడు అక్కడికి చేరుకొని, ధూతాంబ అగ్నికి దగ్గరగా వెళ్ళడాన్ని గమనించి, "ఆమె అగ్నికి దగ్గరగా వెళు తోంది. పదండి, పదండి" అని అన గానే అందరూ పరుగు పరుగున అక్క డికి చేరుకున్నారు.

"రదనీ! పిల్లవాణ్ణి పట్టుకో. నేను కోరుకున్న పనిని ఇక నెరవే ర్చుకోవాలి" అందామె.

"అమ్మా! ఇంతవరకూ మీరుచెప్పిన దంతా విన్నాను. కానీ" అంటూ పిల్ల వాడ్ని హత్తుకొని ఏడ్వసాగింది రదని.

"ఏమయ్యా! నువ్వు పట్టుకో" అంది ఆమె మైత్రేయుడితో.

"అమ్మా! మీ పని నెరవేరాలంటే బ్రహ్మాడు ముందుండాలి. కనుక నేను మీకు త్రోవ చూపుతాను" అని అన్నాడు మైత్రేయుడు.

"ఏమిటీ! ఇద్దరూ నిరాకరిస్తున్నారా?" అంటూ ఆమె పిల్లవాణ్ణి కౌగిలించుకొని, "నాయనా! మాకు తిలోదకాలు ఇవ్వ డానికి నువ్వే ధైర్యంగా ఉండాలి. సమ యందాటితే కోరికలు నెరవేరవు" అని నిట్టూర్చి, "మీ తండ్రి నీకు ఇంక ధైర్యం చెప్పి ఆదుకోలేరు" అంది.

చారుదత్తుడు వెంటనే పరిగెత్తికెళ్ళి "ఇదిగో! నా కుమారుడ్ని నేను ఆదుకుం టాను!" అంటూ పిల్లవాణ్ణి ఎత్తుకొని గుండెలకేసి హత్తుకున్నాడు.

అది చూచి ఆశ్చర్యపోతూ, "ఏమది, చారుదత్తుల మాటలా వున్నా" యంటూ చారుదత్తుడివైపు చూచి, ధూతాంబ ఆనందంతో తబ్బిబ్బయ్యింది.

"అమ్మా! నాన్నగారే వచ్చారు. మన దుఃఖం పోయినట్లే, ఆయనే స్వయంగా నన్ను దగ్గరకు తీసుకున్నారు" అన్నాడు ఆనందంగా రోహసేనుడు.

"ప్రేయసీ! నేను జీవించివుండగానే



'ఆ' ఔరా!

ఇంతకుముందు ఎలా ఉన్నా 'నక్షత్రం' సినిమా తన కెరీర్‌కు ప్లస్ కాగలదనుకుంటూ కాంతిరేఖల కోసం ఎదురుచూసిన రెజీనా కెసెండ్ర కలలు కల్లలయిపోయాయి. ఇక ఇప్పుడూ 'ఆ' తనకు భలే ఛాన్స్ అనుకుంటూ మళ్ళీ ఊహాలపల్లకి ఎక్కేసింది.

ఇందుకోసం కొత్త అవతారంతో కనపడిన రెజీనాను చూసినవారంతా అవాక్కయ్యారు. దీనిపైన ఈ పిల్ల సుదీర్ఘ వివరణ ఇచ్చింది కూడా.

'ఆ' సినిమాలో నా పాత్ర విభిన్నంగా ఉంటుంది. కొంచెం విలన్ ఛాయలు కనపడతాయి కూడా. రూపాన్ని ఓకే చేయడానికి ముందు ఎలా ఉంటేబావుం టుందన్న విషయమై నా స్టయిలిస్టు, టాటూ డిజైనర్లు కసరత్తు చేశారు.

నా రూపం చాలామందిని అబ్బుర పరుస్తుందని తెలుసు" అంటున్నరెజీనా ఆ చిత్రం తనను ఎక్కడికో తీసుకువెళ్ళ గలదని ఆశపడుతున్నది.

ఏమిటీ అత్యంత దారుణ ప్రయత్నం? సూర్యుడు అస్తమించకుండానే పద్మిని కళ్ళు మూస్తుందా...?" అని ధూతాం బను మందలింపుగా అన్నాడు చారు దత్తుడు.

"ఆర్యపుత్రా! అందుకే దాన్ని అచేత నము అన్నారు" అంది ధూతాంబ.

సంతోషపడిపోయాడు మైత్రే యుడు, "ఆశ్చర్యం..! ఈ కళ్ళతోటే నా ప్రియమిత్రుణ్ణి చూస్తు న్నానా? ఏమీ! సతీ ప్రభావం! ఆమె అగ్నిప్రవేశానికి ఉద్యమించగానే ప్రియా సమాగమం కలిగింది. మిత్రమా...! జయం! జయం!" అన్నాడు.

"మైత్రేయా! ఇలారా" అంటూ పిల్ల వాడ్ని క్రిందికి దించి, తన రెండు చేతు లతో ఆహ్వానించాడు చారుదత్తుడు.

మైత్రేయుడు పరుగులాంటి నడ కతో మిత్రుడ్ని చేరుకుని, కౌగిలించు కున్నాడు. "ఆహా! ఏమి సంఘటన! అయ్యా నమస్కారం..." అని రదనిక చారుదత్తుని పాదాలపై పడింది.

ధూతాంబ, వసంతసేనను చూచి, "అదృష్టంవలన సఖికూడా కుశలమే గదా!" అంటూ తన రెండు చేతులతో వసంతసేనను ఆహ్వానించింది.

వసంతసేన వెళ్ళి ధూతాంబను కౌగిలించుకుంది.

"నిజంగా ఇప్పుడు కుశలం కలి గింది నాకు. మీరు నన్నిలా ఆహ్వానిస్తా రనీ నేను ఊహించలేదు" అని అంది వసంతసేన నవ్వుతూ.

"సఖీ! నీ ప్రేమతోనే కదా వాడిన మల్లెవంటి నా చారుదత్తుడు వికసిం చింది. ఆ సౌరభవం నాకెరుకే! నీ మీద నాకీర్ష్యలేదే చెలి!" అంది ధూతాంబ.

"అమ్మా! వసంతసేనా! మన రాజు మిక్కిలి సంతోషించి, నిన్ను ఒక ఇంటి ఇల్లాలిని చేయదలచుకున్నాడు" అని అన్నాడు శర్విలకుడు.

"అయ్యా, నేను ధన్యురాలిని" అని అంది వసంతసేన.

శర్విలకుడు వసంతసేనకు మేలి ముసుగు వేసి-

"అయ్యా! ఈ బౌద్ధభిక్షువుకు ఏమి మేలుచేయాలి?" అని అడిగాడు.

"అయ్యా! నీ ఇష్టం ఏమిటి?" అని అడిగాడు భిక్షువును చారుదత్తుడు.

"ఈ అనిత్య ప్రపంచాన్ని చూసిన కొద్దీ సన్యాసంమీద నాకు మరింత గౌరవం కలుగుతూవుంది" అన్నాడు ఆ బౌద్ధభిక్షువు.

"మిత్రమా! ఇతని సంకల్పం గట్టిది. కనుక మన రాజ్యంలో సర్వబౌద్ధ విహా రాలకి ఇతన్ని కులపతిని చెయ్యి" అని అన్నాడు చారుదత్తుడు శర్విలకుడితో.

"చిత్తం" అన్నాడు శర్విలకుడు.

"సంతోషం" అన్నాడు భిక్షువు.

"ఇప్పుడు నిజంగా నేను బ్రతికినట్ట య్యింది" అంది వసంతసేన.

"స్థావరకా! నీకు ఏమికావాలి!" అని అడిగాడు శర్విలకుడు.

"ఈ సజ్జనుడు ఇంక సేవకుడు కాకూడదు. ఆ తలా రులు చండాలురందరికి కులపెద్దలు కావాలి. చందనకుడు ఈ రాజ్యానికి రక్షక సర్వాధికారి కావాలి" అన్నాడు చారుదత్తుడు.

"అయితే, చెప్పండి, మేము మీకు ఇంకా ఏమి మేలు చేయమన్నారు?" అడిగాడు శర్విలకుడు.

"ఇంతకన్నా మేలు ఏముంది? నా చరిత్ర శుద్ధమయినదనీ ఋజువైంది. శత్రునిర్మూలన అయ్యింది. విప్లవం జయించింది. ప్రియమిత్రుడు ఆర్య కుడే రాజ్యమేలుతున్నాడు.

ప్రియురాలు లభించింది. నీవంటి మిత్రుడు దొరికాడు. ఇంతకంటే ఇప్పుడు నేను కోరదగినది ఏముంది? ఆర్యకుడు ప్రజానురంజకంగా పాలన చేసి, చరిత్రలో గొప్ప రాజుగా నిలిచి పోవాలన్నదే నా కోరిక!" అని అంటూ నవ్వాడు చారుదత్తుడు.

"ఆహా! ఈ విధి కొందరిని నీచపరు స్తుంది! కొందరిని నిండుపరుస్తుంది. కొందరిని పైకెత్తుతుంది. కొందరిని క్రిందికి పారేస్తుంది. కొందరిలో అల జడిని రేపుతుంది.

ఈ విధంగా వ్యతిరేక శక్తులను ఒండొంటితో కలుపుతూ ప్రపంచస్థితి ఇంతే అనీ బోధిస్తూ, నూతిగిలకవలె మనుషులతో ఆటలు ఆడుతుంది. అయినా ఈ విధంగా జరగాలని కోరు తున్నాను. శుభం..." అన్నాడు చివరగా చారుదత్తుడు.

-: అయిపోయింది :-




'వందేమాతరం' అంటే తల్లికి వందనం చెయ్యటం. ఈ విషయంలో ఏ మతం, కులంవారికైనా అభ్యంతరాలు ఎందుకు.

-వెంకయ్యనాయుడు, ఉపరాష్ట్రపతి



రెండు విందులు



సేకరణ : చందమామ కథ

ఒక ఊళ్ళో ఇద్దరు అన్నదమ్ములు. అన్న చాలా భాగ్యవంతుడు. తమ్ముడు పాపం అమిత బీదవాడు. తమ్ముడు ఒకనాడు సంపాదన కోసం దేశాంతరం బయలుదేరుతూ దారిలో తినటానికి భార్యను ఏమైనా చేసి ఇవ్వమని అడిగాడు.

భార్య ఐదు మినపసున్ని ఉండలు చేసి గుడ్డలో మూటకట్టి ఇచ్చింది.

అతను ఆ మూట కర్రకు తగిలించుకుని కర్ర భుజాన పెట్టుకుని బయల్దేరాడు. పోగాపోగా చీకటి పడే సమయానికి ఒక పెద్ద చెరువూ దాని పక్కన వెదురుపొదా కనిపించాయి.

ఆ చెరువులో కాసిని నీళ్ళు తాగి, భుజం మీది మూట వెదురుపొదలో ఒక గడకు తగిలించి ఆ రాత్రికి అక్కడే పడుకుని నిద్రపోయాడు. కొంత పొద్దెక్కినాకగాని అతనికి మెలకువ రాలేదు.

తీరా అతను లేచేసరికి రాత్రి మంచుకు తడిసి వంగి ఉండిన వెదురుగడ ఎండకు పైకి నిలబడి ఉంది.

దానితోపాటు అతని మినపసున్ని ఉండల మూటకూడా పైకి వెళ్ళింది.

మళ్ళీ సాయంకాలమైతేగాని మూట కిందికి రాదని గ్రహించి అతను ఆకలితోటే మళ్ళీ నిద్రపోయాడు.

ఈ సమయంలో ఆకాశంలో తిరుగుతున్న అయిదుగురు గంధర్వులకు మినపసున్ని ఉండల వాసన తగిలింది. వెదురుగడకు వేలాడే మూట చూశారు. దాన్ని విప్పి అందులో ఉన్న ఐదు సున్ని ఉండలూ ఐదుగురూ తిన్నారు.

చెరువుగట్టున నిద్రపొయే మనిషిని చూసి అతని బీదస్థితికి జాలిపడి సున్ని ఉండలకు బదులు ఒక చిన్న పెట్టెను ఆ మూటలో ఉంచి గంధర్వులు అక్కడనుంచి వెళ్ళిపోయారు.

అతను లేచేసరికి సాయంకాలమయింది. వెదురు గడ కిందికి వంగి ఉంది. ఆకలి దహించుకుపోతూం డటంవల్ల అతను ఆత్రంగా మూటదించుకుని విప్పి చూసేసరికి పెట్టె కనిపించింది.

అతను ఆశ్చర్యంతో దాని మూత తెరిచాడు. వెంటనే పెట్టెలోనుండి ఇద్దరు గంధర్వ స్త్రీలు బయటికి వచ్చి పంచభక్ష్య పరమాన్నాలతో అతని ముందు భోజనంఉంచి తిరిగిపెట్టెలోకెళ్ళిమాయమయ్యారు.

అతను భోజనం చేసి, సంతోషంతో పెట్టె తీసుకుని ఇంటికి వెళ్ళి భార్యకు సంగతంతా చెప్పాడు.

మర్నాడతను ఊళ్ళోవాళ్ళందరినీ పిలిచి పెట్టె సహాయంతో వచ్చినవారందరికీ షడ్రసోపేతంగా విందుచేశాడు. వచ్చినవారంతా పెట్టెను గురించి వింతగా చెప్పుకుంటూ వెళ్ళిపోయారు.

తమ్ముడికి కలిగిన ఈ అదృష్టం గురించి భాగ్యవంతుడైన అన్నకు అసూయ కలిగింది.



పెట్టె దొరికిన వృత్తాంతమంతా అన్న తమ్ముడి వల్ల తెలుసుకొన్నాడు. భార్య ప్రోద్బలం వల్ల అటువంటి పెట్టె తాను కూడా సంపాదించుకుని రావాలనుకున్నాడు. భార్యచేత మినపసున్ని ఉండలు చేయించుకుని తానుకూడా తమ్ముడు వెళ్ళిన దారినే బయలుదేరాడు.

వెళ్ళివెళ్ళి ఇతనుకూడా చెరువు దగ్గరకి చేరుకున్నాడు. వెదురుపొదకు మూట తగిలించి పడుకుని నిద్రపోయినాడు.

ఎప్పటిలాగే ఐదుగురు గంధర్వులూ అటుగా వెళుతూ సున్ని ఉండల వాసన పసికట్టి మూటవిప్పి చూశారు. 'ఒకసారి పెట్టె ఇస్తే తృప్తిచెందక వీడు మళ్ళీ వచ్చాడు. చాలా ఆశాపాతకుడుగా ఉన్నాడే' అనుకున్నారు.

మినపసున్ని ఉండలు తిని వాటికి బదులు మరొక పెట్టె పెట్టి వెళ్ళిపోయినారు.

మర్నాడు సాయంకాలం వెదురు కిందికి వంగగానే అన్న మూట విప్పి చూసుకున్నాడు.

మూటలో పెట్టె ఉంది. తన పని నెరవేరిందిగదా అనే సంతోషంతో పెట్టెతో సహా ఇంటికి వచ్చి భార్యకు చూపించాడు. వారి ఆనందానికి మేరలేదు.

మరుసటి రోజున అన్నకూడా ఊళ్ళోవాళ్ళందరినీ విందుకు పిలిచాడు.

అందరూవచ్చి బంతులుతీరి కూర్చున్నారు. అన్న జాగ్రత్తగా పెట్టెమూత తెరిచాడు.తెరిచేసరికి అందులోనుంచి అతిథికి ఇద్దరేసి క్షురకులు పొదులతో సహా బయటికి వచ్చారు.

ప్రతి అతిథినీ ఒక క్షురకుడు గట్టిగా పట్టుకుంటే రెండో క్షురకుడు తల నున్నగా గొరగసాగాడు. కొద్దిసేపట్లోనే అందరి తలలూ బోడిగుండ్లు అయ్యాయి.

తర్వాత క్షురకులు అంతా పెట్టెలోకి తిరిగివచ్చి మాయమయ్యారు.

ఆ రోజు ఆ ఊళ్ళో అన్నను తిట్టని వాళ్ళు లేరు. అతను ఆలస్యం చెయ్యకుండా తనకు దొరికిన పెట్టెను సముద్రంలో పారేయించి తన అత్యాశకు తగిన ప్రాయశ్చిత్తం జరిగిందని తెలుసుకున్నాడు.

అవసరాల రామకృష్ణారావు

డి.సి. శ్రీరాములు

నేనెవరో తెలుసా!

సినిమారంగంలో స్నేహాలు శాశ్వతం కాదంటారు. ఒకే సమయంలో సినీరంగంలో అవకాశాలు వెతుక్కుంటూవచ్చి కష్ట సమయంలో ఒకరికొకరిగా బతికిన తర్వాత ఆ మిత్రులలో ఎవరో ఒకరికి సినీయోగంపట్టి టాప్‌లోకి వెళ్ళిపోతుంటారు.

అలా వెళ్ళినవారు ఒక దశలో తనతోపాటు గడిపినవారిని తమతో పైకి తీసుకురావటం అంత సులభంగా జరగదంటారు.కాని అందుకు భిన్నమైన అనుభవం సినీరంగంలో ఒకరిది.

ఆయన సినీరంగానికి వెళ్ళింది నటుడిగా అవకాశాలు సంపాదిద్దామని కాదు. కాని ఆయన పరిచయం నాడు సినిమాలలో అవకాశాలుకోసం ప్రయత్నిస్తున్న ఇద్దరు నటులతో నటనారంగానికి సంబంధంలేని ఈయనతో మాకు స్నేహం ఏమిటని వారనుకోలేదు. నటనతో నాకేమిటి అని ఆయన అనుకోలేదు.

ఎందుకంటే సినీరంగానికి వెళ్ళకముందు ఆయన చిన్నాచితకా పాత్రలు స్టేజ్‌మీద వేసినవాడే. అయితే ఆయన దృష్టి నటనమీదకన్నా సంగీతంమీద వుండేది. అందుకే సంగీత దర్శకత్వ రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ, ఆ నటులతో స్నేహంగా ఒకే గదిలో వున్నారు.

అలా ఆ గదిలో వున్న ముగ్గురిలో ఒకాయన ఆ తర్వాతి కాలం టాప్ హీరో అయి సినీ పరిశ్రమను శాసించాడు.

మరొకరు అత్యుత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, అంతర్జాతీయ వేదికమీద నటనకు అవార్డు అందుకున్న తొలి తెలుగు కళాకారుడు అయ్యాడు.

ఇక మూడవ వ్యక్తి సినీ సంగీతరంగంలో తన ప్రతిభను ప్రదర్శించి వందలసినిమాలకు బాణీలుకట్టాడు. ఆ హీరో ఎదిగి తానే స్వయంగా సినిమాలు నిర్మించే ఆలోచన చెయ్యగానే తన సినిమాలకు సంగీత దర్శకుడిగా తన రూమ్‌మేట్‌ని పెట్టుకున్నాడు.

స్నేహానికి ఆయన ఇచ్చిన విలువ అది.పిలిచి అవకాశం ఇచ్చిన ఆ పాత మిత్రుడి నమ్మకాన్ని వమ్ము చెయ్యకుండా అద్భుతమైన బాణీలు అందించి అద్భుతమైన సంగీత దర్శకులుగా నిలిచాడు.

సినీరంగంలో కొన్ని పాటలు చిరంజీవులు. అవి ఎప్పుడు విన్నా ఒక రకమైన ఉద్వేగానికి లోనుకాక తప్పదు. 'శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండీ' అనే పాట ఎప్పుడు ఎక్కడ విన్నా మొత్తం పెళ్ళిమండపంలోని హడావుడి అంతా కళ్ళ ఎదుట కనిపించి తీరాల్సిందే.

అటువంటి మరో తెలుగు పాటే 'హేకృష్ణా ముకుందా మురారి' అనేది. ఆ పాటను చిరకాలం నిలిచేదిగా చేసిన తన పేరును చిరకాలంగా నిలుపుకున్నవాడయ్యాడు ఆ సంగీత దర్శకుడు.

ఒక్కొక్క హీరోకి ఒక దర్శకుడితో చెయ్యటం ఇష్టంగా వుంటుంది. కొందరు హీరోయిన్ల జోడీ ఫలానా కావాలని చెప్పుకుంటారు. కాని నాడు టాప్ హీరో మాత్రం మిగిలినవి ఎవరు ఎలా వున్నా ఫలానా ఆయన్ని సంగీత దర్శకుడిగా పెట్టటం మరచిపోకండి అని చెప్పేవారట. అలా ఆ హీరో సినిమాల్లో అధిక శాతం ఈ సంగీత దర్శకుడి పాటలే.

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు **ఇన్‌లాండ్ కవర్‌పై** రాసి స్వాతి చిరునామాకు 13 జనవరి 2018 తేదీలోగా పంపించండి. కరెక్టు సమాధానాలు రాసినవారిలో లాటరీ పద్ధతిద్వారా ఒకరిని విజేతగా ఎంపిక చేసి ₹ 500/- నగదు బహుమతిని అందజేస్తాం.

ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏదైనా కారణంచేత ఆ హీరో సినిమాకి ఈయన సంగీత దర్శకుడిగా వుండకపోతే 'ఏమైంది!' అంటూ సినీ పరిశ్రమ మొత్తం ఆశ్చర్యంతో ప్రశ్నించేది. అలాగని ఆ ఒక్క హీరోకే చక్కని బాణీలు చేశాడని కాదు.

తన 20 ఏళ్ళ సినీ సంగీత దర్శకత్వంలో ఎవరికి పనిచేసినా మధురమైన బాణీలనే కట్టాడు. సినీ రంగంలోకి రాక ముందు, నాటక రంగంమీద విన్నవి, కన్నవి, చేసిన ప్రయోగాలు ఆయనకు బాగా కలిసి వచ్చాయి. వీరిది గోదావరి తీరం.

సంపద వున్న కుటుంబమే అయినా, పసితనంలోనే తండ్రిని కోల్పోవటంతో అజమాయిషీ చేసేవారు లేక హైస్కూల్ స్థాయి చదువుకూడా ముగించలేదు. బతకటంకోసం నాడు గోదావరి ప్రాంతంలో విరివిగా విస్తరించిన నాటక సమాజాలలో చేరాడు.

బాలనటుడిగా నటించాడు. అయితే ఇంట్లో ఎవరికీ లేని సంగీత జ్ఞానం, సంగీతంపై మక్కువ ఆయనకు ఏర్పడ్డాయి. ఫలితంగా సంగీతం నేర్చుకున్నారు. నాటకాలకు అవసరమైన పాటలు, పద్యాలు పాడటం వచ్చింది.

హార్మోనియం వాయించటంకూడా వచ్చింది. కొన్ని నాటక కంపెనీలకు హార్మోనిస్టుగా పనిచేస్తుండగా అప్పటికే ఆ రంగంలో వున్న జంటతో పరిచయమైంది. ఆ జంటలో ఆమె నటి, ఆయన సంగీత దర్శకుడు. వారిద్దరూ సినిమా ఛాన్స్‌లు వెతుక్కుంటూ చెన్నపట్నం చేరితే వారి దోవలోనే తానూ వెళ్ళాడు.

తనకన్నా ముందు వెళ్ళిన ఆయనకు సినీరంగంలో సంగీత దర్శకుడి ఛాన్స్ రాగానే ఆయనకు అసిస్టెంట్ అయిపోయాడు. చురుకుగా సంగీతరంగంలో వున్న అతగాడిని నిర్మాత ప్రోత్సహించాడు.

తాను తర్వాత తీసే సినిమాలో సంగీత దర్శకుడి అవకాశం ఇస్తానన్నాడు. ఆ మాట ప్రకారం ఇచ్చాడు కూడా. తొలి సినిమాకే తెలుగు, తమిళ భాషల్లో సంగీతం అందించిన ఘనుడయ్యాడు. ఆ సినిమా తమిళ వెర్షన్‌లో పాల్గొన్న ప్రధాన నటుడు బాగా సంగీత జ్ఞానం వున్నవాడు.

ఆయన ఈ ట్యూన్స్ విని బాగాచేశాడని మెచ్చుకునేసరికి కొండంత ధైర్యం వచ్చింది. అలా 1952లో తొలి సినిమా అవకాశం పొందాడు. ఆ సినిమా పేరులాగానే ఆయన హుషారుగా వుండేవాడు. సినీ రంగంలో టెన్షన్ ఎక్కువ అంటారు.

పనిచేస్తున్నది ఏ శాఖలో అయినా ఒత్తిడి వుండటమే కాదు, ఆ ఒత్తిడి ముఖంలో స్పష్టంగా కనిపిస్తుందని అంగీకరించేవారు.

అటువంటి రంగంలో సాయంత్రం అయిదారు గంటలయ్యేసరికి ఎంత పెద్ద రికార్డింగ్‌నైనా ఇట్టే ముగించి హాయిగా పంచె, జుబ్బా ధరించి, చేతిలో సిగరెట్ బిగించి పాండీబజార్‌లో హుషారుగా మిత్రులతో కబుర్లు, కాలక్షేపంచేసే ఆయన్ని చూస్తే అందరికీ కుళ్ళుగా వుండేది.

ఇంత హాయిగా, కులాసాగా ఎలా వుండగలుగుతున్నాడు! ఆ హీరోగారి అండా! ఎంత అండ అయినా సినీరంగంలో టాలెంట్ లేకుంటే నిలబడలేరు. కాబట్టి ఆయనలోని టాలెంట్‌వల్లే అలా నిలబడగలిగాడని ఆ తర్వాత అందరూ అంగీకరించారు. ఆయన రూపంకూడా వింతగానే వుండేది. తలమీద ఒక కుచ్చులతో కూడిన టోపీ వుండేది. ఫ్రెంచ్ కట్ మీసం కనిపించీ కనిపించకుండా వుండేది. ఆ కాలపు సంగీత రంగంలోనివారిలో కనిపించిన ఏ లక్షణం ఆయనలో వుండేది కాదు.

కాని నాటి ఉద్దండ దర్శకులు హెచ్.ఎమ్.రెడ్డిని తన బాణీలతో మెప్పించగలిగారు.

ఆనాటి ప్రముఖ గాయనీ, గాయకులందరూ ఆయన బాణీలను పాడినవారే.

నటులచేత కూడా పాటల మధ్యలో పలికించిన ప్రత్యేక దర్శకుడు ఆయన.

తన రూమ్మేట్, తర్వాత ప్రముఖ హీరోచేత పాట మధ్యలో పదాలు చెప్పించి ఒప్పించాడు.

ఆ ఫ్రెండ్‌కి తొలిసారిగా ఎస్.పి. చేత పాడించేందుకు ఒప్పించింది ఆయనే. మహమ్మద్ రఫీ చేత ఆ హీరోకి తెలుగులో పాడించిందీ ఆయనే. ఉత్తరాది, ఇంగ్లీష్ ట్యూన్‌లు ఆయన ఎక్కువగా వాడేవాడు. అదంతా దర్శక, నిర్మాతల అభిరుచి కోసం చెయ్యక తప్పని పని అనేవారు.

తన కొడుకుని సినీ సంగీతానికి వారసుడిగా అందించక ముందే 1973 ఫిబ్రవరి 20న మరణించారు. వయస్సు అరవై ఏళ్ళుకూడా రాకుండా వెళ్ళిపోయారు ఆయన. ఇంతకీ...

1. ఆ సినీ సంగీత దర్శకుడి పేరేమిటి?

2. ఆయన తొలిచిత్రం పేరేమిటి?

29.12.2017 సంచికలో ప్రచురించబడిన 'నేనెవరో తెలుసా!' శీర్షిక సమాధానాలు :
1. బాల్ ఠాక్రే, 2. శివసేన
విజేత : వడ్డే శ్రీరామారావు, ఫ్లాట్ నెం. 102 ఎస్.ఎల్.వి. టవర్స్, రాయలం 534 208 (వియా) భీమవరం, ప.గో. జిల్లా





Courtesy : VANITHA

నాకెందుకు భయం

చుట్టూ వుండే వాతావరణం, మనుషుల ప్రభావం ప్రతి ఒక్కరిమీదా వుంటుంది. వాతావరణమంటే చలి, వేడి కాదు. మనం పనిచేసే చోటు, ఇంటిలో పెద్దలు కల్పించేది. చదువుకునేటప్పుడు వుండే పరిస్థితులు వాతావరణమవుతాయి. వీటిలో కొన్ని పరిస్థితులు కోరి ఎంచుకునేవి. అయితే మరికొన్ని మన ప్రభావం లేకుండా మనమీద పడతాయి.

సామాజిక అంశాలు అటువంటివే. వీటన్నిటి మధ్య పెరుగుతున్నప్పుడు, వాటినన్నింటినీ తట్టుకుని ఎదుగుతున్నప్పుడు పలురకాల అనుభవాలు, భావాలు, నమ్మకాలు ఏర్పడితీరతాయి. ఆలోచనలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి.

ఫలితంగా జీవితం హాయిగా సులభంగా సాగవచ్చు లేదా ఎన్నో రకాల కష్టాలు, నష్టాలు ఎదురవవచ్చు. ఒకరు తీసుకునేదాన్నిబట్టి, గతంలోని అనుభవాలనుబట్టి వాటి ప్రభావం మనిషిమీద వుంటుంది. ఒక అనుభవాన్ని అర్థంచేసుకుని, సవాలుగా తీసుకుని అధిగమించే యత్నం కొంతమంది చేస్తారు.

ఆ అనుభవానికి భయపడి ఆ భయంలోనే కుంగిపోయి జీవితంలో ముందడుగు వెయ్యలేని అభద్రతా భావం వస్తుంది వారికి. అందరి మానసికస్థితి ఒకలాంటిది కాదు. ఒకే ఇంటిలో పెరిగినవారి ప్రవర్తనలు భిన్నంగా వుండటం అందరికీ తెలిసినదే.

భయాలు, భావాలు భిన్నంగా వుండటం సహజం. ఎవరి అనుభవం వారిదే. కాబట్టి ఎవరు ఎదుర్కొనే సవాళ్ళు వారికే. తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.

కోరుకున్న గుర్తింపు సాధించేందుకు చాలా ప్రయత్నిస్తారు. కష్టపడతారు కూడా. ఈ ప్రయత్నంలో వారికి అనుకోని అనుభవాలు, వైఫల్యాలు వారిలో అభద్రతాభావాలను తెచ్చిపెడతాయి. అభద్రత అనేది మనసుకు సంబంధించిన భావం.

అతని ఆశలు, ఆశయాలు, వాటికోసం తానుచేసే యత్నాలు, అందుకున్న అనుభవాలు, ఆ అనుభవాల నుండి వారు ఏర్పరుచుకునే అభిప్రాయాలు కలగలిపి అభద్రతలోకి నెట్టబడతారు.

జీవితంలో ఏ దశలో అయినా అభద్రతకు గురికావచ్చు. బాల్యంలో భయం అంటే తెలియనివారు మధ్యవయసులో అభద్రతలోకి నెట్టబడిన సంఘటనలు చాలా ఉంటాయి. మధ్యవయసులో ఎవరినీ లెక్కచెయ్యనివారు వయసుమళ్ళినతర్వాత అభద్రతతో వుండటం కూడా కనిపిస్తుంది.

నిపుణులు చెప్పినవి

మానసిక అభద్రతకు గురవుతున్నవారిలో కనిపించే లక్షణాలను నిపుణులు పేర్కొన్నారు. వీటిలో అన్నీ అందరిలో కనిపిస్తాయనిగాని, కనిపించాలనిగాని లేదు. వారి వారి అనుభవాలనుబట్టి ఒక్కొక్కరిలో ఒకలాంటి లక్షణం కనిపిస్తుంది.

- వారి ఆలోచనలు పరిమితంగా వుంటాయి. కొత్త ఆలోచనలను స్వీకరించరు. ప్రస్తుతం తమకు ఏది తెలుసో దానిని దాటి అవతలకి ఆలోచించరు. ఆలోచించాల్సిన అవసరం లేదనుకుంటారు.
- మరికొందరు అన్ని విషయాలు తమకే తెలుసు అన్న రీతిలో ప్రవర్తిస్తారు. వాటికి పరిష్కారాలు తాము చూపగలమన్న ధీమా వారిది. వాస్తవంలో వారికి ఆ సమర్థత వుండదు. అయినా లేని సమర్థతను తమ భుజాన వేసుకుంటారు.
- భావోద్వేగాలను బయటపడకుండా అదిమిపెట్టి వుంచటం కూడా వీరి లక్షణం. భయమైనా, ఏడుపైనా బయటపడి ప్రదర్శిస్తే తమను తక్కువగా చూస్తారన్న ఆలోచన వారిది.అందువల్ల ఏ విషయంలోనూ బయటపడని ధోరణి కనిపిస్తుంది వీరిలో. భావోద్వేగాలను బలవంతంగా అదుపుచేసుకుని మనసును మరింత కష్టపెట్టుకుంటారు వీరు.
- త్వరితగతిన ఒక అభిప్రాయం ఏర్పరచుకుంటారు. వ్యక్తులమీదైనా, అంశంమీదయినా తమ నిర్ణయం లేదా అభిప్రాయమే తుది అభిప్రాయమని, ఇక అంతకన్నా ఇతరులు చెప్పేది ఏదీ వినాల్సిన అవసరం లేదని వారు అనుకుంటారు.
- మాటలలో వ్యతిరేకభావాలు అధికంగా పలుకుతుంటాయి. నిరాశ, నిస్పృహ భావాలు ప్రదర్శిస్తారు. ఇంతకన్నా తమ జీవితం ముందుకు వెళ్ళటంలేదని, ఏదీ కలిసిరావటంలేదని, ఎవరూ సహకరించటం లేదన్న ఫిర్యాదు చేస్తుంటారు.
- నలుగురిలో కలవటం తగ్గిస్తారు. తెలిసినవారిని కూడా కలిసేందుకు ఇష్టపడరు. వారిని చూసికూడా తప్పుకుని పక్కకు వెళ్ళిపోతారు. కళ్ళలో కళ్ళు పెట్టి చూడలేరు. చూసి మాట్లాడలేరు.
- ఏ విషయంలోనూ నిర్ణయానికి రాలేరు. నిర్ణయ సామర్థ్యం తగ్గిపోతుంది. ప్రతిదానికీ సందేహాలు, వైఫల్యభయం పెరిగి, నిర్ణయానికి జంకుతారు.



- తమని తాము నిందించుకోవటం అధికంగా కనిపిస్తుంది. ఎందుకూ పనికిరానివారమని, తాము చేసిన పొరపాట్లగురించి అతిగా ఆలోచించటం చేస్తారు. దేనిలో కూడా మంచిని చూడలేని మనస్తత్వం వారిని వేధిస్తుంటుంది.
- కొత్తదనం కోరుకోరు. తమకు ఎక్కడ సౌకర్యంగా వుందో ఆ చోటునుండి బయటకు రారు. చిర పరిచిత వాతావరణంలోనే స్థిరంగా వుండాలనుకుంటారు. ప్రయాణాలకు దూరం.

మనసు వేదన

మానసిక అభద్రతాభావం వలన అనేక ఇతర ఇబ్బందులు తలెత్తుతాయి. వారిలో ఆత్మస్థయిర్యం తగ్గిపోవటంతోపాటు ఆదుర్దా అధికమవుతుంది. మిత్రులు, బంధువులతో సరిగ్గా కలిసివుండలేరు.

ఒంటరితనం కోరుకుంటూ, ఏదో ఒకచోటుకు పరిమితమవుతారు. అభద్రతాభావంతో చేసిన పనినే తిరిగి చెయ్యటం మొదలుపెడతారు. ఎవరితో వేలు ఎత్తి చూపించుకోక, అత్యుత్తమం అనిపించుకోవాలనే యత్నంలో ఒకే పనిని పలుమార్లు చేస్తారు. ఇది సమయం వృధా చేస్తుంది. సంతృప్తినివ్వదు.

తమకు తాము పెట్టుకున్న స్థాయివారికి ప్రతిబంధకంగా మారుతుంది. ఫలితంగా అసంతృప్తి. సరిగా చెయ్యలేకపోయామన్న వేదన. దీనితో మనసులో గందరగోళం. ఇవన్నీ కలిసి వ్యతిరేకభావాల పుట్టగా తయారవుతారు. తమను తాము సక్రమంగా అంచనావేసుకోలేరు. ప్రతి అడుగూ సందేహమే.

తమ వయసు, ఉద్యోగం, వ్యక్తిగత సంబంధాలు, మేధోపరమైన అనుమానాలు అన్నీ వేధిస్తాయి.

ఎందుకిలా! దూరం ఎలా!!

మనిషిలో అభద్రతాభావానికి కారణం ఇది అని ఇతమిత్థంగా తేల్చిచెప్పటం కుదరదు. అందరిలో ఒకే కారణంతో అభద్రతాభావం ఏర్పడదు. ఇంటి వాతావరణం, పెద్దలు పెంచిన తీరు వారిని అభద్రతకు గురిచేస్తుందనేది నిర్ధారించబడిన విషయం.

తొలినాళ్ళలో ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల సంరక్షణలోనే వుంటారు. ఆ సమయంలో వారు ఇచ్చే అనుభవాలు, చెప్పే మాటలు, వారిని తీర్చిదిద్దే తీరును బట్టి పిల్లల వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. ఎదిగిన పిల్లలమీద ఈ అంశాల ప్రభావం అధికం.

వైవాహిక జీవితాలలో సమస్యలకు మూలం అభద్రతా భావమేనంటారు. వయసుతో పోవాల్సిన అభద్రతాభావం, మరికొన్ని కొత్త అనుభవాలతో మరింత పెరిగితే వ్యక్తిత్వం పూర్తిగా దెబ్బతింటుంది. కుటుంబ వాతావరణం కీలకమనేది అందుకే.

పిల్లలను జాగ్రత్తగా తీర్చిదిద్దాలి. మంచి-చెడు అర్థంచేసుకోగల్గిన స్థాయి వారికి కల్పించాలి. పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడపాలి. వారి మాటలు వినాలి. ఆ మాటలు ఎందుకు వస్తున్నాయో అర్థంచేసుకోవాలి.

ఎటువంటి భయం గురించి పిల్లలు చెప్పినా వారికి భరోసా చూపే స్థాయిలో పెద్దలుండాలి.పిల్లలకు వారి వయసుకు తగిన లక్ష్యాలు నిర్దేశించి వాటిని అందుకునేలా ప్రోత్సహించాలి. వెనకబడిన పిల్లలను విమర్శలతో కాక ఉత్సాహపరిచే మాటలతో మార్చాలి.

తల్లిదండ్రులే 'పనికి రారు' అనే ముద్ర వేస్తే లోకం వారిని మరింత చులకనగా చూస్తుంది.

తల్లిదండ్రులందించే ప్రోత్సాహము అత్యంత అవసరం. తగిన సమయంలో పిల్లలను ఆదుకుంటున్న తల్లిదండ్రులే తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించినవారు అవుతారు.

కష్టంలో వున్న పిల్లలమీద మాటల దాడిచెయ్యటం తల్లిదండ్రులు మానుకోవాలి. వారి కష్టం ఏమిటో అర్థం చేసుకుని, చేయి అందించి పైకి లేపగలిగితే వారిలోని అభద్రతాభావం తొలిగిపోతుంది.

అభద్రతలో నుండి బయటపడవేస్తే తమ గమనం, గమ్యం రెండూ పిల్లలు నిర్ణయించుకోగలరు. పిల్లలకు కావలసిన ప్రోత్సాహంతో వారిలోని అభద్రతా భావాలను తొలగించటం తల్లిదండ్రులు చెయ్యాలి.

విద్యార్థి దశలో ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించగలిగిన ఉపాధ్యాయులు దొరికితే పిల్లల భవిష్యత్తు బంగారమవుతుంది. విద్యాలయ వాతావరణం, ఉపాధ్యాయుల ఆదరణ యువతీ యువకుల వ్యక్తిత్వ నిర్మాణంలో మరింత కీలకపాత్ర పోషిస్తాయి.

ప్రోత్సాహక వాతావరణం వున్న విద్యాసంస్థలలో చదువుకునేవారిలో అభద్రతాభావాలు అరుదు. అటువంటి సంస్థలనుండి బయటకు వచ్చినవారు ఉన్నత స్థానాలకు చేరతారు.

కె.మురళీధర్



Courtesy : B+ve

ఫర్ U

Happy men have happy friends, many friends

మెదడుకు యవ్వనం

తాజా ఆకుకూరలు, ఇతరత్రా కూరగాయలు తింటుంటే అనేకానేక ప్రయోజనాలుంటాయన్న విషయం కొత్తది కాదు. తాజా అధ్యయనాల్లో మరో అంశాన్ని గుర్తించారు.

రోజూ ఓ కప్పు ఆకుకూర, కూరగాయముక్కలు తింటుంటే మెదడు యవ్వనంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

వయస్సు పెరిగేకొద్దీ వచ్చే మార్పులను అధిగమించడానికి ప్రతిరోజూ ఆకుకూరలు తింటుంటే మెదడు యవ్వనంగా మారి చురుగ్గా వుంటారు. ఒకటీ, రెండూ కాదు- ఈ క్రమం తప్పని ఆహారంవల్ల మెదడు ఏకంగా పదకొండేళ్ళ యవ్వనాన్ని పొందుతుందనేది సారాంశం. ◆

పెయిన్ 'కిల్లర్స్'

శరీరంలో ఏ నొప్పీ లేకుండా వుంటే హాయిగా వుంటుంది.ఏ శరీరభాగంలో నొప్పిపెట్టినా అసౌకర్యం, ఇబ్బంది వుంటుంటాయి. దీంతో నొప్పి రాగానే గబుక్కున ఓ పెయిన్ కిల్లర్ వేసేసుకుని అమ్మయ్య అని సేదతీరడం అనేక మందికి అలవాటు.

అయితే ఎంతో అవసరం ఐతే తప్ప తరచుగా నొప్పి నివారణ మాత్రలు వేసుకోవడం ఎంతమాత్రం శ్రేయస్కరం కానే కాదు.

ఒకవేళ తప్పనిసరిగా వాడాల్సి వచ్చినా వాడకాన్ని రెండు వారాలకు పరిమితం చేయాలి. అంతే కాని, దీర్ఘకాలం వాడేయడం, తరచూ పెయిన్ కిల్లర్స్ వేసుకోవడం చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ◆

ఎప్పుడు కొనాలి

నెమ్మదిగా, నింపాదిగా వాకింగ్ చేసినా, జిమ్‌లో వర్కవుట్లు సాగించినా ధరించిన షూ సౌకర్యంగా లేకపోతే ఇతరత్రా సమస్యలు ఎదురవుతాయి. కాళ్ళు, కీళ్ళు, కండరాలు నొప్పిపెడతాయి.కాబట్టి వర్కవుట్ షూ ఎంపిక చేసుకునే విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి.

వీటిని రోజులో చివరన ఎంపిక చేసుకోవాలి. ఈ సమయంలో పాదాల సైజు పెద్దగా వుంటుంది.



Courtesy : HIDESIGN

పాదవాటి వేలికి, షూకు నడుమ అరంగుళం ఖాళీ వుండాలి. షూ ఎంపికలో అందంకంటే సౌకర్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. ◆

ప్రకృతి ఆస్వాదన

ఎప్పుడు చూసినా ఇంట్లో, ఆఫీసులో పని. వీటితోనే రోజంతా గడిచిపోతుంటుంది.ఐతే ఆరుబయట ప్రకృతిలో ఆనందంగా గడిపే క్షణాలు ఉత్సాహాన్ని, సంతోషాన్నిస్తుంటాయి.

పరిసరాల్లోని ప్రకృతిని వీలున్నప్పుడల్లా ఆస్వాదిస్తుంటే ఎంతో ఆనందం కలుగుతుంది. అలాగే ఉత్సాహం, సంతోషం సగం వ్యాధులను దూరంగా ఉంచేందుకు ఉపకరిస్తుంటాయి.

ప్రకృతిలో కనపడే ఆహ్లాదకరమైన వాతావరణం పరిపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని నిపుణుల అధ్యయనాల్లో గుర్తించారు. ప్రతిరోజూ వీలు చిక్కినప్పుడల్లా చుట్టూగల సహజ ప్రకృతిని ఆస్వాదించడం చేస్తుంటే ఆ తేడా ఇట్టే తెలుస్తుంది. ◆

గ్యాస్ ట్రబుల్

మారుతున్న జీవనశైలిలో చాలా మంది నోటి వెంట వినబడుతున్న మాట 'గ్యాస్ ట్రబుల్'.

ఆహారపు అలవాట్లు, తినే పదార్థం వల్ల తలెత్తే సమస్య ఇది. ఆహారాన్ని తీసుకునే క్రమంలో సరైన అవగాహన లేకపోవడంవల్లనే ఎక్కువ భాగం జీర్ణక్రియకు సంబంధించిన అనారోగ్యాలు తలెత్తుతుంటాయి.

సమయపాలన పాటించకపోవడం, తిన్న ఆహారం జీర్ణం కాకుండానే తిరిగి ఏవో ఒక చిరుతిండ్లు తినడం, మసాలాలు, కారం ఎక్కువ తీసుకోవడం, ఫైబర్ తగ్గిపోవడంలాంటివి ఈ సమస్యకు ప్రధాన కారణాలు.

ఆహారంలో వాము, మిరియాలు, జీలకర్ర, అల్లం, వెల్లుల్లి వంటివి ఎక్కువగా వాడుతుండాలి.

ఆహార పదార్థాలను మెత్తగా ఉడికించుకోవాలి. అలాగా నిర్ణీత సమయంలో మితాహారం తీసుకుంటుండాలి. వారానికి ఒకసారి అయినా జీర్ణకోశానికి విశ్రాంతి ఇస్తూ, రోజంతా ద్రవపదార్థాలు తీసుకుంటూ ఉంటే ఆరోగ్యానికి మంచిది.

అంతా రాజకీయమే

అసలేం జరిగింది

కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ సెల్ఫ్‌గోల్ స్పెషలిస్ట్. 2014 లోక్‌సభ ఎన్నికల్లో, 2017 గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో మణిశంకర్ వాచాలతే తమ పార్టీని ముంచిందని ఆ పార్టీ నేతలు నమ్ముతున్నారు. అతని ప్రకటనలవల్ల జరిగిన నష్టానికి మణిశంకర్‌ని పార్టీనుండి సస్పెండ్ చేశారు సరే.

ఇంతకీ మణిశంకర్ పాకిస్తానీ దౌత్యవేత్తలతో ఎందుకు మీటింగ్ పెట్టాడు! ఆ మీటింగ్‌కి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఎందుకు వెళ్ళాడు. అక్కడేం మాట్లాడుకున్నారు! ఎటువంటి చర్చ జరిగిందనే ప్రశ్న లకు కాంగ్రెస్‌వారు సమాధానం చెప్పటంలేదు.

విదేశాంగ విధాన అంశంమీద చర్చ జరిపితే దాని వివరాలను ప్రభుత్వానికి అందచేయాలి కదా!

తాము చేపట్టిన చర్యలు ముందుకు తీసుకువెళ్ళ మని సూచించాలికదా! అవేవీ చెయ్యనందున మణి శంకర్ అయ్యర్ ఇంటిలో మీటింగ్‌మీద మరిన్ని అను మానాలు కల్గుతున్నాయి. ఏదో గూడుపుఠాణి జరిగిం దన్న సందేహం ప్రజలలోకి బి.జె.పి. తీసుకువెళ్ళింది. కనీసం ఇప్పుడైనా ఆ 'రహస్య' మీటింగ్ 'ఎజెండా', చర్చల వివరాలు బైటపెడితే మంచిదికదా! ◆

వన్నె తగ్గుతోంది

కేంద్రంలో రక్షణమంత్రి కాకముందు మనోహర్ పారికర్ గోవాకి మంచి ముఖ్యమంత్రి అనిపించు కున్నాడు. కాని గత సంవత్సరం ఎన్నికల్లో బిజెపికి మెజారిటీ రాలేదు. అయినా వారినీ వీరినీ పోగేసు కుని మళ్ళీ ముఖ్యమంత్రి పీఠంమీద కూర్చున్నాడు మనోహర్ పారికర్. అయితే గతంలో ఉత్తమ సి.ఎమ్. అనిపించుకున్న పారికర్ ఇప్పుడు క్రమంగా ప్రజల దృష్టిలో వన్నె తగ్గినవాడవుతున్నాడు.

గోవా నదీ జలాలను జాతీయం చేయాలన్న కేంద్రం ఆలోచనకు మనోహర్ పారికర్ అంగీకారం తెలపటం ప్రజలకు నచ్చటంలేదు. పైగా కర్ణాటకలో బిజెపి గెలుపుకోసం గోవాలోని నదీజలాలలో కొంత భాగం కన్నడిగులకు ఇచ్చేందుకు మనోహర్ పారికర్ సిద్ధమవుతున్నాడన్న అనుమానం ఉంది.

గతంలో ఆయనకు అధికార యంత్రాంగంమీద మంచి పట్టుండేది. కాని ఇప్పుడు ఆ పట్టు తగ్గింది. గోవాకు ప్రధాన ఆర్థిక వనరు అయిన ఇనుప ఖనిజ ఎగుమతులు ఏ కారణంచేతనో తగ్గిపోతున్నాయి.

ఇలా సమస్యలు పెరిగి, ప్రభుత్వం నిలబెట్టుకోవ టం కోసం ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చి ఇబ్బందుల్లో పడుతున్నాడు పారికర్. ◆

గెలుపులో కష్టాలు

హిమాచల్‌ప్రదేశ్‌ని కాంగ్రెస్ చేతిలోనుండి లాక్కు న్నంత సులభంగా తమ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తేల్చుకోలేకపోయింది బి.జె.పి. తమ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి అని ప్రకటించిన వ్యక్తిని ఆ రాష్ట్ర ప్రజలు తిరస్కరించారు.

సి.ఎమ్. అభ్యర్థినే గెలిపించుకోలేని పార్టీకి ఇప్పుడు కొత్త సి.ఎమ్. ఎంపిక తలనొప్పి అయింది. వర్గ విభే దాలు పూర్తిస్థాయిలో బయటపడ్డాయి.

గెలిచిన ప్రతి ఎమ్.ఎల్.ఏ.కి. ముఖ్యమంత్రి కావా లనే కోరిక ఉందనే విషయం స్పష్టం. తమలో ఒకడిని ముఖ్యమంత్రిగా అంగీకరించలేని బి.జె.పి.లో ఐక మత్యం ఏమేరకు ఉందో ప్రజలు అర్థంచేసుకో గలరు. మేము భిన్నమైన పార్టీ అని చెప్పుకోవటమే గాని చివరికి తమదీ కాంగ్రెస్-బి సంస్కృతి అని స్పష్టంచేస్తున్నారు బిజెపి నేతలు. ◆

పశుగ్రాసం కేసులో

బీహార్ మాజీ ముఖ్యమంత్రి మాజీ రైల్వేమంత్రి, ఆర్.జె.డి. పార్టీ అధినేతను జైలుకు పంపింది రాంచీ లోని ప్రత్యేక సి.బి.ఐ. కోర్టు. పశుగ్రాసం కొనటంకోసం వివిధ జిల్లాల ట్రెజరీల నుండి వందల కోట్లు అక్ర మంగా బయటకు తీశారన్నది అభియోగం.

పశుగ్రాస కుంభకోణంగా పేరుపొందిన దీనిలో గతంలోనే ఒక కేసులో లాలూకి శిక్షపడింది. ప్రస్తుతం సుప్రీమ్‌కోర్టు ఇచ్చిన బెయిల్‌మీదున్నాడు. ఇప్పుడు మరో జిల్లా ట్రెజరీ నుండి అక్రమంగా బయటకు తీసిన కేసులోనూ ఆయనకు శిక్షపడింది.

ఫలితంగా ఆరుసంవత్సరాలపాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడయ్యాడు. అంతవరకు రాజ కీయాలకు దూరంగా ఉండాలి. అప్పటికి లాలూ వయసు 75 సంవత్సరాలు దాటిపోతుంది.

అంతగా రాజకీయాలను ప్రభావితం చెయ్యలేడు. ఇది నితీష్‌కుమార్‌కి, రామ్‌విలాస్ పాశ్వాన్‌వంటి బీహార్ నేతలకు బాగా కలిసివస్తుంది. ◆

భయపక్షం

రాజకీయాలలో ప్రతిపక్షం అంటే అధికార పక్షాన్ని భయపెట్టేదిగా ఉండాలి. కాని ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి పక్షం అధికారపక్షం ఎత్తుగడలను చూసి భయపడే పక్షంగా మారింది. కర్నూలు జిల్లాలో జరిగే ఎమ్ఎల్‌సి ఎన్నికల్లో పోటీలో నిలవకూడదు అన్న నిర్ణయం ఏ భయంతో తీసుకున్నదో తెలియదు.

నంద్యాల శాసనసభ ఉప ఎన్నిక సమయంలో ప్రద ర్శించిన ధైర్యమంతా ఒక్కసారిగా ఎందుకు ఆవి రయిందో తెలియదు. అధికారపక్షానికి ఏకగ్రీవంగా ఒక ఎమ్.ఎల్.సి. పదవిని వదిలేసింది.

'కర్నూలు జిల్లానుండి గెలిచి ఎమ్.ఎల్.సి. అయిన శిల్పామోహన్‌రెడ్డిచేత నిజాయితీ రాజకీయంప్రకారం రాజీనామా చేయించా! చూడండి!' అంటూ చెప్పిన జగన్ తిరిగి శిల్పామోహనరెడ్డిని నిలబెట్టలేకపోవటం ద్వారా అది నేడు తెలుగుదేశం బలంతో దక్కిన సీటే గాని శిల్పామోహనరెడ్డికి స్వయంగా సమకూరిన బలంకాదని చెప్పకనే చెప్పినట్టయింది.

ఇప్పుడు ఎమ్.ఎల్.సి సీటుపోయి, తమ కుటుంబం ఎమ్.ఎల్.ఎ. సీటు గెల్చుకోలేకపోవటంతో శిల్పా సోదరులు దిగాలుగా ఉండిపోవటంకన్నా మరో మార్గం లేదు. ఇప్పుడు ఎన్నిక అంటే పాదయాత్రకు ప్రత్యేక బ్రేక్ ఇవ్వాలి. ఇచ్చినా ఫలితం వస్తుందో లేదో తెలియనిచోటకు అడుగెందుకనుకున్నాడు.

మరల ఓటమి అంటే మరింత నగుబాటు కదా! అదే ప్రతిపక్షం పరిస్థితి. ◆

చిక్కడు దొరకడు

అన్ని రకాలుగా పాలనా లోపాలను అర్థంచేసు కున్నవారు రూపొందించిన ఎన్నికల నిబంధనలను ఎలా బురిడీ కొట్టించాలో రాజకీయనాయకులు చెప్ప గలరు. అందుకు తాజా తార్కాణం తమిళనాడు రాష్ట్రంలోని ఆర్.కె. నగర్ ఉప ఎన్నిక.

జయలలిత మరణాంతర్వాత వచ్చిన ఆ ఎన్నికల్లో జైలులో కూర్చుని శశికళ తిప్పిన చక్రానికి డి.ఎమ్.కెకి డిపాజిట్ గల్లంతయింది. తమిళనాడు ఎన్నికల్లో భారీ నగదు పంపిణీ జరుగుతుందని అందరికీ తెల్సు.

అందువలన డబ్బు పంపిణీమీద ప్రత్యేకంగా దృష్టి పెట్టింది ఎన్నికల సంఘం. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన శశికళ బంధువు దినకరన్ ప్రతి ఓటరుకు 20 రూపా యల నోటుమాత్రమే ఇచ్చాడు.

ఆ నోటుమీద ఒక 'కోడ్' వేశారు. ఎన్నికల్లో తనకు ఓటువేస్తే ఫలితాలు విడుదలయినతర్వాత ఆ 'కోడ్' ఉన్న 20 రూపాయల నోటు తెచ్చిచ్చి 2000 రూపా యలు తీసుకువెళ్ళవచ్చని ఓటర్లకు చెప్పారు.

ఎన్నికల్లో 40 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచిన దినకరన్ ఇప్పుడు 2000 నోట్లు పంచుతున్నా ఎన్నికల సంఘం ఏమీ చెయ్యలేని పరిస్థితి. ఎన్నికల ముందు డబ్బు ఇవ్వటం నేరం. తర్వాత ఇవ్వటం నేరం కాదుకదా అన్నది దినకరన్ వాదన. ఎవరు తెలివైన వారు, ఐ.ఎ.ఎస్.లా! రాజకీయ నేతలా?





అమ్మాయిగా మలిచారు

పరిశ్రమలోకి వచ్చి తొలి సినిమా చేసి ఇంకా రెండేళ్ళైనా నిండకముందే మెహరీన్ మెరుపులు వెండితెరపై కళ్ళు మిరుమిట్లుగొలుపుతున్నాయి.

తొలి సినిమా 'కృష్ణగాడి వీరప్రేమగాథ' తర్వాత భలేగా ఉందంటూ మెహరీన్‌ను ప్రశంసించారు. నటన కూడా బావుందన్న టాక్ వచ్చింది. అయినా వెంటనే అవకాశాలు పుంజుకోలేదు. 2016 చివరికి వచ్చేసరికి మెహరీన్ జోరందుకున్నది. వరస ఆఫర్లతో ఉత్సాహంగా ఉంది. ఆమెతో ఇంటర్వ్యూ.

తొలి సినిమా తర్వాత చాలా గ్యాప్ వచ్చిందని ఏమైనా బాధపడ్డారా?

చాలా ఫీలయ్యాను. సినిమా హిట్టయినా, నాకు ఒక్క ఆఫరూ రాలేదు. వ్యక్తిగతంగా గుర్తింపు వచ్చినా, అవకాశాలు రాకపోవడంతో చాలా బాధపడ్డాను.

తర్వాత జోరందుకున్నారు కదా?

అవును.2016 ఫిబ్రవరిలో నా తొలిసినిమా విడుదలయింది. అదే సంవత్సరం నవంబరులో తమిళ సినిమా ఆడిషన్‌కోసం పిలుపు వచ్చింది. ఆ తర్వాత నెలలో హైదరాబాద్‌లో నాలుగు సినిమాలకు సంతకాలు చేశాను. 2017 అంతా వెరీవెరీ బిజీ.

మీ వ్యక్తిగత నేపథ్యాన్ని వివరిస్తారా?

పంజాబ్‌లోని బఠిండాలో పుట్టాను. తర్వాత మా కుటుంబం ఢిల్లీ వెళ్ళిపోయింది. అక్కడే ప్లస్‌టూదాకా చదువుకున్నాను.ఎన్‌సిసి,ఎడ్వెంచర్ స్పోర్ట్స్,ట్రెక్కింగ్ వంటివన్నీ నాకు చాలా ఇష్టం.

వాటిలో పాల్గొని మెడల్స్ అందుకునేదాన్ని. భరత నాట్యంలోనూ శిక్షణ ఉంది. ప్లస్‌టూ తర్వాత అండర్ గ్రాడ్యుయేషన్‌కోసం అమెరికా వెళ్ళా.

అందాల ప్రదర్శన ఆలోచన ఎలా వచ్చింది?

అమెరికా వెళ్ళిన నేను అనివార్యకారణాలవల్ల అక్కడి కాలేజీలో చేరలేకపోయాను.కెనడా వెళ్ళి బిజినెస్, ఎకనామిక్స్‌లో అండర్ గ్రాడ్యుయేషన్‌లో చేరా. అక్కడ చదువే లోకం. ఇంకో పని ఉండేది కాదు. దాంతో బాగా బరువు పెరిగిపోయా.

అప్పుడు దక్షిణాసియావారికే ప్రత్యేకంగా అందాల పోటీనిర్వహించారు.అమ్మప్రోత్సాహంతో వెళ్ళాలనుకున్నాను. అటువంటిచోటికి వెళ్తేనన్నా నాజూగ్గా తయారవ్వాలన్న ఆలోచన వస్తుందన్నది అమ్మ అభిప్రాయం. గెలుస్తానని వెళ్ళని నేను 'మిస్ పర్సనాలిటీ సౌత్ ఏసియా కెనడా 2013' కిరీటం అందుకోగలిగా. అదో మరవలేని అబ్బుర ప్రయాణం.

తర్వాత మీలో మార్పు వచ్చిందా?

(నవ్వేస్తూ) వచ్చిందనే చెప్పాలి. అంతకుముందు మగరాయుడి మాదిరి ఉండేదాన్ని. అక్కడి ఏజెన్సీ సిబ్బంది నన్నో అమ్మాయిగా మార్చారు. పోటీల్లో లభించిన ప్రోత్సాహం ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

నటి కావాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

చదువుకునే రోజుల్లో టీచర్ కావాలనుకునేదాన్ని. తర్వాత సునీతా విలియమ్స్‌ను దగ్గరనుంచి చూసి ఏరోనాటికల్ ఇంజినీర్ కావాలనుకున్నాను. హాస్పిటల్‌కు వెళ్ళి డాక్టర్‌ను చూసి డాక్టర్ కావాలనుకున్నాను. ఇంకోసారి బిజినెస్ చేయాలనుకున్నా.

ఇలా చాలాసార్లు చాలా కావాలనుకునేదాన్ని. అందాల పోటీల్లో గెలిచాక సినిమాల్లో నటించాలన్న ఒక స్పష్టమైన ఆలోచన వచ్చింది.

తొలి అవకాశాలు ఎలా వచ్చాయి?

కెనడాలో ఉన్నప్పుడు రెండు కమర్షియల్స్ చేశాను. చదువు ఆపేసి ఇండియా వచ్చేశా. ఆ తర్వాత ఇక్కడ నలభైదాకా కమర్షియల్స్ చేశాను. అప్పుడే నన్ను చూసిన దర్శకుడు తొలిచిత్రం ఆడిషన్‌కు పిలిచారు. తర్వాత కథ మీకు తెలిసిందే (నవ్వేస్తూ).







ఒకేసారి నాలుగు సినిమాలకు పని చేయడం కష్టంగా లేదా?

చాలా చాలా కష్టం అనిపించింది. విశ్రాంతి, విరామం లేకుండా పనీ, ప్రయాణాలతో గడిచిపోయింది.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న అమ్మమాటల్ని ప్రతిరోజూ ఉదయం నేను గుర్తు చేసుకునేదాన్ని.

సినిమాల ఎంపిక విషయంలో మీ ప్రాధాన్యాలేంటి?

అవకాశం వచ్చింది కదా అని ప్రతి సినిమానూ ఒప్పేసుకోలేను కదా. ప్రేక్షకులకు నచ్చుతుందా? లేదా? అన్న కోణంతో కథ వింటాను. నచ్చితే ఓకే చెప్తాను, లేకుంటే లేదు అనేస్తాను.

సినిమా ఎంపిక సమయంలో పారితోషికానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారా?

ఇవ్వను. పారితోషికంకంటే నాకు కథే ముఖ్యం. మంచి కథలు ఎంచుకోవాలన్నదే నా ప్రయత్నం.

సినిమాల్లో మీకేదో 'దెబ్బ' సెంటిమెంట్ బాగా ఉన్నట్లుంది కదూ?

(మరోమారు నవ్వేస్తూ). నా సినిమాలన్నింటిలోనూ దాదాపుగా దెబ్బలు తగిలించుకుంటూనే ఉన్నా. దాంతో దెబ్బ తగిలితే సినిమా హిట్ అని నా ఫ్రెండ్స్ అంటుంటారు. షూటింగ్ అంతా అటూ ఇటూ తిరుగుతూ గెంతుతుంటానేమో- అందుకే దెబ్బలు తగిలించుకుంటుంటా.

మీలోని కోరిక?

చెప్తే నవ్వకండి. ఆ కోరిక చాలా బలమైనది. టాలీవుడ్‌లో పలానా కాలాన్ని 'మెహరీన్ శకం'గా చెప్పుకునేలా గుర్తింపుతెచ్చుకోవాలన్నది నా కోరిక.

మీరు బాగా ఇష్టపడేది?

ప్రయాణాలు. సినీ షూటింగ్‌లతో ఈ కోరిక బాగా తీరుతోంది. ఎప్పుడూ స్నేహితులతో, కుటుంబసభ్యులతో కూడా ప్రయాణాలు ప్లాన్ చేస్తుంటా.

ఖాళీ దొరికితే ఏం చేస్తారు?

నిద్రపోతుంటా. పూర్తిరోజు ఖాళీ అయితే స్నేహితులతో షికారుచేస్తా అంటూ ముగించింది మెహరీన్.

అయినపూరి సుజాత



సీరియల్

అలజడి



పుట్టగంటి గోపీకృష్ణ



రమేష్ శరీరం పులకించిపోయింది. ఆటోమేటిగ్గా అతని చెయ్యి ఆమె నడుమును చుట్టింది. ఆమెకి కూడా ఆ పులకింతలు పాకాయి.

అయితే రమేష్ పులకింతలతోఆగలేదు. ఏదో మైకం కమ్మినట్లు అతని కళ్ళు అరమోడ్పులయ్యాయి. అయితే ఆ మైకం ఎక్కువసేపు కొనసాగకుండా వెనుక నుండి టైగర్ ఒకమాదిరి శ్రుతిలో మొరిగింది.ఇద్దరూ విడిపోయారు. వెనక్కితిరిగి కళ్ళలో నిప్పులు కురిపిస్తూ చూశాడు రమేష్. టైగర్ అతని చూపుల్ని లెక్కచేయనట్లు తలతిప్పుకుంది.

"ప్రేమకోసం త్యాగాలు చేసినవారిని చూసివుంటావ్. సాహసాలు చేసినవారిని చూసివుంటావ్. హత్యలు చేసినవారిని చూశావా?" అడిగాడు కసిగా రమేష్ సౌందర్యని.

నవ్వింది సౌందర్య. "ఎవర్ని హత్య చెయ్యబోతున్నావేంటి?" అంది.

"చెప్పను... చేసిచూపిస్తాను" వెనక్కి తిరిగి టైగర్ వైపు చూస్తూ అన్నాడు అతను.

"హత్యల సంగతి తరువాత... మా నాన్ననిమాత్రం బానే కాకాపట్టావే..." ఒక చిన్న గుట్టమీద కూర్చుంటూ అంది ఆమె. "ఎలా కనిపెట్టావ్ ఈ సంగతిని?"

తనుకూడా పక్కన కూర్చున్నాడు రమేష్.

"ఇందాక భోజనాలసమయంలోకూడా నీచెవిలో ఏదో గుసగుసగా మాట్లాడుతున్నాడుగా..."

"అదా! అది కోడిపందాల గురించిలే..."

"నీకొక రహస్యంచెప్పనా? ఏదోకటిచేసి రేపటిలోపు కనీసం ఒక్క కోడిపందెం గెలిపించేటట్లు చూడు. ఇక మా నాన్న ఎవరు వద్దన్నా నీకు నన్నిచ్చి పెళ్ళిచేస్తాడు"

"అవునా! ఈ కోళ్ళలో అంత శక్తి ఉందా?" అని ఆమె భుజంచుట్టూ చెయ్యివేసి గోముగా అన్నాడు రమేష్

జరిగిన కథ 20


కోడిపందాలు జరిగేచోటుకి వెళ్తాడురమేష్. అక్కడ మారువేషంలో తారసపడతాడు కిరణ్. కాంతారావు, రామ్మూర్తి ఇద్దరూ తమ కోళ్ళను పందెంబరిలోకి వదులుతారు.

నల్లకాకి అని పేరుపెట్టుకున్న కాంతారావు పందెంకోడికి కాస్తంత మందుపోస్తాడు కిరణ్.

రామ్మూర్తికిచెందిన తెల్లనెమలిని కాంతారావ్ నల్లకాకి ఓడిస్తుంది. వినాయకరావు వరసిద్ధి ఓపాట అందుకోవడం చూసి ఆశ్చర్యపోతారు ఆదిత్య, వ్యాఘ్రం.

రామ్మూర్తి కూతురు సౌందర్యకే కాదు నేను నచ్చాల్సింది ఆమె తల్లిదండ్రులకుకూడా నచ్చాలని ఆదిత్యతో చెబుతాడు రమేష్

కిరణ్ మందుకొట్టి కాంతారావు ఇంటికి వస్తాడు. గౌరిమీద ప్రేమతో ఆమెకో ముద్దుపెట్టేస్తాడు కిరణ్. సౌందర్యను కలుస్తాడు రమేష్ ఆ తర్వాత జరగబోయేది చదవండి.



“మరేమనుకుంటున్నావ్...” అతనివైపు తిరిగి అంది ఆమె. పగడాల్లాంటి పెదవులు ఎండపడి మరింతగా మెరుస్తున్నాయి.

వెన్నెముక కిందనుండి జివ్వుమంది అతనికి. అప్రయత్నంగా ఆమెమీదకి వంగాడు రమేష్.

ఆమె తల పక్కకి తిరగలేదు. ఇంకొక్క క్షణంలో రెండు పెదవులూ కలుసుకునేవే! భయంకరంగా పెద్ద స్వరంతో మొరిగింది టైగర్.

ఇద్దరూ దూరంగా జరిగారు.

“ఏమయింది?ఏమయింది?”అంటూ దూరం నుండి లక్ష్మి రావటం కనిపించింది.

పళ్ళు పటపట కొరికి టైగర్ని హత్య చేయాలన్న తన నిర్ణయాన్ని దృఢపరచుకున్నాడు రమేష్.

సౌందర్య, తల్లితోపాటు వెళ్ళిపోయింది.

నిరాశగా అక్కడే కూర్చుండిపోయాడు అతను.

ఇంతలో బాగా పరిచయమైన విజిల్ శబ్దం వినిపించింది. మళ్ళీ ఆదిత్యవచ్చాడా అని చుట్టూ చూశాడు.

ఫెన్సింగ్ అవతల నిలబడి సైగ చేస్తున్నాడు ఆదిత్య. పరుగెత్తుకుంటూ అటు వెళ్ళాడు రమేష్.

“నువ్వన్నావ్ చూడూ! మురారీకి సంకేతం కనపడటంలేదంటున్నాడని... దాని గురించి ఆలోచించాను. ఎట్టకేలకు ఒక మార్గం దొరికింది”

“ఏంటది...”

“ఇదుగో! ఈ బుల్లి పరికరం చూడు. బ్యాటరీతో పనిచేస్తుంది ఇది. ఈ స్విచ్ నొక్కితే మెరుపు మెరిసినట్లు వెలుతురు వస్తుంది”

“దీంతో ఏంచేయాలి...”

“నీ బొంద చెయ్యాలి. నువ్వేమీ ఆలోచించవద్దు కానీ. తీసుకువెళ్ళి దీన్ని ఈషికకి ఇవ్వు. మిగిలింది తనే చూసుకుంటుంది”

“నేనుకూడా నీకు ఒక విషయం చెప్పాలి”

“ఏంటి?”

“రామ్మూర్తిని కనీసం ఒక్క కోడిపందెంలో అయినా గెలిచేలా చెయ్యమని అడిగింది సౌందర్య. దానికి కిరణ్ సహాయం కావాలి” అన్నాడు రమేష్.

“వాడేం చేస్తాడు?”

“వాడి సంగతి నీకు తెలియదు. ఇంతకుముందు జరిగిన కోడిపందాల్లో చచ్చిపోబోతున్న కోడిచేత పందెం గెలిచేటట్లు చేశాడు”

“అదేదో యాదృచ్ఛికంగా జరిగివుంటుంది”

“అదేంకాదులే! వాడికీ ఈ సంగతి చెప్పు. రేపు కోడిపందాలదగ్గర కలుస్తానని చెప్పు”

“సరే! ఏదో ఒకటి ఏడవండి...” అంటూ వెళ్ళిపోబోతూ, “అది బ్యాటరీతో పనిచేస్తుంది. అవికూడా మామూలుగా మార్కెట్లో దొరికే బ్యాటరీలు కాదు. చిన్నగా ఉంటూనే పవర్ ఎక్కువ ఉండే బ్యాటరీలు. పవర్ ఎక్కువ ఉంటుందికానీ, ఎక్కువసార్లు వాడటానికిపనికిరావు. ఈ విషయంకూడా ఈషికకి చెప్పు”

“సరేలే!...” అంటూ వెనక్కితిరిగాడు రమేష్.

చిన్నపిల్లవాడికి ఎదురుగా చాక్లెట్ కొండపెట్టి ఏమీ తినవద్దని కండిషన్ పెట్టినట్లుంది రమేష్కి. అరిసెలు, లడ్లు, పూర్ణాలు ఎదురుగా ఉన్నా తిందామంటే టైగర్ భయం.

అది ఎదురుగా కూర్చుని కదలదు. అది ఉండగా తింటే ఏమవుతుందో అతనికి బాగా తెలుసు. తరువాత జరిగే ప్రక్రియలు గుర్తుకొచ్చి అసలు తిండిమీద వ్యామోహమే చచ్చిపోయేటట్లుంది.

దాన్ని దూరంగా తీసుకుపోయి కట్టేయిద్దామంటే, అత్తగారు కళ్ళనీళ్ళుపెట్టుకుంటోంది. ఏమీ చేయలేక ఇంట్లోకి నడిచాడు రమేష్.

ఎదురుగా ఒక గది ఖాళీగా కనపడింది. ఆ గదిలోకి వెళ్ళి పరిశీలిస్తూ రెండు క్షణాలు గడిపాడు రమేష్. అతను అనుకున్నట్లే టైగర్ కూడా ఆ గదిలోకి వచ్చింది. అప్పుడే వచ్చిన ఆలోచనతో మెరుపువేగంతో బైటకు వచ్చి గదిబయట గడిపెట్టాడు రమేష్.

టైగర్ గది లోపలనుండి తలుపుమీద గోళ్ళతో గీకుతూ అరిచింది. అయితే ఎవరూ దగ్గర్లో లేకపోవటంతో దాని అరుపులను పట్టించుకోలేదు.

కాసేపటికి అదున్న పరిస్థితి దానికి కూడా అర్థమైనట్లుంది. మౌనంగా ఉండిపోయింది. ఆ తరువాత నింపాదిగా స్టోర్ రూములో కూర్చుని ఉదయం నుండి తినని లోటు పూడ్చే పనిలోపడ్డాడు.

ప్రేమసంకేతం గురించి తెలిసినప్పటినుండీ మురారికి అది నిజమో కాదో తెలుసుకోవాలని తెగఉత్సాహంగా ఉంది. అయితే మృదులా, ఈషికా పక్కపక్కన లేకుండా కనపడటం లేదు.

కళ్ళతో తన సందేశాన్ని మృదులకి పంపాలని అతను చేస్తున్న ప్రయత్నాలను ఆమె అర్థంచేసుకున్నట్లు కనపడలేదు. ఒక్కొక్కడికీ ఒక్కొక్క సందేశం కనపడుతుందంట.

తన ఇంట్లో ఇద్దరమ్మాయిలు ఉన్నారు. తనకి ఎవరు జోడీ? తాతయ్య చెప్పిన ఈషికా? తనంటే ఇష్టపడుతున్న మృదులా? ఎవరినుండీ సందేశం వస్తుందో తెలుసుకోవటం ఎట్లా?... అన్న ఆలోచనలతో అతను సతమతమవుతున్నాడు.

ఎట్టకేలకు అతని ప్రయత్నం ఫలించింది. మృదుల అతని ప్రయత్నాలకు రెస్పాండ్ అయింది. ఏమిటన్నట్లు చూసింది. లోపలకు రమ్మని సైగచేశాడు మురారి. ఆమె ఆలోచనలో పడింది.

ఆమె సంకోచిస్తోందని మురారికి అర్థమైంది. అందుకే ఆమెను రమ్మని మరోసారి సైగచేసి ఆమె జవాబుకోసం ఎదురుచూడకుండాతను లోపలకునడిచాడు. ఎదురుగా ఉన్న గదితలుపుతీసి లోపలకు వెళ్ళాడు. ఆ గది బాగా చీకటిగాఉంది. అలాంటిచోటైతే

ఓ పద్ధతి ఉంది


కొద్ది నిమిషాలో, సెకన్లో కమర్షియల్స్ చేస్తే బాగా డబ్బు వస్తుంది కదా అనుకునేవారికోవలోకి తను అస్సలు రానే రానంటున్నది పూజాహెగ్డే.

డబ్బుకోసం ఏదిపడితే అది చెయ్యనని ఖచ్చితంగా చెప్పేస్తోంది కూడా. ఇంతకూ విషయం ఏమిటంటే ఓ ప్రముఖకంపెనీవారు వెయిట్‌లాస్ పిల్‌ను ప్రమోట్ చెయ్యమని అడిగారట.

భారీ పారితోషికాన్ని కూడా ఆఫర్ చేశారు. కాని, దీనికి పూజ 'నో' చెప్పేసింది.

"చక్కని డైట్ అలవాట్లను, వ్యాయామాలను అనుసరిస్తూ, సహజ పద్ధతిలో బరువు తగ్గాలి.

అంతేకాని మాత్రలు వాడి బరువు తగ్గుతారని తప్పుదారి పట్టించడం నాకు ఇష్టం లేదు. రోజులో కనీసం నలభై ఐదునిమిషాలు వ్యాయామాలు చేస్తూ, జీవనశైలిని మార్చుకోవాలి" అంటూ తన అభిప్రాయాలు వెల్లడించింది పూజాహెగ్డే.



మృదులని టెస్ట్‌చేసి చూస్తే మెరుపులు బాగా కన్పిస్తాయని అతని ఉద్దేశం...

"అతను పిలుస్తోంది ఎందుకో అర్థమైందా?" అడిగింది ఈషిక.

"ఈ ప్రేమ సంకేతాలేమిటో, దానికి ఈ టెస్టులేమిటో నాకేమీ అర్థంకావటంలేదు..."

"ఏం పర్లేదు. ఇదుగో ఇది చీరచాటున ఉంచు. చెప్పింది బాగా గుర్తుందిగా!... అతను నిన్ను చూడగానే ఈ బటన్ టచ్ చెయ్యాలి..."

నిట్టూర్చి ఆ మెషీన్ తీసుకుని ఎవరికీ కనపడకుండా చీరచాటున దాచి, లోపలకు నడిచింది మృదుల. అక్కడ రెండు గదులున్నాయి. మురారి ఎక్కడ ఉన్నాడో తెలియదు.

ఒక గదిలోకి వెళ్ళింది ఆమె. అక్కడంతా చీకటిగా ఉంది. గోడమీద తడిమి స్విచ్ ఎక్కడ ఉందో కనుక్కొని లైట్ వేసింది. వెలుతురులో చుట్టూ చూసిన ఆమెకి దొంగలా ఒకమూలకూర్చుని అరిసెలు నోటినుండా కుక్కుకున్న రమేష్ కనిపించాడు. మృదులని చూసి పట్టుబడ్డ దొంగలా నమలటం కూడా మరచిపోయి నిలబడ్డాడు. "మీరేమిటి ఇక్కడ?"

"ఉదయం నుండీ ఏమీ తినలేదు సిస్టర్. ఏమి తిందామన్నా ఆ టైగర్ పెట్టే టార్చర్ గుర్తుకువస్తోంది.



గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం తొలగిపోవాలంటే గ్రామీణ ప్రాంతాల పరిస్థితుల్లో మార్పులు రావాలి.

-ఇ.ఎస్.ఎల్.నరసింహన్, గవర్నర్

ఇప్పుడే దాన్ని గదిలో పెట్టి గడివేసి కాస్త తిందామని ఇటు వచ్చాను" దీనంగా చెప్పాడు.

అప్పుడు ఒక్కసారిగా ఇద్దరికీ పక్క గదిలోనుండీ ఇద్దరు పెనుగులాడుతున్న శబ్దం, ఒక వ్యక్తి మూలుగులూ వినిపించాయి. పరుగుపరుగున బయటకు వచ్చి ఆ గదితలుపులు బార్లా తీసింది మృదుల.

స్విచ్ వెతికి ఆ గదిలో లైటుకూడా వేసింది.

అక్కడ కనిపించిన దృశ్యం భీకరంగా ఉంది. మురారిని కిందపడేసి అతని గుండెలమీద నిలబడి మరీ తనకిష్టమయిన పనిచేస్తోంది టైగర్.

"లే!.. లే!!..." అంటూ మృదుల టైగర్ని పక్కకి లాగింది. అప్పటికే తను పగ తీర్చుకుంటోంది రమేష్ మీద కాదనీ, మురారిమీద అనీ అర్థంచేసుకున్న టైగర్ బుద్ధిగా పక్కకి జరిగి నిలబడింది.

ఇంతలో దానికి బుగ్గన అరిసెలతో మృదుల వెనుకవచ్చిన రమేష్ కనిపించాడు.

ఒక్క ఊపుతో అతనిపైకి దూకింది టైగర్. రెట్టించినఉత్సాహంతో తన పని చేసుకుపోతోంది.

కిందపడిపోయిన మురారిని లేపటానికి చెయ్యందించింది మృదుల. ఆ హడావుడిలో మెషీన్ సంగతే మరచిపోయింది మృదుల. అందుకే దానిని 'ఆన్' చెయ్యలేదు. ఆ చెయ్యిపట్టుకుని లేవబోయాడు మురారి. అతని కళ్ళముందు ఎలాంటి మెరుపులూ మెరవలేదు. టైగర్ పెట్టిన హింసకంటే, మెరుపులు మెరవని నిరాశే ఎక్కువయింది అతనికి.

పైకి లేవటానికి ప్రయత్నిస్తూ సగం లేచిన అతను, కాలుజారి మళ్ళీ కిందపడిపోబోయాడు. అనియంత్రితంగా అతను తన రెండో చేయి మృదుల నడుము మీద వేశాడు. ఆ చెయ్యి అనుకోకుండా అక్కడ ఉన్న మెషీన్‌మీదపడింది. అంతే!... ఒక్కసారిగా కళ్ళ ముందు మెరుపులు మెరిసినట్లైంది.

ప్రకాశవంతమయిన వెలుతురుతో గదంతా నిండిపోయింది. మృదుల అతని చేతిని అక్కడనుండీ తొలగించి సిగ్గుతో బయటకువెళ్ళిపోయింది. టైగర్ కూడా పని ముగించుకుని పక్కకెళ్ళి నిలబడింది.

"నాకు మళ్ళీ సంకేతం కనపడింది..." మైకంలో ఉన్నట్లు అన్నాడు మురారి.

"నాకు కళ్ళముందు చుక్కలు కనపడటం అంటే ఏమిటో తెలిసింది..." టైగర్‌వైపు చూస్తూ అన్నాడు రమేష్.

ఆ సాయంత్రం మర్యాదపూర్వకంగా వరసిద్ధి ఇంటికివచ్చి కలిశాడు వ్యాఘ్రం.

"నువ్వు చేసిన మేలు మరచిపోనబ్బాయ్.." అన్నాడు వరసిద్ధి. అతనికి ఇంకా మురారి, మృదుల వ్యవహారంమీద ఇసుమంత కూడా ఐడియా లేదు.

"నేను చేసింది ఏముందండీ... ఏదో చిన్నమాట సాయం" అన్నాడు వ్యాఘ్రం.

"ఈరోజుల్లో అది చేసేవారే తగ్గిపోయారు..." అంటూ వచ్చాడు వినాయకరావు.

"ఇక్కడ రోజులు ఎలా గడుస్తున్నాయి అంకుల్" అని అడిగాడు వ్యాఘ్రం.

"పాతకాలపు కబుర్లతో అసలు రోజు ఎప్పుడయిపోతుందో అర్థంకావటంలేదు..." అన్నాడు వినాయకరావు సంతోషంగా.

"సరే వ్యాఘ్రం... మేము బయటకు వెళ్ళివస్తాం. నువ్వు పిల్లలతో మాట్లాడుతుండు..." అని బయటకు నడిచారు వరసిద్ధి, వినాయకరావు.

"ఎక్కడికి అంకుల్..." అడిగాడు వ్యాఘ్రం.

"మోటబావిలో ఈతకొట్టి చాలా రోజులైందోయ్. ఒక చూపు చూసివద్దామని..."

"ప్రమాదమేమో..." ఆందోళనగా అన్నాడు వ్యాఘ్రం. 'మాకు ప్రమాదమా...' అన్నట్లు వంకరగా నవ్వి వాళ్ళు బయటకు వెళ్ళిపోయారు.

ఇంతలో మురారివచ్చి వ్యాఘ్రం పక్కన కూర్చున్నాడు. లక్ష్మివచ్చి రెండు ప్లేట్లలో అరిసెలూ, కారప్పూసా పెట్టి ఇద్దరికీ ఇచ్చింది.

"ప్రతి ఇంట్లోనూ ఇవే వంటలండీ..." కాదనకుండా తీసుకుంటూ అన్నాడు వ్యాఘ్రం. తన డ్యూటీ అయిపోయినట్లు ఆవిడ వెళ్ళిపోయింది.

"మీ ఇంట్లో పూర్ణాలు చెయ్యలేదా?" అడిగాడు వ్యాఘ్రం మురారిని ఉద్దేశించి.

"చేశారు. భలే కుదిరాయి కూడా!..."

"మరి నాకు పెట్టలేదే?"

"చెప్పాగా బాగా కుదిరాయని" పొట్ట నిమురుకుంటూ అన్నాడు మురారి.

వాటిని ఎప్పుడో అవగొట్టాడని అర్థమైంది వ్యాఘ్రానికి. "మా ఇంట్లో వంటమనిషి ఇవాళ దంపుడుబియ్యం అన్నంవండి దాంట్లోకి గుమ్మడికాయ బెల్లంపులుసు పెట్టింది..." ఊరిస్తూ చెప్పాడు వ్యాఘ్రం.

"నువ్వే అదృష్టవంతుడివి. కలిసినప్పుడల్లా ఒక కొత్తరకం వంటగురించి చెప్తావు..."

ఆ తరువాత వారి చర్చ ఒక అరగంటసేపు కొత్త రకం వంటలమీదకి మళ్ళింది. వారికి తెలిసిన రకరకాలవంటలగురించీ, అలభ్యమవుతున్న ఆ రుచుల గురించీ నెమరువేసుకున్నారు ఇద్దరూ. తిన్నది అరిసెలే అయినా, వందరకాల తినుబండారాలు తిన్న తృప్తితో బైటకు నడిచాడు వ్యాఘ్రం.

ఆదిత్య ఇంటికి వచ్చేటప్పటికికిరణ్ మధ్యాహ్నం నిద్రపోతున్నాడు. అప్పుడు అతన్ని డిస్టర్బ్ చెయ్యకుండా వేచి చూశాడు ఆదిత్య.

అయితే సాయంత్రం అయినా కిరణ్ నిద్రలేచే సూచన కనపడకపోవటంతో తప్పక బలవంతంగా అతన్ని నిద్రలేపాడు.

"చెట్టుమీద నుండి దించిన కల్లుకుండా, చెలి చేతులతో వండిన నాటు కోడిపులుసూ... ఈ రెండూ ఉంటే జీవితంలో ఇంకేమీ అక్కర్లేదుబాసూ..." లేచి కూర్చుంటూ అన్నాడు కిరణ్.

"నీ ప్రాముఖ్యత ఊర్లో పెరిగిపోయే సూచనలు కనిపిస్తున్నాయ్. కోడిపందాలదగ్గర ఏదో మ్యాజిక్ చేసి ఓడిపోయే కోడిని గెలిపించావంటగా!...

"నా బొంద నేను చేసిందేముంది? దానికి కూడా ఒక పెగ్గు పట్టించాను..."

"ఆ మాట వాళ్ళకి చెప్పేవు. నువ్వేదో గొప్ప పని చేశావని ఊరంతా ఊహించుకుంటున్నారు"

"ఎందుకు చెప్తాను? చెప్పన్లే..."

"రేపు నీ అపాయింట్‌మెంట్ ఆరామ్మూర్తిగారికి కావాలంట.ఆయన కోడినికూడా గెలిపించాలంట"

"నన్ను ములగచెట్టు ఎక్కించకు. ఇప్పుడు నా దగ్గర విస్కీకూడా లేదు"

"నాటుకోడికి విదేశీ విస్కీ ఎందుకు? కల్లు పట్టించు.ఐనా నువ్వే కల్లు తాగుతుండగా లేంది, కోడికి సరిపోదా?"

"నువ్వంత ధైర్యంచెప్తే ఇక తప్పుతుందా?" అన్నాడు కిరణ్.

"అది నాకోసంకాదు. మన ఫ్రెండు రమేష్‌కోసం. నువ్వు కోడిని గెలిపిస్తే వాడి ప్రేమకూడా ఒక కొలిక్కి వస్తుంది..." అన్నాడు ఆదిత్య.

"నన్ను భయపెట్టకు. ప్రయత్నిస్తాను" అన్నాడు కిరణ్.

హర్ష ఉపాధ్యాయ

సిఐఒ-ఈక్విటీ, కోటక్ ఎ.ఎమ్.సి.

మనీ టిప్స్

"ఆర్థిక ఎదుగుదల రేటు పునరుద్ధరణలో మనం ప్రాథమిక దశల్లో ఉన్నాం.

పెట్టుబడుల సైకిల్ నెమ్మదిగా మెరుగవడాన్ని మనం చూస్తాము. ఈక్విటీలలో పెట్టుబడులు పెట్టేవాళ్ళు తక్షణ పరిస్థితిని గుడ్డిగా అనుసరించకుండా స్థిరమైన, క్రమశిక్షణతో కూడిన వైఖరి ప్రదర్శించాలన్నది మా సలహా.

ప్రస్తుత స్థాయిలకంటే ఈక్విటీలు దీర్ఘకాలంలో ఆరోగ్యవంతమైన రిటర్న్స్ ఇస్తాయన్నది మా అంచనా. కాబట్టి ఈక్విటీ పెట్టుబడిదారులు స్వల్పకాలికంగా ఎదురయ్యే ఎటువంటి ఆటుపోట్లకు అయినాసిద్ధంగా వుండాలి"



అన్ని పల్లెటూర్లలోలానే నక్కలదొడ్డిలో కూడా త్వరగా పొద్దుపోయింది. వెలుతురు తగ్గగానే పగలంతా వినిపించే పెంపుడు జంతువులైన కోళ్ళు, కుక్కలు, బర్రెలు, మేకల అరుపుల స్థానాన్ని, కీచురాళ్ళ రొదా, కప్పల బెకబెకలూ, మరెన్నో రకాల కీటకాల శబ్దాలూ ఆక్రమించాయి.

వెలుగుతున్న కరెంటు లైట్లు కమ్ముకున్న చీకట్లను దూరంగా తరమలేకపోతున్నాయి. ఇంతలో కరెంట్‌పోయింది. "హుష్..."అన్న నిట్టూర్పులు అన్ని దిక్కులనుండి వినిపించాయి.

"మళ్ళెప్పుడొస్తుందో?" అన్నాడు రమేష్.

"ఇక ఒకటే రావటం. ఏదో పేలిన శబ్దం వినిపించలేదూ. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిందేమో?" అన్నాడు వరసిద్ధి.

"ఇప్పుడేమైంది ఆ టి.వి. చూడటం ఆపి చక్కగా కబుర్లు చెప్పుకోండి"అంది లాంతర్ వెలిగిస్తూలక్ష్మి. మిగిలిన ఆడవాళ్ళు వంటపనుల హడావుడిలో ఉండటంతో మురారి, రమేష్ డాబామీదకి వెళ్ళారు.

"నువ్వే అదృష్టవంతుడివి రమేష్!" అన్నాడు మురారి.

"ఎందుకు మీచెల్లెల్ని చేసుకుంటున్నందుకా?"

"కాదు. నీకు కనీసం ఎవర్ని ప్రేమించాలో క్లారిటీ ఉంది. ప్రేమించిన అమ్మాయిని తిరిగి ప్రేమించేలా చేసుకునే తెలివిఉంది. ఇక ఇంట్లో పెద్దవాళ్ళని ఒప్పించటం ఎంతసేపూ?"

"నువ్వు అర్థం చేసుకోవటంలేదు కానీ నువ్వు నా కంటే అదృష్టవంతుడివి..." అన్నాడు రమేష్.



సంగీతం మారలేదు. దానిని వినిపించే తీరు మారింది. దానిని వినే తీరు మారింది అంతే.

-ఎ.ఆర్.రెహమాన్, సంగీత దర్శకుడు

"ఏం అదృష్టవంతుడివి? ఈషికని ఎంచుకోమనీ మా తాత పోరుతాడు.మృదులే నా గమ్యమని మనసు చెప్తోంది. ఎటుపోవాలో తెలియటంలేదు!"

"నిన్న చెప్పాను కదా! నిజమయిన ప్రేమ అయితే ఎవరూ చెప్పనవసరంలేదు. వాటంతట అవే సంకేతాలు వస్తాయని..."

"ఒకసారి కాదు, రెండుసార్లు సంకేతాలొచ్చాయి"

"అవునా?" ఆశ్చర్యంగా అన్నాడు రమేష్.

"ఎప్పుడు?"

"మొదటిది ఇంతకుముందే వచ్చింది. నేనే గుర్తించలేకపోయాను. కానీ ఇందాక స్టోర్‌రూమ్‌దగ్గర కనిపించిన సంకేతం తరువాత నా మనసులో అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి"

"మరింక సమస్యేముంది? నీ మనసు చెప్పినట్లు చెయ్యి" అన్నాడు రమేష్.

"కానీ మా తాతయ్య..."

"కాపురం చేసేది నువ్వు. తాతయ్య కాదు..."

"ఆయన్ని ఎలా ఒప్పించాలో అర్థంకావటంలేదు"

ఏమీ మాట్లాడలేదు రమేష్.

"ఒక పని చేస్తాను..." ఏదో నిర్ణయానికి వచ్చినట్లు అన్నాడు మురారి. "ఇంకోసారి పరీక్షిస్తాను. మళ్ళీ సంకేతం కనిపించిందంటే... తాతయ్యని ఎదిరించి అయినా మృదులని వదలను"

"ఎప్పుడు?"

"ఇప్పుడే..."

"వెళ్ళు.వెళ్ళి విజయమో,వీరస్వర్గమోతేల్చుకురా"

"ఇప్పుడే వెళ్తున్నాను" అంటూ కిందకు దిగబోయిన మురారిని ఆపాడు రమేష్.

"కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అనీ... అందరి ముందూ తొందరపడకు.." అని సలహా చెప్పాడు.

"సరే!" అంటూ కిందకు దిగి వెళ్ళాడు మురారి.

ఈషిక,మృదుల మల్లెపందిరి కింద



భారతదేశపు ప్రాచీన విజ్ఞానం నుండి ప్రపంచం నేర్చుకోవాల్సింది ఇంకా చాలా వుంది.

-దలైలామా, బౌద్ధ గురువు

కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు. వారి దగ్గరకు వెళ్ళాడు మురారి "ఏంటి కబుర్లు చెప్పుకుంటున్నారూ" అని అంటూ.

"రా!... మురారీ" అంటూ అతనికి ఇంకో కుర్చీ చూపింది మృదుల.

"కొద్దిగా తప్పుకో..." అంటూ ఈషిక కూర్చున్న కుర్చీని పక్కకి జరిపి తన కుర్చీలో కూర్చున్నాడు మురారి. డాబామీద ఉన్న రమేష్, కింద మల్లెపందిరి కింద ఉన్న ఈషిక, మృదులలకు వెనుకవైపు ఉండటంతో కనపడటంలేదు.

మురారికి మాత్రం కనిపిస్తున్నాడు. అక్కడనుండి సైగచేశాడు. ఏంటి ఆలస్యం? అన్నట్లు. కాస్త ఓపిక పట్టమని సైగల రిప్లై ఇచ్చాడు మురారి.

తన సైగలను ఎవరూ గమనించలేదని అనుకున్నాడుకానీ... ఈషికా, మృదులా ఇద్దరూ గమనించి ఒకరికొకరు కన్నుకొట్టుకున్నారు.

మృదులని టచ్‌చేసి చూస్తే తన సమస్య ఒక కొలిక్కివస్తుంది. అందుకే "నీ చేతిలో ఏంటి?" అన్నాడు ఆమె చేతిలోని పుస్తకం చూస్తూ.

ఆమె సమాధానంచెప్పేవరకూ ఆగకుండా, దానిని తీసుకునే నెపంతో ఆమె చెయ్యి తాకాడు మురారి. అంతే!... కళ్ళు మిరుమిట్లు కొలిపేటట్లు పరిసరాలన్నీ మెరుపుతో నిండిపోయాయి. కళ్ళు బైర్లుకమ్మినట్లయి తలవిదిలించాడు మురారి.

"మీకేమైనా మెరుపు కనిపించిందా?" అడిగాడు వారిద్దరినీ.

"మెరుపులు కనపడటానికి మబ్బులు పట్టి లేవే?" అంది మృదుల.

"ఇది వర్షాకాలం కూడా కాదు కదా!" అంది ఈషిక.

"ఈషిక అంటే ఓ.కే. నిజంగా నీకు కూడా ఏమీ కనపడలేదా?" అడిగాడు.

"ఏంటి మురారీ? నీ ఆరోగ్యం బానే ఉందా?" అతని నుదుటిమీద చెయ్యివేస్తూ అంది మృదుల.

"అంతే!!!... మళ్ళీ అవే మెరుపులు. కళ్ళు చెదిరేలా. ఒళ్ళు గగుర్పొడిచేలా... అవే మెరుపులు.

"ఇప్పుడు కూడా ఏమీ కనపడలేదా?" కుర్చీకి అతుక్కుపోతూ అన్నాడు. అతని మాటల్లో తన ప్రేమకి కూడా సంకేతం కనిపించిందన్న ఆనందం.

"మురారి ఆరోగ్యం బాగున్నట్లు లేదు..." అంది మృదుల ఆందోళనగా.

"నేనడిగిందానికి సమాధానం చెప్పండి... మీకు మెరుపులు కనిపించాయా? లేదా?" ఎందుకయినా మంచిదని కన్ఫర్మ్ చేసుకోవటానికి అడిగాడు.

"లేదు" అన్నారు ఇద్దరూ. ఆనందంతో స్పృహ తపిపడిపోయాడు మురారి.

ఆ రాత్రి అందరూ నిద్రపోయేదాకా ఆగి మెల్లగా మంచంమీదనుండి లేచాడు రమేష్.

అందరిలోకీ ఆఖరుగా నిద్రపోయింది మురారే.

అతనికి తన ప్రేమ సంకేతం కనపడటంతో ప్రేమ మత్తులో కూరుకుపోయాడు.

రమేష్ జీవితంలో ఇంతవరకూ ఎవరినీ ద్వేషించలేదు. ఆ అవసరం కూడా రాలేదు. కానీ క్షణక్షణం అవమానిస్తూ తన జీవితాన్ని నవ్వులపాలు చేసిన టైగర్ని మర్చిపోలేకపోతున్నాడు.

ఈరాత్రి ఆ విషయం మీద ఏదో ఒక నిర్ణయం తీసుకోకపోతే తిరిగి రేపంతా దాని హింస భరించవలసిందే. అందుకే ఏది ఏమయినా తన బాధకి ఈ రాత్రే చరమగీతం పాడాలనుకున్నాడు.

నైట్‌డ్రస్‌లో పడుకున్న అతను లేచి చెప్పులు వేసుకుని అలానే బయటకు వచ్చాడు. ఇప్పుడు మళ్ళీ బట్టలు మార్చుకోవటం అంటే ఇంట్లోకి వెళ్ళాలి. అప్పుడు ఎవరో ఒకరు లేచే అవకాశం ఉంది. అందుకే అలానే బయటకు నడిచాడు రమేష్.

అతను ఊహించినట్లే టైగర్ కూడా అతన్ని అనుసరించింది. నిర్మానుష్యంగా ఉన్న దారిలో వెళుతుంటే వీధికుక్కలు లేచి అరవబోయి అతనివెనుక ఉన్న టైగర్ని చూసి ఆగిపోయాయి.

ఊరి బయటవరకూ బానే వెళ్ళాడు. తరువాత అడవిదారిలోకి మరలాక అతనికే ఈ పని ఎందుకు మొదలెట్టానా అన్న భయం పట్టుకుంది.

కీటకాల అరుపులు ఎక్కువయ్యాయి. మరికొంత దూరం నడిచాడు. దూరంగా ఎక్కడో నక్క ఊళ పెడుతోంది. వెనక్కితిరిగి చూశాడు. టైగర్ అక్కడే నిలబడి ఉంది. దాన్నిచూస్తే అతనికి ఇప్పుడు కోపం రావటం లేదు. జాలివేస్తోంది.

అమాయకంగా అనుసరించిరావటమేనా అది చేసిన తప్పు. తన తెలివి దాని ప్రాణాలు హరించటానికి ఉపయోగించబోయాడా?

తనకే భయం పుట్టే ప్రదేశంలో నోరు లేనిదానిని వదిలితే అది ఏం చేస్తుంది? అతనికి తప్పుచేసిన ఫీలింగ్ కలిగింది.

"సారీరా!" దాని మొహంచేతుల్లోకి తీసుకుని కావలించుకున్నాడు. అదికూడా రెట్టించిన ఉత్సాహంతో అతని మొహం మొత్తం నాకింది.

ఇప్పుడతనికి అది అసహ్యం అనిపించటంలేదు. ఆనందంగా ఉంది. ఆ చర్యలో అది వ్యక్తీకరిస్తున్న ప్రేమ కనపడుతోంది.

"నీకు అర్థమైందో లేదో నాకు తెలియదుకానీ, నీకు హాని తలపెట్టబోయాను. ఇంకెప్పుడూ అలా చెయ్యను. పద పోదాం" అని వెనక్కితిరిగాడు రమేష్. టైగర్ తనకు అంతా తెలుసన్నట్లు తోక ఊపుతూ తన సంతోషాన్ని తెలిపింది.

ఇద్దరూ వెనక్కి తిరిగారు. "అవున్రా! నీకు అన్నీ తెలుసు కదా... నేను అడవిలోకి నడుస్తుంటే నువ్వు రాకుండా ఉండవచ్చు కదా! మరెందుకురా అలా నా వెనుక వచ్చేశావ్?" టైగర్ జవాబు చెప్పదని తెలిసికూడా దానితో మాట్లాడుతున్నాడు. అదికూడా ఏదో చెప్తున్నట్లు 'భౌ... భౌ' అంది.

ఇంకా ఉంది

కత్తియుద్ధం కోరిక

'ఒక్కక్షణం'తో ఊపేస్తూ, 'ఓటర్' కోసం రెడీ అవుతూ సురభి బిజీబిజీగా ఉంది.


సురభిని డ్రీమ్‌రోల్ గురించి అడిగితే వెన్నెల పరిమళాలతో నవ్వులు కురిపించింది. మదిలోని కోరికను బయటపెట్టింది.

"యుద్ధం నేపథ్యంగాగల చారిత్రాత్మకచిత్రంలో నటించాలని ఉంది. మరీ ముఖ్యంగా ఝాన్సీరాణి తరహాలో పాత్రలు చేయాలన్న కోరిక ఉంది.


కత్తియుద్ధాలుచేసే పాత్ర నా కల" అంటూ పెద్ద కోరికనే చెప్పుకున్నది సురభి.



హెయిర్ స్టయిల్స్













Courtesy : HAIR









కదిలే బొమ్మల కబుర్లు

పెదవి కలిపెనులే...


ఎల్లవేళలా పక్కింటి అమ్మాయి ఇమేజ్ అయితే కుదరదుకదా- అందుకే అనీషా ఆంబ్రోస్ తన ఇమేజ్‌ను మార్చేస్తోంది.

తదుపరి చిత్రం 'నిన్ను వదిలి నేను పోలేనులే'లో సహనటుడు హవీష్‌కు అనేకమార్లు తన పెదవులు అందించిందట.

పైగా కొత్తే అయినా సదరు సన్నివేశాలను ఎంతో సహజంగా, సునాయాసంగా చేసిందన్నది పరిశ్రమ టాక్.

తెరపై ముద్దాడడం తొలిసారే అయినప్పటికీ ఆంబ్రోస్ ఎంతో ప్రొఫెషనల్‌గా కనపడిందని, జంకు లేకుండా నటించిందని యూనిట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ◆





Review

'మనం' అడుగుజాడల్లో...

పూర్వం ఓ టైలర్ తనదగ్గర మిగిలిన అడుగు బొడుగు గుడ్డముక్కలన్నిటినీ కలిపి, ఒక ముక్కలచొక్కా కుట్టేస్తే, అదే ఫ్యాషన్ అయి కూర్చుందట. ఇప్పుడు చాలామంది టాలీవుడ్ దర్శకులు చేసేపని అదే.

ఒకటిరెండు ఫారిన్ సినిమాల్లోని కాన్సెప్ట్‌లు,ఒకటిరెండు తెలుగులో హిట్ అయిన సినిమాల ఫార్ములాలు తీసుకుని,తిరగేసి, మరగేసి, మిక్సీలో వేసి కలిపేసి, కొత్త పదార్థం అనేదాన్ని ఒకటి సృష్టించడం.

విక్రమ్ కే కుమార్ అనే దర్శకుడు '13 బి' అనే సినిమా అందించాడు. హారర్ జోనర్. అలాగే 'మనం' అనే సినిమా తీసి చూపించాడు. ఒకవిధంగా పునర్జన్మలతో లింక్ పెట్టిన పారలల్ లైఫ్ జోనర్‌తో.

ఈ రెండు సినిమాల నుంచి స్ఫూర్తి పొందేసి, కొరియన్ సినిమా లైన్ కొట్టేసి, ఆనంద్ అనే దర్శకుడు ఇప్పుడు 'ఒక్క క్షణం' అనే సినిమా అందించేశాడు. సినిమా విడుదలకు ముందు ఈ కథ నా స్వంతం, అనుసరణ, అనువాదం కాదని మీడియాకు హామీ పత్రం ఇచ్చాడు. అది వేరే సంగతి.

అయితే విడుదలయిన తరువాత తెలిసింది, ఆ హామీ ఏ మేరకు నిజం అన్నది.

సరే ఆ సంగతి అలా వుంచి కథ చూస్తే... జీవా (అల్లు శిరీష్) జో(సురభి)కి చిన్న యాక్సిడెంట్‌తో పరిచయం అవుతుంది. అది ప్రేమగా మారుతుంది. కానీ అదే టైమ్‌లో వారికి ఓ చిత్రమైన విషయం తెలుస్తుంది. తమకు దగ్గరలోనే అచ్చం తమలాంటి జంటే మరోటి వుందని, ఆ జంట శ్రీనివాస్ (అవసరాల శ్రీనివాస్) స్వాతి(సీరత్‌కపూర్).

అంటే శ్రీనివాస్-స్వాతి ఎలా కలిశారో? ఎలా ప్రేమించుకున్నారో? అంతా అచ్చంగా అలాగే జీవా-జో జీవితాల్లోనూ జరుగుతుంది.

అలాంటి టైమ్‌లో స్వాతి హత్య చేయబడుతుంది. ఆమెను హత్యచేసిన నేరానికి శ్రీనివాస్ జైలుకు వెళ్లాడు. అంటే ఇప్పుడు జో హత్య చేయబడుతుందా? జీవా జైలుకు వెళ్తాడా? ఏమయింది అన్నది మిగిలిన సినిమా.

'13 బి'లో టీవీ సీరియల్‌లో జరుగుతున్నట్లే జీవి

భిన్నమైన చిత్రం

అవకాశం వచ్చినప్పుడల్లా తన 'మేళా' సినిమా గురించి ఢంకా మోగించి మరీ చెప్పుకుంటున్నది ధన్సిక.

"రజనీకాంత్ కూతురిగా 'కబాలి'లో మంచిపాత్ర చేశా. అప్పుడే ప్రేక్షకులనుంచి నాకు చక్కని గుర్తింపు లభించింది.

ఇప్పుడు 'మేళా'లో హీరోయిన్‌గా నటిస్తున్నా. కథలో ప్రాముఖ్యంగల పాత్ర ఇది. ముచ్చటగా మూడు షేడ్స్‌తో సాగుతుంది. ఇది నా కెరీర్‌లోనే భిన్నమైన చిత్రంగా ఉండగలదన్న నమ్మకం నాలో ఉంది" అని చెప్పింది అందాలతార ధన్సిక. ◆



తంలో జరుగుతుంటుంది. 'మనం' సినిమాలో క్లాక్ టవర్ దగ్గర యాక్సిడెంట్ అన్నది కథకు కీలకమైన పాయింట్. ఈ రెండూ చక్కగా ఎత్తుకువచ్చి 'ఒక్క క్షణం'లో వాడేసుకున్నట్లు కనిపిస్తుంది.

ఇక కొరియన్ సినిమా పారలల్ లైఫ్‌ను స్ఫూర్తిగా తీసేసుకున్నారు. సరే, ఎక్కడి నుంచి ఎత్తుకువచ్చినా, ఎక్కడినుంచి దిగుమతి చేసుకున్నా సినిమా బాగుంటే మంచిదేగా. కానీ అక్కడే వచ్చింది సమస్య.

సినిమాకు మిస్ కాస్టింగ్ అన్నది శాపంగా మారింది. కథానాయకుడు అల్లు శిరీష్, కథానాయిక సురభి అసలు తెరపైకి పాత్రలను తీసుకురాలేక పోయారు. నటీనటులు పాత్రల్లో జీవిస్తే, సీన్‌లో ఆ టెంపోవస్తే, అప్పుడు ప్రేక్షకుడు సినిమాలో ఇన్‌వాల్వ్ అవుతాడు. లేకుంటే తెరమీద ఏదో తోలుబొమ్మ లాట సాగుతుంటుంది. ప్రేక్షకుడు అన్యమనస్కంగా చూస్తూ వుంటాడు. దాన్ని సినిమా సీన్‌లో ఆత్మ లోపించడం అని కూడా అనవచ్చు.

'ఒక్కక్షణం' సినిమాకు ఇదే ప్రధాన శాపం.

అసలు దర్శకుడు సినిమా ఎత్తుగడనే నాన్చుతూ మొదలుపెట్టాడు. కథనాన్ని చకచకా నడిపించడం లేదు. ఆ ఉత్కంఠ కానీ, ఉత్సాహం కానీ ప్రేక్షకులకు కలిగించడంలో చాకచక్యమూ లేదు. దీనివల్ల ప్రథమార్థం పరమనిస్సారంగా సాగుతుంది.

విశ్రాంతి వేళకు సినిమా మీద కాస్త ఆసక్తి కలుగుతుంది. అప్పుడు కూడా నటీనటులు సీన్లు పండించడం వల్ల కాదు, కథలోకి ఆసక్తికరమైన పాయింట్ రావడం వల్ల మాత్రమే.

విశ్రాంతి తరువాత సినిమా మెల్లగా ఓ క్రయిమ్ సినిమా టర్నింగ్ తీసుకుంటుంది.

రొటీన్ ఇన్వెస్టిగేషన్‌లోకి హీరో దిగిపోతాడు. మళ్లీ క్లయిమాక్స్ వేళకు పారలల్ లైఫ్, డెస్టినీ వంటి వ్యవహారాలు చోటుచేసుకుంటాయి. వీటన్నింటినీ బాగానే వండుకున్నాడు దర్శకుడు.

ఆ కథనం కాస్త బాగుండడం అన్నది సినిమాను కొంతవరకు రక్షించింది.

దానికితోడు సరైన నటులు కుదిరివుంటే సినిమా కాస్తయినా కళ కట్టేది.

కానీ ఇప్పుడు అలా జరగలేదని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

చివరి ఇరవై నిమిషాల ఇంట్రెస్టింగ్ ఇన్వెస్టిగేషన్ సీన్‌కోసం అంతకుముందు గంటకుపైగా బోరింగ్‌సినిమాను బలవంతంగా భరించనక్కరలేదుగా?

ఇలాంటి సినిమాలో హీరోగా అల్లు శిరీష్ నటించాడు. ఎలాగైనా హీరోగా నిలబడాలని అతని ప్రయత్నం. కానీ అలా నిలబడాలంటే, సీన్లలో నిలబడిపోతే చాలదు. నటించాలి. మొహంలో భావాలు మరింత బలంగా పలకాలి.

అవి చూసి ప్రేక్షకులు సన్నివేశంలోకి చేరాలి. కానీ ఇక్కడ అంతసీన్ లేదు.

సురభి అందంగా వుంటుందని భయం వేసినట్లుంది, ఓ పే... ద్ద కళ్ళజోడు మొహానికి తగిలించి దిష్టి తగలకుండా చేశారు. సీరత్‌కపూర్‌ను వీలయినంత తక్కువ బట్టల్లో చూపించడం పాయసంలో ఆవకాయ కలిపినట్లుంది. ఎందుకంటే ఆ పాత జోనర్ విషాదంతో నిండివుంటుంది.

కానీ అక్కడ గ్లామర్ కురిపించాలని దర్శకుడు అనుకోవడం ఏమిటో?

తమ సినిమాలో అన్ని రసాలు వున్నాయని ప్రూవ్ చేయడానికి తల్లిదండ్రులు, అపార్ట్‌మెంట్ మనుషులు ఇలా రకరకాల నటులతో ఏదో కాస్త కసరత్తు చేయించారు. కానీ ఫలితం అంతంతమాత్రం.

సాంకేతికంగా మాత్రం సినిమా బలంగా వుంది. సినిమాటోగ్రఫీ బాగుంది. నేపథ్యసంగీతం బాగుంది. 'పిచెక్కుతోంది. పిచ్చెక్కుతోంది' అనే పాట, 'ఉండడుగా ఇంతటి నరకం'అనే పాట, థియేటర్లో కూర్చున్న ప్రేక్షకుల మనోభావాలకు అద్దం పట్టేలా రాయించారు ముందే ఊహించి.

ఇంతకన్నా ఎక్కువ చెప్పుకోవడానికి ఏమీ లేదు. 'ఒక్కక్షణం' అని-చెప్పి రెండు గంటలు, రెండు జీవితాలు చూపించేశాడు దర్శకుడు.

ప్లస్‌పాయింట్స్...
సెకండాఫ్‌లో సెకండాఫ్

మైనస్‌పాయింట్స్...
హీరో
ఫస్ట్ హాఫ్
పంచ్‌లైన్
మిక్సీలో తయారైన కథ



పరీక్షలకే ప్రాధాన్యం

వరసగా హ్యాట్రిక్ కొట్టేసిన నివేదా థామస్ సినిమాల ఎంపికవిషయంలో అత్యంతజాగ్రత్తగా వ్యవహరిస్తున్నది. అనేక ఆఫర్లను వినమ్రంగా తిరస్కరిస్తున్నదట. టాలీవుడ్‌లో సూపర్‌ఎక్స్‌ప్రెస్ బాటలో పయనించాలన్న కోరికతో అందుకు అనువుగాని అవకాశాల జోలికి వెళ్ళడంలేదు.

అంతేకాకుండా తన ఆర్కిటెక్చర్ పరీక్షలకు కూడా రెడీ అవుతుండడంతో కొత్తగా ఏవిపడితే ఆ సినిమాలకు అస్సలు సంతకాలు చేయడంలేదు.

ఇటీవలికాలంలో నివేదకు కొన్ని పెద్ద టిక్కెట్ ఆఫర్లు కూడా వచ్చాయని, కాని, ముందుగా పరీక్షలకు సమయాన్ని కేటాయించాలని భావిస్తోందని, ప్రస్తుతం తన ప్రాధాన్యం చదువేనని, ఆపైనే సినిమా అని నివేద సన్నిహితులు పేర్కొంటున్నారు.

ఎలా ఆడుతున్నాయి?

- బాక్సాఫీస్‌కు కొద్దిగా కళ వచ్చింది. 'ఫిదా' తరువాత సాయిపల్లవి మరోసారి మ్యాజిక్ చేసింది. యావరేజ్ సినిమాను లాక్కు వెళ్ళడంలో తానే సరైనవాడిని అని హీరో నాని అనిపించుకుంటే, అలాంటి నానితో తాను కలిస్తే, ఇంకా లాక్కు వెళ్ళిపోగలనని సాయిపల్లవి నిరూపించింది. కేవలం ఆమెచేసిన మ్యాజిక్‌తో 'ఎమ్‌సిఏ' సినిమా బాక్సాఫీస్ దగ్గర అయిదు, ఆరురోజుల పాటు కుమ్మేసింది. దగ్గరదగ్గర ఇరవైకోట్లకు పైగా వసూళ్ళు సాగించింది.
- నాగార్జున తనయుడు అఖిల్ రెండో సినిమా 'హలో' ఫరవాలేదు అనే టాక్ తెచ్చుకున్నా, కలెక్షన్లు ఒక మాదిరిగానే మిగిలాయి.
- ఈ వారం విడుదలైన 'ఒక్క క్షణం' సినిమా ఫరవాలేదు అనిపించుకుంది.

Review

సునీల్ ఫెయిల్యూర్... మరొకటి

పక్క భాషలో విజయం సాధించిన సినిమా దొరికితే చాలు, సులువుగా బండి లాగించేయచ్చు అనుకుంటారు మన దర్శకులు, హీరోలు.

అంతేకానీ అది అసలు ఆ భాషలో హిట్ కావడానికి కారణాలేమిటి? అసలు మాతృకలో వున్న సోల్ ఏమిటి? అది తెలుగులోకి ఎలా వస్తుంది? ఇలాంటివి అనేకం చూడాలి. అలా చూడకుండా, ఎద్దు ఈనిందంటే దూడను కట్టేయమన్న చందంగా, సబ్జెక్ట్ దొరికిందని, అందుబాటులో వున్న హీరోతో చుట్టేయడం అన్నది అలవాటైపోయింది.

అలాంటి సినిమాలను చూడకుండా పక్కనపెట్టేయటమన్నది జనాలకు కూడా బాగా అలవాటయిపోయింది. ఈ వ్యవహారానికి మరో సినిమా తోడైంది. అదే ఈ వారం విడుదలైన 'టూ కంట్రీస్'.

'టూ కంట్రీస్' సినిమాకు మలయాళ 'టూ కంట్రీస్' మాతృక. ఒక ఆశపోతు అబ్బాయి, ఒక తాగుబోతు అమ్మాయి పెళ్ళిచేసుకుంటే....? ఇదీ పాయింట్. దీని చుట్టూ అల్లుకున్న కథేంటంటే, ఉల్లాస్ (సునీల్) 'మడతకాజా' సినిమాలో అల్లరి నరేష్‌టైపు.

ఎప్పటికప్పుడు జనాలకు ఏదోకటి చెప్పి, తప్పించుకోవడమే. అలాంటివాడికి లయ (మనీషా)ను పెళ్ళి చేసుకునే ఛాన్స్ వస్తుంది. ఇంతకీ ఈ మనీషా ఎవరు? అమెరికాలో పుట్టి, పెరిగిన తెలుగు అమ్మాయి. ఆ అమ్మాయికి మద్యం తాగడం అలవాటయిపోయింది. అది దాచిపెట్టి ఉల్లాస్‌తో పెళ్ళి చేస్తారు.

ఈ వీక్‌నెస్ తెలియదుకానీ, మాంచి సౌండ్ పార్టీ కదా అని ఓకె అని తాళి కట్టేస్తాడు. తీరా పెళ్ళయ్యాక అసలు పాట్లు మొదలవుతాయి.



ఆ పాట్లు విడాకులవరకు దారితీస్తాయి. అప్పుడు ఏమైందన్నది మిగిలిన సినిమా. 'టూ కంట్రీస్' సినిమాను తెలుగులో హక్కులకోసం తీసుకున్న నిర్మాత, దర్శకుడు శంకర్ తప్పు అంచనా వేసుకున్నారు.

దాన్ని కేవలం ఒక కామెడీ సినిమాగా మాత్రమే చూశారు. కానీ దాంట్లో వున్న మానవసంబంధాలు, భావోద్వేగాలను విస్మరించారు.

సరైన దర్శకుడు, సరైన హీరో కుదిరి, మంచి రచయిత చేతిలో ఇదే సినిమా పడివుంటే, సూపర్ సినిమాగా మారి బయటకు వచ్చేది. ఇప్పుడు జస్ట్ ఓ కాలక్షేపం బటానీ మాదిరిగా, బి, సి సెంటర్ల ఆడియన్స్‌ను ఓ అరగంటో, గంటో నవ్వించే మామూలు సాదాసీదా సినిమాగా మారిపోయింది.

'టూ కంట్రీస్'లో కీలకమయిన సన్నివేశాలు కొన్ని వుంటాయి. తను చేసుకున్న అమ్మాయికి తాగుడు అలవాటు వుందని తెలిసే సన్నివేశం, ఆ అమ్మాయి అలా ఎందుకు మారిందని తెలిశాక, ఆమెను మార్చాలనే కోణంలో ఆలోచించి, హీరో తాను మారే సన్నివేశం, ముగింపులో కోర్టు సన్నివేశం.

ఇవన్నీ సినిమాకు ఆయువుపట్టుల్లాంటి సీన్లు. కానీ 'టూ కంట్రీస్' తెలుగు వెర్షన్ చూస్తే, ఈ సన్నివేశాలను ఎంత తేలికగా తీసుకున్నారో అర్థమవుతుంది. ఆ సన్నివేశాలు ఏమాత్రం ప్రేక్షకులను ప్రభావితం చేయవు. కుర్చీలోంచి ఇంచికూడా కదల్చవు. ఇక సినిమా ఏం ఆకట్టుకుంటుంది.

ఇన్నాళ్ళు సునీల్ హీరోగా చేశాడు. పరాజయాలు చవిచూశాడు. సో, హీరోగా వుంటూ కామెడీ చేసేస్తే జనం మెచ్చి నెత్తిన పెట్టేసుకుంటారు అనుకుని, తన చిత్రానికి చేసుకుంటూపోయాడు.

ఏవేవో పేరడీ డైలాగులు, అర్థం లేని పంచ్‌లు, లాజిక్‌లు లేని కదలికలు చూపించాడు. అవన్నీ చూపిస్తుంటే, సర్కస్‌లో బఫూన్ తన వింతచేష్టలతో ప్రేక్షకులను నవ్వించడానికి పడే పాట్లు గుర్తుకువచ్చి, అయ్యో... సునీల్ అనిపిస్తుంది.

సినిమా ఎత్తుగడే గందరగోళంగా ప్రారంభమవుతుంది. సినిమా అసలు కథకు, దీనికి సంబంధం వుండదు. కేవలం హీరో క్యారెక్టర్ ఎస్టాబ్లిష్ చేయడానికిమాత్రమే దాదాపు తొలి సగాన్ని మొత్తం వాడుకున్నారు. ఇది ఒక విధంగా కరెక్ట్ ఐడియానే.

కానీ అసలు కథ వేరు అన్న హింట్‌ను సినిమా తొలి సగం ప్రారంభంలో జస్ట్ అలా ఇచ్చి వదిలేసి, ఫ్లాష్‌బ్యాక్‌ను ఇష్టంవచ్చినట్లు తీసుకెళ్ళిపోయారు. అసలు పాయింట్ దగ్గరకు వచ్చాక కూడా కాస్తయినా సీరియస్‌నెస్ మెయింటెయిన్ చేయలేదు. దాంతో కీలక సన్నివేశాలు ఏవీ రక్తికట్టలేదు.

సినిమా అమెరికాకు షిఫ్ట్ అయ్యాక మరీ గందరగోళంగా తయారుచేశారు. సీనియర్ నరేష్‌లాంటి వాళ్ళు అమెరికా యాసలో తెలుగు మాట్లాడుతుంటే తల పట్టుకోవాల్సివస్తుంది. సినిమా అన్నాక కాస్తైనా చూడాలనిపించేలా వుండాలి.

అంతేకానీ, కాస్తయినా కొత్తదనం లేకుండా, సవాలక్షసినిమాల్లో ఇదో సినిమా అన్నట్లుగా వుండకూడదు. కొత్త హీరోయిన్ క్యూట్‌గా వుండి, సునీల్ పక్కన నాట్ సూటబుల్‌గా వుంది. అయితే తొలి సినిమా అయినా బాగానే చేసింది.

పృథ్వీ, షియాజీ షిండే, జబర్దస్త్ బ్యాచ్, రాజా రవీందర్, ఇలా చాలామందే వున్నారు. కానీ ఒక్కరు కూడా సినిమాకు పనికివస్తే ఒట్టు.

రామ్‌ప్రసాద్ ఫోటోగ్రఫీ వున్నంతలో ఓకె. గోపీ సుందర్ సంగీతం ఫరవాలేదు. శ్రీధర్ సీపాన డైలాగులు సినిమా సోల్‌ను పట్టుకోలేకపోయాయి. సీన్లో కామెడీని కాకుండా మాటల్లో కామెడీని తేవాలని చూశాయి. శంకర్ దర్శకత్వంలో పట్టులేదు. చాలా కాలం గ్యాప్ అన్నది క్లియర్‌గా తెలిసిపోతోంది.

టోటల్‌గా చూసుకుంటే, 'టూ కంట్రీస్' ఇలా విడుదలయి, అలా వెళ్ళిపోయే సినిమాల జాబితాలో పక్కాగా చోటు సాధిస్తుంది.

ప్లస్‌పాయింట్స్...
పెద్దగా లేవు

మైనస్‌పాయింట్స్...
వెదుక్కున్నవారికి వెదుక్కున్నన్ని

పంచ్‌లైన్
ఫేక్ రీమేక్

అన్నీ దైవం ఆజ్ఞలే!

జీవితంలో తగిలిన ఎదురుదెబ్బలు వేదాంతాన్ని అలవరుస్తాయేమో కాని ఎవర్ బిజీ హీరోయిన్ నయనతార ప్రస్తుతం అదే రూటులో ఉంది. ఈ మధ్య నయనతార పలుకుల్లో తరచూ ఎందుకనో దైవం ప్రస్తావన వినబడుతున్నది.

విజయం వరించగానే మిడిసిపడడం, పరాజయం వస్తే కుంగిపోవడం సరికాదని, ఎవరు, ఎప్పుడు, ఎలా ప్రవర్తించాలన్నది దేవుడు ముందుగానే నిర్ణయిస్తాడని సూక్తులు వల్లిస్తున్నది.

"దేవుడి ఆజ్ఞమేరకే అన్నీ జరుగుతాయి. అందుకే ప్రతిరోజూ నిద్ర లేవగానే ప్రార్థనచేయడం అలవాటు చేసుకున్నాను. దైవచింతనవల్ల చిరాకు తగ్గి, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని మా అమ్మ తరచూ చెప్పే మాటలు నిజం. ఇందుకు నేనే ఉదాహరణ" అంటూ సుదీర్ఘంగా చెప్తోంది. ◆



చివరి రోజుల్లో...

'మాతోపాటే నీకుకూడా ఉరిశిక్ష పడిందిరా' అని తోటి విప్లవవీరులు చెపితే 'ఎంత మంచి వార్త చెప్పారురా' అంటూ కోర్టుబోనులోనే ఆనందంతో గెంతులు వేసిన రోషన్‌సింగ్‌ని చూసి అక్కడున్నవారంతా ముక్కున వేలేసుకున్నారు. బ్రిటీష్ న్యాయమూర్తి, ఇతర అధికారులు ఉరిశిక్ష అనే విషయం విని రోషన్‌కి మతి భ్రమించిందనుకున్నారు. కాని ఉరిశిక్ష పడిందని గర్వంగా ప్రకటిస్తూ బయటకు నడుస్తున్న రోషన్‌సింగ్‌ని చూసి కంటతడిపెట్టని భారతీయుడు లేడు నాడు.

బ్రిటీష్ పాలనాకాలంలో ఉరిశిక్షలు విధించబడినవారెందరో. వారు చేసిన సాయుధ పోరాటానికి, బ్రిటీష్ అధికారులను హత్యచేసినందుకు ఉరిశిక్షలు విధించారు. 'భరతమాతకోసం వలసపాలకులను సంహరించాం ఉరికంబం ఎక్కుతున్నాం' అని ప్రకటించి వెళ్ళినవారే చాలామందున్నారు.

వీరందరికన్నా భిన్నమైన స్వాతంత్ర్య సమర వీరుడు రోషన్‌సింగ్. తాను చెయ్యని నేరానికి ఉరికంబం ఎక్కినవాడు రోషన్.

ఆ సంఘటన జరిగిన ప్రదేశంలో రోషన్ లేనే లేడు. వున్నాడని చెప్పిన సాక్షులు లేరు. అయినా ఆయనను ఆ కేసులో ఇరికించింది బ్రిటీష్ ప్రభుత్వం. విచారణ సమయంలో ఎటువంటి శిక్షపడుతుందోనన్న కంగారు అందరిలో వుంటుంది. కాని రోషన్‌సింగ్‌ది భిన్నమైన మనస్తత్వం.

అంతే తనకు శిక్ష వెయ్యకుండా, తన మిత్రులకు మాత్రమే శిక్షవేస్తారేమో... తాను ఒక్కడు బయట వుండి వారందరూ కారాగారంలో వుండాల్సి వస్తుందేమోనన్నది అతని కంగారు.

చివరికి విచారణ పూర్తిచేసి నేరం రుజువైందని ప్రకటిస్తూ ఒక్కొక్కరికి శిక్షలు ఖరారుచేసి ప్రకటిస్తుంటే ఆ జడ్జి ఇంగ్లీషులో ఏం చెపుతున్నాడో అర్థం చేసుకోలేని రోషన్‌సింగ్ నా సంగతేమిటి! నా సంగతేమిటి! అంటూ మిగిలినవారిని అడుగుతున్నాడు.

'మాతోపాటే నీకుకూడా ఉరిశిక్ష పడిందిరా' అని తోటి విప్లవవీరులు చెపితే 'ఎంత మంచి వార్త చెప్పారురా' అంటూ కోర్టుబోనులోనే ఆనందంతో గెంతులు వేసిన రోషన్‌సింగ్‌ని చూసి అక్కడున్నవారంతా ముక్కున వేలేసుకున్నారు.

బ్రిటీష్ న్యాయమూర్తి, ఇతర అధికారులు ఉరిశిక్ష అనే విషయం విని రోషన్‌కి మతి భ్రమించిందనుకున్నారు. కాని ఉరిశిక్ష పడిందని గర్వంగా ప్రకటిస్తూ బయటకు నడుస్తున్న రోషన్‌సింగ్‌ని చూసి కంటతడిపెట్టని భారతీయుడు లేడు నాడు.

దేశాన్ని దోచే నేటి నేతలకు దేశంకోసం ప్రాణత్యాగంచేసిన ఆ విప్లవవీరులకు ఎంత తేడా!

స్వతంత్ర భారత పోరాటంలో చెయ్యని నేరమని తెలిసినా ఉరిశిక్షకు సిద్ధమైన రోషన్‌సింగ్ 1894 జనవరి 22న నేటి ఉత్తరప్రదేశ్‌లోని ఒక కుగ్రామంలో పుట్టాడు. ఆ కుటుంబం ఆర్థికంగా ఆసరాలేనిది.

ఆ పేదరికంలోనే కష్టపడి చదువుకున్నాడు రోషన్‌సింగ్. చదివిన చదువు గొప్పదికాకపోయినా ప్రాథమిక విద్యాలయంలో ఉపాధ్యాయుడు అయ్యాడు.

రోషన్‌సింగ్‌కి మల్లయుద్ధం బాగా వచ్చు. తుపాకీ గురిచూసి కాల్చటం చేతవును. దేశంకోసం జరుగుతున్న పోరాటంలో తనవంతు పాత్ర పోషించాలనుకుని విప్లవసంస్థ సభ్యులలో ఒకడయ్యాడు.

విప్లవ సంస్థలకు అవసరమైన నిధులకోసం ప్రభుత్వ ఖజానాలను దోచాడు.

సహాయ నిరాకరణ ఉద్యమ సమయంలో బరేలీ ప్రాంతంలో ఆవేశపూరిత ఉద్యమానికి నాయకుడయ్యాడు రోషన్‌సింగ్. పోలీసులు అరెస్టుచేసి రెండేళ్ళ శిక్ష విధించి జైలుకు పంపారు.

జైలులో బ్రిటీష్ అధికారుల ప్రవర్తన చూసిన రోషన్‌సింగ్ ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. అప్పటికే రోషన్ ఆర్యసమాజ్‌లో సభ్యుడు. ఆ సమాజ నేత పండిట్ రామ్‌ప్రసాద్ బిస్మిల్‌కి శిష్యుడిగా చేరాడు. అక్కడనుండి హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో చురుకైన పాత్ర వహించాడు.

బ్రిటీష్‌వారి కొమ్ముకాస్తున్న ధనవంతుల ఇళ్ళను దోచి డబ్బు సేకరించి ఉద్యమానికి నిధులు అందచేసేవాడు. విప్లవ సంస్థకు నిధులకోసం రామ్‌ప్రసాద్ బిస్మిల్, చంద్రశేఖర అజాద్ వంటివారు మరో పెద్ద దోపిడీ పథకం వేశారు. అదే 'కాకోరీ రైలు దోపిడీ'గా చరిత్రలో నిలిచింది.


పథకం ప్రకారం కాకోరీ రైలు దోపిడీ జరిపి ప్రభుత్వ ఖజానాకి తరలిస్తున్న డబ్బును దోపిడీ చేశారు. ఆ సంఘటనలో రోషన్‌సింగ్ పాల్గొనలేదు. అయినా గతంలో అతనిమీదున్న కేసులో విప్లవ సంస్థతో వున్న సంబంధాలు ఆధారంచేసుకుని రోషన్‌సింగ్‌నికూడా అరెస్టు చేశారు.

ఆ కేసులో దోషులుగా బోను ఎక్కినవారిలో అందరికన్నా వయసులో పెద్దవాడు రోషన్‌సింగ్. అయితే ఆగష్టు 9,1925న కాకోరీ కేసు జరిగింది.

బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విప్లవకారులమీద 1926 మేలో విచారణ మొదలైంది.

జూలై 1927 కల్లా విచారణ ముగిసింది.

రామ్‌ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్‌సింగ్, రాజేంద్రనాథ్ లహరి, అష్ఫకుల్లా ఖాన్‌లకు ఉరిశిక్ష విధించాడు న్యాయమూర్తి.



రోషన్‌సింగ్
(1894-1927)

తనకుకూడా ఉరిశిక్ష పడిందని తెలియగానే రోషన్‌సింగ్ రామ్‌ప్రసాద్ బిస్మిల్‌ని కౌగిలించుకున్నాడు. రామ్‌ప్రసాద్ బ్రాహ్మణుడు. రోషన్‌సింగ్ రాజపుత్ర క్షత్రియుడు.

"ఆ విషయం గుర్తుచేస్తే" ఏం పండిట్‌జీ నన్ను వదిలేసి ఒక్కడివే వెళ్ళిపోదామనుకున్నావా! అదేం కుదరదు మనమంతా కలిసే వెళ్ళాలి" అంటూ కోర్టు బయట గ్రూప్ ఫోటో తీయించుకునిగాని జైలుకు వెళ్ళలేదు. వెళ్ళే ముందు ఉరిశిక్ష విధించినందుకు జడ్జికి ధన్యవాదాలు చెప్పాడు.

"వయసులో పెద్దవాడైన నన్ను వదిలి చిన్నవాళ్ళకు ఉరిశిక్షవేస్తే నాకు ఎంత చిన్నతనం. నా పరువు కాపాడినందుకు ధన్యవాదాలు జడ్జిగారూ" అంటూ ఆనందంగా పోలీసు వాహనం ఎక్కాడు.

జైలులో ఖైదీల హక్కులకోసం నిరాహారదీక్ష చేశాడు. ఉరిశిక్షకోసం ఎదురుచూస్తున్న రోజుల్లో మరుజన్మలో పనికి వస్తుందేమో అని బెంగాలీ భాష నేర్చుకున్నాడు. మరణశిక్ష రద్దుకు అప్పీల్ చేసినా, అప్పీల్ తిరస్కరించబడినా ఏమాత్రం తొణకలేదు.

"ఉరిశిక్షకు వారం రోజులు ముందు స్నేహితుడికి రాసిన ఉత్తరంలో ఎవరూ బాధపడవద్దు. మరణంతో ఆనందం... పుట్టిన ప్రతివాడూ మరణించాల్సిందే. అందులో దేశంకోసం మరణించినందున మరింత ఆనందం కలుగుతుంది. ఈ జన్మలో నాకు కోరికలంటూ ఏమీ మిగలలేదు. హాయిగా వెళ్ళిపోతున్నాను" అన్నాడు.

చేతిలో భగవద్గీత పట్టుకుని, చిరునవ్వు చిందిస్తూ ఓంకారాన్ని, వందేమాతరాన్ని నినదిస్తూ 1927 డిశంబర్ 19న అల్హాబాద్ జైలులో ఉరికంబం ఎక్కాడు రోషన్‌సింగ్. చెయ్యని నేరానికి ఆనందంగా ఉరికంబాన్ని ముద్దాడటం అనే రోషన్ త్యాగాన్నిగుర్తించకపోగా అతని భార్య, ఇతర కుటుంబసభ్యులను బ్రిటీష్ ప్రభుత్వం తీవ్రంగా వేధించింది.

అతని కుటుంబాన్ని సామాజికంగా వెలివేయించి విప్లవమార్గంలోకి ఎవరూ వెళ్ళే సాహసం చెయ్యకూడదని హెచ్చరిక చేశారు బ్రిటీష్ పాలకులు.

ఉత్తమ ప్రశ్న-సమాధానం

➜ కె.ఎస్.శ్యామ్‌ప్రసాద్, విశాఖపట్నం
'పరువు' గుర్తుకురానిదెప్పుడు?
పరువంలో ఉన్నప్పుడు.

➜ ఎ.అశోక్‌కుమార్, హైదరాబాద్
తనదైనా, తను అందుకోలేని సర్టిఫికెట్?
డెత్ సర్టిఫికెట్.

➜ ఆర్.ప్రశాంతి, విజయనగరం
మగాళ్ళుకూడా జాకెట్లు వేసుకునేదెప్పుడు?
పడవ ప్రయాణం చేసినప్పుడు.

➜ ఎ.అశోక్‌కుమార్, హైదరాబాద్
మనిషి 'లేట్' అయ్యేదెప్పుడు?
ట్రీట్‌మెంట్ 'లేట్' అయినప్పుడు.

ఈ శీర్షిక మీదే

➜ జి.వెంకట కృష్ణారావు, గొట్టిపాడు
ఎక్కువగా చీరల షాపుల ఓపెనింగ్‌కు హీరోయిన్లను పిలుస్తారు ఎందుకు?
ఒక్క చీరనుకూడా ముట్టుకోరు కనుక.

➜ పి.యోబు, ముదునూరు
రాజకీయ నాయకులకు బాగా తెలిసిన విద్య?
ఓటరును ఎలక్షన్ల ముందు 'స్మరించడం', ఎలక్షన్లు అయ్యాక 'విస్మరించడం'.

ఉత్తమ ప్రశ్నకు ₹ 500
ప్రతి ప్రశ్నకు ₹ 300 బహుమతి


➜ ఎ.అశోక్‌కుమార్, హైదరాబాద్
'పొట్ట' వచ్చేదెప్పుడు?
'డేటింగ్' ఎక్కువ, 'డైటింగ్' తక్కువ అయినప్పుడు.

➜ ఆర్.ప్రశాంతి, విజయనగరం
చెట్టంత మనిషి అంటారెందుకు?
ఒక్కోసారి 'కొయ్య'బారిపోతుంటాడు కాబట్టి.

➜ ఎ.అశోక్‌కుమార్, హైదరాబాద్
ప్రైవేట్ స్కూళ్ళు ప్రదర్శించేది?
ఫీ'జులుం'.

➜ ఆర్.ప్రశాంతి, విజయనగరం
'చేతు'లారా చేసుకునేది?
'కాలు'ష్యం.

ఈ కార్టూన్ మీదే



B హ్యాపీ

"నేను మీటింగ్‌లో వున్నప్పుడు నాకు ఫోన్ ఇవ్వొద్దు నా బంధువులమంటూ ఫోన్‌చేస్తుంటారు. చాలా మందిని చూశాం మీలాంటివాళ్ళని అని చెప్పి ఫోన్ పెట్టెయ్" అని తన సెక్రటరీకి సీరియస్‌గా చెప్పాడు పరంధామ్.

కొద్దిసేపటికే సెక్రటరీకి ఫోన్ వచ్చింది. పరంధామ్ గారి భార్యనుండి కనెక్షన్ ఇవ్వమని.

"మీలాంటి బంధుత్వమే చెప్పుకుని చాలామంది చేస్తున్నారు.నేనివ్వను కనెక్షన్" అంటూ పెట్టేసింది.

నైట్ డ్యూటీలో వున్న ముగ్గురు నర్స్‌లు కొత్తగా డ్యూటీలో చేరిన కుర్రవైద్యుడిగురించి మాట్లాడుకుంటున్నారు."భలే చక్కగా డ్రెస్‌చేసుకుంటాడు" అంది మొదటి నర్స్.

"అవును పనైన తర్వాత చాలా వేగంగా డ్రెస్ వేసుకుంటాడు. ఏమాత్రం ముడతలు కనపడనీయకుండా" అంటూ సిగ్గుపడింది మరో నర్స్.

"మావారికి ఆ శక్తి తగ్గింది, మందులివ్వండి" అని వైద్యుడి దగ్గరికి వచ్చింది ఒకావిడ. సెక్స్ శక్తి గుర్రాలలో అధికం కాబట్టి వాటినుండి సేకరించిన హార్మోన్స్ కలిగిన మందు ఇచ్చి పంపించాడు.

పదిరోజుల తర్వాత ఆమె కనిపిస్తే "మీ పడకగది వాతావరణం బ్రహ్మాండంగా వుందనుకుంటా" అని పలకరించాడు వైద్యుడు.

"ఏం బ్రహ్మాండం... ఇప్పుడు మా ఆయన మంచం చుట్టూ గుర్రం వేగంలో పరిగెడుతున్నాడు" అంటూ వాపోయింది ఆవిడ.

పెళ్ళయిన ఆరునెలలు తిరగకుండానే భార్యాభర్తలు ఇద్దరూ గొడవపడ్డారు.

"అందుకే నేను ఎప్పుడూ పెళ్ళి వద్దనుకునేదాన్ని... అయినా నా ఖర్మ ఇలా రాసుంటే ఏంచేస్తాను" అంటూ ఏడుపు అందుకుంది భార్య.

"నిజమే మరి...మగవాళ్ళ కర్మ అంతే...ఆడవాళ్ళని మాత్రమే పెళ్ళిచేసుకోవాలని వుంది... ఏం చెయ్యను" అంటూ బయటకు వెళ్ళిపోయాడు భర్త.

తమ ఇద్దరు కూతుళ్ళు ఎన్నిసార్లు చెప్పినా పొద్దుపోయిన తర్వాత ఇంటికిరావటం మానలేదని గ్రహించింది తల్లి. ఇక లాభంలేదని "రేపటినుండి ఎవరు ఆలస్యంగా ఇంటికి వస్తేవారు మరుసటిరోజు ఉదయం ఇంటి పనంతా చెయ్యాలి" అని చెప్పేసరికి అమ్మాయిల్లో క్రమశిక్షణ కనిపించింది.

"పెళ్ళిమండపంలో నన్ను పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటానని ప్రామిస్ చేశారా లేదా!" అంటూ గద్దించింది కరుణ. "చేశాను... మరీ అంతమంది మధ్య అబద్ధం ఆడలేం కదా" అని స్నేహితులతో కలిసి బయటకు వెళ్ళిపోయాడు కుమార్.

"సమతా నువ్వు ప్రేమించిన మోహన్ మరో అమ్మాయిని ముద్దుపెట్టుకునే ప్రయత్నంచేస్తున్నాడే..." అంది ఆమె స్నేహితురాలు.

అతని ప్రయత్నం ఫలించిందా... "లేదే..."

"అయితే అతడు మోహన్ కానే కాదు"

పట్టు వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది.

www.mrfpaints.com

అందంగా తీర్చిదిద్దబడింది. సంపూర్ణ రక్షణ కల్పించబడింది.



ఇక్కడ నెలకొల్పబడినది, గొప్ప ప్రవేశద్వారం కోసం అంతర్భాగంగా ఘనంగా చెక్కబడిన ఒక తలుపు.

ఈ మెటల్ కోట్, లోహపు ఉత్పాదనలకు సర్వోన్నతమైన రక్షణను అందిస్తుంది. ఇది ఒక బహుళ ప్రయోజనకారియైన ఎలిఫేటిక్ పాలీయురెథేన్ ఫినిష్ కలిగియుండి, క్లియర్, గ్లోసీ, మెటాలిక్ మరియు మ్యాట్ ఫినిష్ లలో లభిస్తుంది.

దీనియొక్క విస్తృత శ్రేణి ప్రయోజనాలు:

అద్భుతమైన ప్రకాశము మరియు రంగు స్థిరత్వము | అద్భుతమైన యువి నిరోధకత, అంతులేని బయటి మన్నిక | శ్రేష్ఠమైన తుప్పు నిరోధకత్వము ఉన్నతమైన రాపిడి నిరోధకత.

కాబట్టి, ముందుకు వెళ్ళండి, మీ లోహపు ఉత్పాదనలకు తగిన రక్షణను ఇవ్వండి.



Protection Guaranteed.

MRF CORP
VapocurePaints

For enquires send SMS to +91 98166 68822

FIFTH ESTATE : 9265C

MRF CORP. LIMITED : Regd. & HO: Tarapore Towers, V Floor, 826, Anna Salai, Chennai - 600 002.
P: 044-2852 1033, 2855 0297, 2855 0298 I F: 044-2852 0912 I E: vapocure.ho@mrfmail.com

ZONAL OFFICES : New Delhi: 011-4545 8816 / 17 I Noida: 0120-411 8411 I Kolkata: 033-2423 5175 / 2423 5141 I Mumbai: 022-6765 3539, 6770 7226 I Bengaluru: 080-2314 2901 / 3002 / 7901 I Chennai: 044-2861 0022 / 0044 / 0066

DEPOT : Hyderabad: 040-6535 3366 I Vijayawada: 0866-2474393

SWATI SAPARIVARA PATRIKA PRINTED AT ANIL SWATI PRESS AUTONAGAR VIJAYAWADA
RNI 38008 / 1984 REGD NO.VJ / 025 / 2015-17 L.NO.PMG/VJA/PWPP/2/2015-17

